# అనగనగా ఓ మంచికథ

## మొదటి భాగం




శ్రీ కౌముది

మీ మునివేళ్ళ సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య : 29

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. పగిలిన పచ్చికుండలు | నార్ల చిరంజీవి | 3 |
| 2. దేవుడు ఏమనుకున్నాడో | పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి | 10 |
| 3. జీవన్మృత్యు రహస్యం | మధురాంతకం రాజారాం | 16 |
| 4. పోయింది ఇల్లు | బలివాడ కాంతారావు | 20 |
| 5. నిర్మల మొగుడు | బాలగంగాధర తిలక్ | 25 |
| 6. యాదృచ్ఛికం | మాధురి | 31 |
| 7. ఆహ్వానం | కాళీపట్నం రామారావు | 43 |
| 8. జుజుమురా | గొల్లపూడి మారుతి రావు | 46 |
| 9. సుశీల | చలం | 60 |
| 10. ఊహల్లో స్వర్గం | జలంధర | 73 |
| 11. జీవుడి ఇష్టం | విశ్వనాథ సత్యనారాయణ | 77 |
| 12. వేలం పాట | అర్నాద్ | 82 |
| 13. అందాల సముద్రం | శ్రీపతి | 89 |
| 14. చిరంజీవి కథ | శారద | 98 |
| 15. ఎన్నో రంగుల తెల్లకిరణం | సిరివెన్నెల | 101 |
| 16. మగవాడు ఆడమనిషి | రాచకొండ విశ్వనాథ శాస్త్రి | 108 |
| 17. మల్లిపూలు | బుచ్చిబాబు | 119 |
| 18. రాలే ఆకులు | వి.వి.సూర్యనారాయణ | 122 |



# అనగనగా ఓ మంచి కథ

## పగిలిన పచ్చికుండలు

### నార్ల చిరంజీవి

(రచనా కాలం ౧౯౪౦)

*అలనాటి ప్రముఖ కథారచయిత చిరంజీవి గారు 1940 ప్రాంతాల్లో రాసిన కథ ఇది. ఈయన కొన్ని సినిమాలకి పాటలు కూడా రాసారు.*

పెద్ద వంతెనకు దిగువుగా కాలవ్వొడ్డునే రోడ్డు నానుకుని ఇరవై ముప్పయి పాకలు వరసగా ఉన్నాయి. పెద్ద రైలుస్టేషన్‌కి పోయే ఆ రోడ్డు వస్తూ పోయే జనంతో కిటకిటలాడుతూంటుంది. ఆ పాకల్లో ఒక చిన్నపాక విడిగా కాస్త ఎడంగా ఉంది. గవిట్లో 'సీతాలు' చేరగలి కూచింది. దీపం లేని ఇబ్బంది కనిపించడం లేదు. రోడ్డు మీది ఎలక్ట్రిక్ దీపం వెలుగు చారలు ఏటవాలుగా పాకలో పడుకుంటున్నాయి. పాకవేపు చీకటి, రోడ్డువేపు వెలుగూ సీతాలుని సగం సగం పంచుకున్నయ్. ఎదురుగా రోడ్డవతల సినిమాహాలు, సినిమా పాటలూ, రైలు ఇంజన్ల కూతలు, రోడ్డు మీది కోలాహలం ఇవేవి సీతాలుని కదిలించడం లేదు. ఎక్కడో దూరాలకు అలిసి పోయిన కళ్ళప్పగించి దేన్నో వెతుకుతోంది.

ఎవరో తనను తాకినట్టనిపించింది. చప్పున పక్కకి తిరిగి చూసింది. పొరుగింటి పిన్ని. ఆవిడ అన్నపు గిన్నె పట్టుకొచ్చింది. సీతాలు మొహంవైపు పరకాయించి చూసి, గిన్నెని తడిక వేపు ఉంచింది. దగ్గరగా కూచుని – 'ఏమే పిల్లా!' అని ఆప్యాయంగా పిలిచింది. ఆవిడ సీతాలుని కూతురుతో సమనంగా చూసుకుంటుంది.

"ఇట్టా కూడూ నీళ్ళూ మానేస్తే ఏవన్నా లాభం ఉందటే?... దీపమున్నా వెలిగించావు కావు. అయ్యో ... రాతా.. లే! గుప్పెడు మెతుకులు తెచ్చాను. ముందు తిను..."

అని అన్నదా ఇల్లాలు సీతాలుని బుజ్జగిస్తూ.

"ఆకలి వేయడం లేదు పిన్నీ."

"ఆకల్లేదని నాకు చెబుతున్నావంటే? మరీ ఇంత చోద్యమైతే ఎట్టాగే పిల్లా? కడుపు మాడ్చుకుంటే గంగని పడ్డ కాపరం గట్టున పడుతుందంటే..."

సీతాలు ఉలుకూ, పలుకూ లేకుండా కూచుంది. ఎంతో చనువూ, ఇష్టమూను. అందుకే అన్నం తెచ్చింది. తినమన్నది. ఏ రకంగానూ, ఆవిడ సీతాలుచేత ఆ గుప్పెడన్నం తినిపించలేక పోయింది. ఇంతకు ముందు రెండు రోజులు నించీ ఇంతే పిన్ని విసుగుతో లేచి సీతాలుని ఒక్క కుదుపు కుదిపి--

"ఇంత మొండెత్తిపోయిన దానివి బ్రతికి బట్టకడతావని నమ్మకం ఏమిటి...?"

అని అనేసి విసురుగా వెళ్ళిపోయింది. పిన్ని వెళ్ళిపోతూ పెట్టిన శాపం విని సీతాలు కళ్ళుమూసుకుంది. మనసులో ఏదో వికారం ఉబుకుతోంది. "నేను మొండిదాన్నా?" అని పదే పదే గొణుక్కుంది. "మొండిదాన్నే అయి ఉంటే ఈ పాటికే నా బతుకు ఎటో ఒకటు తేలిపోయి ఉండేది" అని సణుక్కుంటూ తనకు తానే సమాధానం చెప్పుకుంది. చావు బ్రతుకుల సంధిలో రోగి ఏవో జ్ఞాపకాల్ని ప్రలాపించిన చందంగా, సీతాలు తన బ్రతుకు లోయల్లోని వెలుగు నీడల్ని నిరూపించుకుంటోంది. ఈ బస్తీ కాపరానికి రాకముందు - ఆ మారుమూల పల్లెటూళ్ళో తన జీవితం ఎలా గడిచిందో తళుక్కున మెరిసింది, మనసులో.

ఆ ఊరి బయట పాకలో తన పూరిల్లు, చెట్లూ చేమలూ, పుట్టా గట్టూ తప్ప మరో ప్రపంచం తెలీని రోజులివి. పైన ఆకాశం మెరిస్తే, కింద భూదేవి నవ్వితే, ఒళ్ళు పులకరించిన బ్రతుకది. బొద్దుగా పొద్దు తిరుగుడు పువ్వల్లే ఉండేది. పరిమళం చెడని, అచ్చం తెలుగు కన్నె తాను. పురుగు పుట్రా భయం ఎరక్కుండా, ఎండా వానా తేడా లేకుండా ఎదిగింది. పెరిగింది. చెరుకు బోదెల్లో, వంగ పాదుల్లో, తుమ్మ బీళ్ళల్లో, గడ్డి వాముల్లో తిరిగేది. చెట్లనీ, పిట్టల్నీ కవ్వించి కవ్వించి పాడేది, ఆడేది తాను.

ఆనాటి ఆ పొద్దు తిరుగుడు పువ్వేనా, ఈనాటి తాను? ఒక్క ఐదేళ్ళ బస్తీ కాపురంతో ఎంతగా మారిపోయింది. పిల్లా పీచు లేకపోయినా వాడిన పచ్చగన్నేరు పువ్వులాగా పాలిపోయింది.

మొదట్లో, రాములు వెంటబడి కాపరానికి వచ్చినప్పుడు ఈ బస్తీ జనం, మేడలు వాడలు చూసి విస్తుపోయింది. సంజెవేళ కందిచేలో ఎగిరిపోయే రంగు రంగుల పిట్టల్లా కనిపించారీ మనుషులు. చీకటి పడే వేళ ఎలక్ట్రిక్ దీపాలు వెలిగితే కళ్ళు జిగేల్ మన్నవి. తన ఊళ్ళో అయితే చీకటి రాగానే గొంగళి ముసుగెట్టి పడుకోవలసిందే! ఈ బస్తీలో రాత్రయినా పగలయినా ఒకలాగానే తోచింది. కొత్త లోకంలోకి జారి వచ్చినట్టయింది.

అదేదో సినిమాకి రాములు తననీ తీసుకు పోయాడు. వీధి బాగోతం తప్ప ఏమీ ఎరగని తనకి - అంతమందిలో కూచోవడం, దీపాలారడం తెరమీద మనుషులు మాట్లాడడం... అదంతా చూస్తుంటే గుండె గుబగుబలాడి పోయింది. తెరమీద ఒక మగాడు ఆ ఆడపిల్లని "రాణీ!" అని పిలిచేవాడు. ఆ పిల్లకూడా "ఓ రాజా!" అని ఒయ్యారాలు కులుకుతో పిలిచేది. సినిమా అయిపోయి ఇంటికి వచ్చాక రాములు తనని దగ్గరకంటా బిగువుగా లాక్కుని "రాణీ" అని అచ్చంగా, అట్టాగే అన్నాడు. తనూ ఒళ్ళు పులకెత్తి అప్రయత్నంగానే 'నా వరాల రాజా!" అని అనేసి, చప్పున సిగ్గుపడింది. చిరువెచ్చని నిట్టూర్పులో ఒకరికొకరు పెట్టుకున్న ఆ క్రొత్త పేర్లని ఎన్నెన్ని సార్లు జపించారో!

ఇప్పుడీ జ్ఞాపకాల వల్ల సీతాలు కళ్ళు చెమ్మగిలినయ్. ఒకసారి కళ్ళార్పి, మళ్ళా జ్ఞాపకాల్లో పడింది.

రోజులు గడిచే కొద్దీ బస్తీలో జనం ఒత్తిడీ, మురుగు వాసనలూ, కొత్త భయాలూ ఒహటొహటి అనుభవంలోకి వచ్చాయి. ఎన్ని భయాలు వెంటాడితేనేం? తన 'రాజా'ని చూసుకుని అన్ని భయాల్ని అతనంటే తనకెంత ఇష్టమో చెప్పడానికి ఈ మాటలు చాలవు. ఒకసారి ఏమయిందీ? తనని పుట్టింటికి తీసుకుపోదామని తండ్రి వచ్చాడు. తండ్రి ఎందుకు వచ్చిందీ తనకి తెలుసు. అన్నాలు తింటుంటే అల్లునితో మాట కలిపి చెప్పాడు కూడా. పుట్టింటికి వెళ్ళాలని తనకు ఎంత ఇదిగా ఉన్నా - రాముల్ని ఒదిలి వెళ్ళడం జరగని పనిగా తోచింది. ఒదిలి ఉండడం అంటే ఇద్దరికీ పిచ్చెత్తుతుంది! తప్పదు. ఒకవేళ తనను పంపుతానంటాడేమో రాములు. మాట జారవద్దని చెబుదామనుకుని, చప్పున గదిలోకి వెళ్ళింది. పిచ్చిమారాజు, చంటి పిల్లాడిలాగా బిక్కమొగం వేసుకునికూచున్నాడు. తనని చూడగానే "వెళ్ళి పోతావా" ఇంచుమించు ఏడ్పుగొంతు పెట్టి అన్నాడు. తాను వలవల ఏడ్చేసింది. పుట్టింటి ప్రయాణం లేదని అర్థమయ్యేలోగా ఇద్దరి కళ్ళూ ఉబ్బిపోయాయి. ఏడవడానికి ఇందులో ఏముందని అడిగితే? ఏం జవాబు ఉంది? ఉహూ! చెప్పడానికి చూపడానికీ వీలు కాని జీవితపు లోతులవి. నాటికీ నేటికీ పుట్టింటి మొహమే చూళ్ళేదు మరి!

అలాంటి తీయని అనుభవాలు ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటోంది సీతాలు. ఆ రోజుల్లో చక్కని ఇంట్లో కాపురం ఉండే వాళ్ళు కళకళ్ళాడిన రోజుల్ని తలుచుకున్నంత సేపూ సీతాలు కళ్ళు మిలమిల్లాడాయి. చిరుచెమటలు పోస్తున్నాయి. వెచ్చగా నిట్టూరుస్తూ ఊపిరి

బిగపట్టి 'రాణీ' అని పిలుస్తున్నట్టు తోస్తోంది. తనకి చాలా ఇష్టమైన ఆకృతి తనని తాకినట్లు భ్రమ కలిగి వొళ్ళు పులకరిస్తోంది. ఎదురుగా ఉన్న ఎలక్ట్రిక్ దీపం చల్లగా చిక్కని వెలుగు ముద్దలుగా కనిపించింది!

ఆమె భ్రమ - భ్రమ మాత్రమే కాదు; గదికి అడ్డంగా కూచున్న ఆవిణ్ణి తప్పించుకోడానికి ఎంతో ప్రయత్నించి, చివరికి సాహసించి, దూరి, పాక లోపల ఉన్న అన్నపు గిన్నె ఖాళీ చేసి, సీతాలు భ్రమ కరిగి చూసేసరికి తోకాడించుకుంటూ, ఒక నల్లకుక్క వెళ్ళిపోతోంది. నాలిక తుడుచుకుంటూ తృప్తిగా దీప స్థంభం కిందికి చేరుకుంది. తన జ్ఞాపకాల దొంతర కూలిపోయినందుకు సీతాలు వెలిగి నవ్వింది. ఖాళీ గిన్నెని పాకమధ్యకి విసిరేసి, మళ్ళా కలల్లోకి పోవాలని ప్రయత్నించింది. మనోతమస్సుని చీల్చి జ్ఞాపకాల్లో పెనుగులాడాలని ప్రయత్నించింది.

రాములు ఇప్పుడెక్కడున్నాడో, ఏం చేస్తుంటాడో ఊహించడం తనకి సులభమే; అతని సంగతి ప్రతీ చిన్న విషయం తెలుసు. అతనికోసం ఏం చెయ్యాలన్నా చేస్తుంది. కానీ - ఏం చేయాలో మాత్రం తనకి తెలీకుండా ఉంది. అదే తెలిస్తే ఎంత బావుణ్ణు!... ఆలోచనలన్నీ అగ్ని జ్వాలలై చుడుతున్నాయ్. రాములు ఇంటికి వచ్చి నాలుగు రోజులయింది. ఇదేం కొత్త కాదు. ఐనా, తానీసారి భరించలేకుండా ఉంది. దారిద్ర్యాన్నీ, కన్నీళ్ళనీ నిర్జించ లేకపోయినా నిర్లక్ష్యం చెయ్యగలిగింది! కానీ ఈ బ్రతుకు మానసికంగా భరించలేకుండా ఉంది. తుఫానుకి చెట్టు పట్టు జారి నేలకూలే తీగెలాగా ఈ దిగుళ్ళతో సీతాలు తూలిపడుతోంది. నిలబడాలని ప్రయత్నించిన కొద్దీ ఎడాపెడా గాలీవానా దెబ్బలు మొహాన్ని ఈడ్చి కొడుతున్నాయ్. లాభం లేదు. ఇహ అతన్ని తాను కలుసుకుని తీరాలి. పీడకలవంటి ఈ బ్రతుకు మారిపోవాలి.

రాములు ఎక్కడుంటాడు?

అక్కడికి నాలుగున్నర మైళ్ళ దూరంలో కాలవకట్ట మీది పాకల్లో ఉంటాడు. తప్పకుండా ఉండి ఉంటాడు. నడిచిపోవటం తప్ప వేరే మార్గం లేదు. రెండు గంటల నడక, ఇప్పుడే బయలుదేరితే పదింటికల్లా వెళ్ళిపోవచ్చు.. ఆలస్యం ఎందుకు?

లేచి నిలుచుంది సీతాలు.

కొత్త బలం పోసుకుంటున్నట్టుంది. పాలు పోసుకుంటున్న వరిదుబ్బు లాగా తోచింది. పాకలోకి తొంగి చూసింది. ఏముంది? విరిగిన మజ్జిగలాగా వెలుగూ చీకట్లు కలిసి ఏర్పడిన పొడలు. కంచాలు మంచాలు ఏనాడో అమ్ముడు పోయాయి. ఒకటో రెండో గుప్పిళ్ళ బియ్యం ఉండాలి. తనూ, తన 'రాజా' వెన్నెల తోటగా చేసుకున్న ఆ పాక వెలుగు పొడల చాటున కుములుతున్న ముసలిదానిలాగా ఉంది. తడిక విసురుగా మూసేసింది. తెల్లారి అన్నం తినలేదు. ఆఖరికి పచ్చి మంచి నీళ్ళయినా ముట్టలేదు. అసలామాటే సీతాలుకి గుర్తు రావడం లేదు.

రోడ్డున పోయేందుకు ఎందుకనో మనస్కరించలేదు. కాలువ గట్టున పోతే దగ్గర కూడాను. పాకల వెనక్కి వచ్చి, వంతెన వేపు సాగారింది. కట్టకింది నుంచీ సరంగుల పాటలు వినిపిస్తున్నాయి. ఎగువన పడవల రేవుంది. రేవు దగ్గరవుతున్న కొద్దీ సరంగుల పాటలు జోరవుతాయి. పాకల తిన్నగా వచ్చాక బూతు పదాలు లంకించుకుంటారు. కట్టమీద నీడల్లో పాకల తాలూకు ఆడవాళ్ళు మొసలుతారు. పడవల్లోంచి సరంగులు కాయాగ్రటా విసిరేస్తుంటారు. చీకటి ముసుగులో జరిగే గుద్దులాటల నుంచీ తప్పించుకుని సీతాలు వంతెన దగ్గరికి చేరేలోగా ఒకటీ రెండు అరిటిపళ్ళ హస్తాలు దూసుకుపోయాయి. క్రమేణా పాకల్లోని పడుచుల నవ్వులూ, పడవ సరంగుల పదాలు దూరమైపోయి.

దోసకాయ వాటంగా ఉన్న బస్తీని ఆ కాలువ నిలువగా చీల్చుకు పోయింది. దాని కిరుపక్కలా తెగిపడిన దోసచెక్కల్లాగా బస్తీ, బస్తీ చివరికి చేరుతున్న సీతాలు ఒకసారి వెనక్కి తిరిగి చూసింది. పాకల కెదురుగా ఉన్న సినిమా హాలు మీది పెద్ద పచ్చదీపం దబ్బ పండులాగా కనిపిస్తోంది. మసక వెన్నెట్లో బూడిద గీతలాగా ఉన్న కాలవకట్ట కాలిబాటనే సీతాలు ముందుకు నడుస్తోంది. నీళ్ళల్లో చేపలు ఎగిరే చప్పుళ్ళూ, తుప్పల్లో పొదల్లో కీచురాళ్ళ రొదలూ తప్ప మరే శబ్దం వినిపించడం లేదు. మాసిన దుప్పటి కప్పుకున్నట్టు ఖాళీ

ప్రదేశం! తలవంచుకుని సీతాలు విసురుగా నడుస్తోంది. ఒకటి రెండు గులకరాళ్ళు కాలికి తగిలి, దొర్లుకుపోయి నీళ్ళల్లో చప్పుడు చేస్తూ మునిగిపోయాయి. ఇంకా మూడు మైళ్ళు పోవాలి తాను. మనస్సంతా పాడుపడ్డ మఠంలాగా ఉంది. మధ్య మధ్య తొలకరి మెరుపల్లే రాములు గుర్తుకొస్తున్నాడు. తాను తూలి పడిపోయేటంత బలంగా వేగంగా వస్తాయి ఆ జ్ఞాపకాలు కడుపు నొప్పిలాగా తెరలు తెరలుగావచ్చి ఒళ్ళు తిప్పుతోంది.

తాను ఇల్లాలు. ఇంత రాత్రివేళ కట్టుకున్న మగణ్ణి కలుసుకునేందుకు ఒంటరిగా బయలుదేరి వెళుతోంది. జీవన పటం మీద విషం చిలికి నల్లబడిన మచ్చ వంటి స్థితి తనది. సీతాలు యుగయుగాల సతీత్వంతో జ్వలించే ఏ సతీమ తల్లికీ తీసిపోదు. నాగరిక ప్రపంచం ఊపుల నించీ తప్పించుకుని, తన అణువణువులో ఒదిగి మిళితమైపోయి ఒక దౌర్భాగ్య వ్యక్తి కోసం వెళుతోంది. నడి వేసవిలో తగలడే కొంప నించీ పెనుగాలికి లేచిన మంటలు నాలుకలు సాచి మరో కొంపని జ్వలింపచెయ్యడానికి అగ్ని శిఖ వంటి శీతాలు కాలవకట్టన పడి వెళుతోంది...

## 2

రాములు సీతాలుని పెళ్ళాడక ముందు ఐదారేళ్ళ ముందు నుంచీ బళ్ళ కార్ఖానాలో కొలిమి వద్ద సమ్మెట మనిషిగా పనిచేసేవాడు. భగభగమండే కొలిమిలో ఎర్రగా కాలి కణకణమమడే ఇనుపబద్దీలు తీసి మేస్త్రి దాలిమీద మోపడం తరువాయిగా – రాములు సమ్మెటను మెరుపులాగా విసిరేవాడు. చింత నిప్పుల్లాంటి కళ్ళార్పి మేస్త్రి 'వారెవ! కొడకా!.. వేయ్ దెబ్బ!' అని హుషారిస్తూంటే, రాములు చేతిలో సమ్మెట గరిడీ కర్రలాగా చక్రం తిరిగేది! ఐదు పది దెబ్బల్తో రైలు బద్దీలాంటిది కూడా మెత్తగా మెలికలు తిరిగేది! పగలస్తమానమూ మంటల్తో ఆడి, సంజవేళ మేస్త్రి తానూ దుకాణం దగ్గరికి పోయేవాళ్ళు. ఆదా ఎక్కువ కనుక మేస్త్రి రెండు చటాకుల సారా తాగేవాడు. తాను మాత్రం ఒక్క లోటా కల్లు మాత్రం పుచ్చుకునేవాడు. కాస్త వళ్ళు చల్లబడేది. నీళ్ళోసుకుని కలో గంజో కడుపున పట్టించి పడుకుంటే ప్రాణాలెటో రెక్కలు విప్పుకుని పారిపోయేవి. తెల్లకు తెల్లారిలేస్తే మళ్ళా భగభగమండే కొలిమీ, ఎర్రగా కాలిన ఇనుపబద్దీలూ, 'వారెవా! కొడకా!', సమ్మెటా తానూ తయారు...

కాలువ కట్ట మీది ఇసుక గుట్ట మీద వెల్లకిలా పడుకున్న రాములు లేచి కూచున్నాడు. సమ్మెట పట్టిన నాటి కండరాలు ఈనాడేమయ్యాయి? ఒళ్ళు చూసుకున్నాడు. ఎడం చెయ్యి సాచి కుడి చేత్తో దండ కింద మాంసం ఉందేమో చూశాడు. ఉత్త తోలు తిత్తి వేళ్ళాడుతోంది. రొమ్ము, ముఖం అరిచేత్తో రుద్దుకుని మళ్ళా ఇసకమీద పడుకుని, ఆకాశం వేపు చూశాడు. కళ్ళు మూసుకుని పెదవులు బిగనొక్కుకున్నాడు. పెళ్ళి చేసుకోవటం తప్పయిందా? అని అనుకుని, కాదు కాదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

పెళ్ళయిన కొత్తలో కార్ఖానాలోని మిత్రులంతా తన వెంట దుకాణానికి వచ్చేవాళ్ళు. కాదనీ లేదనీ అనలేని మనస్సు తనది. రోజుకి పదీ, పన్నెండణాలు చెల్లించవలసి వచ్చేది. తను తాగుతున్నట్టూ మిత్రుల కింద దుబారా అయిపోతున్నట్టూ సీతాలుకు తెలియకుండా ఎంత ఇదయ్యేవాడు! సీతాలంటే చచ్చేటంత మమకారం! అవీ ఇవీ నమిలి వాసన రాకుండా చూసుకుని ఇంటికి మరీ వెళ్ళేవాడు. ఎన్నాళ్ళు దాగింది కనుక!...

'తాగుతున్నావా?' – సీతాలు తన నడిగిన రోజున మామూలు కల్లు మానేసి, పక్కనున్న వాళ్ళతో పందెం వేసి రెండు చటాకులు పైగా సారా తాగాడు. దాన్ని తగలెయ్యా! ఆ మోతాదు కాస్తా తన పరువు తీసింది. దగ్గరికి పోతూంటే – సీతాలు అరిచేత్తో తన నోటిని మూసి దూరంగా తోసేసింది. ఆ వేళ సీతాలు పెదవులు అందలేదు.

రాములు మళ్ళా లేచి కూచున్నాడు. లోపల దాచిన సీసా బయటికి తీశాడు దాన్ని ముద్దుపెట్టుకున్నాడు. రుచీపచీ లేక పెళసరిగా ఉంది ముద్దు. బిరడా తీసి తెండు గుక్కలు తాగి సీసా మళ్ళా దాచేసి పడుకున్నాడు. గుప్పిళ్ళతో ఇసుకని పిసుకుతున్నాడు. బద్ధకంగా ఉన్న కళ్ళల్లో చురుకు పుట్టింది. ఆనాటి ఘట్టాలు ఒహదాని వెంట వొకటి ముసురుకున్నాయి. గట్టిగా నిట్టూర్చి "అట్టా కాలం గడిచిపోయినా బాగుండేది" అని గొణుక్కున్నాడు.

కాలం అలా గడవలేదు. ఒకరోజున ఎక్కణ్నించో నడమంతరంగా ఒక చిక్కొచ్చిపడింది. బస్తీలోనూ, చుట్టుపక్కలా కల్లూ సారాను తాగరాదని రూలొచ్చింది. ఎక్కణ్ణించి ఎందుకీ రూలొచ్చిందో ఈనాటికీ రాములికి తెలీదు. పదేళ్ళ అలవాటు. కుతిపుట్టి రోడ్లన్నీ తిరిగాడు. పాత స్నేహితుల్ని పలకరించాడు. చివరికి మేస్త్రీ కూడా చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయాడు. తిరగ్గా తిరగ్గా చివరికి అతిరహస్య స్థలంలో ఒక అరగ్లాసుడు అర్థరూపాయికి దొరికింది. నిషా కల్పించుకుంటేనే కానీ కుతి తీరలేదు.

సీతాలుకి పువ్వులు తీసుకుపోవాలి. కొత్త సినిమా చూపించాలి. అన్నిటికీ డబ్బేది? ఈ పాడు తాగుడికి డబ్బు ఖర్చయితే ఎలాగ? 'ఇన్ని తిప్పలేందుకు' మానేద్దామని అనుకున్నాడు. ఎంత కష్టమైనా సరే నిగ్రహం మంచిదనుకున్నాడు... ఏం లా భం! ఆ వేళ సాయంత్రం మనసుకి కళ్ళెం పెట్టి రాములు ఇంటికి బయలుదేరాడు. కాస్త దూరం పోయేసరికి వెనకాలే వచ్చి మేస్త్రి చేయి పుచ్చుకున్నాడు. సెగ తగిలిన వెన్నలాగ వెంటసాగాడు. సరాసరి సిటీ బస్ ఎక్కి, ఇక్కడే, ఈ ఇసుక గుట్టల తిన్నగా లోపలి వైపు పాకల దగ్గర దిగారు. బస్తీ దుకాణాల వద్ద అలజడే ఉండేదికాదు. ఇక్కడ చూస్తే వందల కొద్దీ జనం. పెద్ద పెళ్ళో, సంతో జరిగినట్టుగా ఉంది. అందులో చాలామంది బస్తీ నుంచి వచ్చిన వాళ్ళే. ఆ వేళ ఖర్చంతా మేస్త్రిదే. పొద్దుపోయి బస్తీలో ఇంటికి చేరేసరికి తల్రప్రాణం తోకకి వచ్చింది. జేబు ఖాళీ. సీతాలుకి పువ్వులు లేవు. ఆ రాత్రి మాటలూ లేవు. ఒకటే కన్నీళ్ళు. సగం సగం మైకంలో ఆ రాత్రి ఎట్టా గడిచిందో!

అలవాటయిన ప్రాణం అటూ ఇటూ తేలింది. పగలు సమ్మెట వేస్తున్నా, రాత్రిళ్ళు సీతాలు ఎదరకూచున్నా - చేతికందని కల్లూ సారాల మీదనే మనసు. ఇదివరకటిలాగా కూనిరాగాలు ఆనందం ఇవ్వడం లేదు. ఉహూ - అంతా మారి, మనసంతా మాయదారి సారామీదే అతుక్కుంది.

తరువాత తరువాత చాలా మార్పులు వచ్చాయి. ఎన్నిసార్లు తలుచుకుంటే ఏం లాభం? మెట్ల మీంచి జారిన చెంబు, మెట్లన్నీ దాటి నేలమీద కూడా మరింత దూరం దొర్లుతుంది. తనూ అంతే నిషా. నిషా కావాలి. తీపికల్లు చాలదు. నీళ్ళ సారా పనికి రాదు. అడ్డమైన గడ్డీ వేసి పులుపెక్కినది కావాలి. ఒళ్ళూ మనసూ తిమ్మిరెక్కాలి. రాత్రిళ్ళు ఇంటికి చాటుగా వచ్చి ముసుగు తన్నేవాడు. ఏ అపరాత్రో సీతాలు కుమిలి కుమిలి ఏడుస్తుంటే - తనూ లేచి ఏడ్చేవాడు. కళ్ళూ, దవడలు తోసుకుపోయి వికారంగా తయారయ్యాడు.

"ఎందుకిలా తాగుతావ్? నన్ను చూసయినా మానవూ?" అనేది సీతాలు. పాపం! ఎంత బిక్కమొగం వేసుకుని అడిగేది! తను నిస్సహాయంగా కళ్ళప్పగించి తల వేలాడేసేవాడు. పిచ్చి సీతాలు ఇంకేం అడుగుతుంది?

ఏమయితేనేం, దొంగ సారా కోసం తన బ్రతుకు చిచ్చున పడింది. కొన్నాళ్ళు రైలు మీద చిట్టడువుల్లోకి పోయి అక్కడ మస్తుగా తాగి వచ్చేవాడు. ఆఖరికి బస్తీలోనే రకరకాలుగా దొంగసారా దొరికేది. తాగుడు జోరయిన కొద్దీ పనిపాటలు తగ్గి ఆదా తగ్గింది. నిషా కోసం స్పిరిట్ తాగేవాడు. చౌకగా దొరికేదదే. కడుపులో నొప్పి,కళ్ళు తిప్పు వచ్చినా స్పిరిట్ సారా రుచి తగిలింది. రానురాను అదీ దొరకలేదు!

సమ్మెట ఎత్తే ఓపిక తగ్గింది. దగ్గు... పొడిదగ్గు పుట్టింది. బొమికలు బైటపడ్డాయి. ఏ నెలకో ఒకసారి గుక్కెడు మంచి సారా, రెండు చీకులూ దొరికితే ఆ రోజు పెద్ద పండగ! తతిమ్మా రోజుల్లో తను తాగుతున్నది తెల్ల కిరసనాయిలూ, కుంకుముడు రసం కలిసిన మరేదో పానీయం... బంగారం వంటి సంసారంలో ఇలా చిచ్చురేగింది!

## 3

ఇసక గుట్టమీంచి రాములు లేచాడు. అన్ని జ్ఞాపకాలతో కళ్ళు తడిసిపోయాయి. ముక్కు కళ్ళలో చెమ్మ ఊరింది. "సీతాలూ! నీ రాజా చచ్చిపోయాడే!" అని గొణిగాడు. ఆకాశంలో తెల్లచుక్కలు ఒకటొకటీ మాయమవుతున్నాయి. పడమటగా ఒక మెరుపు మెరిసింది. రాములు కళ్ళార్చాడు. ఆలోచనలన్నీ తెగిపోయాయి. 'ఛీ' అని అనుకున్నాడు. చక్కగా లేనిపోని గాంభీర్యం తెచ్చుకుని గుట్టమీద కూచున్నాడు, సీసా ఇసకలోంచి లాగాడు. తాగబోతూంటే ఆవాళ సాయంత్రం అనుకున్న ఆలోచనేదో తటాలున మెరిసింది.

నాలుగురోజులుగా బస్తీ అంతా చెడ తిరిగాడు. ఇంటికి వెళ్ళడం లేదు. ఉత్త చేతుల్తో వెళ్ళదలచుకోనూ లేదు. తిరిగిన చోటు మళ్ళా చూడకుండా తిరిగాడు. చివరికి ఏమీ తోచక రైలు స్టేషనుకి వెళ్ళాడు.. తింటానికి ఏమీ దొరక్క ఫ్లాట్‌ఫారం అంతా తిరిగి చూశాడు. అడుక్కోడానికి అభిమానం అడ్డు తగిలింది. ఏదన్నా కూలిపని చెయ్యడానికి ఓపిక లేదు. ఇవతల పుల్ల అవతల వెయ్యడానికి అలుపొస్తుంది! చివరికి పంపు వద్ద ముఖం కడుక్కుని, కడుపు నిండా నీళ్ళు తాగి బెంచీమీద కూచున్నాడు. కాసేపటికల్లా ఒక నిండుపాటి ప్రయాణీకుడొకాయన వచ్చి అదే బెంచీమీద కూచున్నాడు. లాల్చీ జేబులోంచి పర్సు బయటికి పొడుచుకొస్తోంది. ఆ విషయం ఆయన గమనించనేలేదు. అటూ ఇటూ మెసిలి కూచోడంతో ఆ పర్సు కాస్తా బెంచీ మీద పడింది. ఇంతలో బండి రావడమూ, ఆయన హడావిడిగా లేచిపోవడమూ జరిగింది. రాములు ఇదంతా చుస్తూనే ఉన్నాడు. చప్పున పర్సు తీసి దాచి, చకచకా నడిచి రోడ్డూ, పార్కు కాలువా అన్నీ దాటి వచ్చాడు. ఒంటరిగా కూచుని పర్సు తీసి చూశాడు. రెండొందల రూపాయలు! అబ్బా ఎంత డబ్బు!

చప్పున సీతాలూ, సంసారమూ గుర్తుకొచ్చింది. పాపం ఎంత బాధపడుతోందో! ఏడుస్తోందో; ఈ డబ్బు ఇంటికి తీసుకుపోతే, నాలుగు నెలలపాటు హాయిగా జరిగిపోతుంది కదా... కానీ రాములుకి డబ్బుని చూడగానే నాలిక పిరగలాక్కుపోయినట్టయింది. మంచి కమ్మని సారా తాగి చాలా రోజులయ్యింది. ఈ రాత్రి ఆఖరుసారిగా మస్తుగా తాగి, తెల్లారే సరికి ఇంట్లో ఉంటే చాలా చాలా బావుంటుంది.

తన మనస్సులో సీతాలూ, సారా సీసా దెబ్బలాడుకోడం రాములికి స్పష్టంగా తెలుస్తూనే ఉంది. సీతాలుని నెట్టి సారా సీసా మనస్సుని ఆక్రమించింది. మంచి సారా! బస్తీలోకన్నా - పల్లెకి వెళ్ళి తాగితేనే మంచిది హాయిగా ఉంటుంది.... ఇంకేం - పల్లె వేపు పరిగెత్తాడు.

సరే, తర్వాత మామూలే... ఇదే గుర్తుకు వచ్చింది. రెండు గుక్కలు తాగి ఈ రాత్రే ఇంటికి పోవాలనుకున్నాడు. జేబు తడిమాడు. నిండుగా ఉంది. సగానికి మిగిలి ఉన్న సీసాని చూశాడు. రెప్పలు బరువెక్కుతున్నాయి. కళ్ళ నుంచీ నీళ్ళు జారుతున్నాయి. ఎందుకో తెలీదు... హుషారు దిగజారుతున్నట్టు తోచింది. అదే జరిగిందా ఏడ్పు కన్నీళ్ళూ...

లేచి, బస్తీ వేపు బయలుదేరాడు. పూర్తిగా చీకటి. సముద్రం వేపు నించీ నల్లని చిక్కని మబ్బులు వచ్చి ఆకాశాన్ని ఆక్రమించుకున్నాయి. మబ్బులు చాటున నక్షత్రాలు పగిలిపోతున్న బుడగల్లాగా తోస్తున్నాయి. చలిగాలి వీస్తోంది. తాచుపాములాగా కాలవ పరుగుతీస్తోంది. ఎడం చేత్తో చొక్కా కాలరు బిగించి మెలివేశాడు. మధ్య మధ్య సీసాలోంచి ఒక్కో గుక్క తాగుతున్నాడు. తాగుతున్న కొద్దీ నరనరాల్లో జ్వాలలు రేగుతున్నై. ఎన్నడూ లేనిది ఏదో ఆరాటం వెలికి దూకుతోంది. మాంచి నిషా కాబోలనుకున్నాడు. ఒళ్ళు ఉబుకుతోంది. బట్టలు బిగుతుగా చిరాగ్గా ఉన్నాయి. ఊడ తీసేస్తేనే బావుండును. కళ్ళు మెరుస్తున్నాయి. వోహ్! చాలా కాలానికి నిఖార్సయిన 'మందు' గొంతులో పడింది. నెత్తురు అల్లరి పెడుతోంది. చురుగ్గా ముందుకు నడుస్తున్నాడు.

ఎంత నడిచినా తరిగినట్టే లేదు. 'వెనక్కి నడుస్తున్నానా, లేదే! అదే బస్తీ లైటు కనిపిస్తుంటేనూ!' అనుకున్నాడు. ఎక్కడో వాన కురుస్తున్నట్టుంది. తడిసిన మట్టివాసన. చీకట్లో కాలిబాట కనిపించీ కనిపించనట్టుంది. మనస్సేమీ పనిచేయడం లేదు. పాదరసంలాగా నెత్తురు ప్రతి నరంలోకి పరుగెత్తి పొంగుతోంది. ప్రతి నెత్తురు చుక్కా కండా చలించినట్టుంది. విరిగిపడే ముందు ఉధ్రుతంగా పైకెగిరి కడలి తరంగంలాగా లోలోపలి కోరిక ఏదో ముఖంలోకి పొంగి చెక్కిళ్ళూ, నుదురూ పెళుసెక్కాయి. చాలాకాలంగా నిద్రపోతున్న యవ్వనం ఏదో మనస్సుని పట్టుకుంది. ఆట గుర్రంలాగా కదను తొక్కుతోంది. నిఖార్సయిన మందు మహత్యం కాబోలు! అంత చల్లగాలిలోనూ మండుతున్న కాష్టంలాగా ఉంది ఒళ్ళు!

మెరుపులు, మెరుపులు, ఒకదాని వెంట ఒకటి, బస్తీవేపు మబ్బుల్లేవని తోచింది. బాటవేపు చూశాడు. మెరుపు తళుక్కుమంది. ఎవరో నీడలాగా కనిపించారు. తనలాగే ఎవరో. మళ్ళా మెరుపు మెరిస్తే బావుండును. తనకేం, మహరాజు, డబ్బుంది. అందులోనూ

ఆకలిగొన్న సింహంలాగా ఉంది తన పని. ఐనా, ఆ వచ్చేది ఎవరో చూడగలిగితే.. ఆడదే అయితే. మెరుపొచ్చినప్పుడు మబ్బు చీలినట్లే మెదడు చీలిపోయింది... తటాలున మెరుపు మెరిసింది... ఇరవై గజాల్లో చీరె... బస్తీనుంచీ వస్తోంది.

రాములు నిలిచి పోయాడు. ఆఖరు గుక్క తాగేశాడు. నెత్తురు దూకుతోంది. ఒకసారి ఆపాదమస్తకం వణికింది. భయమా? కాదు - తృష్ణ. మండి పడుతున్న జ్వాల. కింద పెదవి కొరికాడు. చిట్లి నెత్తురు చెమర్చింది. నాలిక మీద నెత్తురు రుచి... ఖాళీ సీసా కాలవలోకి విసిరేశాడు. ఇంతసేపూ ఉన్న ఆరాటం ఏమిటో అర్ధమయింది...

నీళ్ళలో "థప్" మన్న చప్పుడికి ఉలిక్కిపడింది. నీరసంగా ఒక కల కంటోంది. అది కాస్తా చెదిరిపోయింది. తనకో బిడ్డ ఉండి ఉంటే, ఎలా ఉండేదా అని ఆ కల! ఆ బిడ్డనే సర్వస్వంగా చూసుకుంటూ బ్రతికేది. తన బతుకు ఇంత పాడయ్యేది కాదు కదా! నడవలేక నడవలేక ఈడ్చుకుంటూ నడుస్తోంది. తలెత్తకుండా నడుస్తోంది. ఆఖరుసారిగా కురుస్తున్న కన్నీటిని కూడా తుడుచుకోలేకుండా ఉంది. ఆపుకోనూ లేదు... ఎవరో తనని నొక్కేస్తున్నారు... మొదట ఏదో తగిలింది. కొండ చిలువ చుట్టేసినట్టు చుట్టేస్తున్నారు. చెడుకంపు, సారాకంపు. ఇంతసేపూ ఊహిస్తూ వచ్చిన బిడ్డ కూడా గిలగిలలాడుతున్నట్టు తోస్తోంది. బొమికెలు పెటపెటమంటున్నాయి. అమ్మబాబో.. ఎవరో తనని చెరిచే ప్రయత్నం చేస్తున్నారు. 'కెవ్'మని అరిచింది. ఆ అరుపుతోనే గుండె ఆగిపోయింది...

రాములు గిలగిల్లాడే చేపని వడిసి పట్టినట్టు చేతులు బిగిస్తున్నాడు. రొమ్ముకి నొక్కుకున్నాడు. తాచుబాము బుసలాగా చేతుల మధ్య నుంచీ బుస వినిపించి సన్నగిల్లుతోంది. రాములుకు తాను తూలిపోతున్నట్టు తోచింది. పట్టు వదల్లేదు. కింది పెదవి కొరికి నెత్తురు చవి చూశాడు. కాళ్ళూ చేతులు మెలిక వేశాడు.

"కెవ్"మన్న కేక ఎక్కణ్నించో నూతిలోంచి వినపడ్డట్టుగా ఉంది. ఆ గొంతు ఎక్కడో విన్నట్టే ఉంది. ఒక రాయి వచ్చి కొట్టినట్టు, ఆ "కెవ్వు"మన్న స్వరం ఎవరిదో గుర్తు వచ్చింది.

"ఆ" అని మాత్రమే నీరసంగా అనగలిగాడు. రాములు చేతుల్లో సీతాలు మంచు ముద్దయింది. మెలికలు పడ్డ కాళ్ళూ చేతుల్ని వొదిలించుకోడానికి అవకాడం లేదు. ఎక్కడో ఎత్తయిన పర్వతాగ్రం నుంచీ లోయలోకి దొర్లినట్లు తోచింది. ఆ దొర్లడంలో సీతాలు పొడుగాటి జుట్టు రాములు మెడకి చుట్టుకుని బిగుసుకుపోయింది!

ఒకే ఒక నిమిషం!

కాలువలో ఒకసారి 'బుడుంగు'మని చప్పుడయింది. అంతే. పాతికేళ్ళన్నా నిండని ఆ దంపతుల జీవితాల్ని మింగి కప్పని తిన్న పాములే కాలవ, కారు నల్లని ఆకాశం కింద గంభీరంగా పోతోంది. కట్టమీద కంకరరాళ్ళ మీద చిందిన నెత్తురు మడుగు మాత్రం మన అందరికోసం ఇంకా పచ్చిపచ్చిగా మెరుస్తోనే ఉంది!!

*****

# దేవుడు ఏమనుకున్నాడో

పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

(రచనా కాలం ౧౯౭౧)

*పోలాప్రగడ మాగ్నం ఓపస్ కౌసల్య నవల. 14 దేశ భాషల్లోకి అనువదితమైంది. తల్లిదండ్రులు సినిమాగా వచ్చింది. ఇదిగాక దీపశిఖ, భోగిమంటలు, శ్రీనాధ కవిసర్వభౌమ ఇత్యాది నవలలు, రెండువందల కథలు, అనేక వ్యాసాలు రాశారు. ఇజాలకు పరిమితం కాకుండా, సమాజాన్ని విస్తృతంగా పరిశీలించి, మానవీయ కోణం నుంచి రచనలు సాగించారు. నిత్యోత్సాహి. చివరి క్షణం దాకా ఆయన రచనలు చేస్తూనే ఉన్నారు.*

మాధవయ్యకి మళ్ళీ ఓ కొత్త సమస్య ఎదురైంది. అసలు ఆ మాటకొస్తే అతనికి వయస్సు తాలూకు మిసమిసలు పైనబడిన దగ్గర నుంచీ, తిరిగి అవి మళ్ళు ముఖం పట్టేలోగా, అంటే ఈ పాతిక ముప్ఫై ఏళ్ళ కాలంలోనూ, రకరకాల సమస్యలు తలకి చుట్టుకుంటూనే ఉన్నాయి. వాటిని ఎలా పరిష్కరించాలో అర్థంకాక అతను సతమతం అవుతూ ఉన్నాడు. సతమతం అవుతూ అతనలా అవస్థపడడం చూసి జాలితో నిలువెల్లా కరిగిపోయి ఎప్పటికప్పుడు ఎంతో ఆత్మీయతతో గౌరి అతన్ని ఆదుకుంటూనూ ఉంది.

అలా ఆదుకున్నది ఒకమారా రెండుమార్లా?

సరిగ్గా ఇప్పటికి ముప్ఫైయేళ్ళ క్రితం మొదటిసారిగా గౌరి అతని జీవితంలో ప్రవేశించి అతన్ని ఆదుకుంది. ఆ ప్రవేశించడం కూడా అదో విచిత్రమైన విధంగా.

అది మాధవయ్య మాంచి యౌవనపు పొంగులో ఉన్న రోజులు! కాలేజీ శలవలకని ఇంటికివచ్చి, ఆ పల్లెటూళ్ళో ఏం తోచక, పక్క ఊళ్ళో రథోత్సవమూ తిరునాళ్ళూ అవుతున్నాయంటే, పోనీ కాలక్షేపం అయినా అవుతుందని అక్కడికి బయలుదేరి వెళ్ళాడు మాధవయ్య.

ఓహ్! అక్కడ మంచి కోలాహలంగా ఉంది.

రథాన్ని కనుల పండువుగా అరటి స్థంభాలతోటీ, కొబ్బరి ఆకులతోటీ, రంగుకాగితాలతోటీ కొందరు అలంకరిస్తుంటే మరికొందరు తాటిమండల్ని ఆముదం కుండల్లో ముంచి రథచక్రాల ఇరుసులకి రాస్తున్నారు. దేవుడుతో సమానంగా రథం మీద కూర్చున్న పూజారి, దేవుడి మెళ్ళో దండల్ని సరిగా సర్దుతున్నాడు. రథం ముందు భాగానికి కట్టిన మోకులు పట్టుకుని కండలు తేరిన మగరాయుళ్ళంతా అమారుగా నుంచున్నారు, ధర్మకర్త గుమ్మడికాయ కొట్టగానే రథాన్ని లాగడానికి. ఇసుకవేస్తే రాలకుండా రోడ్డుకి ఇటూ అటూ జనం.

రకరకాల సరుకులు అమ్ముతూన్న వాళ్ళూ, వాటిని బేరం ఆడుతూ కొంటున్నవాళ్ళూ కొట్లనీ జనాన్నీ వింతగా చూస్తూ నిలబడ్డ వాళ్ళు, ఉండుండి 'గోవిందా' అంటూ అరుస్తున్న వాళ్ళూ, మంచి సందడిగా ఉంది. అటు జనాన్నీ ఇటు రథాన్నీ చూస్తూ రోడ్డు మధ్య

నిలబడ్డ మనుష్యుల్ని "రథం వస్తుంటే అలా చోద్యం చూస్తూ నిలబడతారేవిటి? పక్కకి తప్పుకోండి" అంటూ నిర్దాక్షిణ్యంగా అటూ ఇటూ తోసేస్తున్నారు పోలీసులు. అలాంటప్పుడు జనం కెరటాల్లా వచ్చి పక్కనున్న కొట్లమీదా మనుష్యులమీదా పడిపోతున్నారు.

అలా పడిన వాళ్ళలో మాధవయ్య ఒకడు.

పోలీసుల తాకిడికి ఒక్క ఉదుటున వచ్చి రోడ్డు పక్కగా నిల్చుని కొత్తగా వేయించుకున్న రంగు గాజుల్ని చూసుకుంటూ మురిసిపోతున్న గౌరిమీద పడబోయి ఆమె బుజాలు పట్టుకుని అతికష్టం మీద ఆపుకున్నాడు. పరధ్యానంలో ఉందేమో గౌరి కెవ్వున అరిచింది. మాధవయ్య అదిరిపడ్డాడు ఆ కేకకి. ఆ తర్వాత ఆమె ఏం అల్లరి పెడుతుందో దేవుడా అని బిత్తర చూపులు చూస్తోంటే జరిగిన సంగతి అర్థం చేసుకుంది కాబోలు, అలవోకగా నవ్వింది గౌరి. అసలే కలకలలాడుతూ అందంగా ఉన్న గౌరి ముఖానికి ఆ నవ్వు ఇంకో కొత్త అందాన్ని, ఆమె యవ్వనం అందించిన ఆహ్వానంలా మాధవయ్యలోని మగతనాన్ని రెచ్చగొట్టింది. యవనపు పొంగులో ఛామనఛాయగా పుష్టిగా ఉన్న గౌరి అందాన్ని కళ్ళతో తాగుతూ తనకి తెలియకుండానే గుటకవేశాడు మాధవయ్య.

రథం కదలడంతో జనంలో కూడా కదలిక బయలుదేరింది. అంతా రథం వెనకాలే పడి 'గోవిందా' అని అరుచుకుంటూ పోసాగారు. రథం ముందుకు వెళ్ళిపోవడంతో అక్కడ జనసమ్మర్దం కూడా పల్చబడిపోయింది. అందరూ వెళ్ళిపోతున్నా మాధవయ్య మాత్రం అక్కడే నిలబడి గౌరికేసి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. అతనిలోని చైతన్యాన్ని తన అందమే కట్టిపడేసిందన్న సత్యాన్ని గ్రహించేసరికి గర్వంతో కూడిన ఆనందంతో గౌరికి ఒళ్ళు పులకరించింది, పెదవుల మీదికి పరిగెట్టుకుని వస్తున్న కులుకుని పంటితో నొక్కి పట్టి మాధవయ్య కేసి ఓరచూపు విసిరి విలాసంగా అడుగు కదిపింది గౌరి.

అనుసరించడమా, ఆగిపోవడమా అని తటపాయిస్తున్న మాధవయ్య మాట వినకుండనే అతని అడుగులు ఆమెని అనుసరించాయి. మధ్య మధ్య వెనక్కి తిరిగి చూసి నవ్వుతూ అతణ్ణి ఊరు బైట ఉన్న తన ఇంటిదాకా తీసుకెళ్ళి వయ్యారంగా తాళం తీసి ఇంట్లోకి వెళ్ళింది గౌరి.

'తను కూడా ఆమె వెనకాలే లోపలికి వెళ్ళడమా, రోడ్డుమీద నిలబడి పోవడమా?' ఎటూ నిర్ణయించుకోలేక తారట్లాడుతున్న మాధవయ్యని చూస్తే జాలేసింది కాబోలు, గడప దగ్గరికి వచ్చి కళ్ళతో పిలిచింది మాధవయ్యని. ఇంక తనని తాను సంబాళించుకోలేకపోయాడు మాధవయ్య. అతను అలా తడబడుతూ లోపల అడుగుపెట్టడమేమిటి, గౌరి నవ్వుతూ వెళ్ళి వీధి తలుపు తడిక వేసి రావడమేమిటి అంతా ఒక్క క్షణంలో కలలో జరిగినట్లు జరిగిపోయింది.

ఒళ్ళంతా వేడెక్కి జివ్వుమని నరాలు మెలితిరిగిపోతూ, కీలుకీలు దగ్గరగా నీరసం నమిలేస్తుంటే, యవ్వనం పెట్టే ఆ నరకాన్ని భరించలేక యమయాతన పడసాగాడు మాధవయ్య. ఆ స్థితిలో అతణ్ణి చూసి నిలువెల్లా కరిగిపోయి ఆ నరకాన్ని స్వర్గంగా మార్చి మొదటిసారిగా అలా ఇబ్బందిలో ఆదుకుంది గౌరి.

ఆ తర్వాత, గౌరికి నా అన్నవాళ్ళు లేకపోవడం వల్లనైతేనేమి, మాధవయ్య తన పెద్దలకి తెలియకుండా జాగ్రత్త పడటం వల్లనైతేనేమి, ఆ రెండు ఊళ్ళ మధ్యనా మాధవయ్య రాకపోకలు సజావుగానే సాగి, శలవలన్నీ ఇట్టే గడిచిపోయాయి.

తిరిగి ఏడాదికి, మళ్ళీ శలవలకి వచ్చినపుడు మాధవయ్య దిగాలుగ వచ్చాడు గౌరి దగ్గరకి. "ఏమిటి సంగతి? అలా ఉన్నావేమిటి? చెప్పవా?" అని లాలించి బుజ్జగించి బతిమాలితే కానీ చెప్పలేదు - తన తండ్రి రెండు మూడు సంబంధాలు చూశాడనీ, అందులో ఏదో ఒకటి చేసుకోపోతే వీలులేదని శాసిస్తున్నాడనే సంగతి.

మాధవయ్య మాటలు విని గౌరి నవ్వింది?

గట్టిగా పకపకా నవ్వింది.

పొట్ట చేతితో పట్టుకుని మరీ నవ్వింది.

విస్తుబోయి చూస్తున్న మాధవయ్యని చూసి మరికాస్త నవ్వి "అది కాదు మాధవా, పెళ్ళి అని సరదాగా చెప్పవలసిన సంగతిని అలా దిగాలుపడి చెపుతావేమిటి? నీ పెళ్ళా? మంచిది. అందమైన మంచి పిల్లని చూసి మరీ చేసుకో సుమా!" అంది గౌరి.

మాధవయ్యకి ఆ మాటలు మింగుడుపడలేదు. నేలచూపులు చూస్తూ "అది కాదు గౌరీ - నేను ఎవర్నో పెళ్ళి చేసుకుంటే మన ప్రేమ సంగతి ఏంగాను? మా నాన్నకి కోపం వచ్చినా సరే, తక్కువ కులం పిల్లని చేసుకున్నందుకు మా వంశం ప్రతిష్ఠ ఏమైపోయినా సరే నేను నిన్నే చేసుకుంటాను. నీ కోసం నేనామాత్రం త్యాగం చెయ్యగలను" అన్నాడు మాధవయ్య నెమ్మదిగా. ఆ మాటలు అంటున్నప్పుడు మాధవయ్య గొంతులో ఏ మాత్రం ఉత్సాహం కానీ, ఉద్రేకం గానీ కనిపించలేదు గౌరికి. ఒక్కక్షణం అతనికేసి చూసి ఆ తర్వాత దగ్గరగా వచ్చి అతని చొక్కా కాలరు సర్దుతూ "నా పిచ్చి మాధవా! నాకోసం అని, నీ మీద ఆశలన్నీ కేంద్రీకరించుకున్న మీ నాన్నగారినీ, తరతరాల నుంచీ కాపాడుకుంటూ వస్తూన్న వంశ గౌరవాన్నీ వదులుకుంటావా? వద్దు.... ఇలాంటి ఆలోచనలు పెట్టుకోకుండా వెళ్ళు - వెళ్ళి లక్షణంగా పెళ్ళి చేసుకో - నేను దూరం ఆలోచించి చెపుతున్నాను. త్యాగం ప్రేమ అంటూ ఆవేశపడటం మంచిది కాదు - ఇంక నాకు అంటావా, నీ అభిమానం ఉంటే చాలదూ పెళ్ళే కావాలేమిటి? మరచిపోకుండా ఎప్పుడేనా వచ్చి కనిపిస్తూండు. ఏం? అలా చెయ్యి" అంటూ ఎన్నో విధాల చెప్పి చివరికి ఎలా అయితేనేం ఒప్పించింది గౌరి.

గౌరిని చూస్తే, ఆపదలో తనని ఆదుకున్న ఒక దేవతలా తోచింది మాధవయ్యకి.

అవును!

అటు తండ్రిని కాదనడమా - ఇటు గౌరిని వదులుకోవటమా - వంశ మర్యాద ముఖ్యమా - ప్రేమ ముఖ్యమా? ఏమిటి చెయ్యడం? పరిష్కార మార్గం ఏమిటి? ఇలా ఏం పాలుపోక తలబద్దలు కొట్టుకుంటూంటే ఇట్టే తేల్చేసి తనని కాపాడింది గౌరి. ఇటువంటి గౌరినా తను వదులుకోవడం?

అలా వదులలేక పెళ్ళయి అయిదారేళ్ళుకావచ్చినా ఏ వారానికో పది రోజులకో ఓసారి వచ్చి గౌరిని చూసి మరీ వెళ్ళేవాడు మాధవయ్య. గౌరి కూడా అక్కడికి అదే మహాభాగ్యం అనుకుంటూ ఇరవై నాలుగు గంటలూ మాధవయ్య గురించే తియ్యగా తలచుకుంటూ, తనకి ఉన్న రెండూ మూడు ఎకరాల మాగాణీ మీద వచ్చే శిస్తు ఖర్చు పెట్టుకుంటూ, ఊళ్ళో తన గురించి ఎంతమంది ఎన్నిరకాలుగా అనుకున్నా లెఖ్ఖచెయ్యకుండా సంతోషంగానే రోజులు గడపసాగింది.

అయితే ఆ కాస్త సంతోషం కూడా ఆమెకు మిగల్చకుండా మాధవయ్య ఇంకో కొత్త సమస్యతో చక్కా వచ్చాడు.

గౌరికి మాధవయ్యకీ ఉన్న సంబంధం భార్యకి తెలిసిందట! ఇంక ఆ ఛాయలకు వెళితే తాను ఒప్పుకునేది లేదనీ, కాదంటే ఉరిపోసుకు ఛస్తాననీ అంటోందిట. ఆమెతో ఇప్పుడు పెద్ద తంటా వచ్చి పడిందంటూ చెప్పుకు వచ్చాడు మాధవయ్య. ఏం చెయ్యాలో, ఆమెని ఎలా ఒప్పించాలో ఏం అర్థం కావడం లేదంటూ తలపట్టుకుని కూర్చున్నాడు మాధవయ్య. గౌరికి పరిస్థితి అర్థమైంది. మాధవయ్యని అతని భార్య ఎంతగా ప్రేమిస్తుందో కూడా అర్థం అయింది. భార్యాపిల్లలతో పచ్చగా పరువుగా బతుకుతున్నాడు. తన కారణంగా అతనూ అతని బతుకూ బజార్నపడడమా? ఉహూ అలా ఒక్కనాటికీ కాకూడదు.

ఒక్క నిశ్చయానికి వచ్చి లేచి నిలబడి "ఇంక రేపటి నుంచీ నా దగ్గరకి రాకు మాధవయ్యా" అంది ఎటో చూస్తూ గౌరి.

మాధవయ్య అదిరిపడ్డాడు.

కాదన్నాడు.

కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

నాకోసం మళ్ళీ త్యాగం చేస్తున్నావా అన్నాడు.

నేను లేకుండా నువ్వు ఉండగలిగినా నువ్వు లేకుండా నేను ఉండలేను అన్నాడు.

ఆ ఆలోచన వద్దన్నాడు.

అలాంటి నిర్ణయానికి రావద్దన్నాడు.

అతని మాటలేం గౌరి వినిపించుకోలేదు. తన నిర్ణయానికి ఇంక తిరుగు లేదు అంది.

బాధ ఆపుకోలేక నువ్వు కర్కోటకురాలివి అన్నాడు; ఏం మాట్లాడలేదు.

చివరికి పౌరుషంతో నానా మాటలూ అని వెళ్ళిపోతున్న మాధవయ్యకు కనిపించకుండా చాటుగా కళ్ళు తుడుచుకుంది గౌరి.

పైకి కోపంగా వెళ్ళిపోయినా మనస్సులో గౌరి చేసిన త్యాగాన్ని గుర్తించలేక పోలేదు మాధవయ్య. 'త్యాగాలు చేస్తూ ఎప్పటికప్పుడు నన్ను ఆదుకోవడానికే ఈమెని పుట్టించాడేమో భగవంతుడు?' అనుకున్నాడు.

గౌరి ఇంకోమారు కూడా మాధవయ్యని ఆదుకుంది.

ముగ్గురు పిల్లల బాధ్యతనీ భర్తకి వదిలేసి మాధవయ్య భార్య కళ్ళు మూసినప్పుడు పదిరోజులూ ఇంకా వెళ్ళకుండానే అయినవాళ్ళూ, కావలసిన బంధువులు అంతా 'వెళ్ళివస్తాం మాధవయ్యా' అంటూ, ఈ బాధ్యత వచ్చి తనమీద ఎక్కడ పడుతుందో అనే భయంతో ఒక్కొక్కరే తప్పుకుంటూంటే, అప్పుడు మాధవయ్యని గౌరే ఆదుకుంది.

భార్య పోయిందనే బాధ ఒక పక్కన, పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యటం ఎలా అనే బెంగ ఇంకో పక్కన గుండెనీ మెదడునీ తొలిచేస్తుంటే చేసేదేంలేక దిక్కుతోచక మోకాళ్ళమీద తలపెట్టుకుని బాధపడుతున్న మాధవయ్య దగ్గరికి సమయానికి వచ్చి "అయ్యో - ఇలా జరిగిందని నాకు కబురేనా తెలియలేదు. ఏంటి! నువ్వే అలా దిగాలుపడి కూర్చుంటే పిల్లలు బెంబేలు పడిపోరూ - ఏం చేస్తాం? లే... స్నానం చెయ్యి. రండ్రా మీకు అన్నం పెడతాను" అంటూ పిల్లల్ని దగ్గరగా తీసుకుని లోపలికి నడిచింది గౌరి.

అంతే అప్పటి నుంచీ మాధవయ్య ఇంట్లోనే వచ్చి ఉండిపోయి, అతని ఇంటికీ పిల్లలకీ చాకిరీ చేస్తూ "అమ్మలేదే" అని వాళ్ళకి అనిపించకుండా తల్లి కంటే ఎక్కువగా వాళ్ళని పెంచి పెద్ద చేసింది గౌరి. ఊళ్ళో లక్ష మంచి లక్ష రకాలుగా అనుకుంటున్నా అవేం లక్ష్యం చెయ్యకుండా మాధవయ్య పిల్లలే తన పిల్లలనుకుంటూ కాలక్షేపం చేస్తోంది.

ఇంతక్రితం గౌరి చేసిన త్యాగాలన్నీ ఒక ఎత్తూ, ఇలా తన ఇంట్లోకి వచ్చి ఉండిపోయి తనకీ తన పిల్లలకీ ఏ లోటూ రాకుండా వేడీ వెచ్చనా చూడటం ఒక ఎత్తుగా కనిపించింది మాధవయ్యకి. ఫలితంగా రోజుకి ఒకసారైనా మనస్సులో కృతజ్ఞతలర్పించుకొనేవాడు గౌరికి.

పెద్దవాడు ఉద్యోగంలో ప్రవేశించాడు. రెండోవాడికి కాలేజీ చదువు పూర్తి కావచ్చింది. పిల్ల పెళ్ళికెదిగింది. ఇంక వాళ్ళనో ఇంటివాళ్ళని చేస్తే తనకింకేం సమస్యలున్నాయి అనుకున్నాడు మాధవయ్య. కానీ అలా ఇంటివాళ్ళని చెయ్యడంలోనే ఇంకో సమస్య వచ్చిపడుతుందని అనుకోలేదు అతను. అలా వచ్చిపడింది కనకే, మాధవయ్యకి మళ్ళీ ఓ కొత్త సమస్య ఎదురైందని అనుకోవలసి వచ్చింది.

అవును - మళ్ళీ ఇంకో కొత్త సమస్యే మాధవయ్యకి.

పిల్లాడికీ పిల్లకీ వస్తున్న సంబంధాలన్నీ ఎందుకు తిరిగిపోతున్నాయి? ఏమిటి కారణం అంటూ పడక కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న మాధవయ్యకి ఇదీ కారణం తెలియచెప్పారు పెద్దబ్బాయీ, అమ్మాయీను.

"కాదు, అదేం కాదు" అని వాళ్ళని సమాధానపరచబోయాడు. "నువు అవునన్నా కాదన్నా అది మాత్రం నిజం. ఆవిడ మన ఇంట్లో ఉన్నన్నాళ్ళూ మాకు పెళ్ళిళ్ళు కావు, ఎవరూ మన సంబంధానికి ఒప్పుకోరు. కులం గాని కులం ఆవిడ ఇంట్లో ఎందుకు ఉంటోంది? ఆవిడకీ మీకూ ఏమిటి సంబంధం? అని మొహం మీద కొట్టినట్లు ఆ పచ్చి నిజాన్ని చెప్పేటప్పటికి మాధవయ్యకి మతిపోయింది.

గతం అంతా ఒక్కమారు అతని మనస్సులో మెదిలింది. తలకు మించిన సమస్యలెన్నో తన తలకి చుట్టుకుని తను సతమతం అవుతూంటే, ఎప్పటికప్పుడు గౌరి దేవతలా ఆదుకుంది. అంతక్రితం అన్నీ అలా ఉంచి మొన్న పది పదిహేనేళ్ళ క్రితం తల్లిపోయి దిక్కుతోచక అల్లాడుతున్న పిల్లల్ని వచ్చి తల్లిలా ఆదుకుంది.

ఏ పిల్లలకయితే ఆ రోజున ఆమె ఆసరా అయిందో ఆ పిల్లల కోసమే ఈ రోజున ఆమె ఇల్లు వదిలిపోవాలన్నమాట!

కావలసినప్పుడు రమ్మనడం, అవసరంలేదన్నప్పుడు పొమ్మనడం! ఇంతకంటే అన్యాయం ఏమైనా ఉందా? ఇప్పటికే తనకోసం పిల్లలకోసం గౌరి ఎన్నో త్యాగాలు చెసింది! త్యాగలు ఎప్పుడూ ఆమె వంతేనా? తనకి వచ్చిన ప్రతి సమస్యకీ గౌరి ఆహుతి అయిపోవాలా? వీల్లేదు. ఏమైతే అవుతుంది. పిల్లలకి పెళ్ళి కాకపోతే కాకపోనీ - ఇంక గౌరి త్యాగం చెయ్యడానికి వీలులేదు. తను చెయ్యనివ్వడు.

మొండికేసుకుని కూర్చున్న మాధవయ్యకి ఇంట్లో రోజు రోజుకీ పిల్లల ప్రతిఘటన ఎక్కువైంది. గౌరిని సూటీపోటీ మాటలనడం - పూర్వంలాగా ఆప్యాయంగా మాట్లాడకపోవడం, చివరికి మాధవయ్యతో కూడా ముభావంగా ఉండటం మొదలుపెట్టారు. ఒకరోజున ఏమైనా సరే గౌరి ఇంట్లోంచి వెళితే కానీ మేం అన్నాలు తినం అంటూ భీష్మించుకుని కూర్చున్నారు ముగ్గరు పిల్లలూ.

పరిస్థితులన్నీ గమనిస్తూ ఇన్నాళ్ళ నుంచీ మౌనంగా ఉంటూ వచ్చిన గౌరి "ఏమిటి మాధవయ్యా నువ్వు మరీను పిల్లలతో సమానంగా? నన్ను పోనియ్యి" అంది బట్టలు సర్దుకుంటూ?

"వీల్లేదు" భయంకరంగా గర్జించాడు మాధవయ్య.

ఏవిటది? ఎప్పుడూ లేంది ఇలా అయ్యాడేంవిటి మాధవయ్య! ఎప్పటికప్పుడు తన తలమీదకి వచ్చిపడిన సమస్యని తెముల్చుకోలేక సతమతం అవుతూ వచ్చిన మాధవయ్యే ఇవాళ ఇంత గంభీరంగా నిర్ణయం తీసుకుంటున్నది? ముడతలు పడుతున్న కనుబొమలు ఎత్తి ఆశ్చర్యంగా చూసింది.

ముడతలు పడుతున్న ముఖం, నెమరుస్తున్న జుట్టుతో కనిపిస్తున్న గౌరిని చూసి "ఈ వయస్సులో ఈమెని పంపించెయ్యడం కంటే ఘోరం ఇంకేమయినా ఉందా?" అనుకున్న మాధవయ్య కళ్ళు చెమ్మగిల్లాయి. కానీ కన్నీళ్ళు కనిపించనీయకుండా తుడుచుకుని "నాకో కొత్త సమస్య ఎదురైనప్పుడల్లా నువ్విలా త్యాగం చేస్తూ ఉండాలా? దీనికో అంతు అంటూ లేదూ? ఏవైనా సరే నువ్వు వెళ్ళడానికి వీలులేదు" అన్నాడు బిగ్గరగా.

"అయితే సరే మేం వెళుతున్నాం," అన్నారు పిల్లలు ముగ్గురూ ఒకేమారు.

ఆ మాటకి మాధవయ్య నిర్ఘాంతపోయాడు. వాళ్ళకేసి బాధగా చూశాడు. వాళ్ళు మాత్రం "ఏమంటారు చెప్పు, ఆమెని పంపిస్తావా? మమ్మల్ని వెళ్ళమంటావా?" అన్నట్టు చూశారు.

"ఎందుకొచ్చిన అల్లరి? నన్ను వెళ్ళనియ్యి? " అన్నట్టు చూసింది గౌరి.

మాధవయ్య ఒక్క నిముషం ఆగి, తల పంకించి లేచి, కండువా దులిపి భుజం మీద వేసుకుంటూ "సరే - మనమే పోదాం, నడు గౌరీ!" అన్నాడు. గౌరి భయంతో "అదేవిటి? నువ్వెక్కడికి? పిల్లలు ఏమౌతారు?" అంది.

"ఇప్పుడు వాళ్ళకి నీ అవసరం లేదు. వాళ్ళంతటి వాళ్ళయ్యారు. ఊ, నడు" అంటూ దురుసుగా అడుగు కదిపాడు మాధవయ్య, పిల్లలు ఎవరైనా అతణ్ణి వెళ్ళొద్దని ఆపుతారేమో అని చూసింది గౌరి. చివరికి నిట్టూర్చి "జాగ్రత్తగా ఉండండి బాబూ" అంటూ కన్నీళ్ళు పెట్టుకుని వదల్లేక వాళ్ళని వదిలి మాధవయ్యని అనుసరించింది.

తనకోసం? ఎంతో ప్రీతిగా చూసుకుంటున్న ఇంటినీ పిల్లల్నీ ఇన్నాళ్ళూ కాపాడుకుంటూ వచ్చిన పరువునీ, ప్రతిష్టనీ త్యాగం చేసేసి తనతో వచ్చేస్తున్న మాధవయ్యని అర్థం చేసుకోలేక బరువుగా అడుగులు వేస్తూ ఇల్లు చేరుకుంది గౌరి మాధవయ్యతో.

దట్టంగా పేరుకుపోయిన దుమ్ము ఊది, తాళం తీయబోతున్న గౌరీ, మౌనంగా పాత జ్ఞాపకాలు తిరగేసుకుంటూ మెట్లమీద పరధ్యానంగా నుంచున్న మాధవయ్యా ఉన్నట్టుండి వినిపించిన పెద్ద కోలాహలంలాంటి సందడికి వెనక్కి తిరిగి చూశారు.

అప్పటికే దేవుడి రథం ఆ వీధిలోకి తిరిగింది. రథంతోపాటు వందలకొద్దీ జనం ఆ వీధి అంతా నిండిపోతున్నారు.

గుమ్మం ముందు నుంచీ ఊరేగుతూ పోతున్న దేవుడికి మాధవయ్యా, గౌరీ చేతులు జోడించి కళ్ళు మూసుకుని మనసారా నమస్కరించారు.

వాళ్ళని చూసి దేవుడు ఏమనుకున్నాడో కానీ రథం చుట్టూ ఉన్న భక్తులు మాత్రం "ఎంతకి తెగించారు! ముసలివాళ్ళయినా పాతబుద్దులు పోలేదు వీళ్ళకి ఛీ... ఎంత వయస్సు వచ్చీ ఏం లాభం, సిగ్గూ, లజ్జా వదిలేశాక" అంటూ గుసగుసలాడుకుని ముక్కుమీద వేలేసుకున్నారు.

ఇలా అన్నారు..!

జీవిత విలాస ప్రతిపాదనలో పడి జగాన్నే మర్చిపోయిన మానవులు ఎవరయినా ఉంటే - లోకం వారినే చెడిపోయినవారు అని నిందిస్తుంది. ఉజ్వలమైన ఆశలతో స్వప్నాలతో జీవితం ప్రారంభించే వారికి పరిస్థితులు అనుకూలించకపోతే పథవిహీనత శాపంగా పరిణమిస్తుంది. అసలు స్వప్నాలంటూ పెంచుకుని అధర్మ పథంలో రూపకల్పనం చేసుకునే వారికి పథవిహీనత ఎలాగూ తప్పదు. ఆ ఉజ్వలత వెనకాల అంధకారమూ తప్పదు. కాని ధర్మపథంలో జీవిస్తూ క్రమం తప్పని స్వప్నాలను వాస్తవం చేసుకోవాలని ప్రయత్నించే వాళ్ళకు కూడా ఈ శాపం తప్పటం లేదంటే అసలు స్వప్నాలలోనే ఒక తప్పు ఉన్నదని అనిపిస్తున్నది.

కలలూ , ఊహలూ, ఆలోచనలూ ఇవన్నీ శాంతి నివ్వడానికి బదులుగా బ్రతుకుని అశాంతి చేస్తున్నాయా? అని అనుమానమూ వస్తుంది.


- 'పథవిహీన' నవలలో లత

# జీవన్మృత్యు రహస్యం

## -మధురాంతకం రాజారాం

(రచనా కాలం ౧౯౭౨)

*చిత్తూరు జిల్లాలోని దామలచెరువు గ్రామంలో జన్మించిన శ్రీ రాజారామ్ గారు అదే వూళ్ళో జిల్లాపరిషత్ హైస్కూలు మాస్టారుగా పనిచేశారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు ఆయన రచించిన కథలు తెలుగు సాహిత్యంలో మణిపూసలు. చాలా కథలు పాఠ్యాంశాలుగా కూడ పరిగణించబడడం ఆయన రచనల గొప్పదనానికి ఒక ఉదాహరణ మాత్రమే. ఎక్కువగా రాయలసీమ నేపథ్యంలో సాగే ఆయన కథల్లో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి జీవితాల కష్టాలు, కడగండ్లు, ఆత్మీయతలు, అనుబంధాలు కళ్ళకు కట్టినట్లుంటాయి. కథలు ఎలా వ్రాయాలో నేర్చుకోవాలనుకునే వారు రాజారామ్ గారి కథల్ని ప్రమాణంగా తీసుకోవాలని పలువురు సాహితీ విమర్శకులు చెబుతుంటారు. వారి కుమారులు మధురాంతకం నరేంద్ర, మధురాంతకం మహేంద్రలు కూడా పేరొందిన కథా రచయితలే.*



మా ఎదురింటి సుందరామయ్య చాలా పెద్దమనిషి.

అనుకోకుండా వచ్చిన ట్రాన్స్ఫరులో నేను ఎండుటాకులా కొట్టుకొచ్చాను. కొత్త ఊరు. ఇక్కడ సుందరామయ్య లాంటి పెద్ద దిక్కు దొరకడం నా అదృష్టం. మనిషన్న తర్వాత జబ్బంటూ ఒకటి రాకపోదు. మా ఇంట్లో ఎవరికైనా ఒళ్ళు నలతగా ఉందని తెలిస్తే నాలుగు రకాల ఔషధాలు సూచించి, నలుగురు డాక్టర్ల దగ్గరికి తీసుకెళ్ళి ఆ జబ్బు నయమయ్యేదాకా సుందరామయ్య నిద్రపోడు. ఏ ఆపద్బాంధవుడైనా ఇంతకన్నా ఏం చేస్తాడు? "మార్కెట్‌లో మంచి కూరగాయలొచ్చాయట? అయినా తెచ్చిపెట్టేవాళ్ళు కావద్దూ," అంటూ మా ఆవిడ నన్ను ఎద్దేవా చేసేసమయానికి "రిటయిరై ఫించన్ పుచ్చుకుంటున్నవాణ్ణి నేనొకణ్ణి ఉన్నాను గదమ్మాయ్ ఆ మాత్రం పని నేను చేసి పెట్టలేనా" అంటూ సంచీ పుచ్చుకుని ఆయన మార్కెట్టుకి సిద్ధం. అందువల్ల ఆయన నాకు సమయ సంజీవిలా కనిపించాడన్నది వట్టి సహజోక్తి.

ఆయన మాట పైన నాకు చెప్పరానంత గురి.

సాయంకాలానికి వాన వస్తుందంటాడు. తప్పకుండా వస్తుంది. జడివానగా మారకపోయినా నాలుగు ఉబ్బచినుకులైనా పడాల్సిందే!

"వాతావరణంలో మార్పు వచ్చింది ఫ్లూ జ్వరాలు ముంచుకొచ్చేస్తే ఆశ్చర్యపడవలసింది లేద"ంటాడు. సుగ్రీవాజ్ఞ ! దేశమంతా ఫ్లూజ్వరాలతో తీసుకోవలసిందే.

ఈ సంవత్సరం వానలెక్కువైపోయాయి. వానలెక్కువైతే చెట్టుబలుస్తుంది గానీ పూతబట్టదు. కందిపప్పు రేటు పెరుగుతుందంటారు. ఏడాదికి సరిపడా కందిపప్పు కొని స్టాకు పెట్టేసుకునేదాకా నా ధ్యాస ఇంకొక విషయం పైకిపోదు.

సుందర్రామయ్య అనుభవజ్ఞుడు. నేను నేలపైన బడి క్యారు క్యారుమని ఏడుస్తూ లోకాన్ని పలకరించిన నాటికి ఆయనకు బహుశా ఇప్పుడు నాకున్నంత వయసుండి ఉంటుంది. నాకన్నా ముప్పై ఏళ్ళు ముందుగా పుట్టి, అనుభవపూర్వకంగా ఆయన సంపాదించి పెట్టుకున్న జ్ఞానమంతా కొంగులోని బంగారంలా, నేల తంగేడు చెట్టులోని తేనెపుట్టలా అశ్రమంగా, అయాచితంగా నాకు కైవశమై పోయింది. ఇంక నాకు డొట్లెందుకు? ఆలోచన ఎందుకు? సుందర్రామయ్య నాకు నాడీజాతకంలా, చిలక జోస్యంలా, పెద్ద రిఫరెన్సు పుస్తకంలా దొరికాడు. సర్వం దైవాధీనమని పెద్దలన్నట్టుగా సర్వం సుందర్రామయ్య ఆధీనమని భావించి నేను నిష్పూచీ, నిష్పేచీలవాణ్ణిగా ఉండిపోవడానికి అలవాటు పడసాగాను.

అసలింతకూ సుందర్రామయ్య అనే బోధివృక్షం నీడక్రింద నాకు జ్ఞానోదయం కలిగిందెప్పుడో చెప్పాలి.

కొత్త ఊరికి వెళ్ళిన కొత్తలో గోడ గడియారం కొన్నాను. గోడకు తగిలించి దానికి ప్రారంభోత్సవం చెయ్యడం కోసం సుందర్రామయ్యనే ఆహ్వానించాను. ఆయన దాన్ని ఏడెనిమిది దృక్కోణాల నుంచీ పరిశీలించి చూచారు. ఎదురుగా నిలబడి అనుమానంగా పెండులం వైపు చూచాడు. తరువాత పెదవి విరిచి, "ఏదీ సవ్వడి బొత్తిగా వినిపించడంలేదే!" అన్నారు.

"ఇంతకంటే బలంగా వినిపించాలంటారా?" అన్నాను.

"మా తాతయ్యగారి ఇంట్లో ఒక గోడ గడియారం ఉండేది. అది పెద్ద చుట్టు భవంతి ఇల్లులే! నడవలో ఎక్కడో ఉండేది గడియారం. ఐతేనేం? అది ఇంటికంతా గుండెకాయేననుకో, అంత పెద్ద ఇంట్లో అది టిక్కుటిక్కుమనే శబ్దం ఏమూలనో ఉన్నా వినిపిస్తుండేది. ఆ పనితనమిప్పుడెక్కడ ఏడ్చింది? కాలం చెడిపోయింది లేవయ్యా శేఖరం!"

కాలమే చెడిపోయినప్పుడు కాలమానిని చెడిపోవడం అబ్బురమా! నాకు ముఖాన చింతనీళ్ళు చల్లినట్టయింది. అలాగని టైం వారా చూపించిందని నా గడియారం పైన నేను అపనింద మోపలేను. కీ ఇవ్వడంలో కొంత ఆలస్యం జరిగినా అది బుద్ధిగా తన పనేదో తాను చేసుకుపోతుండేది. ఐనా సుందర్రామయ్య తాతగారింట్లో వెలసి ఉండిన గోడ గడియారంలా ఇది కొట్టుకోడం లేదు కదా! వందాయాభై రూపాయలు పోసి కొన్నందుకు ఇదేనా ఈ బోడి గడియారం నాకు చేయాల్సిన సత్కారం! నాకా గడియారం పైన మోజు తగ్గింది.

దాన్ని చూచినప్పుడల్లా కాలం చెడిపోయిందన్న సుందర్రామయ్య మాటే జ్ఞప్తికి వస్తుండేది.

ఆలోగా కాలానికి బాగా జబ్బు చేసిందనడానికి తార్కాణంగా సుందర్రామయ్య క్రమంగా రోజుకొకటి రెండు దాఖలాలు చూపుతూనే వచ్చారు.

"అంతెందుకు శేఖరం! మా అమ్మ కూరలకు తిరగమోత పెడుతుండేది. ఆ సువాసన నేనింకా మరచిపోలేకుండా ఉన్నాననుకో! ఎక్కడో పెరటి దగ్గర వంటగదిలో తిరగమోత పెడితే, ఆ వాసన హాలు దాటి నడవ దాటి, వీధివసారాలోకి, ఇంకా మాటాడితే వీధిలోకి కూడా వచ్చేసేది. ఇప్పుడేదీ? నేనూ పొంచి ఉండి గమనిస్తున్నాను కదా! తిరగమోత వాసన చస్తే రాదే! ఇప్పుడు చెప్పు, దీన్నేమంటావు మరి?"

కావచ్చుననుకున్నాను. ఆ మధ్య నాకుకూడా ఇంట్లోగానీ ఆఫీసులోగానీ తిరగమోత వాసన పసిగట్టినట్టు జ్ఞాపకంలేదు.

"ఇంకొకటి చెప్పమంటారా శేఖరం!" అన్నాడు సుందర్రామయ్య "ఏవిటో చెప్పండి" అన్నాను ఆసక్తిగా, "ఇప్పుడు మార్కెట్టుకిన్ని కూరగాయలొచ్చిపడుతున్నాయి కదా? ఏం లాభం చెప్పు. చవీసారం ఉండి ఏడ్చేది ఒక్కటైనా ఉందా వీటిలో? నా చిన్న తనంలో మా అమ్మ ఇన్ని పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయలు తరిగిపోసి కాస్తంత కొత్తి మీర ఆకుతో మిళాయించి చింతపండు ఊరుబిండి నూరి పెడితే, రెండు కంచాల నిండా కూడు తిని లేచేవాళ్ళం. ఇప్పుడు నువ్వు పనిగట్టుకుని ఒక విందుకు వెళ్ళి చూడు. మందు తిన్నట్టు లేచిరావాల్సిందే!"

సుందర్రామయ్య మొదట చాలా చిన్న చిన్న ఉదాహరణలే చెబుతూ వచ్చాడు. నాలో గ్రాహ్యశక్తి తగినంతగా పెరిగినట్టు నమ్మకం కలగగానే మహత్తర విషయంలోకి చొచ్చుకుని వచ్చేశాడు. ఉండుండీ ఒకనాడు "ఈ నాటి సాహిత్యం మాత్రం?" అన్నాడు.

"దానికి ఏమొచ్చిందండీ? అన్నాను.

"మా రోజుల్లో విడివిడిగా అయితే పావలా కొక నవల దొరుకుతుండేది. రూపాయకైతే అయిదు నవలలు వచ్చేవి. చదువుతుంటే ఏ లోకంలో ఉన్నామో తేలేదికాదు. పొట్ట చెక్కలయ్యేటట్టుగా నవ్వుకూడా వచ్చేదనుకో! ఇప్పుడెక్కడ? ఇన్ని పత్రికలొస్తున్నాయికదా! వందల లెక్కలో పుస్తకాలు తయారు చేసి, అచ్చేసిన ఆంబోతుల్లా వదిలి పెడుతున్నారుకదా! ఆ స్వారస్యం వీటిలో కాగడా వేసి వెదికినా కనిపించదే!"

"అవున్నిజమేనండి! మీ మాటలు విన్నాక జ్ఞాపకానికొచ్చింది. మా అమ్మమ్మ చెబుతుండేది. ఆనాటి సినిమాలు కూడా చాలా బాగుండేవట!" అన్నాను.

తనకింత ఆదర్శప్రాయుడైన గొప్ప శిష్యపరమాణువు దొరికినందుకు సుందర్రామయ్య ఆమందానందకలిత వదనార విందుడైపోయాడు - "మెల్లగా చెబుతున్నావా శేఖరం ఆ మాట! ఆ రోజుల్లో వాటిని బయస్కోపులనేవాళ్ళు. ఒకతను తెరముందు నిలబడి కథ చెబుతుండేవాడు నెమ్మదిగా, సాంగోపాంగంగా, నిమ్మకు నీరెత్తినట్టుగా సాగిపోతుండేది కథ. టాకీరావడమల్లా నాకు పెళ్ళయిన సంవత్సరమే! కావాలిస్తే మీ పిన్నినడుగు. మా ఊరి భారతం మిట్టపైన వేసిన డేరాలో నేనూ ఆవిడా కలిసి, అదేదో జయప్రదాదేవి చరిత్రనుకుంటాను - పదిసార్లయినా చూచిఉంటాం..."

కామందకుడి నీతి శాస్త్రంలా, శుక్రాచార్యుడి నీతిలా సుందర్రామయ్య ఉపదేశం ఒంటబట్టేసరికి జీవితం పట్ల నాకొక వినూత్న దృక్పథం ఏర్పడి పోయింది. క్రొత్త కంటే రోత మరొకటి లేదనీ, పాతదంతా బంగారమేననీ నేననుకోసాగాను. కూరగానివ్వండి, చారుగానివ్వండి, ఎంత పాతదిఅతే అంత ప్రియంగా నేను అన్నంలో వదిలించుకోవడం మొదలు పెట్టాను. "అయ్యో అది పాసిపోయిందండీ, అంటూ మా ఆవిడ నెత్తిమొత్తుకునేది. నీకు తెలియదులే! ఊరుకోమంటూ మందలించేవాణ్ణి. మీరీ రోజుల్లో ఉండాల్సిన మనిషిలా లేరు" అంటూ ఆవిడ ఖిన్నురాలై నిల్చుండేది ఐనా నేను ఖాతరు చేసే వాణ్ణిగాను. "నిజమే రాజ్యం! బంగారంలాంటి కాలమంతా ముప్పై నలభై ఏళ్ళకు ముందే వెళ్ళిపోయింది. మనం మన దురదృష్టం కొద్దీ ఈ రోజుల్లో పుట్టి పెరుగుతున్నాం" అనే వాణ్ణి.

ఇలా నేను పురాతన వైభవాల తలపోతలో తన్మయత్వాన్ని భజిస్తూఉండగా మంచి సంగీతంలో అపశృతిలా ఊడిపడ్డాడు లక్ష్మీనారాయణ, ఎవరో కాదు అతడు సుందర్రామయ్యగారి మేనల్లుడు.. చాలనిదానికి కూతురు మొగుడు కూడా!

"చూడండి శేఖరంగారూ! కొన్ని గ్రహాల్లో కాలం వెనక్కు నడుస్తుందట ఆ మాటెంతవరకు నిజమోగానీ మన భూప్రపంచం మీద కొందరు గతించిపోయిన కాలంలో జీవిస్తున్నమాట నిజం! వాళ్ళు బ్రతికిఉన్నా బ్రతకనట్టే లెక్క! అలాంటి వాళ్ళల్లో మా మామయ్య ఒకడని నాకు చాలా కాలం నుంచి తెలుసు. ఇప్పుడాయన కింకొకరు తోడైనందుకు మాత్రం నాకు చాలా విచారంగా ఉంది." అన్నాడు ఏడుపు మొగంపెట్టి!

"ఏమిటండీ లక్ష్మీనారాయణగారూ! ఏమంటున్నారు మీరు?" అన్నాను విస్తుపోతూ.

"కాలం ముందుకు పరుగెడుతుంది, అది స్వభావం. కొందరు కాలంతోబాటు సాగిపోలేక ఒకచోట చతికలబడిపోతారు. అక్కడితో మానసికంగా వాళ్ళ జీవితం ఆఖరు! వాళ్ళకింక మిగిలేవన్నీ జ్ఞాపకాలే! అనుభూతుల్ని నెమరువేసుకుంటూ. వాళ్ళ అనుభవాలను కాలదన్నుకుంటారు. పిప్పిని నములుతూ చెరుగడను నిందిస్తారు. మనిషికి ముసలితనం రావచ్చు కానీ, మనసుకు ముసలితనం రావడం ఘోరం! మా మామయ్య నాకు బుద్ధి తెలిసినప్పటినుంచీ ముసలివాడుగానే ఉన్నాడు. నా బుద్ధి నాకొచ్చాక నేనాయనకు దాపురించిన అకాల వార్ధక్యానికీ కారణమేమై ఉంటుందా అని ఆలోచించి చూచాను. మా మామయ్య పనిచేసే ఆఫీసు ఖార్కానాలకు మధ్యగా ఉండేది. అందువల్ల ఆయన కర్ణభేరి సున్నితమైన శబ్దాలను స్వీకరించడం మానేసింది. ఒకప్పుడాయన అదే పనిగా కొన్నేళ్ళపాటు ముక్కుకు నశ్యందట్టిస్తూ వచ్చారు. ఘ్రాణశక్తి పూజ్యమైపోయింది. నశ్యం మానేయకపోతే చూపుకూడా మందగించవచ్చునని డాక్టరు సలహా ఇచ్చాడు. అందుకని ఈయన తాంబూలం వాడుక చేసి చూశాడు. అహరహాలు తాంబూలం డబ్బీ అందుబాటులో ఉండవలసిందే! అందువల్ల నాలుక మందమైపోయింది. షడ్రసోపేతమైన భోజనమైనా చెత్తలాగే తోస్తూ వచ్చింది. కానీ దోషమంతా తనలో ఉందని ఆయన అనుకోడు. రంగు, రుచీ, వాసన ఏదీ లేని కాలానికి దోషం అంటగట్టి ఆయన కాలదోషానికి గురైపోతున్నాడు, విన్నారుకదూ! అదీ సంగతి!"

నా ఆత్మాభిమానానికి దెబ్బతగిలే ఉండొచ్చు. లావా ద్రవంకదా! పెల్లుబికి వచ్చినప్పుడు పరిసరప్రాంతాలకు హాని జరగనే జరుగుతుంది. కానీ అది చల్లారి పోయాక భూమి చాలా సారవంతమౌతుందిట! అంతపనీ జరిగినతర్వాత పంటలు బాగా పండే అవకాశం ఉంటుందని కూడా విని ఉన్నాను! ప్రస్తుత పరిస్థితుల్లో అదే నాకున్న ఆశాలేశం!



ఇలా అన్నారు..

పురాతన జపనీస్ కథ ఇది. ఒక మహారాజు తన మాస్టర్‌ని 'స్వర్గానికీ, నరకానికీ గల తేడా ఏమిటో చెప్పమ'ని అడిగాడట. మాస్టర్ నవ్వి , 'నీలాంటి మూర్ఖుడికీ, అజ్ఞానికీ చెప్పినా అర్థం కాదు' అన్నాడు. మహారాజు ఆవేశంతో వణికిపోయాడు. కళ్ళు ఎర్రబడ్డాయి. చివాలున కత్తితీసి, 'నేను నిన్ను చంపెయ్యబోతున్నాను' అన్నాడు ఎర్రబడిన మొహంతో.

గురువు మౌనంగా నవ్వి, 'ఇదీ నరకం అంటే..' అన్నాడు.

మహారాజు స్తబ్దుడయ్యాడు. సిగ్గుపడ్డాడు. తన తప్పు గ్రహించాడు. మోకాళ్ళమీద వంగి కూర్చుంటూ, 'నా తప్పు తెలిసింది. నిజంగా నేను అజ్ఞానినే' అన్నాడు నమ్రత వల్ల ప్రకాశవంతమైన మొహంతో.


'ఇదీ స్వర్గం అంటే' అన్నాడు మతగురువు. ఒకే మనిషిలో వెంట వెంటనే మారిపోయే మానసిక స్థాయీ భావాల స్థితి ఇది. ఈ స్థితిలో స్వర్గమూ, నరకమూ పక్కపక్కనే ఉంటాయి.

*'విజయానికి ఆరోమెట్టు'లో యండమూరి వీరేంద్రనాథ్*

# పోయింది ఇల్లు

**బలివాడ కాంతారావు**

(రచనా కాలం ౧౯౬౨)




*1927 జులై 3 వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని మడపం అనే గ్రామంలో జన్మించిన శ్రీ బలివాడ కాంతారావు గారు భారత నౌకా దళంలో సివిలియన్ ఆఫీసర్ గా పనిచేశారు. తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసే రచనలు అనేకం చేసిన కాంతారావుగారు ఎప్పుడూ తాను నమ్మిన సిద్ధాంతాలకు రాజీ పడలేదు. దాదాపు చిన్నా పెద్దా కలిపి 38 నవలలూ, 400 పైగా కథలూ, ఇంకా నాటకాలూ, నాటికలూ కూడా వ్రాసారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఎవార్డు, తెలుగు యూనివర్సిటీ ఎవార్డు లాంటి అనేక ప్రతిష్టాత్మకమైన సాహితీ పురస్కారాలను అందుకున్నారు. 'దగాపడ్డ తమ్ముడు' వీరి ప్రసిద్ధ నవల. 2000 మే 6 వ తేదీన పరమపదించిన శ్రీ కాంతారావు గారు 45 సంవత్సరాల క్రిందట రాసిన కథని కౌముది పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.*

**ఇదివరకు** ఎన్ని సంఘటనలను, కమలమ్మ ఆమె మూడు పదులు దాటిన జీవితంలో ఎదుర్కొనలేదు? అలాంటిది ఈ ఒక్క సంఘటనతో ఆమె ఇలా పూర్తిగా మారిపోవాలా?

భర్త నిరంజనరావు ఈ నష్టంతో కంపించిపోయినా తట్టుకున్నాడు. వారంరోజుల వరకూ విద్యావతియైన భార్య మనసు మార్చుకుంటుందేమోనని ఎదురుచూశాడు. ఆమె అలానే మౌనంగా గదిలో కూర్చుని కిటికీ గుండా ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుంటూంది.

"చూడు కమలా! నా కోసమైనా నువ్వు బ్రతకాలా?"

ఆమె మాట్లాడలేదు. ఈ వారంరోజుల్లో భర్త ఒకవిధంగా కళ్ళల్లో నీరు తెచ్చుకున్నాడు కానీ, భార్యకు కన్నీరు కరువైందేమో? వసంతంలోని ఉద్యానవనంలాంటి వారి ఇల్లు ఇప్పుడు ఈ గాలివానతో బీభత్సం అయిపోయింది. చెట్టుకున్న గులాబీరేకుల్లాంటి ఆమె పెదిమలు రాలిపోయిన రెక్కల్లా పాలిపోయాయ్.

"ఏమీ తెలియని దానివైతే వేదాంతం బోధించేవాడిని. చూడు - ఆ బుద్ధభగవానుడు నీ ఎదురుగా ప్రత్యక్షమైతే, నా బిడ్డను బ్రతికించమని కోరేదానివి! కానీ అతని సమాధానం నీకు తెలుసుగా"

ఆమె తలదించుకుంది.

"నువ్వే అన్నావే - మనం అంతా చెట్టుకున్న ఆకులవంటి వాళ్ళమని, మన ఇష్టాఇష్టాల మీద ఈ ఆకులు చెట్టుకుండవు. మన చేతిలో ఉన్నది జాగ్రత్త పడటం - మనుషులు చెయ్యగలిగినదంతా చేశాం. మన భోగభాగ్యాలు అనుభవించడానికి పాప పుట్టలేదు!"

కమలమ్మ ఈసారి భర్త వేపు తేరిజూచింది.

'లేకలేక కలిగిన సంతానం. ఆ పాప కడుపులో కదిలేటప్పుడు, నేను మిమ్మల్ని భర్తగాపొందినప్పుడైనా అంత ఆనందం పొందలేదు. ఆ బంగారుపాప కడుపులోనే కాదు బయట కూడా నా ప్రాణం కంటే తీపైంది. నా పాప ఈ ఆరేళ్ళూ చిలిపి చేష్టలతో, చిరునవ్వు చిందులతో నా ప్రతిరూపమై నా ఇల్లు స్వర్గధామం చేసింది. మీకేం తెలుసు నా బాధ? చాలించండి మీ వేదాంతం!'

కమలమ్మ ఈ మాటలు ఆడలేదు. ఆమె మౌనం, ఆమె చూపు అతని మనసులో ఈ విధంగా ఆలోచనలు రేకెత్తించాయి. మళ్ళీ ఆమెను బాధించలేదు. నిత్య సంతోషంతో నిర్మలంగా ఇంటిని ఒక దేవాలయంగా ఉంచి పావనం చేస్తుండిన భార్యను మళ్ళీ చూడాలనే తన లోభం తన్నిలా అలమటింపజేస్తుందని అనుకున్నాడు. కాలం అన్ని వ్యాధులకు బాధలకు అమోఘమైన మందని నమ్మాడు. నెలరోజులు దాటినా కమలమ్మలో మార్పు కనబడలేదు. మనసు చెదిరిందేమో అన్న అనుమానం కలగసాగింది.

"ఇద్దరు ముసలివాళ్ళం కాలేదుగా - మనం రాత గురించి నమ్మేవాళ్ళం కాదు. కానీ మనకు రాసిఉంటే ఇంకో పాప పుట్టుతుంది కమలా! మనిషికి నిజంగా కావలసింది డబ్బు కాదు, కీర్తి కాదు - ధైర్యం! పిరికివాళ్ళు రోజూ చచ్చిపోయి బ్రతుకుతారు."

ఆమె ఈసారి తలెత్తయినా చూడలేదు. పాలిపోయిన ముఖంతో, ఎముకలగూడుగా కనిపిస్తున్న భార్యవైపు చూస్తుంటే తనలోనే ధైర్యం సడలసాగింది. పెరటి డాబా మీదకు వచ్చేశాడు.

సాయం సమయం. నీలాకాశంలో ఎగురుతున్న ఒక పక్షి. దగ్గరనే ఉన్న చెట్టుపై వ్రాలిపోయింది. తనూ కూర్చుండిపోయాడు. అందని పళ్ళకు ఆశపడటం మనిషికి అలవాటే! ఆ ప్రయత్నంలో ఎలానో అదృష్టం పండి అందుకున్న పండు కుళ్ళిపోతే.. తన బ్రతుకూ అలానే అయ్యింది. మనసులను ఊగించి మ్రోగించిన మురళిలాంటి పాప పుట్టకపోయినా బాగుండేదనుకున్నాడు. కొంత సేపటికి ఆ పక్షి మళ్ళా ఎగిరింది. తనూ లేచి నిలుచున్నాడు. ఆ పక్షిలానే దూరదూరాలకు ఎగిరిపోతే?..

మరుసటి రోజే భార్యతో ప్రయాణం కట్టాడు. ఆమెకు ఆసుపత్రులలో రోగాలతో బాధపడుతున్న మనుష్యులను చూపించాడు. పిల్లలు పోయిన తల్లుల గోడు, తల్లులు పోయిన పిల్లల గోడు వినిపించాడు. ఆకలి, దారిద్ర్యం, రోగాలు, బాధలకు గురైన వేలాది తోటిమానవుల ఆక్రందనలను ఆమె విన్నది.

"చూడు లోకం నిండా ఎన్ని చావులు, ఎన్ని కష్టాలు, బాధలు! వీటితో పోలిస్తే మన కష్టం ఏముంది? ధైర్యం తెచ్చుకో కమలా!"

ఆమె మాట్లాడలేదు. ఇప్పటికి తిరిగిన ప్రదేశం అంతా ఆమెకో పెద్ద ఇల్లులా ఉంది. ఆ ఇంటిలో తన పాపను వెతుక్కుంటూ తిరుగుతున్నట్లుంది.

ఆమె కళ్ళల్లో ఈ కష్టాలు చూసినప్పుడైనా, కన్నీరు తిరుగలేదు. ఆమెకు అని ఒక సినిమా చూసినట్టే గానీ, సహజంగా జరుగుతున్నట్లు కనబడలేదేమో! రెండు నెలలు దాటినా ఆమె పరిస్థితిలో మార్పులేదు. కష్టాలు ఈమె మనసును కరిగించలేకపోతే ఇంకేం కరిగిస్తాయి?

ప్రతి మనిషీ ఒక దేవాలయం. లోనున్న దేవుడు మనసునును శరీరాన్ని పవిత్రంగా ఉంచటం నేర్పుతాడు. లోన అంత దగ్గరగాఉన్నా చాలా మంది ఆ దేవుని చూడలేరు. అలాంటి వాళ్ళు బయట ఉన్న దేవాలయాలను దర్శించి, ఆ దేవతా విగ్రహాల ఎదుట మోకరిల్లితే తమలోని దైవాన్ని చూడగలిగే అవకాశం ఉంటుంది. అలా చూడగలిగినప్పుడే జీవిత కల్లోల గౌతమిని ఈదగలుగుతారు. ఆ ఆశతోనే ఆమెను ప్రఖ్యాత దేవాలయాలకు తీసుకు వెళ్ళాడు. ఆమె దేవతా విగ్రహం ఎదురుగా చేతులు జోడించలేదు. తలైనా వంచలేదు. ఆ రద్దీలో కనబడిన పాపలందరివైపూ దీక్షగా చూస్తుంది.

సంధ్యా సమయంలో తిరుపతి కొండమీద ఏకాంత స్థలంలో నిరంజనరావు మనసులో చేతులెత్తి "తండ్రీ! కోరినదంతా ఇచ్చావని విర్రవీగేవాణ్ణి! ఒక్కసారి ఇలా నన్ను అగాధంలోకి త్రోసేశావు. నేనేం పాపం చేశాను? ఎన్నో కోరికలు కోరను. ఇంక నాకు మిగిలినదంతా తీసుకో! నా కమలాన్ని నాకు వికసింపజేసి ప్రసాదించు!" అని ప్రార్థించాడు.

అలా ప్రార్థిస్తూనే కళ్ళంట నీళ్ళు కారిపోయాయి. కాస్సేపయ్యాక మళ్ళీ తనలో మానవ ప్రయత్నమనే ఆశ వెలిగింది. ఈ కన్నీరు ఆరిపోతున్న ఆ ఆశ దివ్వెకు నూనెలా అయ్యింది.

దేవతా విగ్రహాలు మాట్లాడవు. లోనున్న దేవునికన్నా వారిలో దేవుని వెలుగు బయటకు కూడా ప్రకాశిస్తుంది. అటువంటి మనిషి దేవుని మాటలు ఆడతాడు. ఆ మాటలు విన్న ఎదుటి వాళ్ళలో అంతవరకూ మూసుకుపోయిన కవాటాలు తెరుచుకుంటాయి.. తనలోనూ వెలుగుతున్న వెలుగును చూడటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు మనసు శరీరాన్ని పవిత్రంగా ఉంచటానికి అవకాశం ఉంటుంది. ఆ ఆశతోనే మానవ రూపంతో ఉన్న మహాత్ముని దగ్గరకు తీసుకువెళ్ళాడు.

ఆ సాధువు మనుషుల నివాసాలకు దగ్గరగా లేడు. ఇంకో సాధుపుంగవుడు చెప్పిన త్రోవ పట్టుకునే వెళ్ళాడు. రైలు దిగి, బస్సుపై కొంత దూరం ప్రయాణమైంది. అక్కడ నుంచీ గుర్రాలపై కొండ త్రోవల్లో పడ్డాడు. చెట్లూ చేమలూ, అడివి పూవులతో అలంకరించుకున్న ప్రకృతిమాత పలకరించింది. వన్యమృగాలు పసిపాపల్లా ఆడుకుంటున్నాయి. ఆ ఆశ్రమం చేరుకుని పండు జటలతో పసిమి వర్ణంతో దివ్యంగా వెలిగిపోతున్న ఆ ఋషిపుంగవుని దర్శించగానే, నిరంజనరావు తలవని తలంపుగా సాష్టాంగపడిపోయాడు. తన కమలం మళ్ళీ వికసించిందని కొంతసేపటికి తలెత్తేసరికి ఆమె అక్కడలేదు. చప్పున చుట్టూ చూశాడు. ఆశ్రమంలో పడమటి వైపు అడవి లేడిపిల్లవేపు పరుగులు తీస్తూంది. చెంగు చెంగున గెంతుతూ ఆశ్రమం దాటినా లేడిపిల్ల వెంటపడటం ఆమె మానలేదు.

నిరంజనరావు పరుగెత్తి ఆశ్రమం దాటి వెళ్ళేసరికి ఆమె రాళ్ళ గుట్టల్లో జారిపడిపోయి ఉంది. ముఖం నుంచీ చేతుల నుంచీ తగిలిన దెబ్బల వలన రక్తం కారుతుంది. ఆమెను భద్రంగా లేవనెత్తి మోసుకుని ఆశ్రమంలోనికి తీసుకుని వచ్చాడు. ఆ ఋషిపుంగవుడు ఆకులు అలమలు నూరి కట్టాడు. ఒకరోజు అక్కడుండి, ఆమె విసుగుబాటు చూసి ఆమెకు అక్కడ ఉండాలని మనస్కరించలేదని తట్టింది. ఎంత అతను చెప్పినా ఆమె చెవికెక్కలేదు. ఆమె దృష్టి అక్కడలేదు.

> మానవ జీవితం దుఃఖ భూఇష్టం. హెచ్చుతగ్గులు అటుంచి మానవులు అందరి అనుభవమూ అంతే. చిత్రమే అయినా ఒకరి దుఃఖం మరొకరు ఎవరూ అర్థం చేసుకొనలేరు. చెప్పడం సులభమే. కానీ సమాధానపడడం దుర్ఘటం.

భర్త నిరాశతో తిరుగుప్రయాణం కట్టాడు. మళ్ళీ తన ఇల్లు. ఆ ఇంట్లో అడుగుపెట్టడానికి తనకే మనస్కరించలేదు. కానీ వెళ్ళక విధిలేదు. ఎవరో మానసిక వ్యాధులలో దిట్టయైన వైద్యుని చేతిలో ఈమెను పెట్టాలి. ఇన్ని ఏళ్ళూ మనసులో మనసు కలిపి కారణం చేసిన తను, ఆమె గాయపడ్డ మనసును తనే నయమేయలేకపోయినాననే నిస్పృహ వెంటాడుతూంది.

రైలు ఎదురుగా రాబోయే రైలు కోసం ఒక చిన్న స్టేషనులో ఆగింది. పశ్చిమ కొండల్లో ఎర్రని పూలవంటిగా మేఘాలు అలుముకుని ఉన్నాయి. ఆ వెలుగు ప్రక్కనే ఉన్న నీలాల నీటిలో ప్రతిబింబించింది. చెరువు ఒడ్డునే శివాలయం. ఆలయానికి దగ్గరగానే

కొన్ని పూరిగుడిసెలు. ఆ గుడిసెల ప్రక్కనే పంటపొలాలు. ఎదురుగా పాతపెంకుటిల్లు. ఆ పైని చిన్నపట్టణం అగుపిస్తూంది.

ఫస్ట్‌క్లాసు పెట్టెలో పేపరుపై దృష్టి పెట్టుకున్న నిరంజనరావు ఇవేమీ చూడలేదు. ఎన్నాళ్ళకో ఏదో మాటలాడుకున్న భార్య వైపు చూశాడు. ఆమె కిటికీలో తలదూర్చి ప్రకృతిలో బాసలాడుకోవడం గమనించి తనూ దగ్గరికి వెళ్ళాడు. ఆ చెరువులో చందమామ వస్తున్నాడని సింగారించుకుంటున్న కలువలు ప్రత్యక్షమయ్యాయి.

"ఇక్కడ దిగిపోదామా!" అన్నాడు.

"ఆ!" అందామె.

ఈ జవాబుతో తలుపుతీసి సామానంతా దించేశాడు. ఆ పరిసరాల్లోనే కోరినట్లుగా ఆ పూరిగుడిసెల ఎదురుగా ఉన్న పెంకుటిల్లు అద్దెకు దొరికింది. బాగా చీకటి పడేలోగానే బజారుకుపోయి హరికేన్ లాంతరు, వండుకోడానికి కావలసిన సామాగ్రి అంతా తెచ్చి వేశాడు.

తొలిసారి తన జీవితంలో వంటచెయ్యడం హరికేన్ లాంతరు వెలుగులో. ఆమె కూడా ఇదివరకు కన్నా హెచ్చుగా తిన్నది. రాత్రి పదిగంటలై పోయింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఇద్దరూ ఎగుడు దిగుడులుగా ఉన్న నేలమీదనే పరుపులు వేసి పడుకున్నారు. అప్పుడప్పుడు ఎలుకలు పైన కిచకిచలాడుతున్నాయి. ఇంటికప్పు ధూళి రాలుతూంది. అయినా నిరంజనరావుకు అన్ని ఆధునిక సౌకర్యాలున్న తన భవనంలో కన్నా ఇక్కడ తృప్తిగా ఉంది.

నిరంజనరావుకు తెలివి వచ్చేసరికి ప్రక్కన కమలమ్మలేదు. గాభరాగా లేచేసరికి వీధి తలుపు తెరిచి ఉంది. బయటకు వచ్చేసరికి కమలమ్మ ఒంటిగా వీధి వరండాలో ఒక మూల నిల్చొని ఉంది. ఆమె ఏకాంతం పాడుచెయ్యాలని తనకు లేదు రెండో మూల నిలుచుని, ఎదురుగా ఉన్న ఒక పూరి గుడిసె నుంచీ వస్తున్న రోదన ధ్వని వింటున్నాడు.

ఇంకా ఉషస్సు ఉదయించలేదు. ఆకాశం కోటి కళ్ళతో చూస్తూంది. మధ్యన చెదిరిన తెల్లని మబ్బు తునకలు తెరల్లా అడ్డుపడుతున్నాయి. రానురాను కొన్ని కళ్ళు మూతలు పడుతున్నాయి.

కొన్ని రోజుల క్రితం శాశ్వతంగా మూతపడిన కళ్ళకోసమే ఆ పూరి గుడిసెలో ఒక తల్లి ప్రాణం కన్నీరు కారుస్తోంది. ఆమె పోయిన పదేళ్ళ కొడుకును వర్ణించి వర్ణించి ఆమె పెట్టుకున్న ఆశలను ఒక గీతంగా శోకమయమైన రాగంతో నివాళించుకుంటూంది. ఎంత వింటున్నా విసిగించని ఆ కమ్మని గొంతులోని సంగీతం నిద్రపోతున్న హృదయాన్ని మేలుకొలుపుతూంది.

ఇంతలో ఇరుగుపొరుగు ఆడవాళ్ళు దగ్గర చేరారు. వాళ్ళ ఓదార్పులు ఆమె ఏడ్పును, దుఃఖాన్ని మరింత విజృంభింప చేసింది.

"చచ్చిన వాళ్ళతో చచ్చి పోతామా? ఏ జన్మలో ఏం పాపం చేశావో? ఈ జన్మలో నలుగురిలో ఒక్కడూ దక్కలేదు. ఆ దేవుడు పగవాడు కాడే! మళ్ళీ జన్మలో పదిమంది నిస్తాడు. ఎందుకింత మంది పిల్లలని విసుక్కోవా?"

ఇలాంటి ఓదార్పులతో తెల్లవారిపోయింది. ఇద్దరూ వరండా కదల్లేదు. అంత వరకూ ఏడ్చిన ఆమె ఇప్పుడు అగపడింది. ఆమె ఏం చేస్తుందోనని కమలమ్మ నిదానించి చూడటం భర్త గమనించాడు. ఆ ఇంట్లో చావుని ఆహ్వానిస్తున్న ఒక ముదుసలి, ఆమె తప్పించి ఇంకెవ్వరూ లేరు. ఆమె లేచింది. చంకన కడవ పెట్టుకునిపెరటినే ఉన్న చెరువుకు వెళ్ళింది. తలకు స్నానం చేసి తడిబట్టలతోనే బయటనుంచే శివాలయం వేపు తిరిగి చేతులెత్తి మ్రొక్కింది. ఆ నల్లని శరీరం మీద అప్పుడే సూర్యరశ్మి పడుతూంది. కొంత సేపట్లో ఆమె ఇంకో మోటు చీర కట్టుకుని, చేతకొడవలి పట్టుకుని పొలాలవైపు వెళ్ళిపోతూంటే ఆమెవైపే కమలమ్మ కనపడే వరకూ చూస్తుంది.

మధ్యాహ్నం ఎండలో చెమటలు కక్కుకుంటూ వచ్చింది. ధాన్యం వాకిట ఎండబెట్టి, పొయ్యి రాజేసింది. ఆ ముసలమ్మకు మందు పెట్టి తనూ అంబలి తాగింది. తరువాత ఆ ధాన్యం దంచడం మొదలుపెట్టింది. మళ్ళీ మధ్యాహ్నం కొడవలి పట్టుకునివెళ్ళింది. చీకటిపడగానే ఇంటికి వచ్చి కిరసనాయలు బుడ్డీ వెలిగించి వంట ప్రయత్నం - ఈ రోజంతా ఆమెయందే ధ్యానంగా ఉంటూ ఆమె చేసినదంతా వరండాలో నిలుచుని చూస్తూంది కమలమ్మ. భర్త ఆమె ఊహలకు అడ్డురాకుండా మసలుతున్నాడు.

మళ్ళీ రాత్రి పదిగంటలైంది. ఆమె నిద్ర పోలేదు. ఒంటిగా బయటి వరండాలో తిరుగుతూంది. చూచి చూచి భర్త నిద్రపోయాడే కానీ మళ్ళీ చప్పున తెలివి తెచ్చుకున్నాడు. క్రీగంటతోనే ఏమి చేస్తుందని చూశాడు. గదిలో ఉన్న సామాను చిందరవందరగా ఉంటే సర్దుతూంది. మళ్ళీ తెలివి వచ్చేసరికి గదిలో కమలమ్మ లేదు. మళ్ళీ ఎదుటి ఇంటి నుంచీ రోదన ధ్వని వినిపించింది. కాస్సేపు అలా పరుపు మీదనుంచే నిరంజనరావు విన్నాడు. ఆ మధురమైన స్వరం వళ్ళంతా పులకరింప చేసింది. ఆమెతోపాటు తనకూ ఏడవాలనిపించింది. కళ్ళలో నీరు తిరిగి పోయింది. ఇంతలో ఇరుగు పొరుగువాళ్ళు మందలింపులు వినపడ్డాయి. ఎవరో వయసు మళ్ళినది "పిచ్చిదానా! పోయింది పొల్లు, ఉన్నది గట్టి! ఇలా ఏడ్చి ఏడ్చి చచ్చిపోతే ఏం వస్తుంది!? బతికినోల్లు మనుసులుగానీ, చచ్చినోల్లు మనుషులా! ఒక కన్ను ఏడిస్తే ఇంకో కన్ను నవ్వాలా!" అంటూ ఇంకా ఆమె ఏడవటం మానకపోతే చేతితో నోరు గట్టిగా మూసేసింది.

ఆ కొద్దిక్షణాల్లోనే ఆమె రాగం ఆగిపోయింది. కానీ ఆ ఆగిన రాగంతో ఇంకో రాగం చేరింది. "నా పాప! నా బంగారుపాప! అంతా నువ్వే అనుకున్నానే తల్లీ! నా చిట్టీ తల్లీ... నన్నింత మాయ చేసి పోయావా?" అంటూ గగ్గోలు పెడుతూ కమలమ్మ ఏడుస్తూంది. నిరంజనరావు దగ్గర నిలుచున్నాడు కానీ ఓదార్చలేదు. ఇంతలో ఎందరో వాళ్ళ ఇంటి ఎదురుగా గుమికూడి పోయారు. విషయం తెలుసుకున్నారు. ఆమె ఏడుపును ఎవరూ అడ్డురాదని నిరంజనరావు ప్రయత్నించాడు. కానీ అందులో ఒక ముసలమ్మ చొరవ చేసుకుని దగ్గరకు చేరింది. ఆమె ప్రక్కలో కూర్చొని ఓదారుస్తూ, "ముసలిదానివా - ముతకదానివా తల్లీ! నాదీ అనే ఆశ లేకపోతే నీకేం పిల్లలు కలుగుతారు? నా ఇల్లూ, నా మొగుడూ, నాదీ అనే ఆశ పెట్టూకో అమ్మా! ఏడాది దాటకుండానే పిల్లను ఎత్తుకోవా? హక్కయినది ఉంటుంది - లేనిది పోతుందమ్మా - కొండంత కొడుకు పోతే నేనేం చేశాను? మనుషులున్న ప్రతి ఇంట్లో చావుపుట్టుక లుండకపోతే మరెక్కడుంటాయి?" అన్నది.

కమలమ్మ తలెత్తి చూసింది. ఆమె నవ్వులతో పాపనవ్వు అగపడింది. కొంతసేపటికి అంతా వెళ్ళిపోయారు. కమలమ్మ లేచింది. ఆమె వెంటనే అతనూ వెళ్ళాడు. చెరువులో మునిగింది. అతనూ స్నానం చేశాడు. దేవాలయానికి వెళ్ళి సాష్టాంగపడింది. అతనూ సాష్టాంగపడ్డాడు. ఇంటికొచ్చాక అతను పొయ్యి వెలిగిస్తుంటే ఆమె వారించింది. ఆమె వెలిగించిన మంటల వెలుగులో ఆమె పెదిమలు దరహాసంతో వెలగటం చూశాడు.

# నిర్మల మొగుడు

**దేవరకొండ బాలగంగాధర తిలక్**

*తెలుగు సాహిత్య ప్రియులకి తిలక్ అనగానే అమృతం కురిసిన రాత్రి గుర్తొస్తుంది. ఆ కవితా సంపుటితో శ్రీశ్రీ మహా ప్రస్థానానికి దీటుగా ఎంతో మంది యువకవుల్ని ప్రభావితం చేసిన దేవరకొండ బాలగంగాధర తిలక్ మంచి కథా రచయితకూడా. 1921 ఆగస్టు 1న పుట్టిన తిలక్ 16 ఏళ్ళకే పద్యాలు, గేయాలు వ్రాశారు. తిలక్ జీవితంలో 1956 - 66 రచయితగా శిఖరారోహణ చేసిన కాలం.*

*'అమృతం కురిసిన రాత్రి' కవితాసంపుటికి 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1970 లో కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు లభించాయి. మొదట తిలక్ కథలు 'సుందరీ - సుబ్బారావు', 'ఊరి చివరి ఇల్లు' రెండు చిన్న సంపుటాలుగా 1996లో వచ్చాయి. 'తిలక్ కథలు' పేరుతో పెద్ద సంపుటం 1967 లో విశాలాంధ్ర ప్రచురణగా వచ్చి పునర్ముద్రణ పొందింది.*



**ఖంగారు** ఖంగారుగా భోజనం చేస్తున్న భర్త మానసిక పరిస్థితినీ, మొహం మీద పడుతున్న నల్లని వంకీల జుట్టునీ, అదోవిధమైన ఆనందాన్నీ అందాన్నీ సూచించే అతని రూపాన్ని చూసేటప్పటికి జాలివేసింది నిర్మలకు.

'తాపీగా తినండి. మీకిష్టమని ఈ గోంగూర పచ్చడి కూడా వేశాను. మీరలాగ కంగారుగా తినివెళ్ళిపోతే నా మనసంతా ఎంత బాధపడుతుంది !?'

'ఒళ్ళమ్ముకున్నాక తప్పుతుందా మరి! ఆ రావణబ్రహ్మ ఈవేళ ఎలాగైనా నన్ను వదలడులే!'

ఈ రావణబ్రహ్మ అన్న బిరుదు ఎవరికి చెందుతుందో నిర్మలకి తెలుసు. ఆ పేరు చెబితే తన భర్త హోరున వర్షములో తడిసి వచ్చి కూడా గడగడా మరచెంబుడు నీళ్ళు తాగుతాడన్న విషయం కూడా తెలుసును. కానీ ఎదురుగా తన భర్త అంత కంగారుగా భోజనం సరిగా చేయకుండా వెళ్ళిపోతుంటే ఆమె భరించలేకపోయింది. అందులోనూ జరిగిన రాత్రి అతనసలు భోజనమే చేయలేదు. దానికి కారణమైన కలహమూ, ఆ కలహములో మొండిపట్టు పట్టిన తన పాత్ర నిర్వహణా, ఆ కోపంలోనే ఇద్దరూ భోజనం మానేసి, ఒక పెద్ద మంచం మీద ఒకరికొకరు తగలకుండా, ఒకరివైపొకరు తిరగకుండా పడుకుని జరిపిన అసిధారా వ్రతనిర్వహణమూ ఇవన్నీ నిర్మలని

పశ్చాత్తప్తురాలినిగా భర్తయెడ మరీ సుముఖురాలినిగా, ప్రేమ చేత కరుణ చేత ఆర్ద్రహృదయముగా చేసివేశాయి. అందులోనూ అందమైనవాడు, జుట్టు ఆ విధంగా మొహం మీద పడేవాడు, అటువంటి వాడు తనకి భర్త అయి, తన సర్వస్వమూ అయినప్పుడు.

'మీరు ఆ కూర మరోసారి కలుపుకుంటే కానీ వీలులేదు. నా మీద ఒట్టే. బోడి ఉద్యోగం పోతే పోయింది. దీని తాతలాంటిది వస్తుంది. ఊ... మరి కలపండి' అంది.

ఈసారి విసనక్ర పుచ్చుకుని విసురుతూ అతని ప్రక్కనే కూర్చుంది. నవ్వుతూ పట్టుదల పట్టుతూ లాలిస్తూ అతని చేత తిరిగి కూర కలిపించింది. 'అయిన ఆలశ్యం ఎల్లానూ అయ్యిందిగా? ఇంకో పావుగంట లేటయితే పీకలు తీస్తారా ఏమిటి? సంసారుల్లో ఎవళ్ళకి మాత్రం ఏదో అవసరాలు రాకుండా ఉంటాయా, ఆలస్యాలవకుండా ఉంటాయా?'అంటూ నొక్కులు నొక్కుతూ సన్నగా దీర్ఘం తీసింది.

ఈ ఆర్గ్యుమెంటుని ఏ కోర్టులోనూ ఒప్పుకోరని తెలుసును. కానీ కలహానంతరం అందులోనూ ఒక రాత్రి రాత్రి మౌనంగా ఉండి, తిరిగి సంధి కలుపుకున్న తర్వాత భార్యాభర్తలనుభవించే ఆనందం సరిక్రొత్త ప్రేమలను, ఉద్రేకాన్నీ, స్వచ్ఛ పరిమళాన్ని కలిగి ఉంటుంది. అటువంటి పునర్నవమైన ఆప్యాయతలో భోజనం పెడుతూంటే, భార్య సన్నని గాజుల చప్పుడుతో విసురుతూ లాలిస్తూ ఉంటే వేరే కాంక్షించే స్వర్గమే లేకపోయింది గంగాధరానికి. ఆఫీసులూ, బాధలూ, సమస్యలూ అన్నీ చప్పున ఫేడౌట్ అయిపోయాయి. ఆ కాస్సేపట్లోను అతనికి నిత్యమూ, సత్యమూనైన బ్రహ్మానందం గోచరించింది.

ఈ సారి వాళ్ళ కబుర్లు, ఒకసారి మనస్సులోంచి సమస్యా సందేహాలు దూరమైపోయిన తరువాత, ఏ అడ్డంకిలేని నదీ ప్రవాహంలాగా సాగిపోయాయి. వచ్చే సంక్రాంతి పండుగకి మామగారు ఏం బహుమతి ఇస్తారో అన్న ప్రశ్న నుండీ, సినిమాలో ఫలానా నటి తాలూకు నటన ఎలా ఉన్నదో, పక్కింటావిడ కొనుక్కున్న కొత్తచీరలోని కొత్త ఫ్యాషన్ విశేషమూ, కో - ఆపరేటివ్ స్కీములో తాము కట్టించబోయే చిన్నసైజు ఇంటికి ఎన్ని గదులు ఉండాలి అన్నంత వరకు అనవసర అవసర సమాలోచనలన్నీ సాగిపోయాయి. అతను చెయ్యి కడుక్కుని లేచేటప్పటికి ఆమె వక్కపొడుం తీసుకొచ్చి ఇచ్చింది. అతను బనీను ధరించేటప్పటికి దువ్వెనతో వచ్చి అతని పాపిడి తీసింది. అతను అమెరికన్ జాకెట్ వేసుకొనేటప్పటికి జోళ్ళు రెడీగా ఎదురుగా పెట్టింది. అతను ఆమెను ముద్దు పెట్టుకుని 'వస్తాను నిర్మలా' అని యధాలాపంగా అలవాటు చొప్పున గోడమీద టైము చూచేటప్పటికి అతనికి స్పృహ వచ్చినట్టు లేక తప్పినట్టు అయింది. కఠిన వాస్తవికత కొరడాతో కొట్టినట్లయింది. ఉన్నపళంగా కుప్పగా కుర్చీలో కూలి 'పదకొండుంబావు' అన్నాడు. అతని మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. తెల్లబడిన అతని మొహాన్ని, పిచ్చిగా చూస్తున్న అతని కళ్ళను చూసి అర్ధాంగి కంగారు పడింది.

'గంటంపావు లేటు! ఆఫీసుకు వెళ్ళేటప్పటికి ఇంకో పావుగంటైనా పడుతుంది. ఇంక ఉద్యోగానికి నీళ్ళు వదులుకోవలసిందే అసలే కోపిష్టి మనిషి, అందులోనూ దొరల పంక్చుయాలిటీ అంటే ఘస్తుంటాడు. అసలు మొన్న మీవాళ్ళు వచ్చిన రోజున ఆలస్యమైనందుకే మండిపడ్డాడు. తుది హెచ్చరిక అని చెప్పాడు. మీసాల మీద చెయ్యివేసి, నాకొంప తవ్వేశావు. ఏ పావుగంటో, అరగంటో ఆలస్యం అయితే సర్ది చెప్పుకోవచ్చును. ఇప్పుడేమిటి చెయ్యటం?'

నిర్మలకి ఏమీ తోచలేదు. నసంభ్రమనవిషాద నశంకిత అయి అలాగ నుంచునిపోయింది. అతను కణతల్ని రెండు చేతులతోనూ అదిమి పట్టుకున్నాడు.

ఈ విధంగా ఆలస్యంగా ఆఫీసుకు దయచేసి ఆ తప్పుని మళ్ళీ మళ్ళీ చేసి ఉద్యోగం పోగొట్టుకుని, కొత్తది దొరక్క మాసిన గడ్డంతో, లోతుకుపోయిన కళ్ళతో రోడ్లు కాస్తూ మిత్రుల్ని అణా, బేడా అడిగి బతుకుతున్న శంకరం స్మృతిపథంలో మెలిగేటప్పటికి అతనికి ఒక్క నిమిషం ఊపిరాడలేదు. అతన్ని లాలిస్తూ భోజనం పెడుతూ, అరగంటకన్నా ఆలస్యం ఆపడంలో వైప్లవ్యాన్నీ, విపత్తునీ చూడలేకపోయానే అని బాధపడుతోంది ఆమె!

'ఛీ ఛీ - మీ ఆడాళ్ళింతే! వెధవ సొద వేసుక్కూర్చున్నావు ఇప్పుడు చీవాట్లు తినాలి. డిస్మిస్ అంటే గొల్లుని ఏడుస్తూ రావాలి. రేపటి నుండీ మెతుకులు కూడా ఉండవు.'

"అయ్యో నాకేం తెలుసండీ" అంది నిర్మల.

"ఏం తెలుసు మరీ? నీ మొగుడేమైనా కలెక్టరనుకున్నావా? మినిష్టరనుకున్నావా? గుమ్మస్తా అంటే ఏమిటనుకున్నావు? ఎన్నిసార్లు చెప్పాను నీకు తొమ్మిదింటికల్లా వంట అవ్వాలనీ" కోపంతో కేకలు వేస్తున్నాడు గంగాధరం.

"మరీ మీరు తొమ్మిదింటికేగా బియ్యం పట్టించుకుని వచ్చింది?" అంది నిర్మల భయంగా.

మొదట తడితడిగా కనబడి తర్వాత బలం సంతరించుకుని బిందురూపం తాల్చుకుని, కనుకొలకుల నుండి రెండశ్రువులు నిర్మల కపోలాల మీద మెల్లగా జారాయి. గంగాధరానికి గబుక్కున జాలి వేసింది. అతనికి ఏ ఊహ తట్టినా, ఏ అనుభూతి కలిగినా గబుక్కున కలుగుతుంది. 'ఏదో కోపంలో అన్నాను నిర్మలా. నీ తప్పేమీ లేదు. కాతాకొట్టు తెరిచేటప్పటికి తొమ్మిదయింది. అవును కానీ ఇప్పుడేమిటి చేయడం?' అన్నాడు గంగాధరం.

నిర్మల తడికళ్ళు ఒకసారి మెరిశాయి. మంచు పడుతూన్న వేకువ పొద్దు మీద చటుక్కున సూర్యకిరణాలు పడ్డట్టు బిక్కపోయిన ఆమె మొహం ఒక్కసారి వెలుగుతో ఉద్దీప్తమయింది. తన భర్తకి నెలనెలా వచ్చే జీతపురాళ్ళని రక్షించే ఒక ఉపాయం ఆమెకు తట్టి ఉండాలి.

గంగాధరం ఆశగా ఆమెకేసి చూశాడు. ఊపిరాడకుండా నదిలో కొట్టుకుపోతున్న అతనికి ఆమెలో స్ఫురించిన ఊహ అనే పడవచెక్కని పట్టుకుని గట్టుకు చేరుకోవాల్నుకున్నాడు.

"నాకో ఊహ తట్టిందండీ" అంది నిర్మల "నిజంగానా" ఆతృతగా అన్నాడు గంగాధరం.

"నిజమేనండీ మా స్కూల్లో ఇదివరకు ఓ మేష్టారుండేవారు. ఆయన చాలా కోపిష్టి. పెద్ద పెద్ద మీసాలతో గండుమొహంతో అచ్చంగా పెద్దపులిలాగ ఉంటాడు. ఓనాడు నేను స్కూలుకి బాగా ఆలస్యంగా వెళ్ళాను. ఆయన కళ్ళెర్రచేసి ఎందుకింత ఆలస్యమైయిందని గర్జించాడు. ఒకవేళ ఆడపిల్లనని చేయి చేసుకోకపోయినా, అక్కడ ఎండలో ఇసుకలో నుంచోబెడతాడు. మగపిల్లలు ఏడిపిస్తారేమో అని భయం. నాకు బయంతో సిగ్గుతో ముచ్చెమటలు పోశాయంటే నమ్మండి. నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఆయనకి మాతృప్రేమ ఎక్కువనీ, మాతృపూజ కన్నా జీవితంలో పరమార్థం మరొకటి లేదనీ.. చూడండి మీరేదో కాంప్లెక్స్పూ, గీంప్లెక్సూ అంటారు. అలాగ అన్నమాట. అంతే మా అమ్మ ఊరగాయలు కోసం అటక ఎక్కబోతూ నిచ్చెన మీద నుంచీ పడిందనీ, ఆమె కాలికి మర్దనా అదీ చేసి, ఆవిడకి భోజనం పెట్టి నేనన్నం తిని వచ్చేటప్పటికి ఆలస్యమయిందనీ.. మాంచి పొడువుగా అబద్దం ఆడేశాను. దాంతో అంత పెద్ద పులీ అహింసావాది అయిన మేక అయిపోయాడనుకోండి. నన్ను దగ్గరకు పిలిచి నా తల నిమిరి, విద్యార్థులందరికీ నన్నొక ఆదర్శం కింద చూపించి గౌరవించాడు మా మాష్టారు."

ఆమె ఆగింది భర్తకేసి భావయుక్తంగా చూస్తూ, పాపం భయావస్థలోనున్న గంగాధరానికి స్ఫురించలేదు.

'ఈ కథకీ నా ఏడుపుకీ సంబంధం ఏమిటి?' అన్నాడు విసుగ్గా.

భర్త తెలివితేటల్ని గురించి కొంచెం నిరసనగా, జాలిగా నవ్వి, విడమర్చి ఇలా చెప్పింది నిర్మల. "చూడండి మీ బాస్‌లో ఎక్కడో వీక్ పాయింట్ ఒకటి ఉంటుంది. దాని మీద మీరు 'ప్లే' చెయ్యాలి. ఎంత కోపంలో ఉన్నవాడైనా, అతనికి ఇష్టమైన, అపాయమైన ప్రసక్తి తీసుకువస్తే చటుక్కున మెత్తబడిపోతాడు మా మేష్టారులాగా. ధైర్యం తెచ్చుకోండి. ఆలోచించండి."

గంగాధరానికి ఆ మధ్య తోటి గుమస్తా ఒకడు చెప్పిన విషయం సమయానికి జ్ఞాపకం వచ్చింది. ఒక్క ఉదుటున లేచి ఆమెని కావలించుకుని "మై ప్రెషస్! నువ్వు నిజంగా నన్ను రక్షించడానికి వచ్చిన దేవతవు. అందుకే కార్యేషు మంత్రీ, కరణేషు దాసీ (పాపం తిరగేశాడు కంగార్లో) అన్నారు పెద్దలు. మా అధికారికి ఓ పెద్ద వీక్నెస్ ఒకటి ఉంది. అదేమిటంటే ఆయనకి చాలాకాలం పిల్లలు లేరు. ఈ

మధ్య మూడు నాలుగేళ్ళ క్రితం ఒక పిల్లాడు కలిగాడు. ఆయనకు పిల్లలంటే ఎంతో పిచ్చట. ఆ రోజుల్లో మిఠాయిలూ, బొమ్మలూ కొని చుట్టుపక్కల ఉన్న పిల్లలకు వారం వారం పంచిపెట్టేవాడంట. ఇప్పటికీ ఈయన ఉన్న వీధిలో ఏ పిల్లవాడికి జబ్బు చేసినా స్వయంగా వెళ్ళి కష్టసుఖాలు విచారించి అవసరమైతే స్వయంగా డాక్టర్ని కూడా తీసుకెళతాడట. ఎవరికీ కానీ రాల్చనివాడు నిరుటేడు అనాధ శిశు శరణాలయానికి రెండువందలు - టూ హండ్రెడ్ అడగ్గానే ఇచ్చి పారేశాడట ఏదీ, నా అమెరికన్ షర్టు ఇలా పడెయ్యి, ఓహో బ్యూటిఫుల్ అయిడియా" అంటూ అతనో విధమైన నాట్యం చేశాడు.

"మీరు షర్టు తొడుక్కునే ఉన్నారండీ" అంది నవ్వుతూ నిర్మల. గోధుమ రంగు ఫాంటు మీద షార్క్‌స్కిన్ బ్లౌజ్ వేసుకుని, జుట్టు అందంగా మొహం మీద పడుతుంటే సైకిలెక్కి సంతోషంగావెళ్ళే భర్తను చూసి ఒకసారి సరికొత్తగా ప్రేమించినంత ఆనందమును, గర్వమూ పొందింది.

గంగాధరం వచ్చినట్లు తెలిసిన మేనేజరు తన గదిలోంచి గంగాధరాన్ని పిలిచాడు.

మాంచి ధీమాగా, ఏ సంకోచమూ లేకుండా వెళ్ళే గంగాధరాన్ని చూసి సోదర గుమాస్తాలంతా తమ కళ్ళను తామే నమ్మలేక ఒకసారి కళ్ళు నులుముకు చూశారు. వినయంగా మేనేజర్ ముందు నిలబడ్డాడు గంగాధరం.

"నీ ప్రవర్తన నాకర్థం కావడంలేదు. నీకు బొత్తిగా భయమూ, భక్తి లేకుండా పోయాయి. ఇది ఆఫీసు పని, ఇక్కడ నీవు జీతగాడివనే స్పృహ కూడా నీకు లేనట్లుంది. ఇదివరకు నీకు మూడు సార్లు వార్నింగు ఇచ్చాను. నా మాట నీకు లక్ష్యం ఉంటేగా, ఇంక నీ విషయంలో కన్సిడరేషన్ ఏమీ చూపలేను. ఇంక నువ్వు ఫలితం అనుభవించక తప్పదు" అని కోపంగా నిక్కచ్చిగా ఆరోహణావరోహణలు పాటిస్తున్న గొంతుతో, మీసం కొసల్ని మెలివేస్తూ కళ్ళెర్ర జేస్తూ మాట్లాడే మేనేజర్‌ను చూస్తుంటే ఠీవిగా వెనకాలే నడిచివెళ్ళి 'జింకని, అమ్మని' నోట కరుచుకునే పులిలో ఒడుపూ, నిశ్చయమూ గంగాధరనికి స్ఫురించేటప్పటికి అతని గుండె కొన్ని సెకనులు పనిచెయ్యలేదు భయం భయంగా వణికే గొంతుని సరిచేసుకుంటూ ఇలా అన్నాడు.

"చిత్తం... ఏక్సిడెంట్ జరిగిందండీ... తమరు క్షమించాలి"

"ఏక్సిడెంటా?" ఎగాదిగా చూశాడు మేనేజరు. 'నువ్వు బాగానే ఉన్నావే' అన్నాడు.

"ఆఫీసుకి ఆలస్యమవుతుందేమోనని తొందరగా వస్తున్నానండి. చటుక్కున దారికడ్డంగా ఒక చిన్నపిల్లవాడు వచ్చాడండి. సైకిల్ ఆ కుర్రవాణ్ణి ఢీకొన్నదండి."

ఈసారి అధికారి మొహం మారిపోయింది. ఆ తరువాత ఆవేదన మొహంలో కనబడింది. "ఏమైంది... ఏమైంది" అన్నాడు.

"తలకి, కాలికి గాయాలు తగిలాయండి ఒకటే రక్తమండి. తక్షణం నా జేబురుమాలు తలకి కట్టి ఆ కుర్రవాణ్ణి ఎత్తుకుని హాస్పటల్‌కి వెళ్ళానండి. అక్కడ చికిత్స చేయించి కట్టుకట్టించి, డాక్టరుగారు ఫరవాలేదన్న తరువాత ఆ కుర్రవాడింటికి ఫోను చేయించి మరీ వచ్చానండి. ఇంటికెళ్ళి బట్టలు మార్చుకుని... "

'ఏం డేంజరు లేదుగదా. డాక్టరు గట్టిగా చెప్పా' ఫైర్ అలారం మోగింది అతని గొంతు.

'మరేం ఫర్వాలేదండి. అశ్రద్ధ చెయ్యకుండా వెంటనే వైద్యం చేయించాకదండీ. సెప్టిక్ అవకుండా పెన్సిలిన్ ఇవీ అవీ ఇంజెక్షన్లు ఇచ్చాడండి డాక్టరు.'

'ఆ కుర్రాడు కళ్ళు తెరచి మాట్లాడుతున్నాడా?'

'చిత్తం.... మొదట్లో కొంత సేపు తెలివిలేదండి. ఇప్పుడు మా అమ్మ కావాలి అంటున్నాడండి. ఈ పాటికి తల్లిదండ్రులు అక్కడికి వెళ్ళేవుంటారండి!'

'మేనేజరు మొహంలోని బాధ క్రమేణా తగ్గింది. మీరంతా వట్టి బ్రూట్స్. సైకిలెక్కితే ఏదో పెద్దనిషా వచ్చేస్తుంది కాబోలు మీ అందరికీ రోడ్డు మీద పిల్లలు అమాయకులైన పిల్లలుంటారని ప్రాధమిక జ్ఞానం కూడా పోతుంది కాబోలు. ఇకనైనా జాగ్రత్తగా మసులుకో నిన్ను క్షమించాను. నువ్వు వెళ్ళి నీ పని చూసుకో. నా మనసంతా అదోలా అయిపోయింది' అన్నాడు మేనేజరు.

శాల్యూట్ చేసి వెనక్కి తిరిగి తోటి గుమ్మస్తాల మధ్యకి వచ్చి పడ్డాడు గంగాధరం సగర్వంగా సహనంగా 'ఏం జరిగింది ఏం జరిగింది?' అంటూ చుట్టూ చేరి అడిగారు అందరూ. 'భాయ్ వీడు గంగాధరం.. ఏమనుకున్నారో' అంటూ నవ్వుతూ ఫైల్స్ తీసే గంగాధరాన్ని ఏదో మహిమాన్వితుడిలాగా హఠాత్తుగా అణిమాది సిద్ధులు లభించిన యోగీశ్వరుడిలాగ వెర్రిగా చూశారు. మనసులోనే నిర్మలని తలచుకుని ధన్యవాదాలర్పించాడు గంగాధరం.

ఈ ప్రమాద వార్త విని సగం డీలా అయిన మేనేజరు కాస్సేపటిలో తిరిగి కోలుకుని, ఒక్కసారి నిట్టూర్చి, తన పనిలో నిమగ్నుడైయ్యాడో లేదో, గణగణమని టెలిఫోను మోగింది. తాపీగా చెవి దగ్గర పెట్టుకుని 'హలో' అన్నాడు. అవతల కొన నుండీ కంగారుగా భార్య గొంతు 'ఏమండీ మీరేనా, అర్జంటుగా రండి. ప్రమాదం అండి అబ్బాయికి. ఎవడో సైకిలు మీద నించీ పోనిచ్చాడండీ. తలంతా రక్తమండీ. త్వరగా రండీ.'

మేనేజరు గుండె ఆగి, తిరిగి ఎగిరి గొంతుకలోకి అడ్డంగా వచ్చేసింది.

అతని మొహం తెల్లబడిపోయింది. మాట వణికింది. 'ఎవడా వెధవ ఆ సైకిలు తొక్కినవాడు?' అన్నాడు.

'ఆ దుర్మార్గపు వెధవ సైకిలు ఆపకుండా దిగకుండా రయ్యమని తొక్కుకుని తొక్కుకుని పారిపోయాడండి. వాడి కాళ్ళు విరగ - త్వరగా రండీ.'

మేనేజరు కాళ్ళూ చేతులూ ఆడలేదు. 'బతికే ఉన్నాడా' అని ఒక్క కేకపెట్టాడు ఫోనులోకి.

'అవేం మాటలండీ మీరు మరీన్నూ. తలమీద గాయమయింది అంతే గాయం కడిగి గుడ్డతో కట్టాను. మన డాక్టరుకు ఫోన్ చేస్తే లేడు. ఇంకొక డాక్టరిని ఎవరినైనా వచ్చేటప్పుడు తీసుకురండి. నెత్తురింకా కొంచెంగా వస్తూనే ఉంది. ఆలస్యం చెయ్యకండి' అంది.

మేనేజరుకిప్పుడు శ్వాస ఆడింది. కానీ క్షణంలోనే అతని మొహం కందగడ్డలా అయిపోయింది. కోటు చేత్తో తీసుకుని ఆఫీసుగదిలోంచీ ఇవతలికి వచ్చి గంగాధరం కేసి విషం కక్కుతూ చూశాడు.

'ఏయ్ ఇలారా'

ఆ పిలుపుకీ చూపుకీ గతుక్కుమన్నాడు గంగాధరం. 'సార్' అన్నాడు దగ్గరగా వచ్చి.

'నువ్వెవరిమీద నుంచీ పోనిచ్చావో తెలుసునా సైకిలుని...?

గంగాధరం ఏమిటన్నట్లు వెర్రిగా చూశాడు.

"మా అబ్బాయి మీదనుంచీ, లేకలేక కలిగిన ఒక్క కొడుకు మీద నుంచీ, మా ఆవిడ ఇప్పుడే ఫోన్ చేసింది. పైగా ఆగకుండా పారిపోయావుట. నీ అంత నీచుడూ, దుష్టుడూ, అల్పుడూ అధముడూ ప్రపంచంలో ఉండడు. నామీద నీకున్న గ్రడ్జి మూలాన్ని చెయ్యాలని చేసినట్టు కనబడుతోంది. నిన్ను అరెస్టు చేయించాలి న్యాయానికి.. కానీ నీ పాపం నిన్నే కొడుతుంది. నిన్ను డిస్మిస్ చేశాను ఫో. ఆఫీసులోంచి ఫో' అంటూ మేనేజరు ఊగిపోయాడు కోపంతో.

గంగాధరం ఏమీ అర్ధంకాక 'సార్' అనబోయాడు.

'నువ్వేం చెప్పనక్కర్లేదు. ఇంకొక నిమిషం ఎదురుగా ఉంటే నిన్నేం చేస్తానో నాకే తెలియదు. ఏమయ్యా హెడ్‌గుమాస్తా ఇతనికేదైనా ఇవ్వవలసింది ఉంటే తక్షణం ఇచ్చి పంపెయ్యి. మళ్ళీ నా కళ్ళకి కనబడ్డావంటే అరెస్టు చేయిస్తాను జాగ్రత్త' అంటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అధికారి వెళ్ళిపోయాడు.

కాసేపటికి వెర్రివాడులాగా, సర్వం పోగొట్టుకున్న వాడిలాగా మూర్తీభవించిన శోకంలాగా వచ్చిన గంగాధరాన్ని చూసి కలవరపడింది నిర్మల. అతని నోటినుండీ జరిగిన కథ విని నిశ్చేష్టురాలైంది జాలిగా తల రెండు చేతులతో పట్టుకుని కుర్చీలో కూర్చున్న గంగాధరాన్నీ, అతని అందమైన మొహం మీద పడే నల్లని వంకీల జుట్టునీ చూసేటప్పటికి ఆమె కనుకొలకుల్లో తెల్లని నీటిబిందువు తళతళలాడింది.

## జ్ఞా నజ్యోతి



నిన్నటికంటే నేడు నీ వివేకం పెంచుకోకపోతే నీ జీవితంలో మరొక రోజు వ్యర్థమైనదని తెలుసుకో..!

***

కష్టంగా భావించేదాన్ని సాధించడం 'నేర్పు'. అసాధ్యంగా భావించేదాన్ని సాధించడం 'ప్రతిభ'

***

విచక్షణతో మాట్లాడ్డం వాగ్ధాటికన్నా మిన్న అవుతుంది.

***

ప్రతిభలేని చదువు కన్నా చదువులేని ప్రతిభ మిన్న

***

ఏదైనా మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం, విమర్శలను భరించే సహనం ఉండాలి

***

మనిషి జీవితంలో పరులవలన వచ్చే సమస్యలకంటే అవగాహనా రాహిత్యం వల్ల తెచ్చుకునే సమస్యలే ఎక్కువ

*ఆంధ్ర సచిత్ర వార పత్రిక 19-1-1962 సంచికలో ప్రచురితమైన కథ*

# యాదృచ్ఛికం

## మాధురి



నాకు పెండ్లి కొడుకుగా నలుగురు మధ్య కూర్చోవాలంటే ఏమిటోగా ఉన్నది. ప్రతివాళ్ళు నన్ను ఆకాశానికెత్తి మాట్లాడుతున్నారు. నన్నొక మహారాజులాగా చూస్తూ కోరిక నాలికమీదుండగానే నెరవేరుస్తున్నారు. వారు చేసే పనులు, మాట్లాడే తీరు చూస్తుంటే నాకు బలే సిగ్గువేస్తోంది.

మామయ్య మాత్రం అంటాడు. "అరేయ్! అల్లుడూ! నీవు అదృష్టవంతుడివిరా!... మా అమ్మాయిలాంటి అమ్మాయి నీకు ముల్లోకాలు గాలించినా, సప్తవర్షాలు తలక్రిందులుగా తపస్సు చేసినా దొరుకుతుందా? అని.

నేను ఆయన మొఖంలోకి చూస్తూ నవ్వి ఊరుకున్నాను. అసలు ఆ మాట, "మా అబ్బాయిలాంటివాడు మీ అమ్మాయికి దొరుకుతాడా?" అని మా తరుపువాళ్ళు అనాల్సిన మాట! కానీ నాకు అయిన మామగారు మా అమ్మకు స్వయాన అన్నయ్య!..

మాటల సందడిలో అమ్మ కేక స్పష్టంగా వినబడింది. "ఏమిటమ్మా?" అన్నట్లుగా అటు చూచాను.

"ఇటురా శేషూ!" అంది.

నేను లేచి లోపలికెళుతున్న ఆమెను అనుసరించాను. హాలులోకి వెళ్ళేటప్పటికి అక్కడ ఫలహారాలు చేస్తున్నారు ఆడవాళ్ళంతా. ఎనిమిది కాలేదేమో ఎండ తీక్షణంగా లేదు.

అమ్మ సరాసరి పెండ్లి సామానులు పడేసిన 'స్టోర్' రూంలోకి వెళ్ళి నిలబడి వెనుదిరిగింది నాకోసరమే అన్నట్లుగా.

నేను లోపల అడుగు పెడుతూండగానే చటుక్కున నా మొహంలోకి చూస్తూ, "శారద లేచి పోయిందటరా!" అంది.

"శారద లేచిపోయిందా? ... అన్నాను ఆత్రంగా. నాకేమిటో అయోమయంగా ఉన్నది. "శారదేవిటీ..లేచిపోవటమేమిటి?"

"శారదేనా?.." అన్నాను రెట్టిస్తూ.

"అవునురా...శారదే!... అదే మీ ప్రసాదు లేడూ, వాడిని తీసుకుని రాత్రికి రాత్రే వెళ్ళిపోయిందట!" అంది. ఆమె ఏదో జరగరాని సంఘటన జరిగినంత వింతగా.

"నిజంగానా? అన్నాను కొంతసేపు అలానే మౌనంగా ఉండిపోయి తేరుకుని.

"నిజంగా" అంది ఒత్తిపలుకుతూ ఆ తరువాత తను ఇంకా చెప్పాల్సిందేమీ లేదన్నట్లుగా నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళిపోయింది.

నేనక్కడే దుమ్ము కొట్టుకున్న పెట్టి మీద అలాగే రెండు చేతులతో తలను పట్టుకుని కూలబడ్డాను.

నా మసకబారిన చూపుల్లో ఆమె లీలగా మెదలుతోంది.. నా కలత బారిన హృదయంలో ఆమె మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి. కొన్ని సంవత్సరాలు నా ఈ కళ్ళతో చూచిన శారదను నేనెలా మరువగలను?... అసలు అంత మంచి శారద అలాంటి (పాడు) పని చేసిందంటే నేనెలా నమ్మగలను... కాని కల్పితాలు చెప్పవలసిన అవసరం అమ్మకేం ఉంది?

సరిగ్గా మా వీధిలో ఒక్కసారి చూస్తే, మరువలేని గృహమొకటి ఉంది - కుడివైపుకు ఎప్పుడూ వాలిపోయి కనబడుతుండే పంచ, సున్నపు మొఖాన్ని చూడని ఉప్పు చవుడు రాలే గోడలు, ఒకటి, రెండు పెంకులు లేచిపోయిన కప్పు... పాత చాపలు, వెదురు కర్రలతో కట్టిన (కాంపౌండ్‌వాల్) అనబడే దడి!

ఆ గృహ యజమాని, చుట్టరికాలు మైలున్నర నడిపి, గొందులు, సందులు తిప్పి "మనకు బంధువేలే.. నీకు మామయ్య అవుతాడు!" అంటుంది మా అమ్మ.

అసలు 'మామయ్య'గా నాకు పరిచయం కంటే 'ఓనమా'లు నేర్పిన ప్రథమ గురువుగానే నాకు బాగా తెలుసు. నేనంటే ఎంత ప్రేమగా చూచేవాడు. అప్పటికీ ఇప్పటికీ ఆ ఎలిమెంటరీ స్కూల్లోనే 'మాష్టారు'గా పనిచేస్తున్నాడు.

ఆయన కూతురే శారద!

మామయ్య అనబడే ఆ రంగనాథరావుగారికి శారద జన్మించిన మరు సంవత్సరంలోనే భార్యా వియోగం సంభవించింది. తరువాత రెండో సంవత్సరం తిరక్కుండానే తల్లిలేని శారదకు కామాక్షి పిన్నె కూర్చుంది.

నేను తరచు వాళ్ళింటికి వెళుతుండేవాడిని. వాళ్ళూ మా ఇంటికి వస్తూండేవాళ్ళు. ముఖ్యంగా శారద రెండు మూడు రోజుల కొకసారన్నా మా ఇంటికి వస్తుండేది.

శారద నాలుగు రోజులు కనబడకపోతే నాకు ఏవిటోగా ఉండేది.. శారద అలాగే 'ఫీలయ్యే'దని తరువాత నాకు తెలిసి వచ్చింది.

శారద వాళ్ళింటికి ఎదురుగ్గానే నా ప్రియమిత్రుడు ప్రసాదు ఉన్నాడు. శరీరాలే వేరు గానీ, ఆత్మలు ఒక్కటే అన్నంత కలిసికట్టుగా ఉండేవాళ్ళం. అసలు బాగా ఆలోచిస్తే వాడు శారదా వాళ్ళింటికి ఎదురుగా ఉండకపోయినట్లయితే శారదతో నాకు అంత చనువు ఏర్పడి ఉండేది కాదేమో అనిపిస్తుంది.

కాని నాకు శారదకు నడుమనున్న బంధం విడదీయరాని బంధం అయింది.

ఎన్నాళ్ళయిందో గుర్తుకు రావటంలేదు. పొద్దు పోయిందనుకుంటాను. భోజనం చేసి చదువుకో బుద్ధి కాలేదు. అలా వెళ్ళివద్దామని బయటకు వచ్చాను. వెన్నెల తెల్లగా ఉన్నది. చెరువుగట్టు మీదకు వెళదామనుకున్నాను. అనుకోకుండా మనస్సు శారద మీదకు పోయింది. ఆమె నిన్నే మా ఇంటికి వచ్చింది. కాని వెళ్ళి చూచి రావాలని పించింది. అటే బయలుదేరాను.

పంపు ప్రక్కగా నున్న తడికల దడి తలుపు నెట్టుకుని లోపలి కెళ్ళాను. గుడ్డిదీపం వెలుగుతోంది మధ్య హాల్లో. అంతా లోపల వంట ఇంట్లో ఉన్నారేమోనని మెట్లెక్కి లోపల అడుగుపెట్టాను.

"అత్తయ్యా!" అన్నాను.

సమాధానం రాలేదు. కానీ ఆ హాలులో మరో ప్రాణి ఏడుస్తున్నట్లుగా లీలగా శబ్దమవుతోంది. ఆశ్చర్యంగా నలుమూలలా చూచాను. మూలగా చీకటిలో గోడవైపు తిరిగి నిలబడి ఒక స్త్రీ ఏడుస్తోంది... ఆమె శారద!

అలాంటి దృశ్యాలు ఆ గృహంలో నేను చాలా చూశాను. అందువలన నేను అంతగా ఆశ్చర్యపోలేదు.

"ఏమిటి శారదా?... ఎందుకు ఏడుస్తున్నావ్? అత్తయ్యవాళ్ళేరి? అన్నాను చాలా నెమ్మదిగా.

ఆమె తలెత్తి నా వంక చూచింది. ఆ కనబడీ కనబడని చీకటిలో గూడా నా కెన్నో విషయాలు చెప్పాలనే ఉబలాటం ఆ కళ్ళల్లో ఉన్నదని నాకనిపించింది.

మౌనంగా నా వంక చూస్తోంది.

నా 'ప్రశ్న'ను రెట్టించాను.

"లోపల భోంచేస్తున్నారు... పిన్నీ, నాన్న!" అంది తలవంచుకుని.

"ఎందుకేడుస్తున్నావు? " అన్నాను తెలుసు కోవాలనే పెద్ద ఉత్సుకత లేకపోయినా ఆమెను ఓదార్చే ఉద్దేశ్యంతో, దీనికంటే ఆమె ఇచ్చే సమాధానం నాకు తెలుసు.

"మామూలే!" అంది నిర్లిప్తంగా.

కొన్ని వందల భావాలున్నాయి ఆ మూడక్షరాల్లో... నిట్టూరుస్తూ వంటింటివైపు వెళ్ళాను.

నన్ను చూస్తూనే అత్తయ్య నవ్వుతూ ఆహ్వానించింది.

నేను గడప మిద కూర్చున్నాను. "భోజనం చేశావా!" తియ్యగా అడిగింది.

ఆమె మీద నాకు 'నాకు'గా ద్వేషం లేదు. శారద చూపులతో చూస్తే అపరిమితంగా ఏర్పడుతుంది. కానీ 'పరాయి' వాణ్ణయిన నాతో మాట్లాడినట్లుగాను, నన్ను చూచినట్లు గాను, శారదను ఆమె ఎందుకు చూడదో నాకు తెలియటం లేదు. దానికి కారణం అప్పుడూ అర్థం కాలేదు. ఇప్పుడూ అర్థం కాలేదు.

కానీ ఆమె ఎదుట నిలబడి ఎప్పుడు, 'దీనికి కారణమేమిట'ని నేను అడగలేదు... అడిగే ధైర్యం నాలో లేదు. నేను బలహీనుణ్ణి... మానసికంగా మరీ! నాలో ఎన్నో ఊహలు కలుగుతుంటాయి పెద్దలు చేసే 'ఘోరా'లను ఎన్నో ఎదురించాలనుకుంటాను... కానీ వాళ్ళే నా ఎదుట నిలబడినప్పుడు మూగవాణ్ణవుతాను.

మామయ్య భోజనమయింది. వాకిట్లోకి వెళ్ళి బాదం చెట్టు క్రింద నులకమంచం వాల్చుకుని పడుకున్నాడు. అత్తయ్య వంట ఇల్లు సర్ది హాల్లోకి వచ్చింది. తను వక్కపలుకు వేసుకుంటూ నాకూ పెట్టింది.

"శారదకు రోజు రోజుకు తలతిక్క ఎక్కువవుతున్నది శేషూ!" అన్నది.

"ఏ విషయంలో?" అని రెట్టిద్దామనుకున్నాను. "ఎందుకు శారదంటే, ఆమెకు అంత ద్వేషమో?" నిలదీసి అడుగుదామనిపించింది.

కానీ అడగలేకపోయాను.

కలతబారి మనస్సుతో బయటకు నడిచాను.

వెన్నెల వెలుతురులో మున్సిపల్ దీపాలు ఉండీ లేనట్లుగానే ఉన్నాయి. చంద్రుడి మీద కసి తీర్చుకోవటానికి మబ్బులు ప్రయత్నించి పరాభవం చెందుతున్నాయి.

ప్రసాదు గదిలో లైటు వెలుగుతోంది. గేటు తోసుకుని లోపలికి వెళ్ళాను. వాళ్ళింట్లో నాకు మంచి చనువున్నది. దగ్గరిగా వేసి ఉన్న వాడి గది తలుపులు నెట్టి లోపల కాలు పెట్టాను.

వాడు ఆ గదిలో ఒక ప్రక్కగా నున్న డ్రాయరు ముందు కుర్చీలో కూర్చుని తలను డ్రాయరు మీదకు జేర్చి, చేతులతో కప్పుకున్నాడు.

నిద్రపోతున్నాడేమోనని వెనుకగా వెళ్ళి భుజం మీద చేయి వేశాను.

ఉలిక్కిపడి తలెత్తాడు.

వాడి ముఖం చూస్తూనే నేను విభ్రాంతుడనయ్యాను.

అతడి కంటి వెంట కారే నీరు చెంపలను తడిపేస్తోంది.

వాడు వడివడిగా చేతులతో కళ్ళు తుడుచుకున్నాడు.

"ఏమిటిరా?" అన్నాను విసుగ్గా. "నా ఖర్మ!" అన్నాడు ఏడుపు గొంతుకతోనే. తిరిగి తలను వాల్చుకుని రెండు చేతుల మధ్య ఇరికించుకున్నాడు.

చిరాకు వేసి తల దించుకున్నాను. నా కాళ్ళ దగ్గర వాడు వ్రాసిన కథ తాలూకు వ్రాత ప్రతి ముక్కలు ముక్కలై ఎగురుతోంది...

"మీరంతా అనుభవశూన్యులురా!" అన్నాను కోపంగా.

వాడు మాట్లాడలేదు.

నేను పెద్ద వాళ్ళమీద ఒక్కసారిగా అపరిమితమైన ద్వేషం అనిపించింది.

మరునాడుదయం నేను పక్కమీద నుంచీ లేవకముందే ప్రసాదు వచ్చి, దుప్పటిలో ముడుచుకు పోయిన నన్ను లేపి కూర్చోబెట్టాడు.

"వెళదాం పద!" అన్నాడు.

"ఎక్కడికి?"

"తోటలోక్కి!"

నేను భుజాన తువ్వాలు వేసుకుని, వేపపుల్ల తీసుకుని మా ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉన్న మామిడితోటలోకి వాడిని అనుసరించాను.

దారిలో ఎవ్వరం మాట్లాడలేదు.

అక్కడికల్లా వెళ్ళింతరువాత వాడే వెనుదిరిగి నా కళ్ళలోకి చూస్తూ, "రాత్రి అసహ్యంగా ప్రవర్తించాను గురూ?" అన్నాడు.

వాడి ప్రశ్నకు నాకు నవ్వు వచ్చింది. మరుక్షణంలోనే కోపమూ వచ్చింది. గట్టుమీద కూర్చుంటూ "నీ మొఖం!" అని నవ్వాను.

"శేషూ! ఏ విషయాన్నైనా నీవు తీసుకున్నంత తేలిగ్గ నేను తీసుకోలేను. శరీరానికి తగిలిన దెబ్బ త్వరలో మానవచ్చు గానీ, మనస్సుకు తగిలిన గాయం మాత్రం మానదు!"

"అంత మానని గాయం ఏమిటో చెబుదూ? అన్నాను.

"నీవు అంత ఎగతాళిగా తీసుకోబోకు... నేను సిన్సియర్‌గాను చెబుతున్నాను!" అన్నాడు.

వాడికోసరమని నా మొఖం గంభీరంగా మార్చుకుని "చెప్పు" అన్నాను.

"నిన్న ఒక కథ ఒక పత్రిక నుండి తిరిగి వచ్చింది... మా నాన్న దానిని చూచి అరుస్తూ 'కానీ' సంపాదించే శక్తి లేదు... అడ్డమైనవాటికి డబ్బు తగలేస్తున్నాడు అంటూ తిట్టిపోశాడు. ఆయననే మాటలు నేను వినలేకపోయాను శేషూ!... నా ఎదుటనే ఆ కథను ముక్కలు ముక్కలు చేసి క్రింద పడేశాడు... ఆ సమయంలో ఆ చేతులే నా ప్రచురించబడిన కథల కొచ్చిన ప్రతిఫలాన్ని తీసుకున్నాయనే విషయాన్ని ఆయన మర్చిపోయాడు. ..... నా ప్రతిభను మెచ్చుకున్న ఆయన నోరే క్షణంతో తిరిగిపోయింది!"

వాడి మ్లాన వదనాన్ని చూచి ఏదో అనబోయిన నా నోరు ఆగిపోయింది.

ఏదేదో గంటసేపు చెప్పాడు.

లేచి నిలబడుతూ "రచయిత ఎప్పుడూ ఇంత చిన్న సంఘటనలకు గూడా బేజారయిపోడోయ్!" అన్నాను.

వాడు నా మాటలకు సమాధానం చెప్పలేదు. సమాధానం చెబుతాడని నేను ఆశించలేదు.

తిరిగి నాలుగురోజుల వరకు ప్రసాదు నాకు కనబడలేదు. ఆ రోజు కాలేజీ కూడా లేదనుకుంటాను. పొద్దుపోయింతర్వాత

భోంచేసి వాళ్ళింటివేపే బయలుదేరాను.

వాడింటి దగ్గరికి వెళ్ళేటప్పటికల్లా వాకిట్లో వంటరిగా నిలబడి ఉన్న శారద కనబడింది.

"భోంచేశావా!" పలకరించాను.

"ఆc..." అన్నది.

"ప్రసాదు దగ్గరికి వెళ్ళి వస్తాను..." అన్నాను ప్రసాదు వాళ్ళింటివైపు తిరుగుతూ.

"తరువాత వెళుదువుగానిలే... రా..." అంది. మెదలకుండా ఆమెను అనుసరించాను.

ముందుగా త్వరత్వరగా వెళ్ళిన ఆమె హాల్లో ఉన్న మంచాన్ని తీసుకుని వచ్చి ఆరుబయట వాల్చి "కూర్చో" అంది.

కూర్చుని "అత్తయ్యవాళ్ళేరి?" అని అడిగాను.

"గుళ్ళో ఏదో పురాణం చెబుతున్నారట.... వెళ్ళారు."

వెనుదిరిగి ఆ మెట్లమీద గడ్డానికి చేతిని పోటీగా పెట్టుకుని కూర్చుంది.

"మీ పిన్ని ఏమంటోంది?" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"నీవు బ్రతికి ఏం సాదిద్దామని... చావమంటోంది!" చటుక్కున తల వంచుకుంది.

"ఏమిటి శారద... ఎందుకు అత్తయ్యకు నీవంటే అంత కోపం?"

నాకు శారద మీద 'ఇందువలన' ఇష్టమని చెప్పలేను. ఆమె మీద నాకు అమితంగా జాలి ఉన్నది. ఆమె జీవితం సుఖమయం అవటానికి నాకు తగినంత సహాయం చేద్దామనీ ఉన్నది.

అయినా అని వాళ్ళ గృహచ్ఛిద్రాలు. మనం కల్పించుకోవటం వలన మనమే తేలికయిపోతామేమోనని నా భయం!

సవతి తల్లులంతా పిల్లలని ఇలా చూస్తారో లేదో నాకు తెలియదు గానీ, శారదను మాత్రం అత్తయ్య హీనంగానే చూస్తోంది!

"నాన్నకు తెలుసా... ఆయనేమంటాడూ?"

"ఆయనకు చెప్పుకునేంత హీనస్థితిలో జారలేను!"

నిజంగా శారద అభిమానధనురాలే... నేనూ కాదనలేను. కానీ అప్పుడప్పుడు ఆమెలోని బాధను నా ముందు ఎందుకు బహిర్గతం చేసుకుంటుండేదో పది రోజుల క్రితం వరకు నాకు తెలియదు!

ఆరోజు అదే ఆమెను ప్రశ్నించాను కూడా.... ఆమె సమాధానం చెప్పకుండా మౌనంగా అలాగే కూర్చుండిపోయింది. నేను రెట్టించలేదు... కొన్ని క్షణాలు అలా నిశ్శబ్దంగా కూర్చున్న తరువాత లేచి నిలబడ్డాను.

"వస్తా."

ఆమె మాట్లాడలేదు.

మెదలకుండా బయట కొచ్చేశాను.

ప్రసాదు కోసం వెళితే వాడింట్లో లేడు. వెనుదిరిగి ఇంటికి వెళ్ళిపోయాను.

మూడు రోజుల తర్వాత ఒక రోజున నాకు బజారులో ప్రసాదు కనబడ్డాడు.

కనబడుతూనే హడావిడిగా, "నీకోసమే తిరుగుతున్నానురా!" అన్నాడు.

వాడి ముఖంలో కళ లేదు. మాసిన గుడ్డలు, రేగిన జుట్టు, మనిషి చికాకును తెలియబరుస్తున్నాయి. మెదలకుండా వాడు వెళుతున్నవైపే 'ఎక్కడికి' అనకుండా నడిచాను.

రెండు గుటకల్లో కాఫీ త్రాగించి ఊరి బయటకు లాక్కెళ్ళాడు.

వాడు ఊరి బయట కల్లా వెళ్ళిం తర్వాత, "అరేయ్! ఎంత తక్కువ జీతమైనా సరే... ఒక ఉద్యోగం చూచిపెట్టు!" అన్నాడు.

"ఇప్పుడంత ఖర్మమేమొచ్చింది.?"

"వచ్చింది కాబట్టే అడుగుతున్నాను...."

"అదే ఏదో చెప్పి ఏడ్వమంటున్నాను!"

"టూకీగా చెప్పాలంటే - ఏ ఉద్యోగమూ సంపాదించకుండా తనకు నా మొఖం చూపించవద్దన్నాడు మా నాన్న. ఇప్పటివరకు పెట్టిన తిండంతా దండగ అని కుండ బ్రద్దలుకొట్టినట్లుగా ముఖానే చేప్పేశాడు!"

"అంటే మీ నాన్నమీద కోపమొచ్చేసి అడ్డమైన ఉద్యోగం ఏదైనా సరే చేస్తానంటావ్?"

"లేకపోతే మనం చదివిన చదువుకు ఎంత పెద్ద ఉద్యోగమొస్తుందంటావ్?"

"అరేయ్! వాదన అనవసరం... మీ నాన్న తిండిలేక చస్తున్నాడా? నీవు తెచ్చే సంపాదన లేకపోతే మీ ఇల్లు గడవదా?... చెప్పు! ఆయన్నడుగుతాను పద!" అన్నాను విసురుగా.

"నా చిట్టితండ్రీ! శేషూ... నీవేనటరా నాన్నా ఆయన ఎదుట బడి అడిగేది?" వాడు తెగ నవ్వుతున్నాడు. వాడి అంత గంభీర మొఖం క్షణంలో విశాలమై కళకళలాడుతోంది.

"ఏం ఎందుకు అడగలేను?" అన్నాను బింకంగా.

వాడు నా భుజం తట్టి ఊరివైపు బయల్దేరాడు. "అబ్బాయి! నీవన్నట్లు వాదనలు, తగవులాటలు అనవసరం... నా గౌరవం నేను మా ఇంట్లో నిలబెట్టుకోవాలంటే నా కింద ఖర్చు పెట్టినదాన్ని ఏదో విధంగా వాళ్ళకు ముట్టచెప్పాలోయ్. అంతా బిజినెస్‌రా నాన్నా బిజినెస్! ఈ రోజుల్లో తండ్రి లేడు... కొడుకు లేడు..."

నేను మాట్లాడలేదు. నా శరీరం ఉడికిపోతుంది.

- అదే నా బలహీనత!

"నీ చెవిలో వేశాను... మీ నాన్నకు మంచి 'ఇన్‌ఫ్లుయన్స్' ఉన్నది కాబట్టి ఏదైనా 'ఛాన్సు' వస్తే పోగొట్టబోకు... అంతే!"

అర్థంలేని ఆలోచనలతో. వివశుణ్ణయి ఇంటికి చేరాను.

అయిదు రోజులు గడిచిపోయాయి.

ఆరోజు ఇంట్లో ఎవ్వరూ లేరు. నాన్న ఆఫీసులో ఇన్‌స్పెక్షన్‌ట. రాత్రింబగళ్ళు అక్కడే సరిపోతుంది. అక్కయ్య పోరంగా పోరంగా అమ్మ కూడా 'భక్త జయదేవ' సినిమా బాగుందంటే బయలుదేరింది.

నేను ఇంటికి కాపలా!

గదిలో తలుపులు దగ్గరేసుకుని పడక కుర్చీలో పడుకుని ఏదో చదువుకుంటున్నాను. పది నిమిషాల కంటే ఎక్కువసేపు చదవలేకపోయాను. ప్రసాదునన్నా పిలుచుకు వస్తే మాటలతోనైనా పొద్దుపుచ్చవచ్చనిపించింది. లేచి గుడ్డలు మార్చుకున్నాను. తలదువ్వుకుని బయటకు నడవబోయేటంతలో ఎవరో నెట్టినట్లుగా తలుపు తెర్చుచుకుంది.

ఎవరా అని ఆదుర్దాగా చూచాను.

శారద!

ఆశ్చర్యపోతూ "ఏం శారదా?... లోపలికి రా!" అన్నాను.

"అత్తయ్యవాళ్ళు లేరా?" అంది తల వంచుకుని.

"సినిమాకు వెళ్ళారు. అలా కుర్చీలో కూర్చో!"అన్నాను నేను వెనక్కు వెళ్ళి పడక కుర్చీలో కూర్చుంటూ.

శారద నా ఎదురుగ్గా కుర్చీలో కూర్చుంది.

గడియారం ఆరుగంటలు కొట్టింది, గదిలో మసక చీకటిగా ఉంటే లేచి వెళ్ళి లైటు వేశాను.

ఆమె ఆ లైటు వెలుతురుకు అలవాటుపడనట్లుగా కళ్ళు రెపరెపలాడించింది.

ఆరోజు తలంటి పోసుకుందేమో జుట్టు చిందరవందరగా ఎగురుతోంది. ఎర్రటి శారద మొఖంలో కళ నృత్యం చేస్తోంది - ఆమె ఆ మాసిన ముతక నేత చీరలో కూడా అందంగా మెరుస్తోంది.

నాకు శారదను చూస్తుంటే అమితంగా జాలి వేస్తోంది. అంత అమాయకురాలిని హింసించటానికి అత్తయ్య మనస్సు ఎలా ఒప్పుకుంటున్నదో నాకు అవగతం కావటంలేదు.

"ఎందుకో నాకు జీవితం మీద రోజు రోజుకు ఏహ్యం జనిస్తోంది!... మా పిన్ని ఉద్దేశ్యంలో లాగానే నేనెందుకు చనిపోగూడదో నాకు తెలియటం లేదు.. ఆరోజు దగ్గరికొస్తూండాలి!"

పరిసరాలన్నీ గంభీరపరిచే కంఠంతో ఆమె అన్నది.

నేను ఆమె మాటలకు విచిలితుడనయ్యాను. మరుక్షణంలోనే ఆమెకు నేనేమీ సహాయం చేయలేదని దెప్పి పొడుస్తున్నట్లుగా ఫీలయి లజ్జితుడనయ్యాను. తలవాల్చుకుని వెళ్ళి కిటికీ ఊచలు పట్టుకుని బయటకు చూస్తూ నిలబడ్డాను.

ఊరంతా చీకటి ముసుగులో మరుగుపడి పోవటానికి తాపత్రయ పడుతోంది.

"శారదా! నాకు ఒక్కటి అనుమానంగా ఉన్నది... నీవు ప్రతి చిన్న విషయాన్ని భయంకర రూపంలో చూచి భయపడుతున్నావేమోనని!"

"ఎన్నటికీ కాదు! ఎంత భయంకర సంఘటననైనా నేను తేలిగ్గా తీసుకుంటున్నాను కాబట్టే ఈ రోజు వరకు నేను బ్రతికి ఉండగలిగాను... లేకపోతే ఏనాడో మరణించేదాన్ని!" అన్నది, ఆ మాటలు చాలా దృఢంగా ఉన్నాయి అనిపించింది నాకు...

"జీవితం మీద అంత నిరాశ పనికిరాదు శారదా! తెలివితక్కువగా త్వరపడి అలాంటి పని ఎప్పుడూ చేయబోకు!" అన్నాను.

బాధగా వెనుదిరిగాను.

ఆమె లేచి నిలబడింది.

ఆ సమయంలో ఆమె కళ్ళు నీటితో నిండి ఉన్నాయి.

నేను చిన్నగా అడుగులేస్తూ ఆమెకు సమీపంగా నడిచాను.

నీటి పొరలు క్రమ్మిన ఆమె కనుపాపల్లో నా పాప అస్పష్టంగా మెదులుతోంది.

అనాలోచితంగా నా చేతి నెత్తి ఆమె చెంపలు మీదుగా కారే నీటిని తుడుస్తూ "ఛా! తప్పు కదూ!" అన్నాను. "ఏదైనా కొద్ది రోజులు ఓపిక పట్టు శారద... జీవితాంతం మీ పిన్ని దగ్గరే ఉండవు కదా?... నీకు చేయగలిగిన సహాయం ఏదైనా సరే మనస్ఫూర్తిగా చేస్తాను.... నా మాటలు నమ్ము!"

"ఆ ఒక్క ఆశతోనే నేను జీవించగలుగుతున్నాను!" అన్నది. అంటూనే చిన్నగా గడపదాటి బయటకు నడవసాగింది.నడవసాగింది.

నేను ఆమె వెళుతున్నవైపే చూస్తూ స్థబ్దుగా నిలబడిపోయాను.

ఆ క్షణంలో నాకు ఆమె కోసరం నా జీవితమైనా అర్పించాలనిపించింది! నా మీద ఆమెకున్న గౌరవానికి నాకు గర్వమూ వేసింది...

బాధగా వెనుదిరిగి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

పుస్తకం తెరవ బుద్ధికాలేదు. ప్రసాదును పిలుచుకు వచ్చే ప్రసక్తే మర్చిపోయాను.

శారద అన్నివిధాలా తృప్తిపడి, ఆమె జీవితం ఆనందోత్సవాలతో వెల్లివిరిసేలా నేనేలా సహాయపడగలను?

ఒకరోజు సాయంత్రం ఏడు గంటల బండిలో చేతి సంచితో మామయ్య దిగాడు. గడపలో కాలుపెడుతూనే "అల్లుడూ! రాజ్యం నీ దగ్గరికి బయల్దేరిందాకా నన్ను వదిలిపెట్టలేదురా! అన్నాడు.

నాకు నవ్వు వచ్చింది.

"నీకింకా చిన్నపిల్లవాడి చేష్టలు పోలేదురా!" అన్నది మా అమ్మ వాళ్ళన్నయ్య గొంతు విని లోపలి నుండీ వస్తూ.

నేను ధైర్యం తెచ్చుకుని "నన్ను తీసుకు రమ్మన్నదా చెప్పు... ఇప్పుడే బయల్దేరతాను!" అన్నాను.

అమ్మ పొట్ట చెక్కలయ్యేలా నవ్వసాగింది.

మామయ్య"ఘటికుడివే!" అంటూ నవ్వసాగాడు.

నేను చిన్నగా బయటపడ్డాను నా క్యాబోయే భార్యామణి రాజ్యలక్ష్మిని నా కళ్ళలో కదిలించుకుంటూ.

మొట్టమొదటిసారిగా 'నీకు పెళ్ళాం పుట్టిందిరా' అన్న మాటతో నా జీవితంలో రాజ్యలక్ష్మి ప్రవేశించింది. అప్పటికీ, ఇప్పటికీ ఆ ఊహతోటే ఇద్దరం పెరిగాం. ప్రతి సంవత్సరం సెలవల్లో రాజ్యం ఇక్కడికి రావటమో, నేను మామయ్యగారింటికి వెళ్ళటమో పరిపాటయింది. మేము ఇద్దరం ఒకళ్ళ నొకళ్ళు పూర్తిగా అర్ధం చేసుకున్నాం. మా భావాలు కలిసినయి. క్రితంసారి సెలవల్లో వెళ్ళినప్పుడు కూడా, "ఈ ఒక్క సంవత్సరమే రాజీ నీవు నాకు దూరంగా ఉండవల్సింది!" అన్నాను ఆమె ఒంటరిగా నాకు దొరికినప్పుడు.

"ఆ మీరనుకుంటున్న ఒక్క సంవత్సరమే నేను ఎన్ని యుగాలుగా గడపాలో?" అన్నది తలవంచుకుని. ఆ ఒక్క సమాధానం చాలు నాకు నా రాజ్యలక్ష్మి హృదయం తెలుసుకునేందుకు.

మామయ్య వచ్చింది ఎందుకో ఆ రోజు రాత్రి మా అమ్మ చెప్పేంతవరకు నాకు తెలియదు .

ఆమె మాటలు వింటూ నేను గాలిలో తేలిపోయాను.

ఈ నెలలోనే మా పెళ్ళి లగ్నం నిశ్చయించి మా అమ్మ నాన్న 'ఆమోదముద్ర' కోసరం వచ్చాడు!

అమ్మా నాన్నా కూడా అభ్యంతరం చెప్పలేదు.

ప్రసాదు కనబడి నాలుగయిదు రోజులయింది. చూచివద్దామని వాళ్ళింటికి వెళ్ళాను. వాడప్పుడే ఎక్కడికో వెళ్ళాడట. ఇంట్లో లేడు.

రోడ్డు మీదకొచ్చాను. వరండాలో నిల్చొనివున్న అత్తయ్య పిల్చింది "రావయ్యా శేషూ!" అంటూ.

లోపలికి వెళ్ళాను.

శారద కోసరం నా కళ్ళు పదే పదే అన్నివైపులా వెతికినాయి.

ఆమె ఎక్కడా కనపడలేదు.

పావుగంట పిచ్చాపాటీ మాట్లాడి బయటపడ్డాను.

ఎందుకనో 'శారద ఎక్కడికెళ్ళిందని' అత్తయ్యను అడగడానికి భయమేసింది.

నా బలహీనతకు నాకే ఒక్కొక్కసారి నవ్వు వస్తుంటుంది. మరుక్షణంలోనే నా మీద నాకే అసహ్యమూ కలుగుతుంది.

ఆలోచనలతో సతమవుతూ ఇంట్లో కాలు పెట్టాను.

అప్పుడే రంగనాథం మామయ్య నవ్వుతూ బయటకు వస్తున్నాడు.

"ఏరోయ్! పెళ్ళికొడుకు! కనబడటమే మానేశావ్!

ఆయన నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

తరువాత మూడురోజులకనుకుంటాను. అప్పుడే కాలేజీ నుండీ ఇంటికొచ్చి కాఫీ త్రాగుతున్నాను. శారద వాళ్ళ పక్కింటి వాసు పరుగెత్తుకుంటు వచ్చి"శారదక్కయ్య నిన్ను రమ్మంటోంది!" అంటూ తిరిగి నా సమాధానం వినిపించుకోకుండానే వచ్చినంత హడావుడిగానే వెళ్ళిపోయాడు. వాడి చేష్టకు నాకు నవ్వు వచ్చింది. స్నానం చేసి ఉతికిన గుడ్డలు కట్టుకుని శారద వాళ్ళింటివైపు బయలుదేరాను.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. చిన్నగా అడుగు లేస్తూమెట్లెక్కి హాలులో అడుగు పెట్టాను. నాకు ఎవ్వరూ కనపడలేదు

"అత్తయ్యా!" అని పిలిచాను.

"ఇటు లోపలికి రా!" అని పక్క గదిలో నుండీ సమాధానం వచ్చింది. అది శారద గొంతు.

ఆ గదిలోకి అడుగు పెడుతూనే "మీ పిన్నీవాళ్ళేరీ?" అన్నాను.

"ఉదయమే వాళ్ళమ్మగారింటికి విజయవాడ వెళ్ళింది."

"...నన్నెందుకు రమ్మన్నావట?" అన్నాను నిల్చునే.

అటు తిరిగివున్న ఆమె ఒక్కసారిగా ఇటు తిరిగింది. ఆమె కళ్ళవెంట నీరు జలజలా రాలుతోంది.

"ఏమిటి శారద?...ఎందుకేడుస్తున్నావు?' అన్నాను నేను నిశ్చేష్టుడనై.

ఆమె ఛటుక్కున నా పాదాల చెంత కూర్చుంది. నేను కలవరపడి తేరుకునే లోగానే "నన్ను దూరం చేసుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నించనని మాట ఇవ్వు!" అన్నది.

ఆమె కన్నీరు నా పాదాలను తడుపుతోంది.

"అసలు సంగతేమిటో విపులంగా చెప్పు శారదా? " అన్నాను నేను విస్తుపోతూ. ఆమె మాటలు నాకేమీ అర్థం కాలేదు.

"అంతకంటే విపులంగా నేనెలా చెప్పగలిగేది... నాకోరిక, నా జీవితాశ తీరుస్తావని ఆశిస్తున్నాను. నీవు నిర్ణయించుకున్న విషయాన్ని తిరిగి హృదయపూర్వకంగా ఆలోచించు... నా మీద ఇన్నాళ్ళ బట్టీ చూపిన ఆదరమంతా ఒక్కసారిగా ఎలా మర్చిపోగలిగావు... నా జీవితాన్ని సుఖశాంతులతో నిలుపుతానని మాట ఇచ్చిన నీవే ఎందుకు అధఃపాతాళంలోకి తోసివేస్తావు? నీ భాగస్వామినిగా నా గడచిన కష్టజీవితాన్నంతా మర్చిపోదామనుకున్నాను."

నా నెత్తిన పిడుగుపడినట్లయింది! శారద అనే ప్రతిమాట నన్ను నిలువునా దహించివేస్తోంది.

"శారదా!" పెద్దగా అరిచాను.

తిరిగి ఆమె మాట్లాడేందుకు ఆస్కారం చిక్కనీయకుండానే పెద్ద పెద్ద అంగలతో రోడ్డు మీదకు పరుగెత్తాను. గమ్యం లేకుండా రోడ్ల వెంట తిరిగాను.

ఎంతో ఆదరించి, అభిమానించి జాలి చూపినందుకా నాకీ ప్రతిఫలం... ఏమీ తెలియని అమాయకురాలైన నా రాజ్యానికి నేను దూరం కావాలని శారద కోరుకుంటుందా?

ఒక్కసారి శారద మీద నాకు అపరిమితమైన కోపమొచ్చింది. అంతులేని ద్వేషం రగిలింది. శారద ముఖం ఇక జీవితంలో చూడగూడదనే గాఢమైన నిర్ణయానికి నేను వచ్చాను ఆ క్షణంలో.

ఆ సంఘటన జరిగినప్పటినుండీ నాకు శారద కనబడటం లేదు. ఆమె కనబడాలని నేను కోరుకోనూ లేదు.

ఈ పది రోజుల్లో శారదే నా మనస్సంతా కలచివేసింది. ఆమె మాటలు నాలోని ఉత్సాహాన్నంతా కలచి వేసింది. ఆమె మీద హృదయంలో ఎంత జాలి ఉండేదో అంతకు ఇబ్బడిగా ఇప్పుడు కోపమున్నది.

అసలు ఇలా జరగటానికి ఎవరు బాధ్యులు అనేది నేను నిర్ణయించుకోలేక పోతున్నాను.

నేను బాధ్యుణ్ణా?

నా ప్రవర్తన ద్వారా ఆమెలో అలాంటి భావనలు కలిగించానా?

లేదు...లేదు...

ఏమో?...

ఎన్నడూ కాదు! ఆమెనెన్నడూ నేను ఆ దృష్టితో చూడలేదు.

అభిమానించాను!

....అభిమానించటమంటే.... ప్రేమించటమా!

అలాంటి ఆలోచనలు వచ్చినప్పుడల్లా నా తల తిరిగిపోతోంది.

ప్రతి విషయంలో అన్యమనస్కంగా, వింతగా ప్రవర్తించి, ఇంటిలో అందరి విమర్శలకు ఈ పదిరోజుల్లో గురయ్యాను.

రేపు రాజ్యం నా ఎదుట నిలబడి నా 'నిస్సారమైన నడత'కు కారణమేమిటంటే నేనేం చెప్పుకోగలను?

నిన్ను గాకుండా శారద తనని వివాహం చేసుకోమన్నదని చెప్పనా?

రెండు రోజుల క్రితం ఉదయంపూట ఇంకో గంటలో రాజ్యం వాళ్ళ ఊరికి పెళ్ళికి తరలి వెళతామనగా, నా గదిలో దిండులో తలదూర్చి గోడవైపు చూస్తూ పడుకున్నాను.

ఎవరో వస్తున్నట్లు అలికిడయింది.

"అరేయ్! శేషు!" ప్రసాదు పెద్దగా అన్నాడు.

నేను వెనుతిరగలేదు... "ఏమిటి?" అన్నాను నిస్పత్తువతోనే.

"ఒక్కటే సమాధానం చెప్పు... బ్రతకమంటావా? చావమంటావా?

వాడి ప్రశ్నకు నాకు చిరకు వేసింది.

కోపంగా, "ఇంతకంటే సుఖంగా బ్రతకటం చేతకాకపోతే చావు!" అన్నాను.

బలంగా కళ్ళు మూసుకున్నాను.

అడుగులు దూరమయినాయి.

ప్రసాదు వెళ్ళిపోతున్నాడు.

లేచి, వెనుదిరిగి వాడిని పిలిచి ఏదో చెప్పాలనిపించింది. అనుకోవటమే తడవుగా లేచాను. వాడప్పటికే వెళ్ళిపోయాడు... పెద్దగా పిలవలేక నా గొంతు బిగదీసుకు పోయింది!

అదే ప్రసాదును ఆఖరుసారిగా చూడటం!

ఏదో గలాభాగా ఇంట్లో అంతా అరుస్తున్నారు. నా ఆలోచనలనుండీ తేరుకుని లేచి నిలబడ్డాను. నా కళ్ళు ఎందుకో బరువుగా ఉన్నాయనిపించింది. చెయ్యెత్తబోయాను. నీరు గబగబా నా చొక్కా తడుపుతూ రాలింది. చెంపలు చేతితో తడుముకున్నాను.

భారంగా అడుగులు వేస్తూ బయటకు వచ్చాను.

చిన్నపిల్లలు గోల చేస్తుంటే పెద్దవాళ్ళు కేకలేస్తున్నారు.

వరండాలో కొచ్చి పడక కుర్చీలో కూర్చున్నాను.

ఎవరో నూతన వ్యక్తులు వచ్చారు. నాన్న పరిచయం చేయటానికిగాను నా దగ్గరకి వాళ్ళను తీసుకు వచ్చాడు. అచేతనంగానే నమస్కరించాను.

నాకు శారద మీద అమితంగా కోపమొచ్చింది.

ఆమె చేసిన పనివలన ఆమెలో నా మీద ఎటువంటి ప్రేమ ఉన్నది తెలిసిపోయింది!

ఛీ! ఛీ!

-జీవితాలతో చెలగాటం.

ఒక రోజున శారద మీద ఎంతగా జాలిపడ్డానో అలాంటిదే నాకీ రోజున ప్రసాదు మీద కలుగుతోంది. చంచల హృదయరాలైన ఒక స్త్రీ వలలో చిక్కుకున్నందుకు!

నాకారోజు శారద నాన్నగానీ, అత్తయ్యగానీ కనబడలేదు... అటు ప్రసాదు ఇంట్లోవాళ్ళెవరూ రాలేదు.

ఇప్పుడు శారద ఎలాగూ నాకు కనబడదని నాకు తెలుసు. ప్రసాదు కూడా నా పెళ్ళికి ఎందుకు రాలేదో ఇప్పుడర్థమవుతుంది.

మూడు రోజులు మానసిక బాధతోనే గడిచిపోయినాయి. ఆరోజు ఫస్టు బస్సులో మామయ్యగారింటికి మూడు నిద్రలకు వెళ్ళాను రాజ్యంతో కలిసి. నాతోపాటు మా చిన్నక్కయ్య దాని ఆడబిడ్డ వచ్చారు.

ఆ ఊరు నేనిదివరలో చాలాసార్లు వచ్చి ఉండటం వలన నాకు బాగా పరిచయమైన వాళ్ళు చాలామంది ఉన్నారు అక్కడ. మొన్న పెళ్ళిరోజు హడావిడిలో అందరితో తీరిగ్గా మాట్లాడలేకపోయాను. అందువలన తిరిగి అందర్నీ ఒక్కసారి ఆ మూడు రోజుల్లో కలుసుకున్నాను.

కానీ ఇదివరకటి ఉత్సాహం ఇప్పుడు నాలో లేదు.

అంతగా నేను శారదను ద్వేషిస్తున్నా. ఆమెను నానుండీ ఎందుకు దూరం చేసుకోలేకపోతున్నానో నాకు అర్థం కావటం లేదు. ఎంత మర్చిపోదామనుకున్నా మర్చిపోలేక పోతున్నాను.

నాకు ఒక్కొక్క క్షణంలో ప్రసాదు మీద కూడా కోపం రగులుతోంది... ప్రాణస్నేహితుడనైన నాకు కూడా అందని అవధులు దాటి వెళ్ళిపోయింది.. ఎన్నడూ ఊహించనిఒక పాడు పని చేసి మరువలేని వ్యక్తిగా నా మనస్సులో ముద్ర వేసి కనుమరుగయి పోయింది!

సున్నం కొట్టిన గోడల్లో నాకు తెల్లదనం కనబడటం లేదు. వెన్నెల్లో చల్లదనం కరువవుతున్నదేమో ననిపించింది. చుక్కల చూపులు సూదుల్లాగా ఉంటే రెండు చేతుల్లో మొఖాన్ని ముడుచుకున్నాను.

భుజాన చేయిపడింది. ఉలిక్కిపడ్డాను.

రాజ్యం!

"ఒంటరిగా కూర్చున్నావేం బావా?... క్రింద అందరిని వదిలి!"

"రాజ్యం!" అన్నాను. "ఎందుకనో మనస్సు కొద్ది రోజులబట్టీ బాగుండడంలేదు..."

"నీవెంత పిచ్చివాడవు బావా... అంత సున్నిత హృదయం పనికిరాదు!" పదహారు సంవత్సరాలైనా నిండని రాజ్యం మహా జ్ఞానిలా పలికింది.

"నీకో కథ చెప్పనా?" అన్నాను ఆమె భుజాల మీద చేతులు వేసి.

"...శారద కథ కాకుండా ఏది ఐనా సరే వినటానికి సిద్ధమే!" అంది అక్కడే ఉన్న పేము కుర్చీలో కూర్చుంటూ.

నేను బిత్తరపోయాను!

"అయితే శారద సంగతంతా నీకు తెలుసా?" అన్నాను వడివడిగా.

నాకు భయం వేసింది. గుండె దడదడలాడింది. ఆమె నోటినుండీ వెలువడే మాటలు వినటానికి ఊపిరి బిగపట్టుకుని కూర్చున్నాను.

"అయితే చెప్పు!" అన్నాను అనుకోకుండా.

"ఏవుంది బావా!... మొదట్లో చూపులు కలిసినయి... తరువాత మాటలు.... ఆ తరువాత ఎదురెదురిళ్ళేగా కాగితాల ద్వారా మనస్సులు ఇచ్చి పుచ్చుకున్నారు... ఇద్దరిళ్ళలో పెద్దవాళ్ళు చండశాసనులవ్వటంతో చెప్పకుండా రైలెక్కారు! "

"నీకిదంతా ఎవరు చెప్పారు రాజ్యం?" లేచి నిలబడి ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాను.

" - అమ్మలక్కలు!" నవ్వుతుంది. "నీ మిత్రుడు వాళ్ళ ప్రేమ సంగతి నీకెప్పుడూ చెప్పలేదా?... అతడు నీకు బాగా తెలుసటగా?... అత్తయ్య చెప్పిందిలే... ఒక స్నేహితుడినే దూరం చేసుకున్నందుకు అలా బాధపడితే ఎలా చెప్పు జరిగిన దేదో పాతబడిపోయింతరువాత కొంపకు చేరుకుంటాడులే శ్రీమతితో సహా!"

ఆమె మాటల కెందుకనో నాకు తెలియకుండానే హృదయం తేలిక పడింది. రాజ్యానికి శారద లేచిపోవటానికి ముందు నా పాత్రను గురించి కూడా చెప్పాలనిపించింది. చెప్పలేదు. చెప్పలేక పోయాను.

"క్రిందకు వెళ్దాం పద బావా... పెందరాడే భోంచేద్దాం... మళ్ళీ సినిమాకు కూడా వెళ్ళాలి!"

మూడు రోజులు గడిచిపోయాయి. ఆలోచనలలో బాధ, మనుష్యుల మధ్య ఆహ్లాదం... అక్కడ రాజ్యాన్ని వదిలేసి, నేను మా తరుపువాళ్ళం మా ఇంటికి వచ్చేశాం.

నేను ఇంటిలో కాలు పెట్టిన కొద్దిసేపటిలోనే "నీకేవో ఉత్తరాలు వచ్చాయిరా శేషూ!" అంటూ అమ్మ రెండు ఉత్తరాలు తెచ్చి ఇచ్చింది.

రెండూ తీసుకుని నా గదిలోకి వెళ్ళాను. అందులో ఒకటి ప్రసాదు వ్రాశాడని ఆ వ్రాతే చెబుతుంది. ప్రసాదును గురించి కాకపోయినా, శారదను గురించి ఏమి వ్రాశాడో తెలుసుకోవాలనే ఆతృతతో త్వర త్వరగా ఆ కవరు చించాను.

"శేషూ!

తంతే గారెల బుట్టలో పడ్డట్టయిందిరా నా పని! ఇంట్లోనుంచీ పారిపోతేనేం నా కథలు ఇప్పటికి చాలా ప్రచురించిన ఒక ప్రముఖ పత్రికలో నాకనుకోకుండా ఉద్యోగం లభించింది. వెళ్ళి అడగ్గానే లేదనకుండా ఇచ్చారు.

నాకు సంతోషంతో ఏం వ్రాయాలో తెలియటం లేదు. నీకు నాలుగయిదు రోజుల్లో అన్ని విషయాలు విపులంగా వ్రాస్తా - ప్రసాదు"

అది నాకు మద్రాసు నుండీ వ్రాశాడు. శారదను గురించి ఒక్క వాక్యం కూడా వాడు ఎందుకు వ్రాయలేదో నాకు అవగతం కాలేదు. అలాంటి పని చేసి, చెప్పుకోటానికి సిగ్గుపడుతున్నాడేమో?

రెండో ఉత్తరం మీద అంతగా ఆసక్తి చూపలేకపోయాను. పెద్ద పరిచయంలేని వ్రాతలా కనిపించింది. ఎవరో నా వివాహానికి ఆహ్వానించిన మిత్రుడు రాలేకపోయినందుకు క్షమాపణలతో ఉత్తరం వ్రాసిఉండవచ్చు.

నిస్సారంగానే చించాను. చించినవాడిని చించినట్లుగానే నీర్జీవుణ్ణయ్యాను.

ఆ ఉత్తరం వ్రాసింది శారద!

"నమస్కారములు.

జీవితంలో నన్ను ఎవ్వరూ అర్థం చేసుకోలేకపోయారు. నన్ను అర్థం చేసుకున్నారనుకున్న మీరు కూడా ఎందుకలా క్షణంలో తిరిగిపోయారో నా కర్థం కావటం లేదు. నాదంతా అపోహేమోనని భ్రాంతి కలుగుతోంది. అయినా అయివుండవచ్చు.

నేనిక ఈ దుర్భర జీవితాన్ని గడపలేను. చివరిసారిగా మీరు మా ఇంటికి వచ్చినప్పుడు ఎన్నో చెప్పాలనుకున్నాను. నేను చెప్పేవేవీ వినకుండానే మీరు వెళ్ళిపోయారు. ఆ సమయంలో మా పిన్ని విజయవాడ వెళ్ళింది. ఎందుకో మీకు తెలిస్తే కనీసం మీ మనస్సు మార్చుకునయినా, కొద్ది క్షణాలు నాముందు నిలబడి నా మాటలు వినేవారేమో?... నన్ను వాళ్ళ వైపు ఒక పండు ముదసలి కిచ్చి వివాహం చేసేందుకుగాను నిర్ణయించేందుకు వెళ్ళింది.


ఏదైనా గతాన్ని తవ్వటం బాధను మ్రింగలేకపోవటమే అవుతుంది. బంధాలన్నీ త్రెంచుకున్నాను. మీకీ ఉత్తరం చేరే సమయానికి ఇక శారద జీవించి ఉండదు!

నాకోసరం చివరిసారిగా ఒక్క కన్నీటిబొట్టయినా రాల్చమని మిమ్మల్ని అడగటానికి సాహసించలేకపోతున్నాను - శారద."

# ఆహ్వానం

## - కాళీపట్నం రామారావు

*(మార్చి,1946 రూపవాణి లో ప్రచురితమైన కథ)*



యిదుగో! - గులకరాళ్ళ మధ్యనే దొరుకుతుంటాయట వెలలేని వజ్రాలు.

నువ్వనవచ్చు -

'ఒకొక్కప్పుడు వజ్రాలలా భ్రమింప చేస్తాయిగానీ నిజానికి గులకరాళ్ళే' - అని.

కావచ్చు. కాదని మూర్ఖంగా వాదించే రకం కాదు నేను. కాని అవి నిజంగా గులకరాళ్ళో ఒకవేళ వజ్రాలో - నువ్వు ఒక సారి ఆగి పరీక్షించి పదును పెట్టి చూడాలి కదా!

అయినా నువ్వు వప్పుకోకుండా అంటావ్ -

'నువ్వు ఏదో మారుమూల కూర్చుని కబుర్లంటే చెపుతావ్. చిత్ర నిర్మాణంలో నీకేం అనుభవం ఉంది' - అని.

కానీ అక్కడ నువ్వు పొరపడుతున్నావు అంటాను. మా హోటల్లో ఇరవయ్యేసి రూపాయలు పుచ్చుకుని మనుష్యమాత్రులు తినరాని తిండి పెడుతున్నాడు. వంకాయకూర బాగా లేదనీ, అన్నం పలుకుగా ఉందనీ, నెయ్యి దుర్వాసన వేస్తోందనీ పప్పు నీరు చప్పగా ఉందనీ మొదలయిన విషయాలు చెప్పడానికి వంట వండటం వచ్చి ఉండాలా? అక్కరలేదు. రుచి తెలుసుకోగలిగే బాలాది సహితం చెప్పవచ్చు. అంతేకాదు - ఎందుచేత బాగాలేదో ఉప్పు ఇంతకన్నా తక్కువ వేస్తే సరిపోతుందనో లేక ఎక్కువ వెయ్యాలనో, మరికాస్త బాగా ఉడకాలనో కూడా చెప్పవచ్చు. మా అభిరుచికి సరిపడా పదార్థాలు తయారు చెత్తమని హోటల్ యజమానిని నిర్బంధించవచ్చు.

నేనిప్పుడు అటువంటి హక్కుతోనే మాటాడుతున్నాను.

మీరు, మా డబ్బు - మేం కష్టపడి సంపాదించిన డబ్బుతో బ్రతుకుతున్నారు.

హాయిమయిన నిద్ర, కమ్మటి పానీయాలు, తృప్తికరమైన భోజనం, మొదలైన జీవావసరాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో ఈనాడు సినీమాకు అంత ప్రాధాన్యతా ఇస్తున్నాము. కానీ అసంతృప్తికరమైన చిత్రాలతో జీవితానందంలో, లోటు కలుగుతోంది. చక్కటి రిక్రియేషన్ కోసం, మా జీవితంలో మిస్ అయిన అనుభవాలను ఆర్టిస్టిక్‌గా నైనా పొందడానికోసరం, మాకు తీరుబడి లేక ఆలోచించలేకపోయిన సమస్యల పరిష్కార మార్గం తెలుసుకోవడం కోసరం, మా కష్టార్జితంలో కొంత వెచ్చించి మీరు తీసి మాకు

పంపించే చిత్రాలు చూస్తున్నాం. కానీ మీలో చాలా మంది మా హోటల్ మేనేజరులాగే మాకు ఎంతో అసంతృప్తిని కలిగిస్తున్నారు. మీరు ఒప్పుకోక పోవచ్చు కానీ మీరు మా కష్టార్జితన్ని అన్యాయంగా అపహరిస్తున్నారు.

మా ఇళ్ళల్లో అబ్బాయిలూ, అమ్మాయిలూ, అన్నదమ్ములూ, భార్యలూ, తల్లితండ్రులూ ఉంటారు. మా కష్టార్జితం తింటారు; మా కష్టసుఖాలకు ఆదుకుంటూ, మా ఆనందం,సౌఖ్యం, ఆరోగ్యం, అభివృద్దీ లక్ష్యంలో పెట్టుకుంటూ ప్రవర్తిస్తారు. కానీ కొందరు దౌర్భాగ్యులు మాకు నిరాశ, విసుగు, కోపం తెప్పించే మార్గాల పోతూవుంటారు. అయినా, వాళ్ళను పోషించడం మానం. ఎందుచేత? వాళ్ళు ఆచరించే మార్గం హర్షించి కాదు. కనీసం సహిస్తుండగలిగీ కాదు.

సరిగా ఆ సూత్రం పైనే మీకూ, మాకూ సంబంధం సాగుతోందంటాను.

మీరు మా తెలుగు వాళ్ళు.

అదీగాక చాలా తక్కువగా తయారయే తెలుగు చిత్రాల కోసం కాచుకుని ఉంటాం. ఆకలివేస్తున్నప్పుడు యే రసవిహీనమైన పదార్ధమయినా, ఏ అనారోగ్యకరమయిన ఆహారమయినా ఆతృతతో తినేస్తాం. తర్వాత తిట్టుకుంటాం. ఒకొక్కప్పుడు 'బాగానే వుంది' అని కొంత మంది అన్నా నిజానికి అవి బాగుండవు. ఆకలి రుచి ఎరుగదు. మొఖమాటం కూడా ఒక్కొక్కప్పుడు అలా అనేట్టు చేస్తుంది. తింటున్నారు కదా అని ఉప్పు ఎక్కువా, కారం తక్కువా, సరిగా ఉడకని పాళ్ళతోనే వండి పెట్టే హోటలు వాడిలాగా - మీరు కూడా చూస్తున్నారు కదా అని ఆ పురాణ గాధలూ, ఈ పుల్లమ్మ గాధలూ మా నెత్తిన రుద్దుతున్నారు. గరికి పచ్చడయినా రుచికరంగా చేసివుంటే కొంత సంతోషించి ఉందుము. అదీ లేదు.

నేను చాలా అన్యాయంగా అబద్దం చెపుతున్నానని మీరు అంటారు. మీరు అలా అనడానికి ఆధారం మీ బాక్సాఫీసులు. అంతేనా? అదే అయితే ఆ ఆధారం సుద్ద నిరాధారం.

అవును పుల్లమ్మ చిత్రాల బాపతు డబ్బు చేస్తున్నాయి.

దానికి చెప్పాను - ఆకలితో మండుతున్న పేగులు ఒకటి - అదికాక -

Vices లోబడ్డవాళ్ళకు తెలుసు - అవి దూష్యాలు అనీ, పాపం వాళ్ళు వాటిని బహిష్కరిద్దామనే అనుకుంటారు. కానీ ఆ అశక్తులు చెయ్యలేక పోతారు. అంతమాత్రాన వాళ్ళు Vicesని గౌరవిస్తున్నారనీ, వాళ్ళు అవే కోరుతున్నారనీ అంటావా?

కష్టపడి వళ్ళు పుండు చేసుకుని వచ్చే కార్మికులకు హాయిగా మేను మరిపించే సౌఖ్యం, నిద్రా త్రాగుడు ఇస్తుందంటూ మద్యపానాన్ని ప్రోత్సహించే వాదన ఒకటి విన్నాము ఆ మధ్య. మరి నీ వాదన కూడా ఆ జాతికే చెందుతుంది. కానీ నువ్వు వెళ్ళి ఒక త్రాగుబోతును అడిగి చూడు - తెలివితో ఉన్నప్పుడు సుమీ! - త్రాగుడు గురించి ఎలాటి అభిప్రాయాలు ఇస్తాడో. దీనికి అంతేనా అంటావు! ఆహా! రా! మా ఊరు రా! అక్కడ ఎంతోమంది - మిడిల్ క్లాసు, మధ్యరకం చేత, కొంతమంది తర్డ్‌క్లాసు వాళ్ళ చేత కూడా ఋజువు ఇప్పిస్తాను.

నేను ఇంత సేపూ చెపుతూ వచ్చినది నీతో ఈ విషయం చెప్పడానికే.

మేం డబ్బు ఇస్తున్నాం. మేం అంటే మీ మెద్రాసులో కూర్చున్నవాళ్ళూ ఒక్కళ్ళే కాదు - త్రిలింగ మధ్య ప్రదేశంలోని తెలుగు వాళ్ళం అందరం. మా కష్టార్జితం నువ్వు తింటున్నప్పుడు నువ్వు మా అభిరుచులను తెలుసుకుంటూ వాటిని అనుసరించి నీ ముందు ప్రయత్నించావా? మెద్రాసులో నీ బృందం మధ్యన కూర్చుని వాళ్ళు ఇచ్చిన అభిప్రాయాలను మాత్రం తెలుసుకుని ఊరుకుంటున్నావు కానీ ఏనాడయినా మాలోకి, మామధ్యకు వచ్చి మా అభిప్రాయాలు, అభిరుచులూ తెలుసుకున్నావా? ఒకవేళ వస్తే మాత్రం ఎక్కడ కూర్చున్నావ్? - ఎవరితో మాట్లాడావ్? బాక్సులో కూర్చుని నీ గొప్పతనానికి తైర్ కొట్టే బృందాన్ని అడిగావ్! మీకు డబ్బిస్తున్నది వాళ్ళా? వాళ్ళంతా F.S బాపతు. మీకు ఎక్కువ భాగం డబ్బు ఇస్తున్నది మేమూ, మా మిడిల్ క్లాస్, మా తర్డ్‌క్లాస్ - నువ్వు రావలసింది మా మధ్యకు.

చెపుతున్నాను. పశువులలో కూడా అగపడే 'విశ్వాసం' అనేది నీలో ఏమయినా ఉంటే - నువ్వు మనిషివని చెప్పుకోదలిస్తే బయలుదేరు. నువ్వు తినే డబ్బు ఎవరైతే ఎక్కువ భాగం ఇస్తున్నారో ఆ ప్రేక్షకుల మధ్యకు వెళ్ళు. నీ హోదాతో కాదు - సాధారణ సోదర ప్రేక్షకుడుగా - వెళ్ళి వాళ్ళు నీ చిత్రాన్ని ఎలా ఆనందిస్తున్నారో చూడు. ఎప్పుడు నిశ్శబ్దంగా కూర్చున్నారు? అని గమనించు. ఆట అయ్యాక బయటికి వచ్చే ప్రేక్షకుల రిమార్కులు విను - ఇంకా భోగట్టా చెయ్యి. అప్పుడు ఈసారి తియ్యవలసే చిత్రం గురించి ఆలోచించు.

ఆ చంద్రతారార్క కీర్తిశేషుడు - యావద్భారత పూజితుడు - "రాజారామ్" ప్రజానురంజకతకు మూలం ఈ మార్గమే. ఒకసారి జ్ఞాపకం తెచ్చుకో.

ఒక్కమాట జ్ఞాపకం ఉంచుకో. ప్రేక్షక లోకం అంటే నువ్వూ, నీ బృందం, నేనూ, నా పత్రిక ఎడిటర్‌గారూ మాత్రమే కాదు - మీ మద్రాసు ప్రేక్షకులూ, మన యావదాంధ్ర దేశపు ప్రేక్షకులూ మాత్రమే కాక ఇంకా ఎంతో మంది.



# జుజుమురా
## గొల్లపూడి మారుతీరావు

*గొల్లపూడి మారుతీ రావుగారు 1971 ప్రాంతాల్లో వ్రాసిన కథ ఇది. ఆ సందర్భాన్ని గుర్తు తెచ్చుకుంటూ ఆయన ఇలా అన్నారు " నేనప్పుడు శంభల్‌పూర్ ఆకాశవాణి కేంద్రంలో పనిచేస్తున్నాను. అందరూ అడిగేవారు.. ఆ పరిసరాల నేపథ్యంలో ఏదైనా కథ వ్రాయమని. కానీ అక్కడ వున్నన్ని రోజులూ నాకే ఏ కథాంశమూ స్ఫురించలేదు.. అక్కడినుంచీ బదిలీ ఐ వెనక్కి వచ్చేసే రోజు..మరో ఇద్దరు ఫ్రెండ్స్ తో కలిసి స్కూటర్ మీద శంభల్‌పూర్ నుంచీ భువనేశ్వర్‌కి బయలుదేరాం. ఆ చీకటి రాత్రిలో 'జుజుమురా ' వద్ద టీ తాగడానికి స్కూటర్ ఆపాము. ఇంకో రెండు గంటల్లో ఒరిస్సా సరిహద్దులు దాటుతాం..సరిగ్గా అక్కడ ఈకథకి ఆలోచన రూపం దిద్దుకుంది. ఈ కథని సినిమాగా తీస్తామని చాలామంది ముందుకి వచ్చారు. కె.హేమాంబరధరరావు గారు, కె.రాఘవేంద్రరావు గారు కూడా వున్నారు వాళ్ళలో. డైరెక్టర్ వంశీ (అన్వేషణ, సితార..ఫేమ్) ఈ కథకి పెద్ద ఫాన్.. మళ్ళీ 36 సంవత్సరాల తరువాత మీరు కౌముదిలో ప్రచురించి మరోసారి జుజుమురా ని ప్రపంచానికి చూపిస్తున్నారు.."*

బస్సు జుజుమురా దగ్గర ఆగినప్పుడు మొదటిసారిగా ఆ అమ్మాయిని చూశాను.

నవంబరు చలి దుర్మార్గుడి పగలాగ పట్టుకుని వదలకుండా ఉంది. తారు పూసినట్లున్న నల్లటి మేఘాల చాటున నీరసంగా తొంగి చూస్తున్నాడు చంద్రుడు. నక్షత్రాలు అక్కడక్కడ అలికినట్లున్నాయి. చెట్లన్నీ చలికి బక్కచిక్కిపోయి బిగుసుకుపోయినట్టున్నాయి.

శంభల్‌పూర్ నుంచీ భువనేశ్వర్ ప్రయాణం. "ఈ రాత్రి వద్దు భాయ్. రథాకోల్ అడవిలో చలి తట్టుకోలేవు. రేపు వెళుదువుగాని" అన్నాడు సాహు. అయినా వినిపించుకోలేదు. "రేపు ఉదయం భువనేశ్‌లో పని ఉందం"టూ బస్సు ఎక్కాను.

ముతక శంభల్‌పూర్ చీరలో చుట్టిన నాజూకయిన రబ్బరు బొమ్మలాగా ఉంది ఆమె. ఆ లావణ్యం, ఆ నాజూకుతనం చూసి కాసేపు ఒరియా అమ్మాయేమోననుకున్నాను. పొడవుజుట్టు సీటుకిందకి చీకట్లో నల్ల తాచులాగ వేలాడుతోంది. నన్ను కాస్త తికమక పెట్టింది ఒకటే - ఆమె సిగలో కెంపులాంటి గులాబీ పువ్వు. ఇక్కడ అమ్మాయిలు పువ్వులు పెట్టుకోరు. సంప్రదాయంలో రాష్ట్రీయ సంస్కారం, అలంకరణలో రాష్ట్రేతర సంస్కారం అలవరచుకున్న ఆమె నన్ను కాసేపు ఆలోచించుకునేటట్టు చేసిన మాట నిజం.

ఆమె అందమయిన అమ్మాయి కాదు. నేను కూర్చున్న చోటుకి నాజూకయిన సన్నటి వెలుగొస్తోంది. ఒక్కసారి వెనక్కి తిరిగి నవ్వితే ఆ చీకటి రాత్రిలో మందకొండిగా వెలిగే బస్సు లైట్లలో ఆమె కళ్ళు రెండు అగ్ని గోళాల్లాగా ప్రతిఫలించడం చూశాను. శరీరంలో

కనిపించని ఏ అందాన్నయినా భర్తీ చేయగలిగిన అందమైన కళ్ళు. తీక్షణమైన చూపు. నా ముందు సీట్లో కూర్చుంది. ఆమె ఒంటరి, పక్కన ఎవరూ లేరు. నా పక్క కునుకు తీస్తున్న పండా కారా కిళ్ళీ చారలో చొంగ కలిసి వంటి మీదకి కారుతుండగా రాత్రి చలిని అనాయాసంగా జయించి నిద్రపోతున్నాడు.

ఆ బాధ ఇప్పుడు అర్ధమవుతోంది. ఆంధ్రదేశంలో చలికాలానికి ఉపయోగించే ఏ దుప్పటీ ఈ చలికి ఆగడంలేదు. సీటులో ముడుచుకు కూర్చుని మగతలో పడుతున్నాను.

ఉన్నట్టుండి బస్సు కుదుపుతో ఆగింది. అందరి ముఖాల్లో ఆశ్చర్యం కనిపించింది. ఒరియా భాష ఒక్కసారి నిద్రలేచింది. వాళ్ళు అతిత్వరగా మాట్లాడుతారు. మాటల్లో కంచు గొంతు వెదికి తెచ్చుకుంటారు. డ్రైవరు ఏదో చెబుతున్నాడు. కొన్ని నిద్రముఖాల్లో కోపం తెలుస్తోంది. క్రమంగా ప్రయాణీకులంతా బస్సు దిగారు. నాముందున్న అమ్మాయి ఊదారంగు శాలువా విదిలించి దగ్గరగా లాక్కుని లేచింది. నేనూ లేచాను.

"జుజుమురా" అన్న నల్లటి అక్షరాలు బస్సు లైట్ల వెలుగులో కనిపిస్తున్నాయి. చుట్టూ దట్టంగా చెట్లు. చిన్న గ్రామం, నల్లటి కంబళి కప్పుకుని నిద్రపోతున్న దయ్యంలాగ ఉంది "జుజుమురా". ప్రతిగాలి తెరతోనూ చలి విరుచుకు పడుతోంది.

బస్సు ఎందుకు ఆగిందో ఇంకా అర్ధంకాలేదు నాకు. ప్రయాణీకుల ప్రశ్నలకు బీడీ కాలుస్తూ తాపీగా సమాధానాలు చెపుతున్నాడు డ్రైవరు. అతని ముఖంలో ఏపాటి ఆందోళనా లేదు. జీవితంలో కష్టసుఖాలకు అలవాటుపడిన వేదాంతిలాగా నిశ్చింతగా ఉన్నాడు - అది అతి సామాన్య విషయంలాగ. అతనేం చెపుతున్నాడో తెలుసుకోవాలనిపించింది. చుట్టూ చూశాను. ఒక చెట్టు నీడన రాయిమీద కూర్చుంది అమ్మాయి. ఆ అమ్మాయికి ఇంగ్లీషు అర్ధమవుతుందేమో, దగ్గరికి వచ్చి అడిగాను. "బస్సు డ్రైవరు ఏం చెపుతున్నాడో చెప్పగలరా?" అని.

ఆ అమ్మాయి తలెత్తి నా వేపు పరీక్షగా చూసింది. ఆ అందమయిన కళ్ళు నన్ను ఎక్సరే పరీక్ష చేస్తున్నట్టున్నాయి. పాపం ఈవిడకి నా భాష అర్ధం కావటం లేదేమో వెనక్కి తిరగబోతుండగా అనుకోని షాక్ తగిలింది.

"ఇంజన్ చెడిందట. క్షణంలో బాగు చేస్తానంటున్నాడు డ్రైవరు" స్వచ్చమైన తెలుగులో వచ్చింది సమాధానం. నేను నివ్వెరపోయాను. నాలో ఆశ్చర్యానికి ముచ్చట పడినట్టుంది. పకాలున నవ్వి - "నాకు తెలుగు ఎలా వచ్చునా అని ఆశ్చర్యపోతున్నారా?" అంది.

"అది ఒకటి. నేను తెలుగువాడినని ఎలా అర్ధం చేసుకున్నారా అని ఆశ్చర్యపోతున్నాను" అన్నాను. ఆమె నవ్వితే బుగ్గలు సొట్టలు పడుతున్నాయి.

ఒకసారి నా ముఖం పరికించింది. "మీకు జర్దాపాన్ వేసుకోవడం అంతగా అలవాటు లేదనుకుంటాను" అంది.

"మీరెలా గ్రహించారు!"

"పాన్ వేసుకుంటే ఇక్కడ వాళ్ళు గంటల కొద్దీ, బుగ్గన ఉంచుకుంటారు. మీరేమో కిటికీ దగ్గర కూర్చున్నారు. అయిదు నిముషాల్లో పూర్తి చేసేస్తున్నారు"

"అవును ఈ దేశం వచ్చాకే అలవాటయింది"

"కొత్తగా వచ్చారా?"

"రావడానికి పాతవాడినే. కానీ నేను తెలుగువాడినని ఎలా అర్ధం చేసుకున్నారో ఇంకా చెప్పలేదు మీరు"

"మీ చేతుల్లో తెలుగు ఉత్తరం ఉంది. మీరు కట్టుకున్న పంచె పొందూరు ఖద్దరు"

ఒక్క క్షణం నిర్ఘాంతపోయాను. **మగాడు ఆడదానిలో అందాన్ని చూస్తాడు. ఆడది అలంకరణల్ని చూస్తుంది. అందుకనే ఆడది మగాడి సోషల్ స్టేటస్‌ని సులువుగా అర్ధం చేసుకుంటుంది.**

"మీరింత జాగ్రత్తగా నన్ను పరికించారని అనుకోలేదు" నవ్వాను.

"కూర్చోండి" అని ఎదురుగ్గా ఉన్న మరొక రాయిని చూపించింది.

"మీరేం చేస్తారు?" అనడిగింది కూర్చున్నాక.

"టెక్స్‌యిల్ మిల్ ఏజెంటుని. ప్రతి సీజన్‌లోనూ వచ్చి ధర్మవరం చీరలకి ఆర్డర్స్ తీసుకుంటాను. తిరిగి వెళ్ళి సరుకు పంపించే ఏర్పాటు చేస్తాను. అమ్మకంలో రెండు పర్సెంట్ కమీషన్ ఇస్తారు. అందులో ఒక పర్సెంట్ జర్దాకిళ్ళీలు నమిలి ఒరిస్సాకే చెల్లించి వెళ్ళిపోతాను"

గలగలమని నవ్వింది.

నిద్రపోతున్న "జుజుమురా"లో కాస్త అందమయిన చైతన్యం వచ్చినట్టనిపించింది. నా ముఖంలో ఆశ్చర్యాన్ని చూసి కాస్త సిగ్గుపడింది.

"ఎలా ఉంది ఒరిస్సా మీకు?"

"ఇక్కడికి వస్తూ పోతూండడం 14 నెలల అలవాటు. ఎలా ఉందంటారా? దిగులుగా, తీరుబాటుగా, ఒంటరిగా, భయం భయంగా ఉంది. ఎక్కడయినా తెలుగు ముఖం కనిపిస్తుందా అని వెదకడం, కనిపిస్తే కదలకుండా పట్టుకు వేళ్ళాడడం, తెలుగు భాష వినిపిస్తే ఆప్తబంధువుని చూసినట్టు ఫీలవుతాను"

"ఆయితా మీకో ఆప్తబంధువు దొరికినట్టే" నవ్వింది.

ఆమె చొరవకి ఆశ్చర్యం కలిగినా, ఆ చిక్కటి రాత్రి అలా బంధుత్వం కలపడం ఆనందంగానే ఉంది నాకు.

"అవును. మిమ్మల్ని కలవడం ఆనందంగానే ఉంది. ఇంకా మిగతా ప్రయాణమంతా మీ స్నేహంతో నింపుకుంటాను" అన్నాను.

"శంబల్ పూర్ జీవితం ఎలా ఉంటుంది మీకు?"

"చెయ్యని నేరానికి విధించిన 'ఎ'క్లాసు జైలులాగ ఉంటుంది. అక్కడేం సమస్యలు లేవు. కష్టాలు లేవు. అన్నీ దొరుకుతాయి. మనిషికి కావాల్సింది తిండీ, నిద్ర అయితే శంబల్ పూర్‌లో ఏమీ లోపం లేదు. కానీ మనస్సుని బతికించుకోడానికి మరేదో కావాలి. అది అక్కడ లేదు. తెలుగుమాట వినిపించగానే ఇక్కడ మనుషులు ఆశ్చర్యంగా చూస్తారు. లేక అనుమానంతోనా? చాలా సంవత్సరాలుగా ఈ వేపుకి రైళ్ళ రాకపోకలు లేవనుకుంటాను. హీరాకుడ్ డామ్ నిర్మాణం ఈ ప్రాంతంలో పెద్ద భావ విప్లవానికి కారణమయి ఉంటుంది. క్రమంగా బయట జనం వచ్చారు. వాళ్ళంతా తెలివయిన వాళ్ళు. చదువుకున్న వాళ్ళు. ఆ విషయాన్ని వీళ్ళకి తెలిసేటట్లు చేశారు. చేస్తున్నారు. తెలివయిన వాడినయితే పరవాలేదు కాని తెలివయినవాడినని వీళ్ళచేత ఒప్పించాలి. నెత్తికెక్కితే ప్రమాదం. ఆ ప్రమాదంలో ఈ ప్రాంతీయులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇక్కడ చదువు సంస్కారం ఉంది. అది మనవాళ్ళతో పోటీపడేంతకాదు. వీళ్ళు మంచివాళ్ళు. ఇక్కడికి వచ్చిన వాళ్ళు కాస్త "అహంకారం"తో వచ్చిన వాళ్ళు. భావ వైదుష్యం కాస్త సుపిరియారిటీ కాంప్లెక్స్‌కి దారి తీస్తుంది. అందుకనే వాళ్ళ కళ్ళలో అనుమానం."

"శంబల్‌పూర్ గురించి చాలా ఆలోచించారే!"

"అక్కడి తీరికను ఏదోవిధంగా నింపాలిగా మరి? కాని గమనించారా? - శంబల్‌పూర్ జానపద సంగీతం, నృత్యానికి ఒక ప్రత్యేకత ఉంది. గిరిజనుల సంస్కారం నుంచీ అప్పుడే బయటపడిన ఒక విచిత్రమైన రిథమ్ కనిపిస్తుంది. ఈ రాష్ట్రంలో "జానపదం" నరాల్ని కదిపే లయబద్ధమయిన సంగీతం".

ఆమె వింతగా నన్నోసారి గమనించింది. "ఈ శంబల్‌పూర్ చీరలు మీకు నచ్చలేదా? " ఈసారి ఆమె కల్పించిన అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని ఆమెని నఖశిఖ పర్యంతం గమనించాను. ఆమె అందంగానే ఉంది. అదే చెప్పాను.

"ఈ చీర మీరు కట్టుకుంటే అందంగా ఉంది. ఇప్పుడు నా మనస్సు మార్చుకున్నాను."

"ఏ విషయంలో, నా విషయంలోనా, చీర విషయంలోనా?" ఎంత సాహసం! ఇలాంటి సందర్భంలో నేను ఓడిపోను.

"రెండింటిలోనూ" అన్నాను.

అంతే. మళ్ళీ "జుజుమురా"ని చిరునవ్వు కుదిపి పలకరించింది. ఈసారి ప్రయాణీకులంతా అర్థమయినట్టు మా వేపు దొంగ చూపులు చూసి నవ్వుకున్నారు.

"చూశారా! వాళ్ళు మనని చూసి ఎలా నవ్వుతున్నారో" అన్నాను.

"ఎందుకంటారు?" అంది అసలే పెద్దవైన కళ్ళ కొసల నుంచీ చూస్తూ.

"ఆ నవ్వు నాకు తెలిసినంతవరకు ఒకటే అర్థం. ప్రేయసీ ప్రియుల్నో, భార్యాభర్తల్నో చూసినప్పుడు వాళ్ళ జీవితాల్లో మధురానుభూతులు ఒక్కసారి జ్ఞాపకం వస్తాయనుకుంటాను"

ఈసారి మళ్ళీ కట్టలు తెంపుకునే నవ్వుని బలవంతంగా ఆపింది.

"మీపేరు?"

"మీరా"

బస్సు రేపేరు అయిందని ఒరియాలో అరుస్తున్నాడు కండక్టరు. లేచి చీరె సవరించుకుంది. నేను లేవడానికి చెయ్యి అందించింది. కాస్త ఆశ్చర్యం కలిగినా, అదేదో సామాన్యమయిన విషయంలాగా అందుకున్నాను. జారిపోయిన నా కండువాని తనే బుజం మీద వేసింది. ఇదంతా తోటి ప్రయాణీకుల దృష్టి పడకపోలేదు.

బస్సులో నేను ఇదివరకే కూర్చున్న సీటులోకి కునుకుతున్నాను. నా పక్కన కూర్చున్న పండా నా భుజం మీద చెయ్యి వేసి ఏదో ఒరియాలో అన్నాడు. నా కర్థంకాలేదు. మీరా నవ్వుతోంది. ఆశ్చర్యంగా చూశాను. "ఆయనేమంటున్నాడో తెలుసా? మీరిద్దరూ భార్యాభర్తలు కదా? రెండు సీట్లెందుకు. మీరు నా పక్కన కూర్చుంటే, ఆయన పడుకుంటాడట"

నా ముఖం ఎరుపెక్కింది. కోపంగా ముసలాడి వేపు చూశాను.

మీరా నా చెయ్యి పట్టుకుని "మనం భార్యాభర్తలం కానక్కరలేదు కానీ, ఇటువచ్చి నా పక్కన కూర్చోండి. పాపం, ఆయన పడుకుంటాడు" అంది.

నిస్సహాయంగా కూర్చున్నాను. బస్సు కదిలింది. ఉన్నట్టుండి చుట్టూ ఉన్న చలిగాలి పొంచి ఉన్న దుర్మార్గపు ఆలోచనలాగ బస్సులోకి జొరబడింది.

మెల్లగా జేబులోంచి జర్దాపాన్ తీశాను. పద్మశ్రీ లభించడంలాంటిదనుకుంటాను జీవితంలో భాగస్వామిని సంపాదించుకోవడం. ఎవరేనా కనిపించి బస్సులో నీతో గంటసేపు ప్రయాణం చేసిన అమ్మాయి నీ భార్య అవుతుందంటే ఒక్క క్షణంలో తెల్లబోతాను. వెంటనే నమ్మాలనిపించదు. అపనమ్మకమేననుకుంటాను నా మాటల్లో ద్యోతకమైంది. కానీ నా భార్య అయే అర్హతలు "మీరా"కి లేవా? నేను లక్షాధికారిని కాను. జీవితం పట్ల కనీసం ఆమెకున్నపాటి కలలు కూడా నాకు లేవు. ఒంటరిని. ఏదో సమయంలో దాని గురించి ఆలోచించాలి. కానీ చీకటి రాత్రిలో ఈ చలిలో పరిచయమైన ఈ కొత్త అమ్మాయి సరసన మొదటిసారిగా ఆ ఆలోచనలు చేస్తాననుకోలేదు.

"మీ కోపానికి కారణం చెప్పనా? అనుకోకుండా కలిసిన పేరూ ఊరు తెలీని ఈ కొత్త అమ్మాయి నా భార్య అంటాడా ఈ ఫూల్!" అని కోపం వచ్చింది మీకు. అవునా?" అంది.

"మీకెలా తెలుసు?"

"నేను బి.ఏ సైకాలజీ స్టూడెంటుని, ఒక్క సైకాలజీయే నాకు నచ్చిన సబ్జెక్టు" అంది.

మరోసారి ఆశ్చర్యపోయాను. ఆ అమ్మాయి అంత చదువుకున్నదని నేనూహించలేదు.

"అవుననుకుంటాను. భార్య గురించి ఆలోచించడానికి కాస్త వ్యవధి కావాలి".

"అవును. అది నెమ్మదిగా తలకెక్కే విషంలాంటిది. అది మన ప్రాణం తీస్తుందనేలోగా గొంతు దిగిపోతుంది"

"అయితే పెళ్ళంటే మీకిష్టంలేదా?"

"మీకు అడగడం తెలీలేదు. మీకు విషమంటే ఇష్టం లేదా అని అడగాలి. నేను మాట్లాడేది స్లోపాయిజన్ గురించి."

నేను అప్రతిభుతడనయాను. ఎదుటి వ్యక్తిలో ఆలోచనల్ని ఛేదించే అందమైన ఆయుధాలు మీరా దగ్గర ఉన్నాయి.

"నన్ను క్షమించాలి మీరు. సరిగ్గా మాట్లాడటమయినా చేతకాని మనుషుల మధ్య బ్రతకడం, పొగరుగా మాట్లాడ్డం అలవాటు చేసుకున్నాను. అదీగాక, మన తెలుగుదేశం సంస్కారం ప్రకారం ఆడపిల్ల ఏం మాట్లాడకూడదో నాకు తెలీదు మరి. నేను పెరిగింది ఇక్కడే" అంది.

మనం చెయ్యలేని పనిని, మనలో లేని గుణాన్ని ఇంకొకరితో చూడడాన్ని 'ఆకర్షణ' అంటారనుకుంటాను. ఆ విధంగా మీరా నన్ను ఆకర్షించింది. క్రమంగా పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచనకి మనస్సు ఒదిగిపోయింది. నాకూ ఆమెతో మాట్లాడటంతో ధైర్యం వచ్చింది.

"నేను పూరీ వెడుతున్నాను. ఈ పండా ఆశీర్వాదం ఫలించాలని జగన్నాధుడికి చెప్పుకుంటాను" అన్నాను.

ఇప్పుడామె ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

"అంటే - మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారన్న మాట"

ఏందుకు చేసుకోకూడదు? పెళ్ళిని సాంప్రదాయాల కళ్ళజోడుతో పరిశీలించే పెద్దలెవరూ బ్రతికిలేరు. అమ్మలేదు. నాన్నలేడు. 'పెళ్ళి' నా జీవితంలో కలకాలం నిలవడానికి చేసే స్నేహంలాంటిది. మీరు మంచి స్నేహితులు కాగలరని ఈ చిన్న వ్యవధిలోనే అనిపించింది."

అంత పెద్ద కళ్ళలో కదిలిన నీటితెరని ఆ మసక వెలుగు దాచలేకపోయింది. ఆ చిలిపి కళ్ళలో నీళ్ళు నేను ఊహించలేనిది.

"థాంక్స్" అంది మీరా. ఆమె చెయ్యి నా చేతిని బలంగా పట్టుకుంది. నేను వణుకుతున్నానని అప్పుడర్థమయింది - నేను తీసుకున్న నిర్ణయానికిగాని.. చలికి కాని.

"అదేమిటి అలా ఒణుకుతున్నారు? ఈ శాలువా కప్పుకోండి" అంది తన చుట్టూ ఉన్న శాలువా తీస్తూ.

"నోనో, మీకు అవసరం అది" అని ఆమె చెయ్యి పట్టుకు ఆపాను.

మీరా తియ్యగా నవ్వింది. "భార్య" అనే ఆలోచన మనిషి హృదయంలో మరో బలమయిన కాంప్లెక్సు అనుకుంటాను. ఆ ఆలోచనతో మీ పట్ల విపరీతమయిన పొసెసివ్‌నెస్ పెరుగుతోంది. ఇక మీకు చలివేస్తే నేను తట్టుకోలేను. ప్లీజ్" అంది.

ఏమిటీ మనిషి!

"అయితే ఇద్దరం కప్పుకుందాం" అన్నాను.

"సరే. జీవితాన్ని పంచుకునే ముందు శాలువని -" నవ్వి తన మీదకి మిగతా సగం శాలువాని లాక్కుంది.

ఇప్పుడు ఆమె శరీరం నాకు తగులుతోంది. సన్నటి ఆమె నడుం వెచ్చగా నా కుడిచేతికి ఆనుకుంది. ఆమెకి చాలా బలమయిన, పెద్ద రొమ్ములని అప్పుడర్థమయింది. నాకు తగులుతున్నాయని తెలుసు. అది నేను తెలుసుకున్నానని గ్రహించి నావేపు చూసి మెత్తగా నవ్వింది. ఈ అమ్మాయి ఆలోచన ఏ చర్యా దాటిపోలేదు!

ఇలా కూర్చున్న మరే సందర్భంలోనయినా రక్తం వేడెక్కి నరాలు వశం తప్పేవి. చెమటలు పట్టేవి. యౌవనం ఆకలిగొన్న సింహమయేది. కానీ ఆ క్షణంలో అలాంటిదేమీ జరగలేదు. అదేదో నాకు అతి సహజమయిన సందర్భంలాగ, భార్య అంతకన్న ఆత్మీయంగా భర్త సరసన ఎలా కూర్చుంటుంది? అనిపించింది. పసిపాపను పెట్టుకునే ముద్దుకీ, అమ్మాయి పెదవుల మీద ముద్దుకీ తేడా ఉంది.

"నా భర్తతో ఇలా ఆప్యాయంగా కూర్చుని ప్రయాణం చెయ్యాలని అనిపించేది. ఈ చలి ఈ రాత్రి ప్రయాణం ఆనందంగా లేదూ?" అంది. అది ప్రశ్నలాగా లేదు. తన మనస్సులో ఆలోచనని బహిరంగంగా మాటల్లో పేర్చినట్లుంది. నేనేం సమాధానం చెప్పలేదు.

రఘాకోల్ అడవిలోంచీ బస్సు వెళుతోంది. బస్సు శబ్దం తప్ప అంతా నిశ్శబ్దం. లైట్లు చెట్లమీద పడినప్పుడు పొడవు సరుగుడు చెట్ల వెనక దట్టమయిన చీకటి గుబురు కట్టుకుని ఉన్నట్టుండి ఎక్కడో తుపాకీ పేలింది. నేను తుళ్ళిపడ్డాను. నా భుజం పట్టుకు ఆపింది.

మరేం భయం లేదు ఆ చెట్ల మధ్య ఎవరో టపాకాయలపేలుస్తున్నారు" అంది.

"మీకెలా తెలుసు?"

"ఈ అడవిలో అక్కడక్కడా చిన్న చిన్న పల్లెలున్నాయి, ఎలుగులూ, అడవి దున్నలూ, ఏనుగులూ, నక్కలూ, అప్పుడప్పుడు పులులూ పల్లెల వేపు వస్తాయి. ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళు పల్లెటూరి వాళ్ళకి బాణాసంచా ఇస్తారు. జంతువుల అరుపులు వినిపించగానే టపాకాయలు పేలుస్తారు. ఆ శబ్దాలు విని దూరంగా పారిపోతాయి. అడవుల్లో బ్రతికే వీళ్ళకి ప్రతిరోజూ చావు బతుకులతో పోరాటం" జీవితాన్ని గురించి ఎంతో ఆలోచించిన వేదాంతిలాగా చీకట్లోకి చూస్తూ నవ్వింది. ఉన్నట్టుండి పండా గుర్రు ప్రారంభించాడు. ఆ రాత్రి నేను తీసుకున్న నిర్ణయాలవల్ల ననుకుంటాను, ఎందుకో పిరికితనమనిపించింది. నాకు తెలియకుండానే మీరా నడుం చుట్టూ చెయ్యివేసి గట్టిగా పట్టుకున్నాను. అలా ఎంత సేపు గడిచిందో తెలియలేదు.

"ఏమండీ" అంటూ చెవిలో మెత్తగా మీరా పిలిస్తే తెలివొచ్చింది. కళ్ళిప్పాను. బస్సు ఆగినట్లుంది. చుట్టూ 'టీ' దుకాణాలు.

"రఘాకోల్ వచ్చాం. కాస్త టీ తాగరూ?" అంది. చుట్టూ చూశాను. బస్సంతా ఖాళీగా ఉంది. ఆమె ఒళ్ళో తలపెట్టుకున్నానని అప్పుడర్థమయింది. సిగ్గుపడిపోయాను.

"నిద్రపోయినట్టున్నాను. సారీ! అన్నాను. మాట నోరు వెడలకముందే చేతితో నోరు మూసేసింది. "మీరలా పడుకుంటే నాకు చాలా తృప్తిగా ఉంది. మిమ్మల్ని లేపాలనిపించలేదు. అయినా తర్వాత ఆకలితో బాధపడతారేమోనని లేపాను. రండి" అంది లేస్తూ.

ఇద్దరం దిగాం.

"భర్త అపస్మారంలో ఉపయోగపడడానికి భార్యకి ఎంత అదృష్టం! థాంక్స్" అంది బస్సు దిగుతూంటే. ముందు ఉన్న తొందరపాటు, చొరవ ఏమయిందో, వైవాహిక జీవితాన్ని తనివితీరా రుచి చూసి తలమునకలయిన స్త్రీ మూర్తిలాగా కనిపించింది మీరా.

"ఏమిటలా చూస్తున్నారు?"

"ప్రతి స్త్రీ పుట్టుక నుంచీ వైవాహిక జీవితానికి సిద్ధపడుతుందనుకుంటాను. భార్య పాత్రని ఎంత సులువుగా స్వీకరిస్తున్నారు మీరు. "

"పదండి. ఇక్కడ మంచి రొట్టెలు దొరుకుతాయి. రండి" అంది చెయ్యి పట్టుకుని.

చిన్న పంచె కట్టుకున్న కుర్రాడు మిషన్‌లాగ చేతుల్తోనే అటూ ఇటూ తిప్పుతూ రొట్టెలు చేస్తున్నాడు. కాల్చడానికి పెనం ఏమీ లేదు. నేలకి సమంగా ఒక కుండని పాతేశారు. కుండ మధ్యలో నిప్పుసెగలు కక్కుతోంది. రొట్టెపిండిని వెడల్పుగా వేసి లోపల కుండ అంచులకి అంటిస్తున్నాడు. అయిదు నిమిషాల్లో నిప్పుసెగకి రొట్టె కాలుతోంది.

"శనగపప్పుతో మంచి పప్పు చేస్తారు. దీన్ని తడ్‌కా అంటారు. రొట్టెలకి మంచి ఉపహారం" అంటూ కుర్రాడికి ఒరియాలో తీసుకురమ్మని చెప్పింది.

పప్పు వేడిగా సెగలు కక్కుతోంది. నిజంగా చాలా రుచిగా ఉంది. మూడు రొట్టెలు కొన్నాను. టీ మనవేపు టీ లాగ ఉండదు. ఇక్కడ టీ ఒక్కొక్క చోట ఒక్కొక్క రుచి. కొందరు టీలో అల్లం వేస్తారు. ఇంకా శొంఠి, మిరియాలు, భంగ్ కూడా వేస్తారు. "తెల్లవారు ఝామున ప్రయాణీకులు, డ్రైవరు టీలో భంగ్ వేస్తే రుచిగా తాగుతారు. కాస్త హుషారుగా ఉంటుంది వాళ్ళకి" అంది మీరా.

ఆకలి చల్లార్చుకుని బస్సు ఎక్కాం. రథాల్‌కోల్ నుంచీ అంగూల్‌కి 80 కిలోమీటర్ల ప్రయాణం. చాలా భయంకరమయిన రోడ్డు. రోడ్డుకి రెండు పక్కలా తవ్వేశారు. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ మట్టి ఉందో తెలీదు. పైగా రోడ్డు గొయ్యి ఉందో తెలీదు. పైగా రోడ్డు మరమ్మత్తు జరిగే చోట దీపం ఉంచడానికి బదులు పెద్ద పెద్ద చెట్టు కొమ్మలు పడేశారు. అదో కొత్త ప్రమాదం.

ఒకరికొకరు విడాకులు ఇచ్చుకుందామని కృతనిశ్చయం చేసుకున్న భార్యాభర్తల్ని బస్సులో కూర్చోపెడితే ఆ రోడ్డు వాళ్ళని అంగూల్ చేరే లోపల ఏకం చేసేస్తుంది. ఇష్టం లేకపోయినా ఒకరి మీద ఒకరిని విసిరేస్తుంది. **భారతీయ కర్మ సిద్ధాంతాన్ని వంటబట్టించుకున్న రోడ్డు అది.**

ప్రతీ పది నిముషాలకీ నా చేతుల్లో ఉంటోంది మీరా. బస్సులో దీపాలన్నీ ఆర్పేశారు. ఈసారి కుదుపుతో నా ఒళ్ళోకి తూలి లేచే ప్రయత్నం చేయలేదు. పొడవు జుత్తు నాకాళ్ళని చుట్టుకుంది. నా చేతికి ఆమె పల్చటి ఊపిరి తాకుతోంది. కుడికాలు మీద శరీరం బరువంతా వాలింది. ఇది చాలా వింత అనుభవం. మీరా కూడా ఆ అనుభూతి పొందుతున్నట్టుంది.

"అబ్బ! చలి!" అని శాలువా తన తలమీంచి లాక్కుంది. నా ఒడిలో ఊదారంగు ముద్దలా కనిపించింది మీరా.

బొయిండాకు పది మైళ్ళు అవతల ఈ రోడ్డు అంతమవుతుంది. ఆ తర్వాత కాస్త శుభ్రమయిన రోడ్డు. మీరా లేచి కూర్చుంది. నా వేపు నవ్వుతూ చూసి చెదిరిపోయిన జుత్తును సరిచేసుకుంటూ "భార్యని వెదుక్కోవడమంటే ఎంత బరువో చూశారా?" అంది.

"ఆనందంగా భరిస్తున్నాను" అన్నాను.

నావేపు చూసి పకాలున నవ్వింది. ఈసారి నేను నోరు మూశాను. "పండా లేస్తాడు - ఈసారి పిల్లల పెళ్ళి గురించి దీవెనలు గుమ్మరిస్తూ" అన్నాను.

"ఊహించుకున్న భర్త దొరకాలని ఆడపిల్లలు పూజలు చేస్తారు, తెలుసా? అంది చీకట్లోకి చూస్తూ.

కాసేపాగి అడిగాను. "మీ ఊహ ఏమిటో తెలియకుండానే మీకు భర్త దొరికేశాడు. వెళ్ళగానే మీ అమ్మతో చెప్తారా?"

పరాకుగా ఉన్నట్టుంది. చాలా సేపటికి ఇటు తిరిగింది. "ఊ?" అంటూ.

మళ్ళీ అడిగాను.

"చెప్పాలిగా మరి. మా అమ్మ సంతోషిస్తుంది. ఈపాటి ఆనందాన్ని ఈ మధ్య అమ్మ అనుభవించి ఉండదు." - ఆ గొంతులో చిలిపితనం, చొరవ వెనక కాస్తపాటి దిగులు ద్యోతకమయింది.

ఆ తర్వాత మా పెళ్ళి, తర్వాతి జీవితాన్ని గురించి 30మైళ్ళు చర్చించుకున్నాం. మా పెళ్ళి డిసెంబరులోనే జరిగిపోవాలి. నేను మా కంపెనీ తరపున బరంపురంలో ఉండిపోయేటట్టు ఏర్పాటు చేసుకుంటాను. నా కాంపులన్నీ ఇద్దరం కలిసే తిరుగుతాం పిల్లలు పుట్టేవరకు. పిల్లలు? కుటుంబ నియంత్రణ గురించి కాస్సేపు తర్జన భర్జన పడ్డాం. మీరా తొందరగా కావాలంటుంది. ఆ తర్వాత కావాలంటే నియంత్రణ. చివరికి నేనే రాజీ పడ్డాను. మాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి అయినా ఫరవాలేదు. ముగ్గురూ అమ్మాయిలే పుడితే? ఆపరేషన్! **మీరా జీవితంలో అవి అపురూపమయిన కోరికలు. భర్త ఒడిలో తలపెట్టుకుని నిద్రపోవడం, మల్లెపువ్వులు పెట్టుకోవడం, వెన్నెల్లో భర్త తనని ఒళ్ళో పెట్టుకు పడుకోవటం, వెన్నెట్లో భర్త కాళ్ళ మీద తల పెట్టుకుని నేలమీద కూర్చోవడం, ఇవన్నీ మధ్య తరగతి కలలు.** నా అంతస్తు చాలు వీటిని తీర్చడానికి. మీరా ఆలోచనలు పంచుకున్నాక మేమిద్దరం చాలా అనుకూలమంతమైన భార్యాభర్తలు కాగలమని నిశ్చయం చేసుకున్నాను.

బస్సేదో చిన్నపల్లె మధ్య నుంచీ వెళుతోంది. పది పన్నెండు దీపాలు వెలుగుతున్నాయి. లైటు వెలుగులో 'రంఢోలీ' అనే అక్షరాలు కనిపించాయి. మీరా కూడా గమనించినటుంది. నా వేపు తిరిగి "ఇది చూశారా ఎంత చిన్న ఊరో! ఒకప్పుడు ఈ చిన్న ఊరు దేశాన్నంతటినీ ఆకర్షించింది" అంది.

"ఎలా?"

"1975 లో ననుకుంటాను. ఇక్కడ గొర్రెల కాపరి కొడుకు - పదేళ్ళ కొడుకు హఠాత్తుగా మహానుభావుడయి పోయాడు. ఎవరికో ఏదో రోగం వస్తే ఏదో చెట్టు వేరు ఇచ్చాడట. అది వాడాక రోగం తగ్గింది. మరొకడు వచ్చాడు. అతనూ బాగయ్యాడు. అంతే. కార్చిచ్చయి ఆ వార్త వ్యాపించింది. మన దేశంలో మిస్టరీకి ఇచ్చే విలువ వాస్తవానికి ఇవ్వం. ఊరట కలిగించిన వ్యాపారస్తులు ప్రచారాన్ని పెద్ద ఎత్తున జరిపారు. ఆ కుర్రాడిని "రంఢోలీ నేపాలీ బాబా" అన్నారు. అన్నట్టు పక్కనే కాకుండా మద్రాసు, ఢిల్లీ, బొంబాయి, కలకత్తా అతని కీర్తి పాకింది. వేల కొద్దీ మూలికలు ఇస్తున్నారు బాబాగారు వచ్చినవారందరికీ. జబ్బులు ఉన్నవాళ్ళు లేనివాళ్ళు తీసుకుంటున్నారు. దేశంలో అన్ని మూలల్నుంచీ లక్షలాది మంది విమానాల్లో, కారుల్లో, రైళ్ళలో కటకం రావడం, ఆ రోజుల్లో దాదాపు 300 ఖర్చు పెట్టి టాక్సీల్లో రంఢోలీ చేరడం, బాబా దర్శనానికి. ఉన్నట్టుండి రంఢోలీకి దేశఖ్యాతి వచ్చేసింది. ఫలితం రోగాలు ఎలా తగ్గాయో తెలీదు కానీ ఈ పల్లెలోకి ప్రాముఖ్యత ఏర్పడింది. అతి త్వరలో కలరా వ్యాపించింది. ఆ రోజుల్లో కేవలం కటకం రైల్వే ప్లాట్‌ఫారం మీద ఎలకల్లాగా కలరాతో ఎంతో మంది చచ్చిపోయారని చెప్పుకుంటారు. ఆ కలరా కూడా బాబా కీర్తిలాగే దేశమంతా వ్యాపించింది. అప్పటికి ప్రభుత్వం కన్ను తెరిచింది. మొదట బాబాని నిర్భంధంలోకి తీసుకున్నారు. ఇకముందు మందులూ గట్రా ఇస్తే మర్యాద దక్కదని బెదిరించారు. వైద్యం ఆగిపోయింది. తగ్గే రోగాలకి సరే, వచ్చే కొత్త వ్యాధికి భయపడి క్రమంగా బాబా భక్తులు రావడం మానేశారు. ఎంత త్వరగా బాబాగారి కీర్తి వ్యాపించిందో అంత త్వరగానే సమసిపోయింది. ఇప్పటికీ ఆ రంఢోలో బాబా బ్రతికే ఉన్నాడు. గొర్రెలు కాసుకుంటున్నాడేమో. ఒకరోజు ఒక వెలుగు వెలిగిన ఈ 'రంఢోలి' అజ్ఞాతంలో చీకటిలో మరో బ్రతుకు బతుకుతోంది"

క థ పూర్తయ్యేసరికి అంగూల్ వచ్చేసింది.

రెండు సర్దార్‌జీ 'టీ' దుకాణాలు, చీకట్లో కదిలే పది ఎడ్లబండ్లూ, నిద్రపోతున్న ఒరియా ముఖాలూ, పెట్రోలు వాసనా, అరిగిపోయిన 'ఆవారా' సినిమా పాట, విరిగిన కాలుతో కుంటుతూ బస్సు స్టాండంతా పర్యటిస్తున్న కుక్కపిల్లా, గుండ పాన్ వాసనా, 'రూర్కేలా ఎక్స్‌ప్రెస్' పెన్నుల పరపతిని వర్ణిస్తూ హిందీలో కేకలు వేసే ఒరియా గొంతు, ఒక పెట్రోమాక్స్ లైటూ, కిళ్ళీతో గారెక్కి, ఊడిపోయిన రెండు పళ్ళు మినహా మిగతా పళ్ళతో చిరునవ్వు నవ్వుతూ "గొట్టాయ్ టొంకా"కి తన శీలాన్ని అమ్ముకోడానికి సిద్ధంగా ఉన్న ఒక అమ్మాయి - అదీ అంగూర్.

పెట్రోమాక్స్ దీపం ఉన్న టీ దుకాణం దగ్గరికి నడవబోతుంటే దూరంగా ఉన్న టీ దుకాణం వేపుకి మళ్ళించింది మీరా.

"అటు ఎవరూ లేరు. తీరిగ్గా మన కోసమే 'టీ' చేసి ఇస్తాడు పదండి" అంటూ.

ఆ మూలన టీ దుకాణంలో దీపం పడిన మేర తప్ప అంతా చీకటే. నా చేతి మెలికలో చెయ్యి తిప్పి నాతో నడుస్తోంది మీరా. ప్రయాణీకులు ఈ పాటికి మా బాంధవ్యం రూఢి చేసుకున్నట్టున్నారు. మా వేపు చూడ్డం మానేశారు. అదీగాక నిద్ర వాళ్ళ ఆసక్తిని జయించింది. టీ బాగానే చేశాడు. మేం ప్రత్యేకంగా వాడిని వెదుక్కుంటూ వచ్చామని ప్రత్యేకంగా అల్లం ఎక్కువ వేశాడు. లేకపోతే మరికాస్త బాగుండేదనిపించింది. రెండు పళ్ళులేని ఒరియా అమ్మాయి టీ బడ్డీ నీడలో నిలబడి మమ్మల్నే అబ్బురంగా చూస్తోంది. **జీవితంలో బ్రతకాలని తను పవిత్రంగా కన్న కలని గుర్తు చేసుకుంటోందిగావును. లేదా ఆ కల గుర్తు రాకుండా మనస్సుని బిగపడుతోందో.**

టీ ముగించి డబ్బులిచ్చి వెనక్కి కదిలాను. కొట్టుదాటి నాలుగు అడుగులు వెయ్యగానే ఎవరో వెనకనుంచీ లాగినట్టనిపించింది. ఆలోచనలింకా ఒరియా అమ్మాయి వేపే ఉన్నాయేమో తుళ్ళిపడ్డాను. ఆ క్షణంలో మీరాని కాసేపు మరచిపోయాను. ఆ చీకట్లో నాజూకయిన ఒళ్ళు స్పర్శ తెలియగానే మీరాని గుర్తుపట్టాను. ఒరియా అమ్మాయి పెట్రోమాక్స్ దీపం నీడలో తచ్చాడుతోంది.

"ఇష్! ఇటు" అంది మీరా.

నాకు ఆమె చర్యకి ఆశ్చర్యం వేసింది. నా భుజం మీద పడిన ఆమె వేళ్ళు వణుకుతున్నాయి.

"మీరా? ఏమిటది?"

చీకట్లో నాకర్థమయ్యేలాగ నవ్వింది. "కోరిక..! వాళ్ళందరికీ తెలియని రహస్యం మనిద్దరి మధ్య ఉన్నదని గర్వపడ్డడానికి గుర్తు"

ఇంకా అర్థం కాలేదు.

"మొపాసా చదవలేదూ?"

చీకట్లో మొపాసా గుర్తు రావడంలేదు. ఆమె చేతిని పట్టుకోబోతుంటే తగిలిన బలమైన రొమ్ములు గుర్తుకొచ్చాయి.

"ముద్దు పెట్టుకోరూ!" అంది.

ఒక క్షణం దిమ్మరపోయాను.

ఆ చీకటి రాత్రిలో అటుపక్క ఒక చిన్న ప్రపంచం 'టీ' సేవిస్తూండడం ఇక్కడ నన్ను తన కౌగిట్లోకి తీసుకుని ముద్దు కావాలని సూటిగా అడిగే అమ్మాయి – ఏమయినా విచక్షణకి వ్యవధి లేని క్షణమది.

నా చేతులు అప్పుడే స్వాధీనం తప్పాయి. మనస్సూ క్రమంగా వశం తప్పింది. మంచులాంటి చల్లటి గాలి క్రమంగా మా శరీరాల మధ్య నలిగి, వేడెక్కి మెల్లిగా శలవు తీసుకుంది. శరీరాలు ఎక్కడా దూరం లేకుండా ఏకమయ్యాయి. మంచుకి గట్టిపడిన ఆమె చల్లటి పెదాలు నలిగి, మెత్తబడి, వేడెక్కి, వణకడం ప్రారంభించాయి. **అగ్నిహోత్రంలాంటి కౌగిలి అది.** ఆమె బలమయిన రొమ్ములు నా గుండెల్ని దొలిచేస్తున్నాయి. నా వీపు మీద ఆమె చేతులు బలంగా బిగుసుకుని ఆధారాన్ని వెదుక్కుంటున్నాయి. మా ఇద్దరి మధ్యా నా కళ్ళజోడు నలిగిపోతోంది. అది ప్రయత్నం మీద తనే తీసేసింది. కాస్సేపటికి ఆమె ఏడుస్తోందని తెలుసుకున్నాను. ఊపిరి సలపని ఆనందానికి పరాకాష్ట దుఃఖమేమో! నాకు భయమేసింది. అయినా ఆ ఉద్రేకానికి ప్రోత్సాహం ఆమెది. భయం భయంగా "మీరా!" అన్నాను.

మెల్లిగా చేతుల్ని విడిపించుకుంది. చీకట్లో నా పెదాల దగ్గర్నుంచీ ముఖమంతా తడిమి కళ్ళజోడు పెట్టింది. తన చిన్న రుమాలుతో నా ఎంగిలి పెదవుల్ని తుడిచింది. మళ్ళీ మెత్తగా కావలించుకుని రహస్యంగా చెవిలో

"థాంక్యూ! థాంక్యూ!" అంది.

ఇద్దరం వెలుగులోకి వచ్చేసరికి సూర్యుని మొదటి కిరణాలకు స్వచ్ఛంగా మెరిసే గడ్డిపువ్వులాగా ఉంది. ముఖంలో ఏమీ ఉద్రేకం కనిపించలేదు – కళ్ళకొనల్లో నా వేపు చూసేటప్పుడు చిలిపి ఆనందం తప్పిస్తే. ఆ చీకటి అనుభవానికి ఆమె ముఖంలో గుర్తేమీ లేదు. ఇందాకటి ఆమె ఉద్రేకానికీ, ఇప్పటి సంయమనానికి ఆశ్చర్యపోయాను.

డ్రైవరు మా కోసమే హారను మోగిస్తున్నాడు. అందరూ మా వేపే చూస్తున్నారు.

"చూశారా! వీళ్ళంతా మనమేదో తప్పు చేసినట్లు చూస్తున్నారు. మనం నిజంగా ఏదో చేశామని వీళ్ళకు తెలీదు. అదే మన గర్వం" అంటూ సీటులో కూర్చుంది.

ఈసారి కావాలని తన నడుంచుట్టూ నా చేతిని తిప్పుకుంది. చాలాసేపు మాట్లాడకుండా చీకట్లోకి చూస్తూ కూర్చుంది. ఉన్నట్టుండి నా వేపు తిరిగి అంది.

"మీరు మీ భార్యని చాలా బాగా ప్రేమించగలరు" నేను ఆశ్చర్యపోయాను.

"మీకెలా తెలుసు?"

"ఈ కింది పెదవిని చూడండి. ఇంకా రక్తం చిమ్ముతోంది" అని నవ్వింది.

నేను సిగ్గుపడిపోయాను. నా స్థితిని గుర్తించిన దానిలాగా నా చేతిని నడుంకి మరింత దగ్గరగా లాక్కుంది. ఆమె కుడిరొమ్ము నా చేతిలో ఉంది. ఉద్రేకంతో ఒక్కసారి ఊగిపోయాను.

"భార్యభర్తల సంసారిక జీవితంలో ఇలాంటి ప్రయాణాలు ఎప్పుడో కలిసి వస్తాయి కదూ?" అంది.

నేనేం మాట్లాడలేదు.

"బాగుందా?" అనడిగింది ఉన్నట్టుండి.

చెయ్యి వదిలేశాను.

ఆమె కళ్ళ కొనలతో నవ్వి "నేనడిగింది ముద్దు సంగతి"

నాకు నవ్వొచ్చింది - "ఇంకా నా కుడి చెంప రక్తం చిమ్ముతూనే ఉంది" అన్నాను. చీకట్లో ఆప్యాయంగా చెంప తడిమింది. నా చెయ్యి మళ్ళీ బిగుసుకుంది.

అంగూర్ వచ్చిన డ్రైవరు గుర్రు తీస్తున్నాడు. కొత్త డ్రైవరు నడుపుతున్నాడు బస్సు కూడా బద్ధకం వదిలి చీకట్లో పరుగులు తీస్తోంది. **ఉన్నట్టుండి నా ఆలోచనలు హఠాత్తుగా భయంకరమైన మలుపు తిరిగాయి.**

ఎలాగో చెప్తాను. మీరాతో పవిత్రమయిన బాంధవ్యాన్ని ఊహించుకున్నంతవరకు, ముందు జీవితంలో మాదని చెప్పుకునే ఇల్లు, భార్యతో సినిమాకి వెళ్ళే ఘట్టాలు, వెన్నెల రాత్రి మీరా కట్టుకునే పట్టు చీరె, ఆమె మెడలో కట్టే మంగళ సూత్రం, పెళ్ళి పందిరి ఇవన్నీ కదిలాయి. కానీ అంగూల్ చీకట్లో అడగని ముద్దు, మంచురాత్రిలో కోరికల్ని జివ్వున లేపే కౌగిలింత, మీరా గుండె మీద ఆనుకున్న కుడి చెయ్యి, ఆలోచనల్ని మరొక వేపు పరుగులెత్తించాయి. అందమయిన ఆలోచనల్ని జోకొట్టి తాత్కాలికమయిన ఉద్రేకాన్ని మేలు కొలిపాయి. **పవిత్రమైన ఆలోచనలు మేఘాల్లో విహరించే హంసల్లాంటివి. ఉద్రేకాల చుట్టూ వయసు ఎదుర్కొనే ఆలోచనలు విచిత్రమయినవి. అవి భూమికి అతి దగ్గరగా ఎగిరే కాకుల్లాంటివి.**

అతి సులువుగా, అనలోచితంగా నా కౌగిట్లో ఒదిగిపోయిన ఈ మీరా నా జీవితంలో వహించనున్న పాత్రకి అర్హురాలేనా? ఒక రాత్రి ప్రయాణంలో, కొన్ని గంటల స్నేహంతో సంపాదించుకోగలిగిన ఈ సాన్నిహిత్యం శాశ్వతంగా నిలుపుకోగలిగిందేనా? ఇది ఈమె స్వభావమేమో! ఇలాంటి అనుభవాలు ఈమెకు చాలా ఉన్నాయేమో! అతి సులువుగా సంపాదించుకున్న ఈ అనుభవాలకి మనస్సు పెద్ద విలువల్ని కట్టదు. ఆలోచించిన కొద్దీ మీరా నా మనస్సులో నిర్మించుకున్న స్థాయినుంచీ జారిపోతోంది. అపురూపమయిన అనుభూతి స్థాయి నుంచీ అశాశ్వతమయిన అనుభవం స్థాయికి ఆ చీకటి రాత్రి జారిపోతోంది.

మీరా నా భుజం మీద నిద్రపోతోంది. బస్సు కుదుపికి లేచి "అబ్బ! చలివేస్తోంది. నన్ను మరీ దగ్గరగా లాక్కొండి" అంది, లాక్కున్నాను. ప్రేమ వివాహానికి విడాకులిచ్చి నా మనస్సు కోరిక, అనుభవాన్ని గురించి ఆలోచిస్తుంది. ఆమెని భువనేశ్వర్ తీసుకుపోవాలి. అక్కడ మంచి హోటళ్ళునాయో లేదో! రెండు రోజులు కలిసి ఉంటే చాలు. ఆ తరువాత విడిపోయినా ఫరవాలేదు. నేనూహించినంత సుఖాన్ని మీరా ఇవ్వగలదని ఆ కౌగిలి సాక్ష్యం చెప్పింది. శాలువా ఇద్దరి మీదకి లాగి - ఈ సారి రెండో చేతిని ఆమె రొమ్ము మీదకి పోనిచ్చాను. గుండెల మీద వెచ్చదనానికి ఆమెకి తెలివొచ్చింది. పెదాల మీద సన్నటి చిరునవ్వు తెలిసింది.

"రసికులే మీరు!" అంది మెల్లగా.

ఆ నవ్వుతో మిగతా ఆలోచనలన్నీ చెదిరిపోయాయి. మీరా శరీరం నాక్కావాలి. ఈ అనుభవం చాలు. "పెళ్ళి" - అవును అది వేరే విషయం. ఇలా నా మనస్సుని నచ్చ చెప్పుకున్నాను.

డెంకనాల్ దాటి కుంతలీ దగ్గర డ్రైవర్‌తో పాటు కొంత మంది టీ దుకాణానికి దిగారు. కానీ నా చేతులు తియ్యాల్సి వస్తుందేమోనని భయపడి బస్సు దిగలేదు. ఆమె నాజూకయిన పెదవుల్ని ముద్దుపెట్టుకోవాలని పదేపదే అనిపించింది. ఇంకా కొద్ది సేపట్లోనే తెల్లవారుతుంది. భువనేశ్వర్ చేరగానే 'రాజమహల్' చేరుకుంటాం.

ఆ తర్వాత... ఆ తర్వాత మళ్ళీ చీకటిలాంటి కోరిక....

చౌద్వార్ లైట్లలో కళ్ళిప్పింది మీరా. చుట్టూ చూసి - "చాలా దూరం వచ్చేశామే!" అంది.

నా ఆలోచనలు వంకర తిరగగానే నా గొంతులో ఇదివరకటి బలం పోయింది. వణకడం గమనించి "వణుకుతున్నారేం?" అంది.

"చలి చలి" - అన్నాను **కోరికతో మలినమయిన నవ్వు నవ్వుతూ.**

"ఇంక అయిదారు మైళ్ళలో కటకం వచ్చేస్తుంది" అంది.

కటకం దగ్గరవుతుందనగానే ఆమె కంఠంలో దిగులు గమనించాను. "వస్తే రానీ, నాతో భువనేశ్వర్ వస్తున్నావు నువ్వు" అన్నాను ధైర్యంగా.

అదే మొదటిసారి `నువ్వు` అనడం - ఆశ్చర్యపోయింది. నా కంఠంలో నిశ్చయానికి. "ఎందుకు?"

సమాధానం చెప్పలేక ఆమె శరీరాన్ని గట్టిగా దగ్గరకి లాక్కున్నాను. అంతవరకు తనకు తెలియని విషయమేదో శరీరానికి జరిగినట్లు ఆశ్చర్యంగా చూసి తనని విడిపించుకుంది. జాకెట్టునీ, చీరని సవరించుకుని శాలువా కప్పుకుంది. చారలు చారలుగా మెరుస్తూ చౌద్వార్ వెలుగుల్ని చూస్తూ కూర్చుంది.

"నేను కటకంలో దిగాలి" అంది.

"సరే. అయితే నేనూ దిగుతాను"

"ఎందుకు?"

ఎందుకా? ఎలా చెప్పాలి "రాత్రి మనం మాట్లాడుకున్న విషయాన్ని మీ అమ్మతో మాట్లాడటానికి" ఆమె ఆశ్చర్యంగా నావేపు చూసింది.

"పెళ్ళి గురించి" అనలేక అనలేక అన్నాను.

మీరా నవ్వింది. జుజుమురా చీకటి తెల్లబోయే నవ్వు కాదు అది - చౌద్వార్ వెలుగు సిగ్గుపడే నవ్వు. ఆ నవ్వులో సందేహం ఉంది, సంకోచం ఉంది.

"వద్దు నా మాట వినండి. మళ్ళీ మనం కలుస్తాంగా?"

"ఎప్పుడు? ఎక్కడ?"

ఆ ప్రశ్న వినిపించనట్టు కిటికీ వేపు తలతిప్పుకొనే కూర్చుని ఉంది. ఆ ప్రశ్నకు సమాధానం వెదుక్కునేలోగానే కటకం వచ్చేసింది. చిన్న చిన్న ఇళ్ళు కూరుకుపోయినట్టుగా, హఠాత్తుగా, వీధులు మలుపులు తిరుగుతూ, ఒక పద్ధతి మరచిపోయి, దానంతటదే పెరిగిన జలచరంలాగ ఉంది కటకం. ఊరింకా నిద్రలేవలేదు.. నా పక్కన మీరా కదులుతోంది.

"నిన్ను దిగనివ్వను" అన్నాను. చేజిక్కిన అవకాశాన్ని వదులుకోవడం ఇష్టంలేని అవకాశవాదినయాను. రాత్రి కలబోసిన ఉద్రేకాలకు ఆటవిడుపు లేనిదే నిద్రపట్టదు.

మీరా జాలిగా నా వేపు చూసింది. "నిన్ను వదిలి పెట్టను అనే వ్యక్తిని చూసి భార్య ఎంత గర్వపడుతుందో తెలుసా?" అంది నవ్వుతూ.

హఠాత్తుగా చెయ్యి వదిలేశాను. ఆ బాంధవ్యం ఎందుకో ఇప్పుడిహ గుర్తు చేసుకోవడానికే రుచించడంలేదు.

ఒక్క కుదుపుతో మరిచిపోయిన గమ్యస్థానంలో ఆగినట్టు దూకి ఆగింది బస్సు మీరా లేచింది. సగం కోపంగా, సగం అసహనంగా "మీరా?" అన్నాను.

నా వేపు జాలిగా చూసింది, ఆ కళ్ళలో కన్నీరుంది. "బాగుంది....చాలా సేపయి కూర్చున్నాం. కిందకు దిగనివ్వరా?" అంది.

ఇద్దరం దిగాం. "ఏమిటి నీ ఉద్దేశం? రాత్రంతా ఆలోచనల్తో రెచ్చగొట్టి ఇప్పుడు హఠాత్తుగా మాయమవుతావా?"

మీరా మాట్లాడలేదు.

దిగే ప్రయాణీకులంతా హడావుడిలో పడ్డారు. సగంపైగా బస్సు ఇక్కడే ఖాళీ అయిపోతుంది.

"ఇక్కడ అరగంట పైగా ఆగుతుంది. అలా నడుద్దాం పదండి" అంది చెయ్యి పట్టుకుని. మాట్లాడకుండా నడిచాను.

కటకం ఇంకా నిద్రపోతూనే ఉంది. ఆనాటి మా నడకకి సాక్ష్యం ఉదయం చల్లగాలి, ఇంకా మిణుకు మిణుకు మంటున్న మున్సిపాలిటీ దీపాలు.

"ఇప్పుడు చెప్పు" అన్నాక నాలుగడుగులేశాను.

"నేను మీతో రాలేను. నన్ను క్షమించండి" అంది. ఆమె చెయ్యి అనుకోకుండా నా చేతిని గట్టిగా పట్టుకుంది.

నాకు కోపం ముంచుకొచ్చింది.

"నా మీద అప్పుడే అంత హక్కును పెంచుకున్నారా? మిమ్మల్ని చూస్తూంటే నా కెంతో గర్వంగా ఉంది"

"నన్ను ఆటపట్టించడానికి ఈ నాటకం ఆడానా? అయితే నీ స్వభావం..." తర్వాత నన్ను మాట్లాడనివ్వకుండా నోరు మూసింది.

**"అవును. నాటకం ఆడాను. కానీ మిమ్మల్ని ఆట పట్టించడానికి కాదు. ఒక అపురూపమయిన అనుభవాన్ని సంపాదించుకోడానికి. మిమ్మల్ని మనసారా క్షమాపణ కోరడానికే ఇప్పుడు నడిపిస్తున్నాను. కారణం అడక్కుండా నన్ను క్షమించి మరిచిపోగలరా?"**

"నీకు పిచ్చెక్కిందా ఏమిటీ? ఇంత జరిగాక నిన్ను వదిలిపెడతాననుకున్నావా? - నువ్వు..."

"నాకూ మిమ్మల్ని వదిలి పోవాలని లేదు. చిన్నతనంలో, కాస్త వచ్చిన రోజుల్లో చెట్టాపట్టాలేసుకు నడిచే భార్యాభర్తలని చూస్తూ - ఇలాగా నా రోజులు గడవాలనుకునేదాన్ని. నాకు కారుల్లో తిరగాలని, బంగ్లాల్లో బ్రతకాలనే కోరికలుండేవి కావు. అందరూ తిరిగే ఈ కటకం రోడ్డు మీద ఓ ఉదయం నా భర్తతో ఇలా తిరగాలనుకోవడం పగటి కలకాదుగా?"

"ఇప్పుడు తీరుతోంది కదా?"

"అవును. మీరే నాకా అదృష్టాన్నిచ్చారు. జీవితంలో కనీసం భర్త సరసన ఒక్క రాత్రయినా ఇలా గడపాలనుకున్నాను. ఆ అదృష్టాన్ని మీరు కలిపించారు. మీకు చలివేస్తే దుప్పటి కప్పాను. మీ తలని ఒడిలో పెట్టుకుని మీ నిద్ర చెడిపోతుందని భద్రంగా కూర్చున్నాను. చలి వేస్తుందంటే మీరు నా భుజం చుట్టూ చేయివేసి దగ్గరికి తీసుకున్నారు. ఇద్దరం కొన్ని గంటలసేపు భవిష్యత్తును గురించి కలలు కన్నాం. మన సంసారం గురించి, పిల్లల గురించి తగాదా పడ్డాం. రాజీకి వచ్చాం. కలిసి భోజనం చేశాం. మీ కళ్ళు చూసి, మీ ఆకలిని గుర్తుపట్టి ఆయాచితంగా మిమ్మల్ని దగ్గరికి లాక్కుని ముద్దిచ్చాను. ఆనందంగా మిమ్మల్ని కౌగిట్లోకి తీసుకున్నాను. ఒంటరి క్షణాల్లో ఇద్దరం ఆ అనుభవం గురించి సిగ్గుపడుతూ కబుర్లు చెప్పుకున్నాం. మీ అండ నాకున్నదనుకుంటూ మీ సరసన ధైర్యంగా నిద్రపోయాను. ఇదంతా భార్యా భర్తల సహచర్యంతో పొందే అపురూపమైన ఆనందం **- నా జీవితానికి ఈ ఒక్కరాత్రి చాలు"**

ఆ మాటల్తో నాలోని స్వార్థమంతా పటాపంచలయిపోయింది. నేను మళ్ళీ పాత మనిషయి పోయాను. అంగూల్ దాటాక నా ఆలోచనలన్నీ తప్పు. ఈ మీరా నాక్కావాలి.

"కాని మీరా! ఈ ఒక్క రాత్రి ఏం ఖర్మ. మన మధ్య ఇలాంటి రాత్రులు ఎన్నో ఉంటాయి. జీవితమంతా నేను నీతో ఉంటాను."

"అవును ఉండే మనస్సు మీకుంది. కానీ ఉంచుకునే అదృష్టం నాకు లేదు. మనం ఇంకో క్షణంలో విడిపోవాలి."

ఆమె గొంతు క్రమంగా గాద్గదికమయింది.

"ఎందుకని? ఎందుకని? చెప్పు" అన్నాను ఆవేశంగా.

"కారణం చెప్పను. చెప్పలేను"

"చెప్పి తీరాలి" ఇంకా మీరా మాట్లాడలేదు. ఆమె దారికి అడ్డు నిలిచి వంచిన ఆమె ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాను. "మీరా - నాతో చెప్పవా?"

నా బుజ్జగింపుకి కరిగిపోయింది మీరా. నా చేతుల్లో మొదటిసారిగా భోరుమంది.

"మీతో రెండు మూడు అబద్ధాలు చెప్పాను. నాకు నా అనేవారెవరూ లేరు. నాకు లంగ్ కాన్సర్. అది తెలిశాక ఇటీవలే మా అమ్మ చచ్చిపోయింది"

మున్సిపాలిటీ దీపాలు గుప్పుమని ఆరిపోయాయి. తలమీద ఎవరో బలంగా మోదినట్టయింది.

"మీరా!" అని అరిచాను.

"ఇష్! మెల్లగా! ఎవరయినా వింటారు" అంది - భర్త చిలిపిదనానికి అదిలించే భార్యలాగ.

"ఇది నాకు ముందే ఎందుకు చెప్పలేదు?"

మీరా నవ్వింది. "చెప్తే ఏం చేసేవారు. చెప్తే ఈ రాత్రి కూడా నా జీవితానికి కరువయేది. ఇప్పుడు కనీసం ఒక రాత్రయినా నా జీవిత భాగస్వామిని ఎంచుకన్నాను. వైవాహిక జీవితాన్ని ఒక్కసారయినా రుచి చూశాను. రేపే నాకు ఆపరేషన్. ఆ తర్వాత ఏమవుతుందో నాకు తెలుసు. ఇప్పుడిక ఏమయినా ఫరవాలేదు."

దుఃఖంతో, బాధతో, నిస్సహాయతతో నా గొంతు పెగలలేదు. ఈ వ్యక్తిని శాశ్వతంగా నాకు మిగల్చుకునే మార్గం ఉన్నదా అని ఆ స్వల్ప వ్యవధిలో మనసు ఆరాటపడుతోంది.

"ఈ నిజాన్ని మీ నుంచి దాచి ఉంచినందుకు నన్ను ఎప్పుడూ అసహ్యించుకోకండి. రేపు పెళ్ళయిగాక, మీభార్యతో గడిపే ఒంటరి క్షణాల్లో మరొక అమ్మాయి కూడా మిమ్మల్ని అంతే అభిమానంగా కావలించుకున్న విషయాన్ని గుర్తుచేసుకోండి. అప్పుడయినా నన్ను క్షమిస్తారు - నాకు తెలుసు"

"కానీ మీరా! మీరా! ఇది ఘోరం"

"అవును. కానీ దానికి ఎవరూ బాధ్యులు కాదు. నా గురించి ఎక్కువ ఆలోచించకండి. ఆలోచించినా ఏమీ చెయ్యలేరు"

"నేనిక్కడే ఆగిపోతాను. నీ ఆపరేషను అయేవరకు ఉంటాను".

ఆమె తుళ్ళిపడింది. "వద్దు. వీల్లేదు - మీరు వెళ్ళాలి. ఇప్పుడే, ఈ బస్సులోనే వెళ్ళాలి."

"మీరా! నా మాట విను. నీ... నీ... భర్తగా ఈ కష్టంలో ఆదుకునే హక్కునాకుంది"

ఆమాటకి ఆమె ముఖం మరింత ఆర్ద్రమయింది. నా పట్ల ఆమెకి వెర్రి అభిమానం ముంచుకు వచ్చింది. నా చెయ్యి గట్టిగా పట్టుకుని "చాలు. ఆ ఆలోచన చాలు నాకు. మీతో అందమయిన అనుభవాన్ని పంచుకున్నాను. కానీ ఈ పీడకలని పంచుకోడం ఇష్టం లేదు. ఈ మీరా మీకు చాలా ఆనందంగానే గుర్తురావాలి. పెద్ద శాపంలాగ కాదు. ప్లీజ్. ఇది నా ... కాదు - మీ భార్య కోరిక."

సెంటిమెంటుకి ఎంత బలం ఉందో ఆ క్షణాల్లో అర్ధమయింది నాకు. ఇద్దరం కళ్ళనీళ్ళు కారుస్తూనే ఉన్నాం. క్రమంగా దూరపు ఆకాశం తెల్లబడుతోంది. మాకు తెలియకుండానే వెనక్కి తిరిగాం. బస్సులోంచీ ప్రయాణీకులంతా దిగిపోయారు.

"ఈ టీ కొట్టులో మంచి టీ దొరుకుతుంది. రండి. రాత్రి మీకు బాగా నిద్రలేదు. కాస్త ప్రశాంతంగా ఉంటుంది"

ఆమె చేయి అందించిన 'టీ'ని యాంత్రికంగా తాగాను. నేనలాగే నిలబడి ఉంటే నా జేబులోంచి పర్సు తీసి డబ్బు చెల్లించింది.

బస్సు దగ్గర్కికి వస్తూంటే ఒక్క సారి ఆపి "మీ మనస్సులో ఏ చెడు ఆలోచనతోనూ నా పేరు కలవడం ఇష్టం లేదు. ఈ మీరా ఏదో కుంటిసాకు చెప్పి తప్పించుకుని ఉంటుందని మీకు అనిపించవచ్చు. ఏం అలా అనిపిస్తోందా?" అంత దుఃఖంలోనూ లేని నవ్వు తెచ్చి పెట్టుకుని చూస్తోంది.

నా మనస్సు మొద్దుబారి పోయింది. ఆమె ముఖం చూసి ఆమె అబద్ధం చెపుతోందని అనుకోలేదు. కానీ మనస్సు నిప్పు తొక్కిన కోతిలాంటిది. ఏ బలహీనపు స్థితిలోనయినా ఆ ఆలోచన వస్తుందేమో.

"మళ్ళీసారి వచ్చినప్పుడు ఆస్పత్రిలో వాకబు చెయ్యండి. మీ మీరా లేదని వాళ్ళ రికార్డులు సాక్ష్యం చెప్తాయి"

"మీరా!" గుండె గొంతులో కదిలింది.

డ్రైవరు హారన్ మోగిస్తున్నాడు.

"ఇంక బస్సు ఎక్కండి. మీతో నా ప్రయాణం ఇంతటితో సరి. ఇంకా మీరు ముందుకు పోవాలి."

"ఇక్కడ నన్నూ ఆగనీ మీరా! నేను..."

"ప్లీజ్"

చెయ్యి పట్టుకుని పసిబిడ్డనిలాగ బస్సెక్కించింది. తేలికయిన ఆమె సంచిని అందించాను.

నా చెయ్యి పట్టుకుని నీళ్ళు నిండిన కళ్ళతో అలాగే గమనించి "గుడ్ బై మై హజ్బెండ్ థాంక్స్" అని బస్సు దిగిపోయింది.

ముందుకు దూసుకుపోయే బస్సు దూకుడులో నీళ్ళు నిండిన మీరా ముఖం కనిపించింది.

ఈసారి భువనేశ్వర్ వచ్చినప్పుడు కటకంలో ఆగి మీరా చెప్పినట్టే వాకబు చేశాను. డిసెంబర్‌లో మేం అనుకున్నట్టు పెళ్ళయితే జరగలేదు కానీ క్రిస్టమస్ రెండు రోజులుందనగా మీరా కన్ను మూసింది.

శంబల్‌పూర్ బస్సులో ప్రయాణం చేస్తూ జుజుమురా వచ్చినప్పుడు ఒక్కసారి గుర్తు చెయ్యమని కండక్టరుతో చెప్పాను. కళ్ళిప్పేసరికి బస్సు ఇంకా నడుస్తోంది. కండక్టరుని అడిగాను. జుజుమురా వెళ్ళిపోయిందన్నాడు.

ఒక అపూర్వమయిన అనుభవాన్ని 'మీరా' రూపంలో ప్రసాదించి నా దారినుంచీ సవినయంగా తప్పుకుంది జుజుమురా.

*****

# సుశీల

## - చలం

తెలుగు భాష ఉన్నంతకాలం అజరామరంగా నిలిచిపోయే సాహిత్యాన్ని సృష్టించిన చలం గారిది, తెలుగువారి హృదయాల్లో ప్రత్యేకస్థానం. తెలుగు జాతిని తట్టి, తిట్టి, ఊపి, నిద్రలేపి, లాలించి, బోధించి తన రచనల కొత్తకాంతితో కళ్ళు చెదరగొట్టే కొత్త జ్ఞానంతో జీవితపు చీకటికోణాలలో వెలుగు నింపి, కొత్త జీవితానంద జ్యోతులతో కొడిగట్టిన హృదయాలను ఉద్దీపింపజేసినవాడు చలం. తెలుగుజాతికొక కొత్త జీవితదృక్పథం ఇచ్చినవాడు, తెలుగు జాతికొక కొత్త పరమార్థం కలిగించిన వాడు. ఆయన రాసిన రెండో కథ ఇది. రచనాకాలం 1924.



**నారాయణప్పగారిది** కొత్త పద్ధతుల ఇల్లు, బ్రాహ్మలే. అయినా ఇల్లు పైనుంచి చూడడానికి యూరోపియనుల ఇల్లులాగుంటుంది. వరండాకి ముందు తడికలూ, తొట్లలో మొక్కలూ, గోడలకి సీనరీల పఠాలు, పట్టు సోఫాలు, పేము కుర్చీలు, గాజు గిన్నెల్లో పువ్వులు, చాలా అందంగా ఉంటాయి. మనుషులూ అట్లానే ఉంటారు. ఆయన బూట్సులూ, షర్టులూ, బొత్తాములూ, కోట్లూ క్రాపింగు జుట్టూ అన్నీ నీటుగా ఉంటాయి. ఆయన భార్య అట్లానే సన్నగా, పొడుగ్గా చాలా నాజూకుగా ఉంటుంది. ఆ జుట్టు దువ్వుకోవడం, బొట్టుపెట్టుకోడం, చీర కట్టుకోడం, నడవడం, నవ్వడం, మాట్లాడడం అన్నీ నాజూకుగా అందంగా ఉంటాయి. తెల్లవారి లేవగానే చూచినా సరే అట్లానే ఉంటుంది. ఒక్క వెంట్రిక తలనించీ రేగి ఉండదు. తల్లో వొక్క పువ్వు నలిగి ఉండదు. ఆమె జాకెట్టూ, చీరా, బెల్టూ, చేతికి సన్నని గాజులూ, మెళ్ళో సన్నని గడియారం గొలుసూ, కాళ్ళకి మొహమల్లు స్లిప్పర్లూ, అన్నీ సృష్టిలోనే ఆమెకోసం ఏర్పడ్డట్టుంటాయి. ఆమె పేరు సుశీల. వాళ్ళ వంటవాడు అతే. అంత శుభ్రంగా గవర్నరుగారి బట్లరు కూడా ఉండడు. ఆయన కుక్కలూ అంతే తక్కిన కుక్కల వలె అల్లరి చెయ్యవు; అనవసరంగా మొరగవు; బయటికి వెళ్ళవు; వాటి ముక్కు దగ్గిర బిస్కట్లు తింటున్నా అడగవు. కాళ్ళు మీద పెట్టవు. నాకమంటేనే గాని చెయ్యిగానీ, మూతిగానీ నాకవు. ఆయనకి పిల్లలు లేరుగాని, ఉన్నా వాళ్ళు అల్లరి చెయ్యరు. ఎత్తుకోమనరు. ప్రాణం విసిగేట్టు ప్రశ్నలు వెయ్యరు. తేలు కుట్టినా బిగ్గరగా యాడవరు.

నారాయణప్పగారికి ఆస్తి చాలా ఉంది. అర్జించుకునేందుకు ఆయన చాకిరి చెయ్యనక్కర్లేదు. కానీ ఎప్పుడూ కూడా సోమరిగా ఉండడు. ఛైర్మనూ, ప్రెసిడెంటూ, సెక్రటరీ, ఆనరరీ మెంబరూ మొదలయిన పనులు ఆయనకి ఒక డజను ఉన్నాయి. తీరుబడే ఉండదు సాయంత్రం తప్ప. సాయంత్రం ఊళ్ళో పెద్ద ఉద్యోగస్తులందరూ ఆయన ఇంటికి చేరుకుంటారు. ఈయన ఇల్లు ఒక క్లబ్బు. వచ్చేవాళ్ళు

లేక ఆ ఊరి క్లబ్బు మూసేశారు. ఏ ఉద్యోగస్తుడు ఆ ఊరు కొత్తగా వచ్చినా నారాయణప్పగారి స్నేహం కోరి, వెతికి చేసుకుంటాడు. ఒక్క గంట నిలవడు. వాళ్ళందరూ ఆయన ఇంటికొస్తారు. టెన్నిసు ఆడతారు, టీ తాగుతారు, చీట్లాడుతారు. రాత్రి పదింటికి వెడతారు. సుశీల గూడా వాళ్ళందరితో కలిసి ఇంట్లో తిరుగుతుంది. వాళ్ళకి షేకాండిస్తుంది, టీ ఇస్తుంది, న్యూసు పేపరు సంగతులు చర్చిస్తుంది, వాళ్ళతో కూచుని ఉంటుంది. వాళ్ళు వెళ్ళిందాకా.

ఆ కాలంలో న్యూసు పేపర్లు చాలా హడావిడి చేస్తూఉండేవి. సత్యాగ్రహం, రౌలెట్ ఆక్టు, ఇవన్నీ అయిపోయి, పంజాబు వధల కాలం వస్తోంది. దేశమంతా అల్లకల్లోలమయ్యేట్లు కనపడుతోంది. ఇదంతా సుశీలకి చాలా సరదా. వీళ్ళందరూ ఏమంటారో తెలుసుకోవడం ఆమెకి చాలా ఇష్టం. నారాయణప్పగారు ఈ గవర్నమెంటు ఉద్యోగస్తులనే గాక ఊళ్ళో అందరినీ ఎరుగును. వీళ్ళ ఉద్దేశాలే గాక లోకమంతటి ఉద్దేశాల సంగతి తెలుసు అతనికి. అందుకనే అతనికీ, ఉద్యోగస్తులకీ, చాలా పెద్ద వాదనలు జరిగేవి. సుశీల ఊహలు చాలామట్టుకు గవర్నమెంటు ఉద్యోగస్తుల వల్ల ఏర్పడ్డవే! ఆమె స్త్రీ గనక ఊళ్ళో తిరగదు. విశాలమైన దృష్టిలేదు.

నారాయణప్పగారికీ సుశీలకీ మత, కుల పట్టింపులు లేవు. మీరెవరంటే బ్రాహ్మలమంటారుగానీ, ఆ బ్రాహ్మణీకం ఎక్కడుందో గుర్తుపట్టడం చాలా కష్టం. వాళ్ళ ఇంట్లో బ్రాహ్మల్ని, తురకల్ని, క్రిష్టియన్లని ఒక మోస్తరుగానే చూస్తారు. కష్టమయినవాళ్ళు రావడం మానెయ్యొచ్చు. వాళ్ళకి లక్ష్యంలేదు. ఇట్లా ఉన్న ఊళ్ళో ఎవరూ వాళ్ళని హీనంగా చూడరు. వాళ్ళని భోజనాలకి పిలుస్తారు. వాళ్ళింటికి వెడతారు. ఆయన పిలిస్తే చాలు. ప్రతివారికీ గొప్పే. నారాయణప్పగారికున్న పలుకుబడీ, మర్యాద ఎవరికీ లేవు. కానీ వీపు వెనకాల గుసగుసలు ఎవరికి తప్పుతాయి. ఎంత గొప్పవాళ్ళయినా, మంచి వాళ్ళయినా?

సుశీలకీ నారాయణప్ప గారికీ చాలా ప్రేమ ఒకరిమీద ఒకరికి, ఎన్నడూ ఒకరితో ఒకరు పోట్లాడి ఎరుగరు. వొకరు చెపితే అది రెండోవారు ఆజ్ఞగా నెరవేరుస్తారు. **నారాయణప్పగారు భార్య ఆత్మని చంపి , తన వశం చేసుకుని, తనకు నీడని చేసుకుని, తన ఊహలే ఆమె తల్లో పెట్టి, ఆమె నోట రప్పించి, మేమిద్దరం ఒకటయిపోయామనే రకం మనిషి కాడు.** ఆమె ఊహలకీ పనులకీ పూర్ణస్వాతంత్ర్యమున్నది. ఎన్నడూ వొకరి మీద వొకరికి అనుమానం లేదు. అనుమానపడడమనే తలపే వారికి సిగ్గువేస్తుంది. ఇందరు మొగాళ్ళు వస్తుంటారు, పోతూ ఉంటారు. నారాయణప్పగారు అనేకసారింట్లో ఉండరు. అయినా అనుమానమన్నమాట లేదు.

క్రొత్తగా ఆ ఊరు ఒక తురక పోలీసు సూపరెండెంటు వచ్చాడు. ఆయన పేరు సులేమాన్ చిన్నవాడు. అందమైనవాడు. అతనికి కొత్తగా పనికావడం ఇక్కడికే. ఆయన యూనిఫారం, కత్తీ, పోలీసు ఉద్యోగస్తుల శాల్యూట్లూ చూసుకుని, ఆయనకి చాలా వినోదంగా, కొంచెం గర్వంగా ఉండేది. అతనికి పెళ్ళికాలేదు. మొత్తానికి ఆయన జాతిఏమిటో, మతమేమిటో నిర్ణయించడం కష్టం. సరే వచ్చినరోజునే అతను నారాయణప్పగారి ఇంటికి వచ్చాడు. ఆయన ఇంట్లో భార్య, కుక్కలూ, ఆయనకి పట్టింపులు లేకపోవడం, ఆ సాయంత్రపు టీ, కబుర్లూ అన్నీ సులేమానుకి చాలా సంతోషం, ఆశ్చర్యం కలగచేశాయి. ఇండియాలో కూడా ఇట్లాంటి వాళ్ళుంటారనుకోలేదు. మొదటి రోజు నుంచీ కూడా ఆయనకీ సుశీలకీ చాలా స్నేహమయింది. వారం రోజుల్లో మరీ ఎక్కువయింది. అది అక్కడ కొచ్చేవాళ్ళందరికీ కనపడుతూనే ఉంది.

పది సంవత్సరాలు నారాయణప్పగారితో కాపురం చేసిన తరువాత సుశీల ఇప్పటికి ఇంకొక పురుషుడి మీద ప్రేమ కలిగింది. ఆమెకు ఈ ప్రేమేమీ ఇష్టంలేదు. నారాయణప్పగారంటే ఆమెకి ఎక్కువైన గౌరవం కనక మొదట సుశీల ఈ ప్రేమతో చాలా పోట్లాడింది ఒకటి రెండు రోజులు ఉత్త స్నేహమనుకుని సమాధాన పరచుకుంది. తరువాత తెలుసుకుని అతనికి దూరంగా ఉండడానికి ప్రయత్నించింది. కానీ సులేమాను వెతికి ఆమెను తీసుకొచ్చేవాడు. తరువాత ఆమె ఆ ప్రేమని నిలుపుకోలేక ఘోరమైన యుద్ధం చేసింది. కానీ ప్రేమ చాలా మాధుర్యంగా ఉంది. ఆమెకి భర్త మీద భక్తిగాని, పాపభీతి ఏమీ లేవు. అదంతా మూఢత్వమని ఆమె నమ్మకం, భర్త లేకపోతే అసలు ఈ సందేహాలే ఆమెకు ఉండేవి కావు? ఈ యుద్ధమే అవసరంలేదు. తన భర్తకియ్యవలసిన ప్రేమ ఇతని కిస్తున్నానని

ఆమెకు చాలా బాధగా ఉంది. నారాయణప్పగారితో చెప్పాలని నిశ్చయించుకుంది. ఆయన్ని చూస్తే భయంలేదు. కానీ ఆయనకి మనోవేదన కలుగుతుందనీ, తరువాత, ఆయన ఎట్లానన్నా తననీ సులేమాన్ స్నేహం మాన్పిస్తాడనీ భయం వేసి ఊరుకుంది. ప్రేమ జయం పొందింది. భర్త మీద ఇప్పటికీ ప్రేమ ఉంది. అయినా ఈ క్రొత్త ప్రేమను స్వాధీనం చేసుకుంది.

**కొందరు స్త్రీలు వారినెవరికి పెళ్ళి చేస్తే వారిని వెంటనే ప్రేమిస్తారు. ప్రేమించినట్టే ఉంటారు. ప్రేమించామనే, వారూ అనుకుంటారు. దాంట్లో ఏమీ మోసం లేదు. చాలా నమ్మకస్తులు. కానీ ఎప్పుడో వొకప్పుడు, ఎవరో కొత్తవారిమీద నిలవరాని ప్రేమ కలుగుతుంది వారికి. వారి హృదయాలు, ఎవరికోసం చెయ్యబడ్డాయో, అటువంటి వారిని కలుసుకుంటారు. అపుడు ఆ మహాగ్నిలో ఈ పూర్వపు ప్రేమ నీతి, విశ్వాసమూ, అన్నీ దగ్ధమౌవుతాయి. ఎవరూ ఆపలేరు. కొన్ని బైటకి వస్తాయి. కొన్ని ఒకరిద్దరికి తెలిసి ఆగుతాయి. కొన్ని బైటకి రానేరావు.**

సులేమాన్ స్వభావమంతా పట్టుదలతో చెయ్యబడ్డది. తలచుకున్నాడా అది నెరవేరితీరాలి; అందాకా నిద్రపోడు. పోలీసు సూపరెంటుకావాలని పదిహేనేళ్ళ కిందట చిన్నకుర్రవాడుగా ఉన్నప్పుడనుకున్నాడు. అయిందాకా ఒక్క రోజు ఆ పట్టును మరిచివుండలేదు. సుశీలను చూచిన మొదటి రోజే ఆమెను ప్రేమించాననీ, తనదాన్ని చేసుకోవాలనీ అనుకున్నాడు. ఇంక అంతే; ఆమె ప్రేమను లోబరచుకున్నదాకా నిద్రపోలేదు. ఎవరడ్డమొచ్చినా, తనకెంత నష్టమయినా ఆ పనిని వదలడు. ఈ కాలంలో ఈ దేశంలో పుట్టాడు గానీ హానిబాల్ వంటి దీక్షాపురుషుడు కావలసింది. ఆమె తనని ప్రేమిస్తోందా లేదా అని ప్రశ్నే లేదు. తప్పించుకోడానికి ఆమె ప్రయత్నాలూ, ఆమె భయమూ, పశ్చాత్తాపమూ, అన్నీ చూశాడు. తన బలంలో ఆమెని, అవన్నీ కూడా తోసేసి తన దగ్గరకి వచ్చేటట్టు చేశాడు. ఇక ముందు వెనుకలు లేవు. స్నేహితుణ్ణి మోసం చేస్తున్నానే ఆలోచన తట్టింది. కానీ దాన్ని పైకి రానీయడు. తలచుకున్నది చేసేసితీరాలి. అతనికి ఇంకొకరు చూస్తారు, తనకవమానం, అల్లరి, ఇల్లాంటి ఆలోచనలు లేనేలేవు. ఎవరన్నా అడిగితే సంగతంతా చెప్పేస్తాడు కూడాను.

ఒకనాటి రాత్రి పదింటికి వచ్చిన వాళ్ళందరూ తోట్లోంచీ వెళ్ళిపోతున్నారు చీట్లాట చాలించి నారాయణప్పగారు ఆ రాత్రి పన్నెండింటికిగానీ రానన్నాడు. పనిమీద వెళ్ళాడు. సులేమాను కదలలేదు. ఆఖరు మనిషి వెళ్ళడంతోటే సుశీలా, అతను, మధ్య అడ్డం తీసేస్తే కలుసుకునే రెండూ ప్రవాహాలాగా కావలించుకున్నారు. సన్నగా, తెల్లగా ఉన్న సుశీల, రాతి విగ్రహం మల్లే నిలబడ్డ అతన్ని అల్లుకున్నట్లు కలిసిపోయింది. అతని షర్టుమీదా, భుజం మీదా ముద్దు పెట్టుకుంది. ఇంకా ఎప్పటికీ వదలకుండా, అట్లా ఉత్తరీయంవలె ఉండిపోతుందేమోననిపించింది.

"పొద్దున్నించీ ఎదురు చూస్తున్నాను, ఇంక వదలను. ఎన్నటికి వదలను. ఇన్నాళ్ళూ, ఇన్ని సంవత్సరాలు, నాకు కనపడకుండా ఎక్కడున్నావు! నిన్నింక వదలను. ఎట్లా వెడతావో వెళ్ళు"

రాత్రి వంటి గంటయింది. మంచమ్మీద సుశీల నిద్రపోతున్నట్లు పడుకుని ఉంది. సన్నని దీపం వెలుగుతొంది. నారాయణప్పగారు పడుకోడానికి కోటు అవీ తీసేస్తున్నారు.

"సుశీలా!"

జవాబు లేదు. వచ్చి మంచం మీద కూచుని సుశీల మీదికి వంగి, మొహం తనకేసి ప్రేమతో తిప్పుకున్నాడు. చెంపలనిండా కన్నీళ్ళున్నాయి. ఎన్నడు లేనిది జుట్టు చీదరగా చెంపల కతుక్కుని ఉంది. ఆయన చాలా ఆశ్చర్యపడ్డాడు.

"సుశీలా, సుశీలా ఏమిటి ఈ కన్నీళ్ళేమిటి? ఎందుకేడ్చావు!"

ఆమెనంతా లాక్కుని తనవేపు తొడలమీద పడుకోపెట్టుకున్నాడు. సుశీల కళ్ళువిప్పింది; మళ్ళీ నీళ్ళు కారుతున్నాయి.

"ఏంలేదు ' ఏదో దిగులేసింది."

నారాయణప్పగారికి వారంరోజులనుంచీ ఏదో చెప్పలేని బాధగా ఉంది. కారణం ఆలోచించినా తేలలేదు. ఇప్పుడు సుశీలని చూడగానే ఈమె విషయమయ్యే ఆ బాధ అని తట్టింది.

"సుశీల! ఏదో ఉంది , నా దగ్గర్నుంచీ దాస్తున్నావు"

"నేను నమ్మను. దాస్తావా, నాతో చెప్పకుండా? చెప్పవూ? నేను ఏమీ అనని నీకు తెలియదూ? చెప్పు.... నా సుశీలకదూ: చెప్పవూ? ఛీ, ఏడుస్తారా: చెప్పెయ్యి. నేను ఆలోచిస్తాగా తరువాత ఏం చెయ్యాలో"

అంతా అతనితో చేప్పేసి శాంతి పొందాలని సుశీలకెంతో అనిపించింది, కాని చెప్పేస్తే... తరువాత. ఆ రాత్రి ఏమీ చెప్పలేదు. సుశీల ఏదో మనోవ్యధలో ఉందని నారాయణప్పగారికి తెలిసిపోయింది. తనకెందుకు చెప్పదో ఆయనకర్థం కాలేదు. తనే ఎట్లానన్నా తెలుసుకుని పోగొట్టాలని, నిశ్చయించుకున్నాడు. ఏమీ అనుమానం మాత్రం మనసులోలేదు. ఆయనికి ఇంతేకాకుండా సులేమానంటే కూడా అయిష్టం మొదలు పెట్టింది. నిష్కారణంగా. అతను ఏమన్నా అంటే తను సహజంగానే దాన్ని కాదంటాడు. సుశీలా సులేమాన్ ఒకటే మాట - గవర్నమెంటు పక్షం. సులేమాన్ని చూస్తే ఆయనకి ఒక విధమైన భయం కూడా పట్టుకుంది. ఆ నిష్కారణమైన భయం సంగతి తలచుకుని నారాయణప్పగారు తనలో తను నవ్వుకునేవారు.

ఒకరోజు పొద్దున్న సుశీల పోలీసు లైన్లకి వెడతానంది. ఆ వాళ గొప్ప డ్రిల్లు జరుగుతుందని చూడ్డానికి సులేమాను రమ్మన్నాట్ట. సుశీల తనని యూనిఫాంలో చూడాలని ఆతని ఆశ.

నారాయణప్పగారు,

"ఎందుకులెద్దూ, అందరి ఉద్యోగస్తులలో నువ్వు ఆడదానివి ఒక్కెతెవూ వెళ్ళడం బాగుండ"దన్నాడు.

"నేను వస్తానని చెప్పాను, పాపం ఆయన ఎదురు చూస్తూ ఉంటాడు" అంది.

"ఇప్పుడు నువ్వు వెళ్ళకపోతే అతని డ్రిల్లు ఆగుతుందా? పోనిద్దూ:" అన్నాడు.

"అట్లాకాదు వెడతాను, ఉండిపోవడానికి నాకేం కారణం కనపడ్డంలే"దంది.

ఇద్దరికీ భేదాలు వస్తున్నాయి.

సన్నని చీనా పట్టుచీరె కట్టుకుని, తల్లో గులాబి పువ్వులు పెట్టుకుని, గుఱ్ఱపు బండిలో వెళ్ళింది. ఇంకా సులేమాన్ బంగళానుంచీ బయలుదేరలేదు: కాఫీ తీసుకోబోతున్నాడు. యూనిఫారం వేసుకుని పెద్ద కత్తి కిందకి వెళ్ళాడుకుంటూ పెద్ద చేతులూ, ఆ బలిసినమెడా, గుండ్రని దవడలూ, అతన్ని చూసింది.

"ఎంత బావున్నావు? ఈ డ్రెస్సులోనే ఏదో అందం ఉంది. నాకు తప్ప ఇంకెవరికీ కనబడదు:"

"నీకు కనబడాలనే నేను రమ్మన్నాను."

"అందరూ సోల్జర్లు కావాలని ఉంటుంది నాకు. ఆ కత్తి, ఆ తుపాకీ, ఎంతమందిని చంపెయ్యవచ్చు? ఎవరూ అడ్డం చెప్పలేరు కదూ? పూర్వం యుద్ధాలు చేసే యోధులు జ్ఞాపకమొస్తున్నారు. నిన్ను చూస్తే! ధర్మం నిలబెట్టే మహారాజులాగున్నావు. అన్యాయం, నీచత్వం, కత్తికి వణకవలసిందే!"

"ఏమిటి ఇవాళ కవివయావు?"

"ప్రేమ మారుస్తుంది. సామాన్య మానవుల్ని దేవతలని చేస్తుంది"

"అవును నేను యోధుణ్ణయితే, యోధుడికి జయమిచ్చే దేవతవి నువ్వు" అని మోకరించి ఆమె చెయ్యిని ముద్దు పెట్టుకున్నాడు. "నా చెయ్యిని చెరుకు ముక్కలాగు నవిలెయ్యగలవనుకుంటా; ఆ దవడలతో! ఎక్కడిది నీకింతబలం?"

"చారు, మజ్జిగ తాగితే బలం వస్తుందా!"

"నేను కూడా మీ అంత లావుగా ఉంటే బావుండేదాన్ని?"

"ఉండవు నాకు సన్ననివాళ్ళని చూస్తే ఇష్టం. నా మెళ్ళో హారాల్లాగుండాలి వాళ్ళ చేతులు, నన్ను కావలించుకుంటే నా బలాన్నంతా ఆ బలహీనంతో, మృదుత్వంతో కట్టెయ్యాలి... నీకో?"

"నాకేమిష్టమో తెలీదా ఏం నీకు? ఇట్లా ఉంటే" అని అతని నడుముచుట్టూ చేతులు పోనిచ్చింది.

"ఈ బలమంతే, అధికారమంతా, పొగరంతా నాదేకదూ?"

"నీదే కాని ఇది బలమేకాదు; నీ చేతులలో ఓడిపొయ్యే మా బలమేం బలం? ఏ తుపాకుల దెబ్బలకన్నా తప్పుకుంటాముగానీ ఈ కళ్ళనించి... ఈ పెదిమలనించీ.. ఈ మాధుర్యంనుంచీ.."

సుశీల ఆ రోజు ఇంటికి మధ్యాహ్నం మూడింటికి వచ్చింది. తరువాత త్వరలోనే నారాయణప్పగారికి అనుమానం తట్టడం మొదలుపెట్టింది. వాళ్ళ మొహాలే చెప్పాయి అతనికి. కానీ అతను చూడదలచుకోలా. **ఆరితేరిన దొంగలూ, మొనగాళ్ళూ, తప్పుచేసి దాచుకోగలరు; కానీ నిర్మల స్వభావులు దాచలేరు,** అందులో సులేమాన్ దాచడానికి కూడా ప్రయత్నించడు. ఒకరిద్దరు స్నేహితులు నారాయణప్పగారితో కొంచెంగా సూచించారు. అయినా ఆయనికి నిశ్చయం లేదు. సాధారణమైన భర్తలవలె దాక్కుని, దొంగవేషాలు వేసి, వాళ్ళిద్దరినీ కలిపి ఏం చేస్తారో చూసి, సాధించే రకం కాదు. ఆయన మనసు బాధిస్తోంది. కానీ తను మాత్రం నీచమైన పని చెయ్యలేడు.

ఇంతలో దేశాన్నంతా ఊగించేసే నాన్‌కో-ఆపరేషన్ వచ్చింది దేశానికంతా. ఆ దేశంలో ఆవేశం వస్తోంది. అందరికన్నా ముందు నారాయణప్పగారి మనసులో ఆ విషయాలు కలవరం కలిగించాయి. **ఏదో తమ పొట్టకోసం పనితో పాటుబడేవాళ్ళ కన్నా, తమస్వంతపని లేనివాళ్ళని ప్రతి ఉద్యమం ముందుగా కదుపుతుంది. ఏమి దొరకుతుందా కొంత హడావిడి చెయ్యడానికి అని వాళ్ళు చూస్తుంటారు.. ఏదో ఒకగోల లోకంలో జరుగుతూ ఉంటేగానీ వాళ్ళ బతకలేరు.** దేశమంతా వాళ్ళపనులు వాళ్ళు చూసుకునే వాళ్ళే అయితే ఇన్ని కాన్ఫరెన్సులూ, కాంగ్రెసులూ నిలబడతాయా? వెంటనే తన సూట్లూ మల్లు పంచలు మానేసి, ఖద్దరు కట్టడం మొదలు పెట్టాడు. ఇంటినిండా పంచమ జాతి నౌకర్లను పెట్టాడు. గోడలికి గాంధీ పటాలు తగిలించాడు. మునపటి అందమే షోకే, కానీ ఇప్పుడు ఈ రకం. ఏ మీటింగులలో చూసినా అతనే! ఏ ప్రొసెషనులో చూచినా అతనే ముందు. గవర్నమెంటును గురించి అతి తీవ్రంగా మాట్లాడతాడు. కొందరు గవర్నమెంటు నౌకర్లు భయపడి ఆయన ఇంటికి రావడం మానేశారు. కానీ సులేమాన్ మానలేదు.

ఒక రోజు రాత్రి చీకట్లో నీళ్ళకుండీ దగ్గర సుశీలా, సులేమాన్ నుంచున్నారు. అమావాస్య చీకటి, నక్షత్రాలు చుట్టూ కళ్ళ లాగు మెరుస్తున్నాయి. తెల్లని పువ్వులు కూడా కనపడటం లేదు వాళ్ళిద్దరూ రహస్యంగా మాట్లాడుకుంటున్నారు.

"నేనింక ఇక్కడకు రావడానికి కూడా వీలుండక పోవచ్చును. నువ్వు వచ్చి నాతో ఉండిపోవాలి. నా నౌకరిపోతే పోయిందిలే. కాని నిన్ను వదలను, రావూ! సుశీలా, రావాలి! తప్పదు."

'ఎందుకు వీలులేదు? వచ్చేయి. నేనింక ఇక్కడికి రాను. ఇట్లా రావడం నాకు బాగుండలేదు. మొహం చూడ్డానికి సిగ్గేస్తుంది. ఈ చీకట్లోంచీ తప్పించుకుని బైటపడదాము."

"అయితే ఈ ఊళ్ళోనే మనమిద్దరమూ కలిసి ఉండడం? నాకు ధైర్యం చాలుతుందో లేదో?

"ఛా! అధైర్య పడతావా? ఏ విషయంలో నన్నా పడొచ్చు గానీ భయపడి ప్రేమ జీవనాన్ని పోగొట్టుకుంటారా?"

"సరే ఆలోచిస్తా సంగతి. నాలుగైదు రోజులు కానియి తొందరేముంది?"

ఈ కొత్త ప్రేమ వచ్చిన తరువాత ఆ ఇంట్లో ఉండడం అర్థహీనంగా కనబడుతోంది. దేనికోసం తను అక్కడ ఉండడం? కానీ వెంటనే వెళ్ళడానికి ధైర్యం చాలడంలేదు. సులేమాన్ వెళ్ళిపోయిన తరువాత కూడా ఆ కుండీ వడ్డున అట్లానే నుంచుని ఆలోచిస్తోంది. ఇంత సేపు నారాయణప్పగారు ఇంట్లోనే ఉన్నారు. సులేమాన్ వెళ్ళిపోయిన బూట్సు చప్పుడు విన్న తరువాత చీకట్లో వెనకాలే వచ్చి సుశీల బుజం మీద చేయివేశాడు. చూడకుండానే వెనక్కి వంగి మెడ మీద చేతులెయ్యడానికి వెతుకుతూ, సుశీల -

"మళ్ళీ ఎందుకొచ్చావు".... అంది.

మెడ కనపడలేదు. నారాయణప్పగారు సులేమాన్ కంటే పొట్టి, వెనక్కి తిరిగి చూచింది. నారాయణప్పగారు కావలించుకున్నారు.

"నాతో చెప్పవూ? ఇప్పుడన్నా చెప్పకూడదూ? ఎందుకలా లోపలలోపల కుళ్ళుతావు? నాతో చెప్పేస్తే ఆ బాధ తప్పకుండా పోతుంది. ఇన్నాళ్ళూ ఆనందంగా జీవించాము, ఇప్పుడు నీ హృదయమిలా వేరు చేసుకుంటావా? నా మీద నమ్మకం లేదూ? చెప్పు."

"వద్దు, వద్దు, నన్నడగకండి. నేననుభవిస్తున్నస్తోంది చాలు. మిమ్మల్ని కూడా ఎందుకు బాధపెట్టడం? తెలియవలసినప్పుడు తెలియనే తెలుస్తుంది"

"అప్పుడు నీకు సహాయం చెయ్యగలనో, లేదో. ఆలశ్యం చేసి పాడుచేసుకుంటున్నావు. ఏదో మహా భ్రమలో, నీకు అణుచుకోవడానికి బలములేని వ్యామోహంలో పడి, క్షోభ పడుతున్నావు. నన్ను నీకు సహాయం చెయ్యనీ. నా బలం కూడా నీకిస్తాను. నేను కూడా నీతో కలిసి ఆలోచిస్తాను... ఒక్క ఆత్మతో పెరిగామే, ఏం చేశానని నా మీద నీకు నమ్మకం లేకపోవడం? పోనీ ఆలోచించు; ఎన్నాళ్ళయ్యింది. నువ్వు నాతో మనసిచ్చి మాట్లాడి. నామీద ప్రేమ పోయిందా, నేను నీకేం ద్రోహం చేశాను?"

"మీరు కాదు, మీరు కాదు, అంతా నేనే. నన్నలా ముట్టుకోకండి? నేను పనికి రాను, తగను, వెళ్ళండి మీకే తెలుస్తుందంటున్నానుగా? వెళ్ళండి."

నారాయణప్పగారు కొంచెం సేపు ఊరికే ఉన్నారు. ఇంక నిశ్చయం చేసుకుని అడిగేశారు.

"నేను నమ్మలేదు. ఇప్పటికీ నాకు నమ్మకంలేదు... చాలా రోజులు అనుమానమే రాలేదు. నేను రానియ్యలేదు. కానీ ఇప్పుడనుమానంగానే  ఉంది. నిజం చెపుతావని నిన్ను అడిగేస్తున్నాను."

రెండు చేతులలో మొహం పెట్టుకుని ఆ గట్టుని ఆనుకుని సుశీల ఏడ్చింది.

"నాకు కోపమనుకోకు, విచారపడకలా, కానీ ఇలా సంగతులు జరగడం మాత్రం నాకిష్టంలేదు. నేను పనిచేసే పవిత్రమైన ఉద్యమమేమిటి? నా ఇంట్లో జరిగే సంగతులేమిటి? మొదటి నుంచీ ఏం జరిగిందో చెప్పేస్తావా?"

"చెప్పను, చెప్పలేను."

"చెపితే చాలా మంచిది. అందరిమల్లే నేను నిన్ను శిక్షించడం కేకలు వేయడం అవీ చేస్తానని అనుకోకు సుశీలా, నీమీద ప్రేమ నాకింకా పోలేదు. అంతా మరిచి పోయి పూర్వమల్లేనే ఉందాం, చెప్పు."

"చెప్పను."

అయితే పోనీలే, ఇకముందు మానేస్తావా?"

"ఏమో చెప్పలేను. ప్రయత్నిస్తాను. నా శక్తికి మించిపోయింది. గనకే లోబడ్డాను."

"అదేమైనా గానీ, ఆ ప్రకారం ఇక్కడ జరగడం నాకిష్టం లేదు."

"సరే, ఆయన్ని ఇక్కడికి రావద్దంటాను."

సుశీల ప్రతిరోజూ సాయంత్రం సులేమాన్ బంగళాకి వెళ్ళి రావడం మొదలు పెట్టింది. నారాయణప్పగారు గట్టిగా వీలులేదని పట్టుపట్టారు. ఇంక ఈ పద్ధతి సాగదని తెలుసుకుని మూడు రోజుల్లో అతనితో ఉండటానికి వస్తున్నానని సులేమాన్‌తో చెప్పేసింది.

ఇవ్వన్నీ జరుగుతుండగా ఈ లోపల నాన్‌కో - ఆపరేషన్ చాలా ఎక్కువయింది. విద్యార్థులు బళ్ళు మానేస్తున్నారు. ప్లీడర్లు కోర్టులకు వెళ్ళడం లేదు. వార్తాపత్రికలు ఉద్యమం దినదినమూ బలమవుతున్న సంగతి చాటుతున్నాయి. ఎవరికిచేత అయినట్లు వారు త్యాగం చేస్తున్నారు. ప్రతి హృదయాలలోనూ దేశభక్తి అంకురిస్తోంది. ధనం ఇచ్చేవారు, కాలమిచ్చేవారు, శక్తినిచ్చేవారు, సౌఖ్యానిచ్చేవారు ఎవరికి చేతయింది వారు అర్పించుకుంటున్నారు. ఏమౌతుందా అని ప్రతివారూ ఎదురు చూడ్డమే 31 వ -డిశంబరులో ఏదో గొప్ప మార్పు జరగపోతుందని ఆబాలగోపాలము నమ్మేశారు. అందులో ఆ ఊళ్ళో ముఖ్యంగా ఈ హడావిడి చాలా ఎక్కువగా ఉంది. భజనలు, కీర్తనలు, మీటింగులు, ప్రొసెషన్‌లు, లెక్చరర్లు, సమ్మెకట్లు, హరతాళాలు ఎగిరిపోతున్నాయి. వీటికంతా నాయకుడు నారాయణప్పగారు.

ఎప్పుడూ ఆయన ఇంటినిండా నాన్‌కో - ఆపరేషన్ మనుష్యులు. ప్రొద్దుణ్ణించి సాయంత్రం దాకా ఆ మాటలే. ఆ పనులే. కుర్చీలు, సోఫాలు మూలపారేశారు. చరకాలు, మగ్గాలు పెట్టారు.

సుశీలకు ఇదేమీ అంటలేదు. ఆమె ఊహలన్నీ సులేమాన్ ఊహలు. పూర్వమైతే నారాయణప్పగారితో ఈ సంగతులన్నీ చెప్పేసేది. కానీ ఇప్పుడు ఆయనతో సరిగానన్నా మాటాడ్డంలేదు. ఈ పనులన్నీ కూడా వట్టి భేషజమనీ నిరర్ధకమనీ, పనిలేని వాళ్ళూ, మూఢ నమ్మకంకలవాళ్ళూ, దుర్మతాభిమానం కలవాళ్ళూ ప్రోత్సహించి చేయిస్తున్నారని సులేమాన్ చెప్పాడు. సుశీలకి కూడా అలానే కనపడ్డది. నారాయణప్పగారి గొప్పతనం, భావౌన్నత్యం సుశీలకి తెలుసు. కానీ ఆయనకి ప్రజలమీద ఉండే అనుభక్తి, ఆయన స్నేహితుల ప్రోత్సాహమూ, ఆయని చెడగొట్టి ఈ ఉద్యమంలో చేర్చాయని ఆమె అభిప్రాయ పడ్డది. కానీ జరిగే సంగతులని చూస్తున్నకొద్దీ తనూ, సులేమానున్నూ, తక్కిన స్నేహితులున్నూ తప్పు అభిప్రాయపడ్డారేమో అని ఆమెకు సందేహం కలగడం మొదలు పెట్టింది. నిజమైన త్యాగమూ, దీక్షా సంతోషంగా కష్టపడ్డానికి సిద్ధంకావడమూ, ఇవన్నీ చూచి ఆమె క్రొత్తగా ఆలోచించుకోవడానికి మొదలు పెట్టింది.

ఓరోజు సాయంత్రం సులేమాన్ దగ్గరనుంచీ వచ్చేటప్పటికి ఇల్లంతా గలంతుగా ఉంది. వచ్చేపొయ్యేవాళ్ళూ, గుంపులు గుంపులుగా కూడా నారాయణప్పగారితో మాటేడే వాళ్ళూనూ. అక్కడ ఎవ్వరినో అడిగింది. ఏమిటని? అతను ఆశ్చర్యపోయాడు.

"మీకు తెలీనే లేదండీ? నారాయణప్పగారిని కోర్టుకు 20 వతారీఖున సమను చేశారు."

"రాజ ద్రోహపు మాటలు మాటాడారనీ, ప్రజలని దౌర్జన్యానికి పురికొల్పారనీ రోడ్ల వెంబడి ఖద్దరు అమ్మారనీ."

"అయితే"

"అయితే ఇంకేముంది? ఈయన జామీనివ్వరు గదా! కఠిన శిక్ష వేస్తారు."

సుశీల మేడమెట్లెక్కి తన గదిలోకి వెళ్ళింది. ఖైదు! నారాయణప్పగారికి ఖైదు! తనతో చెప్పలేదు. ఎందుకు చెప్పాలి! ఆయనెవరు, తనెవరు? పాపం ఆయన ఈ గోలలు పడుతూ ఉంటే తను తనకేమక్కర్లేనట్లు సౌఖ్యపడాలని చూస్తోంది కదూ? ఆయన్ని మాత్రం ఎవరు సౌఖ్యపడొద్దన్నారు? పైగా జామీనియ్యననడమెందుకు? ఏమి లాభం? ఈ పనులన్నీ? పోనీ పూర్వమైతే పనిలేనివాళ్ళకి ఏదో పని అనుకోవచ్చు ఈ ఉద్యమం, కానీ ఖైదులోకి పంపేటప్పుడు కూడా అదే పిచ్చా? కూచుని చాలాసేపు ఆలోచించింది. ఆయన ఇవన్నీ ఎందుకు చేస్తున్నారో తెలుసుకోవాలని నిశ్చయించుకుంది. **ఆయన జీవితం తన జీవితం ఎంత వేరైనాయి! ఆయన్ని ఖైదులో పెట్టపోతుంటే తను ఇంట్లోంచి పారిపోవాలని చూస్తోంది కాదూ?**

మూడు రోజులు అదే పనిగా కూచుంది. ఎంగుఇండియా చదవడమూ, చదివి తక్కినవాళ్ళతో మాటాడి, దేశస్థితీ ఈ ఉద్యమము అవసరమూ, అర్ధమూ గ్రహించింది. తన భర్తని అన్యాయంగా సమను చేస్తున్నారనుకుంది. ఖద్దరు బట్టలు కొంది. తనకున్న బట్టలన్నీ, పట్టుచీరెలతో సహా బైటరోడ్డు మీద తగలేసింది. ఖద్దరు బట్టలమ్మేవాళ్ళూ, లెక్చర్లు ఇచ్చేవాళ్ళూ, స్త్రీలున్నారని తెలిసి, వాళ్ళతో కలిసి పని మొదలు పెట్టింది. ఖద్దరు బట్టల మూటలు మోసుకుని వాళ్ళందరితో కలిసి సులేమాన్ బంగళాకెళ్ళి అతన్ని కొనమని అడిగింది. నవ్వి, అదేదో జోక్ అనుకుని ఎన్ని కొనమంటావ్? అన్నాడు. అన్నీ కొనమంది. కొనేశాడు. నవ్వుతున్నాడన్న మాటేగానీ, సుశీలలో మార్పు చూసి అతని మొహం వెలవెల పోతోంది. సుశీలకు జాలేసి సాయంత్రం వస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఎప్పటిమల్లేనే వెళ్ళింది. నాన్‌కో-ఆపరేషన్ గురించి ఇద్దరికీ చర్చ జరిగింది. ఈసారి సుశీల అతను చెప్పినదంతా ఒప్పుకోలేదు. తను చేసేపని చేసి తీరతానంది. నారాయణప్పగారి సంగతేదో తేలిందాకా సులేమాన్ దగ్గర ఉండిపోవడానికి రాననీ, వచ్చి చూసిపోతూ ఉంటాననీ ఒప్పించింది.

సుశీల తన ఉద్యమంలో ప్రవేశించడం నారాయణప్పగారికి చాలా సంతోషం కలిగింది. ఇంక సులేమాన్‌తో సంబంధం మానుకుంటుందని కూడా అనుకున్నాడు. 20వ తారీఖున కోర్టువారు నారాయణప్పగారిని విచారించి వదిలేశారు. నారాయణప్పగారు స్పెషల్ కాన్ఫరెన్సుకి, ఉత్తర ఇండియా వెళ్ళారు.

నారాయణప్పగారి పని కొంత భాగం సుశీల మీద పడ్డది. అదిగాక కొందరు నాయకుల్ని అరెస్టు చేశారు. ఆ భారమంతా కూడా సుశీలే పూనుకున్నది. ప్రొద్దున్న లేచింది మొదలు సాయంత్రం వరకు ఎడతెగని పని ఇప్పుడామెకి. ఊరంతా ఆమె మీద ఎంతో భక్తి. ఆమెకీ సులేమాన్‌కీ ఏదో సంబంధముందనే అనుమానం చాలామందికుంది గానీ, ఆ గోలల్లో ఆలోచించడానికి ఎవరికీ తీరుబడి లేదు. సుశీలకి ప్రతిరోజూ సులేమాన్ దగ్గరికి వెళ్ళడానికి వీలయ్యేది కాదు. బండి ఆపి, లోపలికెళ్ళి అతన్ని చూసి 'టైం లేదు. ఇవాళకి వెళ్ళనియ్యి రేపు వస్తా' అనేది.

ఒక వారమయిన తరువాత ఒకసారి నాలుగురోజులు అతనింటికి అసలే వెళ్ళలేదు. రోజు రోజూ సులేమాన్‌కి ఆమె మీద వెర్రిప్రేమ ఎక్కువైపోతోంది. బైట తిరిగి వ్యవహారాలు చక్కబెట్టుకునే నాయకురాలిని చూసేకొద్దీ అతనికి ఒక పూజ్యభావమూ, భక్తీ ఏర్పడుతున్నాయి. ఈ ఉత్సాహ ప్రవాహంలో పడి నీతినీ, మర్యాదనీ బోధించే స్నేహితుల మాటలు విని, తనతో మాట్లాడ్డం మానేస్తుందేమోనని భయం ఎక్కువౌతుంది. అప్పటి నుంచీ భరించరాని విరహావస్థ తటస్థమయింది. తనే ఆమె ఇంటికి వెళ్ళడం మొదలు పెట్టాడు. ఆమె ఇంటి దగ్గర ఉండేది కాదు. రాత్రి పదిగంటల దాకా కూచునేవాడు.

అప్పుడామె వచ్చి భోజనం చేసి,

"నా సులేం, ఏం చెయ్యను చెప్పు? నాకోసం కాచుకుని కూచున్నావా! రోజల్లా అలిసిఉన్నాను. ఇప్పుడు నీతో కూచోడానికి కూడా ఓపిక లేదు. కళ్ళు కూరుకొస్తున్నాయి. ప్రొద్దున్నే అయిదింటికి లేవాలి. ఇవాల్టికివి చాలవూ? " అని పంపించేది.

సులేమాన్ ఆమెని తన దగ్గర కొంచ్చి ఉండమని ప్రాణం తీసేవాడు.

"ఇంకొకడి పెళ్ళాన్ని తెచ్చుకోవడమే తప్పు. అందులో నాన్‌కో-ఆపరేషన్ దాన్ని తెచ్చుకుంటే, ఇంకా ఇబ్బందులు తటిస్తాయి" అని నవ్వేది. అతనొప్పుకునేవాడు కాడు. ఆమె వస్తానన్న సంగతి జ్ఞాపకం చేసేవాడు."మరి దేశమంతా ఇట్లా గోలగోలగా ఉంటే అందరూ త్యాగం చేస్తూ ఉంటే, అనేక మంది అన్నం లేక అల్లాడుతూ అనేక మంది స్త్రీల భర్తలు జైల్లోకి వెడుతూ ఉంటే, నేను వచ్చి నీతో సౌఖ్యమనుభవించనా? వచ్చినా నాకేమీ మనస్థిమ్మితముంటుందని? డిశంబరు 31 వ తారీఖు అయిపోనీ, మాకు స్వరాజ్యమూ వస్తుంది, నీకీ పనీ ఊడుతుంది; మన ఇద్దరికీ పనే ఉండదప్పుడు. బ్రతికున్నన్నాళ్ళూ ఒకళ్ళ నొకళ్ళం చూసుకుంటూ ఎదురుగా కూచోవచ్చు. "

నారాయణప్పగారు వచ్చారు. సుశీల సులేమాన్‌కి కనపడ్డమే మానేసింది. పొరుగూళ్ళకి వెళ్ళేది ఖద్దరమ్మడానికి, సులేమాన్ ఆ ఊళ్ళకి కూడా వెళ్ళేవాడు. ఎందరితోనో, మొగవాళ్ళతోనో ఆడవాళ్ళతోనో ఉంటే, ఆమె ఆవేపు వచ్చిందాకా రోడ్డుమీద నుంచుని, తనని చూసి ఆమె చిరునవ్వు నవ్వితే ఎంతో గొప్పగా సంతోషించి, మోటారు సైకిలెక్కి వెనక్కి వచ్చేసేవాడు. నాన్‌కో-ఆపరేషన్ పార్టీలెక్కడెక్కడ తిరుగుతున్నా సులేమాన్ హాజరు. సుశీల ఊళ్ళో లేనప్పుడు స్వరాజ్యాఫీసు గుమ్మంలో కావలి. మొదట తమని కనిపెట్టడానికి వస్తున్నాడని అందరికి కోపంగా ఉండేది.

"పోలీసువాడు"

"గవర్నమెంటు బానిస"

"దేశద్రోహి"

"స్పై, స్పై"

ఇట్లా అనేవాళ్ళు. కొద్ది రోజులలో అతని సంగతి కనుక్కుని నవ్వుకునేవాళ్ళు.

సుశీల ఎప్పుడో ఒకప్పుడు అతన్ని వంటరిగా కలుసుకునేది. "సులేమాన్! నీకేం కిలాఫత్తు మీద అభిమానం లేదూ?"

"ఎందుకు?"

"నువ్వే గవర్నమెంటు చాకిరీ ఎందుకు మానవూ?"

" కిలాఫత్తు తగలపడనీ, నాకేం కావాలి? నాకు కావలసిందల్లా నువ్వు, నువ్వే నామతం: నువ్వే నా కిలాఫత్: నువ్వే నాదేశం."

"నేను మానెయ్యమంటే మానేస్తావా ఈ నౌకరీని?"

"ఈ నిమిషం. కాయితం కలం తీసుకురా. అదంతా ఎందుకు? నువ్వు ఇక్కడికి వస్తే చాలు. ఇంక పని ప్రస్తావనే ఉండదు. నేనూ నీ వెనక ఖద్దరు మూటలు మోసుకు తిరుగుతాను."

కాంగ్రెసు నుంచీ వచ్చిన పదిహేను రోజుల్లో నారాయణప్పగారిని అరెస్టు చేశారు. ఊరంతా చాలా గోలయింది. మూడువేలు జామీను ఇవ్వాలి, లేకపోతే మూడు నెలలు ఖైదు. మొదటినుంచీ నారాయణప్పగారి శ్వాసకోశాలు బలహీనమైనవి. ఈ ఉద్యమంలో ఎడతెరిపి లేకుండా పనిచెయ్యడంతో ఆయన చాలా బలహీనమయ్యారు. డాక్టరు ఖైదులోనికి వెళ్ళవద్దనీ అపాయకరమనీ అన్నాడు. ఏ కారణము చేత తను మానినా, దేశంలో తనమీద నిందపడుతుందని తెలుసు ఆయనకి. ఇన్నాళ్ళూ అందరినీ పురికొల్పి, చివరికి తాను సమయం వచ్చేటప్పటికి తప్పుకున్నట్లుంటుంది. అందువల్ల జామీనియ్యకుండా ఉండడానికాయనికి ధైర్యం చాలిందికాదు. నారాయణప్పగారిని జైలుకు పంపారు అందరూ ఆ ఛార్జీ అన్యాయమన్నారు. సుశీలకీ అట్లానే తోచింది. అన్యాయంగా ఆయన్ని శిక్షించినందుకు గవర్నమెంటు మీద చాలా కోపం వచ్చింది. నారాయణప్పగారి మీద జాలి కలిగింది. తను కూడా ఆయన మాటాడిన మాటలే మీటింగులో మాట్లాడి తనని కూడా అరెస్టు చెయ్యమని అడిగింది.

దినదినమూ సుశీలకీ, సులేమాన్‌కీ ప్రేమ ఎక్కువవుతోంది. సుశీలకి పని ఎక్కువైనకొద్దీ, ఆటంకాలు ఎక్కువైన కొద్దీ, వాళ్ళకి ఒకరి నొకరు కలుసుకోవాలనే కోర్కెకూడా ఎక్కువౌతోంది. సులేమాను సుశీలని తనతో ఉండిపొమ్మని అడుగుతున్నాడు. ఇంతలో డిశంబరు 31 వ తారీఖు వచ్చింది. పోయింది.

"స్వరాజ్యం పని ఇంక మానెయ్యి మరి; ఈ ప్రచారం, ఈ ముతక బట్టలూ" అన్నాడు సులేమాన్.

"సులేమాన్! దేశంలోంచి ఉద్యమం పోతే పోవచ్చు కానీ, నా హృదయంలోంచీ పోదు. దీనితో నా ఊహలు, నా బతుకు, నా వాంఛలు అన్నీ మారిపోయినాయి. ఇదివరకటి మనిషిని కాను. ఈ ఉద్యమం, ఈ త్యాగం అంతా వృధా కావచ్చు. దేశంలో ఏమీ ఉపయోగం లేక పోవచ్చు. కానీ ఒక జీవితాని కన్నా గొప్ప ఉపకారం చేసింది. కొత్త ఆదర్శాన్నీ, ఆనందాన్నీ, ఆసక్తినీ ఇచ్చింది. నిజం చెపుతున్నా ఏమనుకోకేం. **నీమీద ఎన్నటికీ పోని ప్రేమ ఉంది. నాకు నన్ను మింగేస్తున్న ప్రేమ, నాదేహాన్ని, ప్రాణాన్నీ, నీవు చేసిన ప్రేమ.** అంతేకానీ ఇదివరకువలే నీహోదా, నీ ఉద్యోగం చూస్తే నాకేమీ గౌరవం లేదు ఇప్పుడు. నా అభిప్రాయం అదంతా తిండి కోసం బానిసత్వమని, ఆ యూనిఫాం చూస్తే నాకు పంజాబు వధలూ, నిరాయుధుల్ని కాల్చడం జ్ఞాపకమొస్తాయి..."

జైలులోపల నారాయణప్పగారికి జబ్బుగా ఉన్నట్లు తెలిసింది. సుశీలకి చాలా విచారంగా ఉంది. ఆనాడు రాత్రే సుశీల తోటలో ఒంటరిగా ఆలోచిస్తూ కూచుంది. తన భర్త జబ్బూ, జబ్బు చేస్తుందని ముందే తెలిసి కూడా ఆయన వెర్రిగా జైలుకి వెళ్ళిన సంగతీ, ఉద్యమం స్థితీ తనప్రేమ అన్నీ తలుపుకొస్తున్నాయి. ఇంటి ముందు మోటారు సైకిలాగింది. సులేమాన్ లోపలికొచ్చాడు. కూచుని సుశీల మెడచుట్టూ చెయ్యివేసి.

"దొరికావు, ఎవరూ లేరేం?"

"తప్పించుకొచ్చేశాను."

"నాకోసమే! మరి అక్కడికి రాలేదేం?"

"కాదు. ఆలోచిస్తున్నాను."

"ఏమిటి?"

"అంతానూ ఈ వినోదమంతా,"

"నాకు వినోదంగా లేదు. చెప్పు మరి, మళ్ళీ నిన్ను విసికిస్తానుగావును? కానీ నాకిదే తలుపు. ఆహారం, నిద్రా వదిలాను. సుశీలా, ఎన్నాళ్ళు చెప్పు ఇట్లా? ఎన్నటికీ రావు?"

"సులేమాన్; ఒకమాట చెపుతా, నీకు కోపం రాకూడదు. ఏమీ దాస్తున్నాననుకోకు. **నన్ను ప్రేమిస్తానంటున్నావా, నా హృదయాన్ని అర్థం చేసుకునే శక్తి ఇవ్వాలి నీకా ప్రేమ.** లేకపోతే వృథే; నీ మీద చెప్పలేని ప్రేమ నాకని నీకిదివరకే చెప్పాను. రోజూ రోజూ అది ఎక్కువవుతోంది. నాకిక్కడ ఒక్క నిమిషం కాలు నిలువడం లేదు. అంతా నీదగ్గిర ఉండిపోవాలనే; నాకేం భయంలేదు. నాకీ లోకమక్కర్లేదు, నువ్వు లేకుండా. ఇంక నేను బతకడం వ్యర్థమని నాకు పూర్తిగా తెలుసు. కానీ నారాయణప్పగారు జైలు కెళ్ళింది మొదలు నేను ఆ విధంగా నీతో సంతోషంగా ఉన్న నిమిషమల్లా నాకు సిగ్గేస్తోంది. అందులో విన్నావుకదూ, ఆయనకి జబ్బుగా కూడా ఉందట. ఆయన ఈ దేశం కోసం, నీకోసం, నాకోసం జైలుకు వెడితే ఆయన్ని వదిలి ఆయన లేకుండా చూసి నేను నీతో సౌఖ్యమనుభవించినా: నిన్ను చూడకముందు నారాయణప్పగారికీ, నాకు ఎట్లాంటి ప్రేమ ఉండేదో నీకు తెలుసునా? నీ ప్రేమవచ్చి నా జీవితంలోకి దాన్నంతనీ ఒక్కసారి కూలతోసింది. నాకు దిగులనుకోకు. పోయిన ప్రేమ కోసం నేను పశ్చాత్తాప పడటంలేదు. నీ పాదాల దగ్గర కూచోగలిగితే చాలు. ఆ పెద్ద చేతుల్లో ఊపిరాడకుండా బిగిసిపోయి చచ్చిపోవాలని ఉంటుంది. కానీ మన ప్రేమ వల్ల ఆయన పడ్డ బాధ నువ్వెప్పుడన్నా తలచుకున్నావా? ఆయన హృదయం ఎట్లాంటిదో నీకు తెలీదు. నిన్ను బతిమాలుకుంటా, సులేమాన్: నారాయణప్పగారు వచ్చిందాకా నన్ను ముట్టుకోవద్దు. ఆయన రాగానే చెప్పి నీ దగ్గరికి అసలు ఎప్పటికీ వచ్చేస్తాను. సరేనా? "

"సరే ఇకనేనేదేమిటి? నీకు తెలుసుకదూ: ఈ పదిహేను రోజులు ఎట్లా ఉంటుందో కానీ నాకు భయంగా ఉంది. సంగతులు చూస్తే మన ప్రేమకి ఏదో ఒక ఆటంకం ఎప్పుడూ వచ్చేటట్టే ఉంది. ఈ నాన్‌కో-ఆపరేషన్ ఇప్పుడే రావాలీ? అందులో ఎన్నడూ లేనిది ఆడవాళ్ళమీద కూడా భారమిప్పుడే పడాలి? సరే, తక్కినవన్నీని. నిజంగా వస్తావుకాదూ: ఇంక ఏమీ అభ్యంతరం చెప్పకుండా, ఎన్నాళ్ళుమట్టి ఇట్లా దూరంగా ఉంచుతున్నావు? కథలో రాజకన్య వ్రతమని వంకబెట్టి పోలిశెట్టిని దూరాన ఉంచినట్టు. అక్కడయితే ప్రేమలేదు. ఇక్కడో...."

"ఇక్కడా? ఇక్కడంతా నీదే: ఈ హృదయమంతా నీదే: సులేమాన్: నామీద ఇంకా సందేహమా: నీ సంగతి అట్లా ఉంచు. నీదగ్గరికి రాక ఇంక నాకేమౌంది?...."

నారాయణప్పగారు జైలులో విడుదలై ఇంటి కొచ్చారు. చాలా జబ్బుగా ఉన్నారు. డాక్టర్లు ఇదివరకే క్షయరోగపు చిహ్నాలన్నారు. ఇప్పుడు బాగా పరీక్ష చేసి అది క్షయరోగమేననీ, జైలులో పట్టుకుందనీ, కుదరడం చాలా కష్టమనీ మదనపల్లి మొదలైన స్థలాలో ఉంచితే రోగి చచ్చిపోడుగానీ, బతికున్నన్నాళ్ళూ మంచం మీదనుంచీ లేవడనీ చెప్పారు.

మూడు రోజులయింది. సాయంత్రం అయిపోయి మెల్లిగా చీకటవుతోంది. సులేమాను తన బంగళాగదిలో బల్లముందు కూచుని, అవసరమైన కాగితాలు చూస్తున్నాడు. చేతిలో సిగరెట్టుంది. బల్లమీద పెద్ద టేబులు లైటు వెలుగుతోంది. సుశీల వచ్చి గుమ్మం దగ్గిర నుంచుంది. సులేమాను చివాలున లేచి పరుగెత్తుకు గుమ్మం దగ్గరి కెళ్ళాడు.

"సుశీలా: వచ్చావా చివరికి?"

"నువ్వు నన్ను ముట్టుకోకుండా దూరంగా కూచుంటేనే గానీ నేను లోపలికి రాను."

"ఏమిటి?"

"చెపుతాను. ముందు అట్లా కూచో"

సుశీల కంఠం కన్నీళ్ళలో వణుకుతోంది. ఇముడ్చుకోలేని ఆవేశాలు ఆమెని కదిలించేస్తున్నాయి. తెల్లబోయిన మొహంతో కుర్చీలో కూచుని, సులేమాను సుశీల వేపు వంగాడు. సుశీల కూచుంది. ఇద్దరు మొహాలమీదా వెలుతురు పడుతోంది. సిగరెట్టు జారికిందపడ్డది. వణుకుతున్న వేళ్ళతో ఇంకొకటి వెలిగించుకున్నాడు. సుశీల బల్లమీద చేతులు వేసి తలనానించి, ఏడుస్తోంది. సులేమాను చూడలేకపోయినాడు. లేచివచ్చి ఆమె తలమీద చెయ్యివేసి,

"సుశీలా..." అన్నాడు

సుశీలా లేచి

"అట్లా కూచో; యాడవను. చెపుతా... నేనిక ఇక్కడికి రాను. నీకు తెలిసింది కదూ? నారాయణప్పగారి స్థితి: ఆయన్నెవ్వరు చూస్తారు? నేను కాకపోతే ఇంక దిక్కెవరు?" సులేమాను ఆలోచించాడు.

"అతనికి తమ్ముళ్ళెవరో ఉండాలికాదూ"?

"ఉంటే మాత్రం? వాళ్ళు నేను చూసినట్లు చూస్తారా? ఇన్నాళ్ళూ వాళ్ళ సంబధం లేకుండా అవసరం వచ్చేటప్పటికి వాళ్ళమీద పడెయ్యనా? ఎట్లా ఉంటుంది. ఆలోచించుకో, ఎవళ్ళన్నా ఆయన్ని జాగర్తతీసుకున్నా ఆయన్ని వదిలి నేను సంతోషంగా ఉండగలనా? నాకొస్తే ఆయన చేసేవారు కారూ? నేనంత హృదయం లేనిదాన్నయితే నీకు నన్ను చూస్తే గౌరవమేముంటుంది. నీకే ఇట్లాంటి జబ్బుచేస్తే వదిలేస్తే? "

"సరేలే. అనుకున్నట్లే అయింది. అతను నిన్ను తనకి కట్టేసుకోడానికి ఈ జబ్బు తెచ్చుకున్నట్టుంది. పోనీ నేనే వస్తూ ఉంటాలే. వీలున్నప్పుడే వస్తూ ఉండు, ఏం చెయ్యను?"

"ఆలోచించి అన్ని సంగతులు చెపుతాను. నాకీ దెబ్బతో మతి పోయినట్టుంది. **ఇటు ప్రేమా? అటు కర్తవ్యం నా ప్రాణాలు చీలుస్తున్నాయి....."**

సుశీల మళ్ళీ సులేమానుకి కనబడలేదు. వారంరోజుల్లో నారాయణప్పగారిని తీసుకుని మదనపల్లి వెళ్ళిపోయింది. సులేమాను రెండు నెలలు చూశాడు. జవాబు లేదు. చివరికి తనే వెళ్ళాడు. పొద్దున్న తొమ్మిదింటికి వాళ్ళున్న వార్డు దగ్గరికి చేరుకున్నాడు. ఒక చెట్టుకింద ఉన్న మంచం మీద నారాయణప్పగారు నిద్రపోతున్నారు. మంచం పక్కన గుడ్డ కుర్చీలో సుశీల చదువుకుంటూ కూచుని ఉంది. వెనక బల్లమీద మందు బుడ్లూ అవీ ఉన్నాయి. ఆమెని చూసేటప్పటికి అతని కాళ్ళు వణికాయి. కళ్ళవెంబడి నీళ్ళొచ్చాయి. ప్రేమంతా వొక్కసారి తిరగబెట్టింది. అట్లానే అక్కడ నించునిపోయినాడు. నారాయణప్పగారు కొంచెంగా కదిలారు. సుశీల పుస్తకమక్కడ పెట్టి, లేచి, దగ్గరికి వెళ్ళి దిళ్ళు సరిగా పెట్టింది. రోగంతో బాధపడుతున్న చంటిపిల్లని అత్యంత ప్రేమగల తల్లి కూడా అంత శ్రద్ధతో చూసి ఉండదు. ఆమె కళ్ళలోంచీ ప్రేమా, దయా వలికిపోతున్నాయి. సులేమానుకి సిగ్గేసింది. వెనకాలకి తిరిగి పోవాలనిపించింది. సంపూర్ణమైన నిరాశ కలిగింది. ఈ ప్రయాస అంతా వ్యర్థమని తెలిసింది. సుశీలతో ఒక్కమాట మాట్లాడకుండా వెళ్ళడమెట్లా? దగ్గరికి నడిచాడు. ఆమె కళ్ళెత్తి చూసి, మెల్లిగా చప్పుడు కాకుండా వచ్చింది రహస్యంగా.

"దూరంగా రా. రాత్రంతా నిద్రలేదు. ఇప్పుడే కళ్ళు మూశారు" అంది. దూరంగా వెళ్ళిన తరువాత. "ఎందుకొచ్చావు?" అని అడిగింది.

"ఎందుకు: ఎక్కడ నిలుస్తుంది నా ప్రాణం?"

సుశీల కళ్ళ వెంబడి నీళ్ళు కారాయి.

"పాపం! ప్రతి నిమిషం నీ సంగతే తలుచుకుంటాను. నిన్నెంత కష్టపెడుతున్నాను? నేను లేకుండా నువ్వెట్లా ఉంటావో నాకు తెలుసు. నిన్ను...."

"నాతో చెప్పకుండా వచ్చేశావు కదూ?"

"ఏం లాభం? మళ్ళీ నిన్ను చూస్తే నా మనోబలమంతా మాయమవుతుందని భయమేసింది. చెయ్యకూడదనుకున్నది, ఏదో ఒకటి చేస్తాను. అందుకని..."

"పోనీలే.... ఆలోచించి చెపుతానన్నావు....."

"సులేం! నన్ను మరచిపోలేవూ? పెళ్ళి చేసుకో. నా మాట విను. ఇట్లా ఎన్నాళ్ళుంటారా?"

"ఇదా నువ్వు చెప్పేది? ఎట్లా మరిచిపోను? ఎక్కడున్నా నీ రూపమే కనబడుతుంది. నీ కంఠమే వినబడుతుంది. నీ పనులే జ్ఞాపకమొస్తాయి? "

"ఏం చెయ్యను? అట్లా చూడు. వదిలిపెట్టి రమ్మనడానికి నీకు నోరొస్తుందా?"

"వద్దు. నేను నా పని మానేసి ఇక్కడే ఉంటాను. ఉణ్ణియ్యి"

"కానీ ఇదివరకు రకంగా ఉండను, సులేం అంతా ఆలోచించా."

"ఏం? నామీద ప్రేమ లేదూ?"

"ఉంది. చాలా ఉంది. కానీ ఆయన మీద అపరిమితమైన ప్రేమ వచ్చింది. ఏదో జాలికాదు, నిజంగా ప్రేమ. అట్లా చూస్తావేం? ఆశ్చర్యంగా ఉందా? **ఆ బొమికల కుప్పమీద ప్రేమ ఏమిటనిపిస్తోందా నీకు. అవును. అట్లాంటి ప్రేమకాదు. నీ మీది ప్రేమ రకం కాదు. ఆపాదాల దుమ్ము, నెత్తిన వేసుకోడానికి తగననే భక్తితో కూడిన ప్రేమ.** నాదేశం కోసం, నా ప్రజల కోసం, అట్లా అయినారు. తన ఆరోగ్యాన్ని అర్పించారు. వ్యర్థమయిన దానికి, ఏమాత్రమూ జయము ఆశలేని దానికోసం అంత త్యాగం చేశారు. తెలిసి వద్దని డాక్టరులంటున్నా చేతులారా తెచ్చుకున్నారు. ఆ మహా గౌరవంతో నా ఆత్మే ఆయనదయింది. ఈ శరీరం, ఈ మనస్సు, శక్తి అన్నీ ఆయనవే: వాటిల్లో ఇంకొకళ్ళకి భాగం ఇవ్వడానికి వీల్లేదు. నీకు కూడా, క్షమించు మనమిద్దరం కూడా ఆ కాళ్ళని తల మీద ఆ నించుకోడానికి పనికిరాము."

"నా సంగతేమిటి సుశీలా? ఇంకా...."

"నన్ను క్షమించు, వెయ్యిసార్లు క్షమించు. నాకెంత విచారంగా ఉందో నీకు తెలీదు. నీహృదయాన్ని లాగుకుని, నిన్నిట్లా ఏడిపించడం నన్నెంత విచారపెడుతుందో? ఏం చెయ్యను? అట్లాకాకుండా ఇంకెట్లానయినా నీ సేవ చెయ్యగలిగితే, నీ దుఃఖం పోగొట్టగలిగితే....

"సుశీలా: ఇదంతా నువ్వు తెచ్చిపెట్టుకున్నావు. ఆయన ఏదో మహాత్యాగం చేశారనీ, గొప్ప అపాయంలో ఉన్నారనీ..."

"సులేమాన్! నీకర్థంగాదు. ఆయన సేవకి ఈ చేతులు నిర్మలంగా ఉంచక పోతినే అని నాకెంతో బాధగా ఉందో ఏం చెప్పను?"

"సుశీలా.....

"వెళ్ళు. నీకు నమస్కారం చేస్తా. నా నిశ్చయాన్ని చెడగొట్టడానికి చూడకు, చెడదు. అన్నాళ్ళూ నిజంగా నిన్ను హృదయ పూర్వకంగా ప్రేమించా, ఎంతో ఆనందమనుభవించా, అయితే -"

"ఆయన ఒకవేళ పోతే?

"అనకు, ఆ మాట అనకు,అది తలవను. నాకు చాలా కష్టంగా ఉంటుంది. ఆయనలేకపోతే నేనుంటానా?...."

దూరంగా సులేమాను కొండ దిగి వెడుతున్నాడు. సుశీల మంచం దగ్గర కుర్చీలో చప్పుడు కాకుండా ఏడుస్తోంది. వెనకాల ఆమె వీపు మీద నారాయనప్పగారు చెయ్యివేశారు.

"సుశీలా! చూస్తూనే ఉన్నా; ఎట్లాఉంటావు? వెళ్ళు, నీకానందం అక్కర్లేదూ."

"ఆ సంగతి మాట్లాడకండి, అదంతా మాట్లాడకండి. అదంతా అయిపోయింది."

"నిజంగానే? నీకు దిగులు లేదూ?"

"ఉంది. అతను నాకోసం పడే బాధకోసం దిగులేస్తోంది."

"నీకోసమో?"

"నాకోసము నాకేమీ దిగులు లేదు. నేనే పవిత్రురాలినై మీ సేవ చెయ్యడానికి తగివుంటే ఎంత బాగుండేది అనే దిగులు తప్పా ఇంకేమీ లేదు. మీ దగ్గరుండడం, మీ సేవ చెయ్యడం, నాకు స్వర్గతుల్యంగా ఉంది. ఎవరికి లభిస్తుంది. ఇట్లాంటి అదృష్టం? నా వంటిదాన్ని మీ సేవకు అంగీకరించినందుకు నాకు ఎంతో...."

"నిజం?"

"నిజం. నేను జరిగిందానికి ఏడ్చాను. అంతే."

# ఊహల్లో స్వర్గం

## – జలంధర

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 16 - 4 - 1969)*

మనిషి మేధస్సు సృష్టించిన రంగుల కల స్వర్గం.

ఉపనిషత్తులు, పురాణాలు ఏమైనా చెప్పనీ... నిజానికి చక్కటి ఊహ ఈ స్వర్గం. మృత్యువుకు, మనిషికి మధ్య ప్రవహించే వైతరిణీ ముఖద్వారం స్వర్గమే అయితే... స్వర్గం నిజమే అయితే... అంతకన్న కోరుకోదగింది ఏముంది? జాగృతిని మరచిన ఆత్మీయులు ప్రక్కన, ఆశనిరాశల మధ్య ఊగాడుతున్న మనిషికి ఎంత చక్కని ఆశ ఈ స్వర్గం!

ఒకనాటికి.. అందరూ పోయేవారే... మనకు తెలియకుండానే ఈ బొమ్మల పుస్తకంలో ఆఖరిపేజీకి వస్తుంటాం. కానీ, ఈ లోకంలో మిగిలిపోయిన కోరిక ప్రేమ, ఆప్యాయత, ఆశ, మళ్ళీ మరో లోకంలో మనవారినందర్నీ కలుసుకుంటామనుకునే తృప్తినిస్తుంది. ఈ అద్భుతమైన ఊహ ఎంత అందమైంది?

చిన్ననాటి నుంచీ మమ్మల్ని కన్నుల్లో దీపాలుగా పెంచిన అమ్మ చనిపోతూంటే దుఃఖమని తెలిసీ, ఆశలు విరిగిపోతున్నాయని తెలిసీ కన్నీళ్ళ పునాదులు వేసుకుంటూ, ఏనాడో మళ్ళీ ఈ ప్రేమను పొందగలుగుతాము అనీ, అదే స్వర్గమయితే ఒప్పుకోవాలనీ ఆశ ఉండదా?!

"అన్నయ్యా! స్వర్గం ఉందిరా?" మైకంలో గబుక్కున పైకి అనేశాను.

"స్వర్గం లేదు, నరకం లేదు, పిచ్చిగా వాగకే" అనే చిన్నన్నయ్య.

"లేదు, చిన్నారీ! మనం ఆఖరి వరకు ఏదో ఒకటి చెయ్యాలి కానీ, పిచ్చిగా ఆలోచించి మనస్సు చెడగొట్టుకోకూడదు" అనే డాక్టర్ అన్నయ్య.

"ఇవ్వాల్టితో ఈ జీవికీ, మనకూ ఋణం తీరిపోయిందే, తల్లీ!" అని పిచ్చి శోకాలు పెట్టే బామ్మ. వీళ్ళందరూ నా కలను భగ్నం చేస్తున్నారు. నాలోని ఆశను పాతేస్తున్నారు... కానీ, ఈ అందమైన ఆశను ఎట్లా వదులుకోను?

కావలిసినవారి మృత్యువును కలలో కూడా ఊహించలేమంటారు. ఆఖరి క్షణాల కోసరం, చైతన్యం నర్తించే శరీరంలో జీవం నాశనమవడానికి, దీపం ఆరిపోవడం తప్ప మరొక మార్పురాదని తెలిసీ, ఏదో ఒక మార్పుకోసరం ఎదురుచూడడం ఎంత దురదృష్టం? ఈ నిరీక్షణ ఎంత పాపిష్టిది?

"కళ్ళు తెరిచే నిద్రపోతున్నావా, చిన్నారీ?" అని అన్నయ్య హెచ్చరించాడు. కళ్ళు తెరచుకుని నిద్రపోవడం... ఈ జాగృతికి, సుషుప్తికి, సత్యానికి ఊహకు మధ్య ఉన్న దూరాన్ని ఇంత కన్నా చక్కగా ఎలా కొలవడం...? కలలో నుంచీ తొంగి చూశాను. మెళ్ళో

స్టెతస్కోపుతో అన్నయ్య అమ్మ ముఖంలోకి చూస్తున్నాడు. అన్నయ్యలో మనిషి నా బోటివాడేనేమో, కానీ, అతనిలో పెరిగిన ఈ అవాస్తవిక పరిజ్ఞానం ఆశలను, అందమైన భావాల్ని కప్పేస్తుందేమో... అమ్మ ఎప్పుడూ అనేది 'రోజాపువ్వును స్పిరిట్‌లో నానపెట్టడం లాంటిది మీ జీవితం' అని.

అన్నయ్యను డాక్టరును చెయ్యాలని అమ్మ ఎన్నో కలలు కన్నది. అవి నిజమయ్యాయి. అన్నయ్యలో వైద్యుణ్ణి చూసుకుంది అమ్మ, హాయిగా దాటిపోతూంది. అన్నయ్యకే కాదు, ఏ డాక్టర్‌కూ అలవికాని రోగంతో అమ్మ అంతమైపోతూంది. ఈ చేతులలోని వెచ్చదనం మరికాసేపటికి ఉండదా?

"అన్నయ్యా! ఏదన్నా చెయ్యరా! అంత బాధపడుతూంటే చూస్తూ ఊరుకుంటావేమిరా?" అన్నాను.

"ఏం చెయ్యగలం! చెయ్యగలిగినదంతా చేశాం."

అయ్యో! చూస్తూ చూస్తూ అమ్మను మృత్యువు చేతుల్లోకి ఎట్లా అందివ్వటం? ఆమె బాధను ఎలా చూడడం? అందుకని ఎలా మృత్యువును కోరడం? ఎదెక్కడి పాపిష్టి బాధ అమ్మకు?

అమ్మవంక తేరిపార చూచాను. పచ్చటి ముఖం నీలివర్ణానికి తిరుగుతూంది... ఎప్పుడూ తాంబూలం వేసినట్లుండే పెదవులు నల్లబడుతున్నాయి,

"అమ్మా! నా వంక చూడమ్మ! ఒక్కసారి మాట్లాడమ్మా!" అని ఏడ్చాను.

"ఒద్దు చిన్నారీ! ఊరుకో!" అని చిన్నన్నయ్య ఓదార్చాడు.

"నా చిన్నారివికదూ! ఏడవకు" అని దగ్గరకు తీసుకుని బుజ్జగించాడు పెద్దన్నయ్య. అమ్మ ఆ మాటలు విన్నట్లుంది. కనులు విప్పి అన్నవంక చూచింది.

దాదాపు ఇరవై అయిదేళ్ళ క్రితం అనాధ శరణాలయంలో నుంచి ఒక పాపను తెచ్చింది అమ్మ. ఆ బిడ్డ తల్లి క్రిష్టియన్, తండ్రి హిందువు. సనాతన కుటుంబంలో పెరిగిన అమ్మ, ఐశ్వర్యం మధ్య పెరిగిన అమ్మ, ఆనాడు ఆ బిడ్డ మీద జాలితో, సంఘాన్ని, లోకాన్ని కాదని ఆ బిడ్డని ఇంటికి తెచ్చుకుంది. ఆ సాహసాన్ని సులభంగా క్షమించదలచుకోలేదు మా బామ్మ.

ఆ బిడ్డకు చైతన్య అని పేరు పెట్టింది అమ్మ. అతన్ని డాక్టర్ చేసింది. అతడేమో పెద్దన్నయ్య. అన్నయ్య ఈ ఇంట్లో పెరుగుతున్నందువల్ల మా కుటుంబానికి రాకూడని నిందలు వచ్చాయి. రాబందుల్లాంటి బంధువులు అమ్మను పీక్కుతినడానికి ప్రయత్నించారు. అన్ని నిందలు భరించింది అమ్మ. ఒకనాడు నాన్నగారి దగ్గరికి వెళ్ళి, "ఇందరిలో మీరొక్కరే నన్ను అర్థం చేసుకున్నారనుకుంటాను. ఈ బిడ్డ నాకెంతో, మీకూ అంతే. నే కోరుకునేదొకటే ఈ ఆప్యాయత ఒక్కటే నా నేరమైతే ఈ ఒక్క తప్పు మన్నించండి."

అమ్మ కన్నీటికి కరగనంత కఠినులు కారేమో నాన్న. ఒప్పుకున్నారు. ఆ చేయూతే అమ్మకు ఆధారమైంది. బహుశా, అమ్మ మీద ప్రేమకన్నా, ఆమెలోని వ్యక్తిత్వాన్ని గౌరవించి నాన్న ఒప్పుకుని ఉంటారు. అటుతరువాత నాన్నగారు ఆమె చుట్టూ ఆవరించిన చైతన్యపు పరదాని తొలిగించదలచుకోలేదు. ఆ తరువాత పుట్టిన నేను, అన్నయ్యకూడా పెద్దన్నయ్యకు చెల్లెలు, తమ్ముడుగానే పెరిగాం. అన్నయ్య ఫిఫ్త్‌ఫారంలో తప్పినప్పుడు "ఆఁ! ఆ అనాధప్రేతానికి చదువేమిటి నా బొంద?" అని మా బామ్మ వెక్కిరించింది. నాన్నగారు "తంజావూరు వీణ అనుకుని మోహనరాగం ఆలపించబోతే అది వీధివాయిద్యం అని తెలిసినప్పుడు కలిగే ఆశాభంగానికి నువ్వు తట్టుకోలేవేమో, మాలతీ!" అన్నారట పరిహాసంగా.

"ఉన్నత కులంలో పుట్టినంత మాత్రం చేత మనమంతా ఉన్నతులమైపోయామేమిటండీ! ఒక్క అనాధ బిడ్డకి ఆశ్రయమివ్వలేని ఈ కులంలో ఉన్నతత్వముందంటారా?" అని కోపంగా అడిగిందట.

అమ్మ పట్టుదలే ఊపిరిగా పోసి పెంచడం వల్ల కాబోలు - అన్నయ్య మరెప్పుడూ అమ్మను నిరాశ పరచలేదు. నేను పుట్టిన తరువాత మరొక్కసారి బామ్మ అమ్మ మీద దాడి ప్రారంభించిందట, " ఆడపిల్లకు పెళ్ళి అవ్వాలి... ఆ అనాథ వెధవని ఎక్కడైనా ఉంచమనరా... కావాలంటే డబ్బు పారెయ్యమను" అని. కానీ, ఒక్క క్షణం మమ్మల్ని, అమ్మను, నాన్నను చూడకుండా ఉండలేని అన్నయ్యను ఏం చెయ్యగలదు అమ్మ? అమ్మ పట్టుదలను నాన్న అర్థం చేసుకున్నాడు. అన్నయ్య డాక్టర్ చైతన్య అయ్యాడు.

ఎవరైనా, ఎప్పుడైనా, "మీరు ఇంత పట్టుదల కలవరుకదా! ఒక అనాథశరణాలయాన్ని మీ ప్రేమకు చిహ్నంగా కట్టించకూడదూ?" అని అమ్మతో అంటే, "అయ్య బాబోయ్! ఒక అనాథ బిడ్డడిని పెంచడానికి నేను పడ్డపాట్లు భగవంతుడికే ఎరుక. ఇంక అంత పెద్ద బాధ్యతే? ఆ పని సంఘానికి ఒదిలేద్దాం..." అని తప్పించుకునేది నవ్వుతూ.

అమ్మ ఎప్పుడూ అన్నయ్యకు తనే కన్నతల్లి అని చెప్పి మోసగించలేదు. "ఏం? తనే తల్లిని కాననితెలిసినప్పుడు నా మీద ప్రేమ చైతన్య చంపుకుంటే, మాతృత్వానికి అర్థమేమిటి? అతడి తల్లిని నేను కాకపోయినా, అమ్మ అని పిలిపించుకున్నాను. అదీ గొప్ప..." అనేది.

అన్నయ్యకు ఒడుగు చేయ్యడానికి వీలులేదని పట్టుపట్టింది బామ్మ. ఒడుగు జరిగితీరాలని పట్టుదల కాకపోయినా, అన్నయ్య అన్నివిధాలా ఆ ఇంటి బిడ్డడని అనిపించాలనే తాపత్రయంతో నలిగిపోయింది అమ్మ. నాన్నగారు అమ్మ బాధ చూడలేక, "గాయత్రి అందరూ జపించవచ్చు" అన్నారు. అన్నయ్యకు జ్ఞానం వచ్చిన తరువాత ఎన్నోసార్లు చర్చికి తీసుకువెళ్ళింది. "చైతన్యా! నీకు ఏ పద్ధతి నచ్చితే అదే అనుసరించు. భగవంతుడొక్కడే" అని చాలాసార్లు చెప్పింది. "వాడిది అమ్మ మతం" అని అనేవారు నాన్న ఎప్పుడూ. తన స్వార్థం కోసరం ఎప్పుడూ అమ్మ ఎవర్నీ ఏమనలేదు. ఏదీ చెయ్యమని శాసించలేదు. అల్లాంటి అమ్మ వెళ్ళిపోతూంది.. కొన్ని గంటలు.. అంతే...

మెల్లిగా కన్నీరు తుడుచుకుని కలియచూశాను.

"ఆఁ ఆ చీరలో మన్నిక తక్కువలెద్దూ!" అత్తయ్యలు మాట్లాడుకుంటున్నారు మరొకపక్క. "పిల్లకి నగలేం పెట్టారొదినా?" అని పెళ్ళిముచ్చట్లు అడుగుతున్నారు పక్కింటి అత్తయ్య మరొకామెను.

నాకు ఆశ్చర్యం వేసింది. మాకు మా అమ్మ ఆదర్శమూర్తి. వాళ్ళకేమిటి? మనుషుల తత్వమంతేనేమో అని సరిపెట్టుకుని అమ్మవంక చూశాను. అమ్మ జాలిగా ఒక్కసారి చూచింది. ఆ కళ్ళల్లో ఓదార్పు కన్నీటిపొరలా కదలాడింది.

"ఆవిడ పేర ఏదో మేడా గీడా ఉందనుకుంటాను... విల్లూ అదీ తయారుచేయించారా?" అంటూ హడావిడిగా రైలు దిగి వస్తున్న పెదనాన్నగారు నాన్న చెవిలో ఊదారు.

నాన్న ఇబ్బందిగా, 'వీళ్ళతో ఎలా' అన్నట్లు చూశారు.

చిన్నన్నయ్య లేచి, "ఇదుగో, పెదనాన్నా! నువ్వు వెళ్ళి ఆ హాల్లో కూర్చో" అన్నాడు గట్టిగా.

ఆయన గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"వాణ్ణంటావేమిటిరా మధ్య... అదేదో నీ మంచికే చేద్దామని వాడి తాపత్రయం. ఉట్టి మొరటు వెధవని తయారుచేసింది." బామ్మ సణుగుతూంది.

అవును, చిన్నన్నయ్య మొరటువాడే.. అమ్మ చేతుల్లో పెరిగిన చిన్నన్నయ్యకు మొరటుదనం ఎక్కువ. ఇద్దరి తత్వంలో ఎంతో బేధం. ఆప్యాయత కోసరం తలొగ్గుతాడు పెద్దన్నయ్య. హక్కులకోసం ఎవరితోనైనా నిలబడి పోరాడతాడు చిన్నన్నయ్య. ఈ రెండు సమానాంతర రేఖలను ఆప్యాయత పొరలతో కట్టి పెంచింది అమ్మ.

అన్నయ్య కేకలకు అమ్మ కళ్ళు విప్పి చూచింది.

"అమ్మా ఏం కావాలి?" అని మెల్లిగా అడిగాడు చిన్నన్నయ్య.

"చైతన్య!" అంది అమ్మ.

"అయ్యో! చావుతెలివి ఒచ్చిందర్రో" అంటూ అందరూ మంచం చుట్టూ చేరారు.

"ఇదిగో! మీరంతా దూరంగా పొండి ముందు.." అని ఒక్క కసురు కసిరాడు చిన్నన్నయ్య.

అందరూ మెల్లిగా దూరంగా వెళ్ళి నిలబడ్డారు.

ఇరవై ఏళ్ళ వ్యక్తిత్వం, చదువూ, వయస్సు అన్నీ మర్చిపోయి పసివాడిలా నాన్నగారి ఒళ్ళో తలదాచుకుని బావురుమని ఏడ్చేశాడు పెద్దన్నయ్య.

అమ్మ అన్నయ్యని, నాన్నగార్ని చూసింది. అస్తమిస్తున్న సూర్యునితో మెల్లిగా అంతరించే కాంతిలా నవ్వింది.

"చిన్నారి అమాయకురాలు... అందులో ఆడపిల్ల. జాగ్రత్త!" అని ఇంక మాట్లాడలేకపోయింది.

"తులసి తీర్థం పొయ్యండర్రా!" ఎవరో అరిచారు.

అమ్మ తల ఒళ్ళో పెట్టుకుని, మెల్లిగా, భక్తిగా తులసితీర్థం పోశాడు పెద్దన్నయ్య. తలెత్తి అమ్మ అన్నయ్య వంక చూసింది... అంతే.

'అమ్మా! అంటూ అన్నయ్య, 'మాలతీ!' అంటూ నాన్న స్పృహ తప్పిపడిపోయారు. ఇల్లంతా శోకాలతో గగ్గోలైంది.

అమ్మ చేతిలో నా చెయ్యి అలాగే ఉండిపోయింది. చనిపోతే ఎలాగో అయిపోతారనుకున్న నాకు ఏ మార్పూ అమ్మలో కనబడలేదు. అసలు చనిపోలేదేమో... అని అనుమానమొచ్చింది. ఈ నిద్ర శాశ్వత నిద్రా? ఎప్పటినించో అమ్మ మృత్యువును తలచుకుని దుఃఖిస్తున్న నాకు ఆశ్చర్యంగా మృత్యువు పరదా అమ్మని కప్పినప్పుడు దుఃఖం రావడం లేదు. చావు మనిషిని కబళిస్తుందనుకున్నాను కానీ, ఇంత చల్లగా, విప్పారిన పొగలా, కనిపించని తెరని మృత్యువు మనిషిని ఆవహిస్తుందా?

కొన్ని గంటలు కలలా గడిచిపోయాయి. చుట్టూ ఏమిటో గగ్గోలు. ఎంత మంది జనం... అమ్మ జీవితం వీళ్ళ పొగడ్తలతో ఊపిరి పోసుకుంటుందేమోననిపించింది.

సోఫాలో పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తునాడు ఎంతో ధైర్యశాలి అనుకున్న చిన్నన్నయ్య.

ఎవరైనా కొత్తవాళ్ళు వచ్చినప్పుడల్లా గగ్గోలుగా ఏడుస్తూంది బామ్మ. మెల్లిగా పెద్దన్నయ్య, నాన్నగారు స్నానాలు చేసివచ్చారు. ఏదో మునిగిపోయినట్లు అందరూ బామ్మ దగ్గరికి వెళ్ళి గుసగుస ప్రారంభించారు.

"ఆ కిరస్తానీవాడు దానిని ముట్టుకుంటానికి వీల్లేదు!" అని ఒక్క అరుపు అరిచింది బామ్మ.

పెద్దన్నయ్య ముఖం వివర్ణం అయిపోయింది. నాన్నగారికి దుఃఖంలో నిస్సహాయత.

ఒకసారి లేచి కూర్చుని, "ఎవరా మాట అన్నది?" అని ఒక్క అరుపు అరిచాడు చిన్నన్నయ్య. వాడి నోటికి దడిసి చాలామంది ఆగారు.

"అదికాదురా..." అని దీర్ఘం తీస్తూ బామ్మ మాట్లాడబోయింది.

మెల్లిగా ఆవిడ కుర్చీ దగ్గరకు వెళ్ళి నిలబడి, "ఇదుగో, బామ్మా! అమ్మ ఉన్నంతకాలం నిన్ను ఒక్క మాట అననీయలేదు మమ్మల్ని... ఆ గౌరవం ఇప్పుడుకూడా దక్కించుకో" అని విసురుగా లోపలికి వెళ్ళాడు.

ఐదు నిమిషాల్లో స్నానం చేసి ధోవతి, అంగవస్త్రంతో వచ్చాడు. ఏనాడూ చిన్నన్నయ్య కర్మ, క్రతువు వీటిల్ని నమ్మలేదు. అమ్మ ఎంత బతిమాలినా ఏరోజూ కూడా తన మనస్సుకు ఇష్టం లేని తతంగం చేసే రకంకాదు. కానీ, ఈనాడు పెద్దన్నయ్య హక్కు కాపాడడానికి తలఒగ్గాడు.

అటు పెద్దన్నయ్య మధ్య చిన్నన్నయ్య, మరొక పక్క నాన్న ముగ్గురు ముందుగా - వెళ్ళిపోతున్న అమ్మ.. మూడు ప్రమిదలలో వత్తులు కలిపి భగవంతుడే వెలిగించిన దీపశిఖలా ఉన్నది. ఏదో తెలియని మైకం నన్నావరించింది.

రెండూ చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్నాడు పెద్దన్నయ్య.

"ఏమైంది అమ్మ? మన దగ్గిరే ఉంది!" అని అన్నయ్యను ఓదారుస్తున్నాడు చిన్నన్న.


"లేదురా! అమ్మ లేదని ఏడవడం లేదురా! అమ్మ నన్ను ఎంత ప్రేమించిందో నాకు తెలుసు. మనని ఇంత ప్రేమించి, మనల్ని విడిచి ఎక్కడికి పోతుంది? మన ఊహకందని ఏదో లోకంలో నిరంతరం ఉంటుంది. ఇంతకాలం స్వర్గమంటే నవ్వొచ్చేది నాకు... కానీ, అమ్మలాంటి దేవతలు ఎక్కడో ఒక చోట ఉంటారు. అదే స్వర్గం!" అన్నాడు పెద్దన్నయ్య.

"మృత్యువులో ఎన్ని అందాలున్నాయో? ఇలాంటిదే ఏదో లోకం అక్కడా ఉందేమో! అక్కడ అందరం కలుసుకుంటామేమో! కాలమే మధ్య పరదా..." నా ఊహ ఇది. ఈ స్వర్గం ఎంతమంది కవులను, మేధావంతులను భ్రమింప చేసింది! నిజంగా స్వర్గమనేదే ఉంటే, అక్కడ అమ్మ ఉండనిదే అది స్వర్గమెలా అవుతుంది? మా అమ్మ ఉంది... ఉంటుంది... అక్కడ.!

****

# జీవుడి ఇష్టము

## విశ్వనాథ సత్యనారాయణ



(రచనాకాలం-1941)

*నా జీవుడు ఈ శరీరాన్ని పట్టుకున్నాడు. వాడంతట వాడు వదిలిపోడు. ఆ నా చనిపోయిన భర్త కోసం, పిల్లల కోసం గుండె అటుమటించి చావటం, మాహాగ్ని జ్వాలలతో మగ్గిపోవడం ఈ జీవుడికి ఇష్టం. ఈ జీవుడికి ఇదియొక అనుభవం. ఆ జీవుడు తనంతట తాను చచ్చిపోడు. చచ్చిపోవటానికి ఇష్టపడడు. సౌఖ్యమనుభవిద్దామని కాదు దుఃఖమనుభవిద్దామని.*

ఒక మారుమూల సముద్రంలో ఒక ద్వీపం ఉంది. ఆ ద్వీపం కూడా ఎక్కడో మారుమూల ఉంది. ఓడలమీద సముద్రాలను నాగరకులు గాలించారు. అంత గాలించిన ఆ ద్వీపం ఒక పట్టాన కనిపించలేదు. నాగరికులు సర్వ ప్రపంచము, సముద్రపు నీళ్ళలో తేలిన ప్రతిమంటిగడ్డ తాము సాధించామని అనుకున్న తరువాత ఆ ద్వీపం ఉన్నదని తెలుసుకునేందుకే కొన్నివేల ఏండ్లు పట్టినవి. తెలుసుకోవటమే ఆలస్యము. మతాలు, వర్తకులు, తుపాకులు అక్కడికి చేరినవి. ఆ ద్వీపం గూడా డిటో ప్రకారం అయింది.

అయితే ఆ ద్వీపంలో వాళ్ళు ఇతర ప్రపంచంలో లొంగిపోయిన ఇతర ద్వీపనివాసులకంటే కొన్ని వేల సంవత్సరాలు ఎక్కువ స్వాతంత్ర్యం అనుభవించారు. అందుచేత వాళ్ళ బానిసతనం అంత తేలికగా అలవాటు చేసుకోలేకపోయినారు. ఇతరచోట్ల మల్లేనే అక్కడా తిరుగుబాట్లు, మరఫిరంగులు, కాల్పులు.

ఒక నాగరిక జాతి సేనా నాయకుడు ఆ ద్వీపానికి సైనిక నియంత. అతడు బ్రహ్మచారి. అనగా అవివాహితుడన్నమాట. ఆ ద్వీపము శీతమండలాల్లో ఉండటం మూలంగా అక్కడి జనులు తెల్లనివాళ్ళు. చర్మము తెల్లన. ఇతర ఖండములలోని అనాగరికులు వంటివారు. అనగా కోట్లకొలది సంవత్సరాలు బ్రతికిన జాతి అన్నమాట, చెట్టులో - పుట్టలో, సూర్యునిలో, కాలువలో - కొండలో, మెరుపులో - మేఘములో నేదో దివ్యశక్తియున్నదని దాని నారాధించిన వాళ్ళు. మెరుపును చూస్తే జేజేలు పెడతారు. మిణుగురు పురుగులను చూచి తొలిగిపోతారు. ప్రాణశక్తి వంటిది వాళ్ళకు మహా గౌరవము. ప్రాణాన్ని నేల క్రింద పడవేసి రాయరు. జీవుణ్ణి కాలిక్రింద బెట్టి త్రొక్కరు. బంగారము నాణెముగా వాడుకోరు. దానియందు తేజశ్శక్తి వున్నదని ఆరాధిస్తారు. కుండ పెంకులలో వండుకుని తింటారు. లోహపాత్రలు నాగరికత అని యెరుగరు. శరీరావయములు కావలసినంత మాత్రము కప్పుకొంటారు. నాగరికులై ఒళ్ళంతయు కప్పుకోరు. ఈ యనాగరికులు నాగరికులయ్యే రోజులు వచ్చి ఆ ద్వీపం నాగరకుల కంటబడ్డది.

సైనిక నియంత ఒక స్త్రీని చూచాడు. ఆమె అందం అతని కళ్ళు పట్టరాకుండా ఉండిపోయింది. ఆ సాయంత్రం ఆవిడ మొగుడికి కబురు పంపించాడు - నీ భార్యని నాకు తోలిపెట్టమని. ఆ జీవుడు ఏమి చేస్తాడు. ఇంతవరకే తమ ద్వీపంలో జరిగిన ఘోరాలు అతనికి తెలుసు. అయినా జీవుడు పెనుగులాడడం స్వభావం. అది అన్యాయమనీ, తన ప్రాణము పోయినా తాను తన భార్యను వదిలిపెట్టనని కబురంపించాడు. నియంతకు కోపం వచ్చింది. పదిమంది సైనికులు, తుపాకులతో వాని ఇంటికి వెళ్ళాడు. అతడు వీళ్ళు వస్తారని తెలిసి పొయ్యిలో పెట్టుకునే పొడుగాటి పుల్లలు తానొకటి, తన పెద్ద కొడుకొకటి చేతులలో పుచ్చుకుని, తమ గుడిసె ముందర నిల్చున్నారు. వారి ఆయుధాలను, వాళ్ళను చూస్తే నియంతకు నవ్వు వచ్చింది. అతడు "ఎందుకు నవ్వుతావు?" అని అడిగాడు. నియంత ఇట్లా అన్నాడు" "ఓరి మూర్ఖుడా! మా తుపాకుల ముందు నీ కట్టెపుల్లలు నిలుస్తవా?" అని, అతడన్నాడు కదా - "నాకట్టెపుల్లలు నీ సమాధానం చెప్పవలెనని కాని మరొకదానికి గాదు" అని.

నియంతకు కోపం వచ్చింది. ఒక్క కత్తి విసురుతో తండ్రి కొడుకులు తలలు తెగిపోయినవి. నియంత ఆ గుడిసెలో ప్రవేశించి అతని భార్యను తీసుకు రాబోయినాడు. ఆరేండ్ల మొదలు చనుబాలు త్రాగే శిశువు వరకు నలుగురు పిల్లలు గుడిసెలో ఏడవ మొదలు పెట్టారు. ఆ స్త్రీ తన పిల్లలను వదిలి రాలేకపోయింది. భర్త శవం, కొడుకు శవం మీద బడి ఏడవడం మొదలు పెట్టింది. సైనికులు నియంత ఆజ్ఞతో పెద్ద పిల్లలను ముగ్గురినీ తల్లి చేతులలోంచి లాక్కుని పది పదకొండుసార్లు విదిలించి వేయగా వేయగా వాళ్ళు దెబ్బలు తగిలి, ఉస్సురని ప్రాణాలు కడవట్టి చనిపోయినారు. ఆ స్త్రీ పాలు త్రావు పిల్లతో నియంత ఇంటికి వెళ్ళింది.

ఈ కథ జరిగి అయిదేళ్ళయింది. పాలు త్రాగే పిల్లకు అయిదేండ్లు వచ్చినవి. ఆ స్త్రీ ఆ పిల్లతో కాలం పుచ్చుతోంది. ఒక రోజున నియంత వచ్చాడు.

నియంత - ఆ పిల్ల కూడా పోతే గానీ నీవు నాతో సరిగా ఉండవు.

స్త్రీ - నీ కన్న కర్కోటకుడవు నీవే! నీవు మనుష్యుడవు కావు. ఈ పసిపిల్ల ప్రాణములు కూడా తీస్తావా?

నియంత - నిన్ను తీసుకువచ్చినప్పుడు ఇది పసిపిల్ల. ఇప్పుడు పసిపిల్ల కాదే! దీని ఈడు పిల్లలను అప్పుడు నీ దగ్గర నుండీ లాగివేయలేదా? అట్లాగే ఇప్పుడూనూ.

ఆ స్త్రీకి అతనితో అయిదేండ్లున్న తరువాత అతని ఏ మాటకు ఎంత అర్థమో తెలిసినది. తనబిడ్డ తనకు మిగులదని ఆమెకు తెలిసింది. ఆ పిల్లను తీసుకు వెళ్ళి అతని చేతిలో పెట్టి "ఇదిగో, పిల్లను చంపి వేయి. ఈ పిల్ల ఉన్నన్నాళ్ళూ నేను దానిని వదిలి పెట్టలేను" అన్నది. అతడు ఆ పిల్లను ఆమె ఎదుటనే కత్తితో రెండుగా నరికాడు. ఆమె ఏడుస్తూ వెళ్ళిపోయింది.

ఆమె కొన్ని రాత్రులు ఉరి పోసుకుందామనుకుంది. పోసుకోలేదు. ఆమె కొన్ని రాత్రులు సముద్రములో బడి చద్దామనుకుంది. చావలేదు.

ఆమె కొన్ని రాత్రులు కిరసనాయిలు మీద పోసుకుని నిప్పు ముట్టించుకుందామనుకుంది ముట్టించుకోలేదు.

ఇల్లా ఎన్నో అనుకుంది. ఏమీ చేయలేదు. తరువాత కొన్నాళ్ళకు ఒక రాత్రి నియంత తప్ప తాగి మదించిన కళ్ళతో ఆమె ఉన్న గదిలోనికి వచ్చాడు. "తనకు దుఃఖానికి భేదము లేదు" అన్నట్లుగా ఉన్న ఆమెను చూచాడు. ఇట్లా అన్నాడు.

"నీ మగడు, నీ పిల్లలు పోయి పదేళ్ళయింది. నీ పసిపిల్ల పోయి అయిదేళ్ళయింది"

స్త్రీ -నా ద్వీపపు స్వాతంత్ర్యం పోయి పాతికేండ్లయింది.

నియంత - (వెటకారముగా నవ్వి) ఇంకా ఎన్నాళ్ళీ దుఃఖం?

స్త్రీ - ఈ శరీరం వున్నన్నాళ్ళు.

నియంత - నీకు ఏమి తక్కువగా వుంది? పూర్వం కన్న మంచి దుస్తులు ధరిస్తున్నావు. పూర్వం కన్నా మంచి ఇంట్లో నివసిస్తున్నావు. పూర్వం కన్నా మంచి భోజనం చేస్తున్నావు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ జాతి కన్నా నా జాతి గొప్పది. నీ భర్త కన్నా నేను గొప్పవాడను.

స్త్రీ - నీవు నా భర్తకన్నా గొప్పవాడవు కావు.

నియంత - (కోపముతో) కానా! ఎట్లు కానో చెప్పుము.

స్త్రీ - మీకు తుపాకులున్నవి. కత్తులున్నవి. అతనికి ఏమీ లేవు. అయినా తన భార్యను, పిల్లలను రక్షించుకునేందుకు కర్ర పుచ్చుకుని నిలబడ్డాడు. రక్షించలేనని తనకు తెలుసు. అయినా తన ధర్మం తాను చేశాడు. తాను చచ్చిన తరువాత గానీ నిన్ను నా దగ్గరకు రానీయలేదు. నేను నిజముగా నీ భార్యనై వుంటే నీకన్నా బలవంతుడు నాకోసం వస్తే, నీవు పారిపోయేవాడవు. నీవు వట్టి పిరికిపందవు.

నియంత - (కోపముతో) నేను పిరికిపందను కాదు.

స్త్రీ - నీవు పిరికిపందవని నాకానాడే తెలియును. నీవు ధైర్యస్థుడవైనచో నింకొక కర్ర పుచ్చుకుని అతనినెదిరించెడివాడవు. అంతమంది సైనికుల నేల తెత్తువు?

నియంత - (నవ్వి) అయినచో ఆ చచ్చు వెధవను నేను కర్ర పుచ్చుకుని ఎదిరించలేకపోయితిననియా నీ యుద్దేశ్యం?

స్త్రీ - అతడు చచ్చిపోయినాడు. నీ మాటకు రుజువు ఏమున్నది? ఇప్పుడు నీ ధైర్యాన్ని నీవు నాకు రుజువు పరచలేవు. నిజంగా నీవు ధైర్యస్తుడవే అయితే అప్పుడలా చేసి యుండవు.

నియంత - నాకు ధైర్యము లేకపోవుట కాదు. నాకప్పుడే తెలివి లేకపోయింది.

స్త్రీ - మా జాతిలో తెలివికి ధైర్యానికి ఎక్కువ భేదం లేదు. న్యాయానికీ తెలివికీ ఎక్కువ భేదం లేదు. మాకు న్యాయమే తెలివి. తెలివే ధైర్యం.

నియంత - మరి ఇటువంటి వారితో, నాతో నీవు సంసారం ఎందుకు చేస్తున్నావు?

స్త్రీ - నేను నీతో సంసారం చేయటం లేదు.

నియంత - ఈ మాటలు వింటే ఎవరైనా నిన్ను మూఢురాలవనుకుంటారు.

స్త్రీ - నేను వాళ్ళని మూఢులనుకుంటాను.

నియంత - అయితే నీకు నాతో ఉండటం ఇష్టం లేదనమాట.

స్త్రీ - లేదని నీతో చెప్పుట ఇది ఎన్ని లక్షలసారో.

నియంత - నీవు నన్ను ప్రేమించుటలేదని నాకు తెలుసు, నీప్రేమను సాధు మార్గాన సంపాదించవలసింది. అప్పుడు ప్రేమించేదానవు.

స్త్రీ - నీ జాతి అంతా నశించిన తరువాత నిన్ను ప్రేమిస్తాను.

నియంత - నిన్ను చంపేస్తాను.

స్త్రీ - పదేళ్ళనుంచీ అలా చేస్తావేమోనని ఎదురు చూస్తున్నాను.

నియంత - నీకు చావంటే అంత ఇష్టమా?

స్త్రీ - అంతా ఇంతా ఇష్టమా?

నియంత - అయితే చావడానికి మార్గాలు లేవా?

స్త్రీ - ఉన్నవి.

నియంత - అయితే ఎందుకు చావవు? సముద్రంలో పడిచావచ్చు. ఉరిపోసుకుని చావవచ్చు.

స్త్రీ - నాకట్లా చావడం ఇష్టం లేదు.

నియంత - ఎట్లా చావడం ఇష్టం?

స్త్రీ - నీకు కోపం తెప్పించి నువ్వు నన్ను చంపితే చావాలని.

నియంత - అంటే, నీకు నా మీద ప్రేమ ఉన్నదన్నమాట.

స్త్రీ - అవును, ఉంది ఆ ప్రేమ ఎల్లాంటిదంటే - నా భర్త, నాపిల్లలు నీచేతి మీదుగా చచ్చారు గనుక అలా నీచేతిమీదుగానే చద్దామన్నంత ప్రేమ.

నియంత - ఈ మాట్లకేమి గానీ నీకు చావడానికిష్టంలేదు.

స్త్రీ - చాలా పొరపాటు. చావటానికిష్టం ఉన్నది. ఆ ఇష్టము కూడా ఒళ్ళంతా తగలబెడుతూ ఉన్నంత ఇష్టము. కానీ చావు రెండు రకాలు, ఒకటి తనంతట తాను చచ్చేచావు. రెండవది ఎదుటివాళ్ళు చంపితే చచ్చేచావు. నాకు రెండవ చావే ఇష్టము.

నియంత - అంటే నాతో కలసి సుఖించడం ఇష్టమన్నమాట.

స్త్రీ - నిన్ను నేను పదేండ్ల నుంచీ ఎరుగుదును. నీవు పశువువు. నీనాగరికత అంతా నీవు చేసే సురాపానంలో, నీవు ధరించే దుస్తుల్లో, నీ చేతిలో నున్న తుపాకీ మందులో ఉంది. నీ మనసులో లేదు. నీ జాతిలో లేదు. నీ సృష్టిలో లేదు. నిన్ను నేను ప్రేమించడం లేదు, నీవు మనుష్యుడవేకాదు. నేను బ్రతుకుతున్నానన్న విషయం నీకాశ్చర్యంగా ఉంది. నేను ఉరిపోసుకునో, సముద్రంలో పడో చావడం నా జీవుడికిష్టం లేదు. నా జీవుడు ఈ శరీరాన్ని పట్టుకున్నాడు. వాడంతట వాడు వదిలిపోడు. ఆ నా చనిపోయిన భర్త కోసం, పిల్లల కోసం గుండె అటమటించి చావటం, మహాగ్ని జ్వాలతో మ్రగ్గిపోవడం ఈ జీవుడికి ఇదొక అనుభవం. ఆ జీవుడు తనంతట తాను చచ్చిపోడు. చచ్చిపోవటానికి ఇష్టపడడు. సౌఖ్యమనుభవిద్దామని కాదు. దుఃఖమనుభవిద్దామని, సౌఖ్యమో దుఃఖమో ఈ శరీరంతో పుట్టి, ఈ శరీరానికి సంబంధించినవి అనుభవించడమే అతనికిష్టం. ఈ శరీరానికి ఈ జీవుడికి ఒక ఎడతెగరాని లంకె, ఈ శరీరంతో ఈ జీవుడికి ఇష్టమైన అనుభవము వాడు అనుభవమనుకుంటాడు. మరి ఈ శరీరంతో నేను నేను నీతో సంసారం చేస్తున్నాను గనుక అది వాడి ఇష్టమే అనుకుంటావు కాబోలు. అల్లా కాదు. నా అంతట నేను చావటం నాకిష్టం లేదు. నీవు చంపితే చచ్చిపోవటం చాలా ఇష్టం. మృత్యువు దానంతట అది వస్తే చావటం ఇంకా ఇష్టం. అట్లాగే ఈ జీవుడు ఈ శరీరంతో తన ఇష్టం వచ్చిన సౌఖ్యాన్ని అనుభవించి సౌఖ్యం అనుభవించాలనుకుంటాడు. ఇతరుల వల్ల బలవంతంగా చేయబడ్డ అనుభవం అదివాడికి సౌఖ్యం కాదు. అది దుఃఖమే. ఆ దుఃఖమైనా అనుభవించడం అతని కిష్టం.

నియంత - అయితే నీవు నాకక్కరలేదు.

స్త్రీ - నేను నిన్నడగలేదు.

నియంత - నిన్ను చంపుతాను.

స్త్రీ - ఊరికే అనటమెందుకు?

నియంత ఆమెను చంపెను. చనిపోవుచున్న ఆమె పెదవి మీద సంతోషపు నవ్వు తాండవించెను. ఆమె కొన ఊపిరితో ఇట్లనెను. "నీవు నీ జన్మలో చేసిన మంచిపని ఇది ఒక్కటియే. నేను చనిపోవుచుంటిని గదా! నీవు తరువాత ఏమి చేసెదవు?"

నియంత - మరల నింకొక స్త్రీని సంపాదించెదను.

స్త్రీ - నీకు తగినమాట! నీ జాతికి జీవుని ఇష్టము తెలియదు.



# వేలంపాట

## అర్నాద్



"అర్నాద్" పేరుతో సుప్రసిద్ధ కథా, నవలా రచయితగా అఖిలాంధ్ర పాఠకులకు సుపరిచితులు - డి. హరనాథ్ రెడ్డి. 1-7-1946న జననం. డిప్యూటీ మేనేజర్ (మెటీరియల్స్)గా బి.హెచ్.పి.వి., విశాఖపట్నంలో ఉద్యోగిస్తున్నారు.

సహధర్మచారిణి 'రమణీమణి'. పిల్లలు - రవీంద్రనాథ్, నవీన్.

మొదటి కథ 'వేలంపాట' ఏప్రిల్ 1972లో 'స్వాతి మాస పత్రిక'లో అచ్చయింది. ఇప్పటికి 44 కథలు, 3 నవలలు ('చీకటోళ్ళు', 'ఈతరం స్త్రీ', 'సాంఘికం') రాశారు.

*( 'స్వాతి ' మాసపత్రిక - ఏప్రిల్, 1972 )*

'శ్రీనివాసా! శ్రీ వెంకటేశా!

ఐదే అయిదు రూపాయల్!

పాడాలి. పెద్ద పాట పాడాలి సార్. ఇంత చక్కటి క్లాతు మళ్ళీ మీకు దొరకదు. ఇంత చక్కటి క్లాతు మన వైజాగులో ఏ షాపులో కానరాదు. భలే బట్ట సార్... పాడండి సార్ పాడండి... ఎంత తాతగారూ.. పదా!... పది రూపాయల్. బొంబాయి టెర్లిన్ పీసు పది రూపాయలు.. ఎంత సార్... కొద్దిగ్గట్టిగ చెప్పండి సార్. వెధవది నాక్కొద్దిగ చెవుడు... పదిహేనా.. ఆహాఁ పదిహేను రూపాయలు..పాడండి సార్ పాడండి... ఇందులో దగా లేదు. మోసం లేదు. పాడండి సార్ పాడండి.. అయ్యా! మిమ్మల్నే .. అలా నించుండిపోయారేం.. మీరు గూడా పాడండి సార్.. పాడి మీరే కొనండి సార్. బ్రహ్మాండమైన బట్టండి. మీ తెల్లటి ఒళ్ళుకి ఈ క్లాతు ఫస్టుక్లాసుగా ఉంటాదండి... నిజం సార్.. ఎంతంటారూ... ఇరవయ్యా.. అదీ అలా పాడండి సార్... ఇరవై రూపాయలు. ఇది నాణ్యమైన క్లాతండి. ఈ క్లాతు ఒట్టి బ్లూకలర్లోనే కాదు. ఆకుపచ్చ, తెలుపు, నేరేడు రంగుల్లో గూడా ఉన్నాయండి. అయ్యా! అయిదు వెయ్యండి. పది వెయ్యండి. మూడు వెయ్యండి. రెండు వెయ్యండి... అర్ధవేసినా ఫర్వాలేదు.. బాబూ! ఇరవై మూడున్నరా.. ఆ బాబుగారు ఇరవై మూడున్నరంటున్నారు... ఇరవై మూడున్నరా... ఇరవై మూడున్నరా...

అయ్యా! మీరిలా పాడితే నేను నెత్తిన కొంగేసుకోవాల్సిందే నాకు లాభాలు అక్కర్లేదండి అసలు వస్తే చాలు. ఒక్కమాటండి... మామూలు టెర్లిను కమీజు గుడ్డ కొనాలంటేనే కనీసం నలభై, యాభై అవుద్ది. అవునా? మరి మీకిది న్యాయమేనా? ఇంత బ్రహ్మాండమైన బొంబాయి బట్టని ఇరవయ్యీ, ఇరవై మూడున్నరని నాన్సెయ్యడం బావుందా?... అయినా నాకు తెలీకడుగుతా... ఎందుకుసార్ వందేళ్ళపాటు మన్నే వస్తువుని కొనడానికి వెనకడుగేస్తారూ? ఎందుకు సార్ జేబులో డబ్బుతీయడానికి జంకుతారూ.. అసలు మనిషన్నవాడు భలే గమ్మత్తయినోడులెండి. బ్లాకులో తెలుగు సిన్మా టిక్కెట్టు రూపాయిది అయిదుక్కొంటాడు. నిషా ఎక్కని గవర్నమెంటు సారా నిషా ఎక్కుతుందేమోనని రోజూ అయిదేసి ఆరేసి, ఆర్పేస్తాడు. రెండు రూపాయలిచ్చి కుండడు కుంకెడుగాయ పుల్లని కల్లు అనుకుని కళ్ళు మూసుకుని తాగేస్తాడు. ఇంకా సానిదాని కనీ, బ్రాకిట్లు కనీ బోల్డు డబ్బు గుమ్మరించేస్తాడు. దాని వల్ల ఏమొస్తుందట? చెప్పండి. ఒళ్ళు పాడవుద్ది. పెళ్ళాం, బిడ్డల్ని ఏడిపించడం జరుగుద్ది. అంతకు తప్పించి ఏవుందందులో... అదే చూడండి.. ఆ వెధవ ఖర్చుతో ఒక కమీజు గుడ్డ కొనండి. ఆ దిక్కుమాలిన ఖర్చుతో ఒక దుప్పటి గుడ్డ కొనండి.. అప్పుడు మీ పెళ్ళాం బిడ్డలు ఎంత సంతోషిస్తారో? ఆలోచించండి. అసలు మనిషికి గౌరవం ఇచ్చేదీ, విలువ పెంచేదీ వంటి మీద బట్ట చూసే గదండి ఎవడిక్కావాలండీ వెధవ గుణం... అంచేత ఈ టెర్లిను బట్టను పాడండి పాడి కొనండి.'

ఆ రీతిలో ఉపన్యాసం సాగిస్తాడు చంద్రయ్య. దేన్ని దేనితో కొట్టాలో, ఎప్పుడు ఏ తోవని నడవాలో చంద్రయ్యకు బాగా తెలుసు.

చంద్రయ్య పర్సనాలిటీ, ధరించే లాల్చీ, పంచీ, కళ్ళజోడు ఇంచుమించు అల్లురామలింగయ్యలా ఉంటాడు. వయసు ఇంతని చెప్పలేం గానీ తల వెంట్రుకలు తెల్లబడుతున్నాయి.

చంద్రయ్య వట్టి కమీజు గుడ్డలే కాదు చీరలనీ, జాకిట్టు గుడ్డలనీ, దుప్పట్లనీ, తువ్వాళ్ళనీ - ఒకటేమిటి రకరకాలవెన్నో వేస్తాడు వేలం - బ్రాసరీలు తప్ప. అయితే బ్రాసరీలు వేల వేయకపోవడం ఆశ లేక కాదు, ధైర్యం లేక!

ఏవంటే అతన్ని బ్రాసరీలు వాడుతున్న నిండైన కూతురుంది. ఆ ఉండడం కూడా వేలం పాటలో అతని పక్కనే ఉంటుంది. అందుకే బాగోదు అని సరిపెట్టుకున్నాడు.

వేలం పాటలో కూతురెందుకబ్బా?

వేలమెయ్యడానికి మాత్రం కాదు. వెంట వెంటనే పద్దులు రాయడానికి, బట్టలు అందరికీ చూపడానికి.

ఘోరం! పద్దులు రాయడానికి, బట్టలు చూపడానికి వయసులో ఉన్న ఆడపిల్లే కావాలా? అందులోనూ కూతురు?

అంచేత చంద్రయ్య తన కూతురుని వ్యాపారానికి వినియోగించడంపై పనిపాటులేని కొంతమంది కొన్ని విధాలుగా అనుకున్నారు. పనీపాటు ఉన్న వాళ్ళు కూడా కొన్ని విధాలుగా అనుకున్నారు.

'బహుశా ఆమె చంద్రయ్య కూతురు కాద'న్నారు. 'చంద్రయ్యకు పుట్టిందే గానీ పెళ్ళి భార్యకు పుట్టింది గా'దన్నారు. 'కాదు కాదు పెళ్ళి భార్యకు పుట్టిందేగానీ, చంద్రయ్యకు పుట్టింది గా'దన్నారు. 'ఇవేవీ కాదస్ - అప్పారావు కంపెనీలో దాన్ని మూడొందలికి కొన్నా'డన్నారు. 'అవునవును లేకుంటే అది అంత పబ్లిగ్గా ఎందుక్కులుకుతాదీ' అన్నారు.

నిజానికవన్నీ నిజాలు కావు. చంద్రయ్యకూ పెళ్ళి భార్యకూ నిజంగా పుట్టిన కూతురు ఆమె. పెంకిగా, గారాబంగా, అల్లారుముద్దుగా పెరిగిన కూతురు ఆమె. ఆమె పేరు చంద్రిక.

మరో నిజం. చంద్రయ్యకు పెళ్ళి భార్యంటూ ఒకతీ, పెళ్ళికాని భార్యంటూ మరొకతీ లేరు. ఒకతే భార్య. గొప్ప ఇల్లాలు. పేరు చంద్రమతి. అతడు హరిశ్చంద్రుడు కాదుగానీ ఆమె చంద్రమతే - చంద్రమతి.

వయసూ, అందమూ ఉన్న గుంటని వ్యాపారంలో పెట్టాలేగానీ - పెడితే ఆ వ్యాపారం దేదీప్యమానంగా వెలుగుతుందని చంద్రయ్యకు తెలుసు. అందుకే అందం, వయసూ ఉన్న తన కూతుర్ని వ్యాపారంలోకి దించాడు.

వ్యాపారంలోకి దించేముందు పాఠం నేర్పాడు. చాలా చిన్న పాఠం.

'కదలనీయకుండా మగాళ్ళ కాళ్ళని నీ కళ్ళతో బంధాలేసేయమ్మా. మిగతాది నే చూసుకుంటాగా' - అదీ పాఠం.

"ఏటి నాన్నా! నీదంతా చోద్యంగానీ, కాళ్ళని గొలుసుల్తో బంధిస్తారు. లేకుంటే తాడుతో బంధిస్తారు. కళ్ళతో బంధిస్తారేటి ఎక్కడైనా?" - అందమైన కళ్ళు టపటప్ప లాడిస్తూ, అమాయకంగా ముద్దుగా అంది చంద్రిక.

"అయ్యో! ఎలా బతుకుతావే తల్లీ" అని భయం వెలిబుచ్చి - "అది చాలా తేలికమ్మా" అన్నాడు.

'తేలికా!' స్వగతంలా అంటూ కళ్ళు చిత్రంగా పెద్దవి చేసి - "హౌ ఈజ్ ఇట్ పాసిబుల్ ఫాదర్" అని అడిగింది ఇంగ్లీషు పెద్దగా చదువుకోకపోయినా.

'ఎలాగ' అన్న ప్రశ్నకు ఎలాగ జవాబు చెప్పాలో తెలీక, తికమకపడి ఇలాగ... ఇలాగ అన్నాడు చంద్రయ్య - ఆడమనిషిలా కులుకుతూ.

ఆ కులుకుల్ని చూసి పకపక విరగబడి నవ్వింది చంద్రిక.

సిగ్గుపడి పోయేడు చంద్రయ్య.

అంచేత చేసి చెప్పలేమనీ, చెప్పి చూద్దామని, "విజయలలితలా కళ్ళు నిషగా పెట్టు. జ్యోతిలచ్మిలా వయ్యారం ఒలికించు ఏటి?.... అదీ చేతగాకపోతే చెక్కిన శిల్పంలా అందంగా నిలబడు చాలు. తక్కిన్దినే చూసుకుంటానన్నాగా" అని ఏవీ కాకుండా అనేశాడు.

"ఛీ! ఏవిటి నాన్నా! పాడు మాటలు. కూతుర్కి తండ్రి చెప్పాల్సినవేనా ఇవి?" - అలా అందేగానీ ఆమె కిసుమంత బాధ కలగలేదన్నది నిజం.

"అయ్యో! పిచ్చితల్లీ. యాపారమమ్మా యాపారం. యాపారాభివృద్ధికి తండ్రేటి? కూతురేటి? నీ ఎర్రిగానీ మనం బాగుండాలంటే మన యాపారం బాగుండాలి. యాపారం బాగుండాలంటే కొన్ని కొన్ని పన్లు చేయాలి. కూటి కోసం కోటి విద్యలన్నారు గదే అయినా నిన్ను చేయమంటున్నది వట్టి యాక్సనే తల్లి.. వట్టి యాక్సను. చూడు మరి అంజిలీలు, సావిత్రీలు నిజమైన మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య బోల్డు మగోళ్ళ చేత బోల్డు మంగళ సూత్రాలు కట్టించేసుకోవడం లేదూ? మరవన్నీ నిజంగా పెళ్ళిళ్లేనంటావా? ఆళ్ళంతా నిజంగా మొగుళ్ళేనంటావా? చెప్పు మరి" అని ఎదురు ప్రశ్న వేసి నడి వీధికెక్కమన్నాడు కూతుర్ని.

పదిమందిలో కులకడం ఎంతో అదృష్టంగా భావించి చంద్రిక నిస్సంకోచంగా నడివీధిలోకి తుర్రున పరిగెత్తింది. చంద్రిక్కి ముస్తాబై మగాళ్ళ మధ్య నిలబడ్డం అదొక సరదా! అదొక సందడీ!

చంద్రయ్య కిదేం పాడుబుద్ధి? ఎంత వ్యాపారమైతే మటుకు కూతుర్ని నడివీధిలో కులకమంటాడా? తండ్రి చెప్పాల్సిన పాఠమేనా అది? - కూటి కోసం కోటి విద్యలనడం బావుంది. కానీ చంద్రయ్య కూటికేం లోటొచ్చిందనీ? అమలాపురంలో భూములూ, వైజాగులో పెద్దమేడా ఆ మేడలో నున్న భార్య మెడలో యాభై తులాల పాత బంగారం కలకళ్ళాడుతుండగా - మరిక కూటికి లోటేమిటి?

తనకు వయస్సు కూడా ఐదోపడిలోనో, ఆరోపడిలోనో, పడింది గదా. రామా కృష్ణా అంటూ పడుండగూడదూ? ఎందుకు పడుంటాడూ? డబ్బు! డబ్బు! డబ్బు పిశాచి అతన్ని ఆవహించింది. ఆవహించి ఇరవై సంవత్సరాలుగా పట్టుకు పీకుతోంది. అన్నాళ్ళు వేలం పాటతో మేడలూ, భూములూ గడించింది చాలకా - ఈ మధ్య రెండు మూడేళ్ళగా వ్యాపారం కుంటుపడిందని - కూతుర్ని వ్యాపారంలోకి దింపేస్తాడా! ఎంత డబ్బుంటే మటుకు బజారుపాలైన చంద్రిక్కి మొగుడొస్తాడా? కూతురు బతుకు పాడయ్యాక గడించిన డబ్బెందుకూ? ఇంకా గడిచబోవడమెందుకూ?

అందుచేతనే చంద్రమంతికి ఏ మాత్రం ఇష్టం లేదు. 'ఒద్దు ఒద్దు' అని ఎంత మొత్తుకున్నా ఆమె మాటను మొగుడు గానీ, కూతురు కానీ లక్ష్యపెట్టలేదు. అసలు ఆమె మాటలకు ఆ ఇంటిలో విలువ లేదు.

ఇపుడు వేలం పాట వ్యాపారంలో చంద్రిక సర్వీసు రెండేళ్ళు. మరిక కులకడంలో ఎంత ప్రజ్ఞ సంపాదించేసుంటుందో ఊహించేయొచ్చు. చంద్రయ్య విజయలలితల్ని, జ్యోతిలక్ష్మిల్ని చూసి నేర్చుకోమన్నాడు గానీ - చంద్రికే వాళ్ళకు నేర్పగలదిప్పుడు.

ఏమైతేనేం - తండ్రి చల్లటి పలుకుల వల్లా, కూతురు వేడి కులుకుల వల్లా వ్యాపారం మూడు పూవులూ ఆరుకాయలన్నట్టుగా ధగధగా వెలిగిపోతున్నది.

అలా ధగధగా వెలుగుతుండగా...

ఒకరోజు...

పట్నానికి దూరంలో రెండూ మూడు మేడలూ, రెండూ, మూడొందలు గుడిసెలూ కలిసి నివసిస్తున్న ఊరులో, సంతలో, గోలలో, కుళ్ళు కాలవ కంపులో - పాటొకటి జరుగుతున్నది. వేలం పాట.... చంద్రయ్య వేలం పాట.

పెద్ద అరుగు మీద నిండా బట్టల్తో ట్రంకు పెట్టె - డబ్బుల పిడత - నలిగిన పద్దుల పుస్తకం - చిన్న బల్ల మీద పెట్రొమాక్సు లైటు - లాల్చీ పంచిలో చంద్రయ్యా - నవనవలో, ధగధగలో చంద్రికా.

ఆ వేలం పాట రిక్షా వాళ్ళనీ, విద్యార్థులనీ, కార్మికులనీ, దొరలనీ భేదం లేకుండా అందర్నీ ఆకర్షిస్తున్నది.

చంద్రయ్య దుప్పటి తాలూకా గొప్పని గమ్మత్తుగా పొగడుతుంటే - ఆ దుప్పటిని చంద్రిక వయ్యారంగా పట్టుకుని వివిధ భంగిమల్లో ఫోజు కొడుతూ నిషాగా చూస్తున్నది. తియ్యగా నవ్వుతున్నది. మాటాడకుండానే కొనమంటున్నది.

"చూచేరా! ఎంత అందమైన డిజైనో. ఇది మామూలు నాసిరకం దుప్పటి కాదు. చేనేత దుప్పటి. ఇంత నాణ్యమైన దుప్పటి ఖరీదు ఎంతో కాదు. ఎనిమిది రూపాయల పావలా మాత్రమే. ఎలాగనేరు? ఆరూపాయలు దారానికీ, రెండు రూపాయలు పని కూలికీ, ఒక పావలా నాకు లాభానికినీ. లాభం ఒక పావలా కన్నా ఎక్కువ నాకొద్దు సార్. మీ సొమ్ము నా కన్యాయంగా అక్కర్లేదు. ఏవిటి బాబూ దారం ఆరూపాయిలే అదంటావా? అయ్యోరామా! చిన్న దారపు ఉండే అమ్ముతుంది గదండీ ఇరవై పైసలూ. అలాంటిది ఇంత పొడవుదీ, దుక్కదీ నేయాలంటే ఎంత దారమవుద్దో లెక్కేయండీ? అందుకే గదండీ గాంధీగారన్నారు రోజుకో గంట రాట్నం వడకమనీ, అలా ఒడికితే దారం కుప్పలక్కుప్పలైపోయీ - కొన్ని మైళ్ళ పొడవున గోదాములు కట్టాల్సి వచ్చేది. అప్పుడు బట్టలసలు ఇంత ధరలో మండిపోయేవి కావూ. మీలాంటి వాళ్ళకు ఇలా అర్థం లేని అనుమానాలు వచ్చేవి కావూ. అయినా గాంధీగారు చెప్పినవి మనం ఏవిటి చేశాం గనుకా? ఆ మహాత్ముడు ఆశించిన ఆశయాలనే మంట గల్పుతున్నారుగదండీ మన దేశ నాయకులూ - సర్లెండి... మనకెందుకదీ. ఆః! బ్రహ్మాండమైన దుప్పటి సార్ ఇది. ఈ దుప్పట్లనే రాజకీయ నాయకులు వాడేది. ఈ దుప్పట్లనే సినిమా యాక్టర్లు వాడేది. అయ్యల్లారా ఇందులో దగా లేదు. మోసం లేదు. కారు చౌకలో దుప్పటి.. రెండే రెండు రూపాయలికి పాట పెడుతున్నా.. ఎలా పాడుతారో మరి... శ్రీనివాసా శ్రీ వెంకటేశా... రెండే రెండు రూపాయలు...

మూడూ... ఐదు.. ఆరు.. ఆరున్నరా.. ఆరున్నరా...

అయ్యా! అన్యాయం దుప్పటిని అయిదు, ఆరూపాయల్ని దాటనివ్వక పోవడం ఘోరం! ఈ నవనాగరికతలో, ఆలిండియాలో ఎక్కడ వెదికినా పది రూపాయలు తక్కువకి ఏ దుప్పటీ కానరాదు. ఆ రేటుకి మీరు నాకు చూపిస్తే మీ ఇంట్లో ఆర్నెల్లు అంట్లు తోముతా... నవ్వుతారేమిటి సార్. నాలో నిజం ఉన్నప్పుడు నాకేం భయం? చూడు నాయినా. తువ్వాలే అమ్ముతుంది గదా అయిదు రూపాయిల చిలుకూ... ఏమిటి నాయినా దుప్పటి పొడవు తక్కువంటావా? భలేవాడివే. ఆరడుగుల దుప్పటండీ ఇది. అసలు మీరు పొడవెదిగితే దుప్పటి కూడా ఎదుగుతుందిలెండి. (నవ్వులు) అయ్యా రెండు వేయండి. మూడు వేయండి. రూపాయి వేయండి అర్థవేయండి ఇందులో దగా లేదు. మోసం లేదు. మీకు ఇలాంటి చేనేత దుప్పటి దొరకడం కష్టం. అయ్యా రాబోయేది చలికాలం. మనం ఈ కాలాల్ని నమ్మలేం. మనం అన్ని విధాల జాగర్త పడాలి. ఎండకి గొడుగనీ, వానకి రయిను కోటనీ; చలికి దుప్పటనీ దేనికది - జాగ్రర్త

చేసుకోవాలి. ఏ కాలానికది చూసుకుందామనుకుంటే లాభం లేదు. ఈ కాలాలు కాలాల్లాగా లేవు. చూశేరూ! విజయ నగరంలో వర్షం ఉంది. కొత్తవల్సలో వర్షం ఉంది. అనకాపల్లెలో వర్షం ఉంది కానీ మన వైజాగులో లేదు వర్షం. ఇలా వుంది కాలం. అందుకే అంటున్నాను సార్. దుప్పట్లు కొని జాగర్త పడండి. ఈ రాత్రి నుంచే ఎముకలు పీల్చే చలి పుట్టొచ్చు. చెప్పలేం అంచేత ఈ దుప్పటి కొనండి. అందుకు పెద్దపాట పాడండి. పాడండి సార్ పాడండి. నాలోగానీ, ఈ దుప్పట్లో గానీ దగా లేదు. అయ్యా రెండు వెయ్యండి. మూడు వెయ్యండి.."

చంద్రయ్య వాక్ప్రవాహాన్ని ఆపేడు. ఊపిరి పీల్చుకున్నాడు. కూతురు మర చెంబులోనుంచీ ఇచ్చిన మంచినీళ్ళు తాగేడు. తాగేక ఉపన్యాసంలో మళ్ళీ మునిగిపోయేడు చంద్రయ్య. అదే సమయంలో చంద్రిక దుప్పటిని చూపిస్తూ - చూపేటప్పుడు అమరావతి శిల్పంలా ఫోజు కొడుతూ, వేడి వేడి కులుకుల్ని కురిపించేస్తున్నది.

ఎలాగైతేనేం పాట ఎనిమిది రూపాయలికి పెరిగేలాగా చేసేశారు ఇద్దరూ.

ఒకటోసారి. ఎనిమిది రూపాయలు. రెండోసారి. ఎనిమిది రూపాయలు. అదిగో మూడోసారి అనేస్తున్నాను. అనేస్తున్నాను అంటూనే చాలాసేపు జాగు చేసేడు.

దుప్పటి ఎనిమిది రూపాయలకు అమ్ముడయినందుకు చంద్రయ్య ఆనందపడిపోయేడు. పైకి మాత్రం "పావలా నష్టమని రాయి, ఎందుకొచ్చిన యాపారమో ఏటో" అన్నాడు చంద్రికతో

చంద్రిక నవ్వుకుంది. నవ్వుతూ పద్దు రాసింది. నవ్వుతూ, రాస్తూ అనుకుంది! 'పావలా నష్టమట! నాకు తెల్సు నాన్నా నీ బాషా. నాలుగు రూపాయల్లాభం కదూ' అని.

అప్పటికప్పుడే ఆ రకం దుప్పట్లు నాలుగు. నాలుగు పావలాల నష్టానికి అమ్మేశాడు.

"ఏమిటో ఈ యాపారం చేస్తున్నానన్న మాటేగానీ అంతా నష్టం. ఎందుకు చేస్తున్నానో ఏవిటో. అరచరిచి గొంతుక పడిపోవడమే గానీఏం లాభం? డాక్టర్లు కూడా నీ ఆరోగ్యం పాడయిందయ్యా. రెస్టు తీసుకో రెస్టు తీసుకో అంటున్నారు. ఇక మానేస్తే మంచిది. ఎందుకొచ్చిన గొడవ. ఇదిగో ఈ చీర వేలం వేసి కట్టేస్తాను. అసలే రానప్పుడు ఎందుకు మరి!"

అలా కట్టేస్తాను కట్టేస్తాను అంటూనే దుప్పట్లు మీద చీరలూ, చీర్ల మీద ఫేంటు ఫీసులూ, బ్లవుజు ఫీసులూ, తువ్వాల్లూ అవీ ఇవీ చకచకమని అమ్మేసాడు. ట్రంకు పెట్టె ఖాళీ చేసాడు. డబ్బుల పిడత నింపేసాడు.

పెట్టెలో ఇక ఒకే ఒక చీర మిగిలిపోయింది. చూస్తుంటే ఆ చీరేదో చంద్రయ్య కొంపలు ముంచటానికే మిగిలిపోయినట్టుంది.

అప్పటికే రాత్రి పది దాటింది. ఊరు నిద్రలో కొరిగింది. సంతలో కొట్లు మూయబడ్డాయి. చంద్రయ్య వేలం పాట దగ్గర చేరిన జనం అలా పోకుండా ఉండిపోయారంటే అది వయసులో ఉన్న చంద్రిక గొప్పతనమని వేరే చెప్పేదేముంది. చిత్రమేమిటంటే చంద్రయ్యకు టైము తెలియడం లేదు. అవును ఎలా తెలుస్తుంది? ఒక పక్క లాభాలు ముంచెత్తుతూ పిడత నిండుతుంటే.

ఆఖరి చీర మీద పెద్ద లాభమే తీద్దామన్న ఎత్తులో ఉన్నాడు చంద్రయ్య. చంద్రిక కూడా ఆ రోజుకి ఆఖరు బట్ట కదా అని శృంగారం, వయ్యారం పూర్తిగా ఒలిపేద్దామనుకుంది.

పెట్టిలో చీర తీసింది. తీసి నాజూగ్గా చీర పొడవంతా చూపించింది. చూపించి చీర రెండు చుట్టలుగా తన వంటికి చుట్టుకుంది. ఆ చుట్టుకోవడం భలే గమ్మత్తుగా అందంగా చుట్టుకుంది. కుడిచీర రెండు కొసలూ రెండేసి గజాల్లా వదిలేసి మధ్యభాగం కుచ్చిళ్ళు లేకుండా చుట్టుకుంది. కుడి చేతిని పైకీ, ఎడమ చేతిని కిందకీ వాల్చి ఒక డాన్స్ ఫోజులో నించుంది. చీర రెండు కొసల్లో వొకటి కుడి చేతి మీద, మరొకటి ఎడమ చేతి మీద అందంగా వేసి, వయ్యారంగా నిలబడింది - చక్కని ఫోజులో, చిన్నగా నవ్వుతూ, ఎటో చూస్తూ.

చుట్టూ చీకటిలో ఆమెకే పరిమితమయినట్టున్న పెట్రొమాక్సు లైటు వెలుతురులో ఆ చీరలో, మిలమిల మెరిసిపోతూ అప్సరసలాగున్న చంద్రికను చూసి మత్తెక్కిపోయారు కొందరు.

అలా మత్తెక్కించీ, మతులు పోగొట్టేస్తే - చంద్రిక తృప్తితో సాధించాననుకుంటాది ఏదో.

ఆ చీర ఖరీదు ఇరవై రూపాయలే - అయినా యా భైరూపాయలదేమో అన్నంతగా ఆ చీరకు కాంతి నిచ్చింది చంద్రిక. అంచేత ఆ చీరని యాభైకే అమ్ముదామనుకున్నాడు చంద్రయ్య.

చాలాసేపు చీరని గొప్పగా పొగిడాడు. పొగిడి 'శ్రీనివాసా శ్రీవెంకటేశా' అంటూ పాటకి పెట్టేడు.

అయితే పాట సరిగా సాగలేదు.

ఎలా సాగుతుంది? అందరి దృష్టి చీర మీదుంటే కదూ! చీర చుట్టుకున్న చంద్రిక మీదుంది. ఆమె అందాన్ని తిలకిస్తూ, ఆస్వాదిస్తూ మైమరుపుతో ఉన్నారు. అంచేత చంద్రయ్య ఒడుపు మాటలు ఎవరికీ వినిపించడంలేదు.

అయినా చంద్రయ్య చీర గొప్పతనం గురించి ఏదో చెప్తూనే ఉన్నాడు.

చంద్రిక్కి వ్యాపారంలో లాభాలు వస్తున్నాయా లేదా అన్నది అనవసరం. తనక్కావల్సింది ఒక్కటే. తన అందం అందర్నీ ఆకర్షిస్తున్నదా లేదా అన్నది. అంచేత ఆమె చాలా ఆనందంగా ఉంది. అందర్నీ మూకుమ్మడిగా కట్టేసి మూలపడేసానని గర్వపడిపోతున్నది.

నిజమే మరి. అక్కడ దృశ్యం ఎలా ఉందంటే చంద్రిక దిగొచ్చిన దేవతలా ఉంది. జనమంతా ఆ దేవత చేత శపింపబడ్డ రాళ్ళలాగున్నారు.

ఆ శపింపబడ్డవాళ్ళలో ఒక రౌడీ మూక ఉంది. వాళ్ళు అప్పటికే రెండు మూడు గుడ్డలు కొన్నారు. వాళ్ళు అప్పటికే మంచి మందు పట్టులో ఉన్నారు. చంద్రిక కులుకుల్ని చూసి మరీ నిషా ఎక్కిపోయినట్టున్నారు. అంచేత ఇక ఉండబట్టలేక వాళ్ళలో వాళ్ళు ఏదో రహస్యంగా అనుకోవడం జరిగింది. ఆ జరగడం ఎవరూ గమనించే వీలులేకుండా జరిగింది.

"ఏవయ్యోయ్! ఇదిగో వెధవ సీరల్ని వేల పాడితే ఏటొద్ది - అదుగో సూడు ఆ సీరలో పాలరాతి బొమ్మలాగ, జోతినచ్చిమి లాగా మెరిసిపోతుందే ఆ గుంట. ఆ గుంటని పాడు వేలం పాట. లచ్చల్కి లచ్చలు గలగల కురిసిపోతాయి. ఏటంటావ్?" అన్నాడు ఆ రౌడీల్లో ఒక రౌడీ.

తక్కిన రౌడీలు పగలబడి నవ్వారు.

చంద్రయ్యకు చుర్రుమంది. కూతుర్ని - అల్లారుముద్దు కూతుర్ని - అంత మాటలనడంభరించలేకపోయేడు. అయితే కూతుర్ని ఇన్నాళ్ళూ అప్పుడప్పుడు - అక్కడక్కడ - ఎవరొకరు అనడం జరగకపోలేదు. అప్పుడు తనకు ఒళ్ళు మండినా పట్లేదు. యాపారం మరి. సర్దుకుపోతే సరి అని సరిపెట్టుకునేవాడు. కానీ ఈసారి అంత నీచమైన మాటలు భరించలేక, ఊగిసలాడిపోయేడు. సహనం, వివేకం కోల్పోయాడు. ఉగ్రుడయ్యి, "ఏమ్రిటా కూసేవు గాడిద కొడకా" అన్నాడు అంతే.

"ఏమ్రిటా నేను గాడిద కొడుకునా - నీకు చావు మూడింది. తస్సదియ్య" అని చంద్రయ్యను కిందకు లాగాడు రౌడీ. అదే సమయంలో మరో రౌడీ దబ్బున తన్నేడు పెట్రొమాకు లైటుని, ఆ లైటు గిల గిల తన్నుకుని గుప్పు గుప్పుమంటూ ప్రాణాలు వదిలేసింది. ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్న కొన్ని బలిష్టమైన చేతులూ, కంపు నోరులూ చంద్రిక మీద కుక్కల్లా పడ్డాయి. మనకెందుకొచ్చిన గొడవనీ పారిపోయారు చాలామంది. సాయం చేద్దామనే పరిగెట్టాడొక విద్యార్థి.

మసక చీకటిలో, గుడ్డి వెలుతురులో జాలిగొల్పే ఆర్తనాదాల్లో, వికృతపు నవ్వుల్లో, పెద్ద కేకల్లో కొట్లాటలో అయిదు నిముషాలు భయంకరంగా సాగినాయ్.

ఆరో నిముషంలో లైట్లు వచ్చేయి. ఏదో నిముషంలో పరిగెట్టిన విద్యార్థీ, పోలీసులూ వచ్చేరు... ఆ మరు నిముషంలో తుపాను సద్దుమణిగింది.

పోలీసులకి రౌడీలు కొంతమంది దొరికిపోయారు. పోలీసులకి రౌడీలు మరికొంతమంది దొరక్కుండా పోయారు. పోయిన రౌడీలతో బాతు డబ్బుల పిడత పోయింది. పెట్రొమాక్సు లైటు తుక్కయిపోయింది. చంద్రయ్య తుక్కు తుక్కయి పోయేడు.

చంద్రిక స్థితి మరీ ఘోరంగా, హృదయ విదారకంగా ఉంది. ఆమె శరీరం మీద సరైన బట్టలేదు. ఉన్నా అంతా పేలికలై ఉన్నాయి. నుదురూ, బుగ్గలూ, తొడలూ, చేతులూ, వక్షస్థలం రక్కులతో, గంట్లుతో, రేగిన జుట్టుతో మూలుగుతూ పడి ఉంది. నలిగిన, చిరిగిన వేలం చీరతో ఆమె వయసు ఒంపులను కప్పారు తోటి ఆడవారు - ఎక్కడి నుంచో వచ్చి.

అంబులెన్సు వచ్చింది. వచ్చి చంద్రయ్యనూ, చంద్రికనూ తీసుకుపోయింది. పెద్దాసుపత్రికి మోసుకు పోయింది.

ఆ చోటును చంద్రయ్య, చంద్రికా, రౌడీలూ, పోలీసులూ వదిలేసినా - జనం మాత్రం ఆ చోటుని వదలకుండా పట్టుకూర్చున్నారు. కబుర్లు చెప్పుకోడానికి ఇళ్ళ దగ్గర కుదరదనీ, మళ్ళీ టైముండదని, అసలిలా అందరం ఒకేసారి కలిసి మాటాడుకునే సమయాలు రావనీ, ముఖ్యంగా ఇలాంటి విశేషాలు వాయిదా వేయరాదనీ, వెంట వెంటనే చెప్పుకోవాలనీ ఆవలిస్తూ, కళ్ళు నులుముకుంటూ, కూర్చొనీ, నిలబడీ జరిగిన విషయాన్నందరూ చెప్పుకుంటున్నారు.

"అరె! ఇంత అన్నేయం నా కళ్ళతో ఇంతవరకెన్నడూ చూళ్ళేదు. ఏమి ఘోరం! ఏమి ఘోరం!"

"అసలిది ఊరా! అడివా?"

"నీ కళ్ళు పోయాయేటి? ఇది ఊరే - అది అంత పబ్లిగ్గా కులుకుతుంటే మనకే జిమ్మెడిపోతుంది గదా. ఇక తాగుబోతులూ పొగరబోతులూ తిన్నగా ఉంటారా?"

"ఇంకేం కులుకుతాదిలే ఆసుపత్రి పాలైపోతే"

"ఏమైతే మటుకూ గొప్ప చిత్రమే జరిగింది స్మీ"

"వూరుకోవయ్యా. ఇదేం చిత్రం - ఢిల్లీలోనైతే పట్టపగలు కారులో ఉన్న అమ్మాయిని కారుతోనే ఎత్తుకుపోయి చెరిచేస్తున్నారయ్యా బాబూ. దాని దగ్గర ఇదొక లెఖ్ఖా."

"అన్నట్టు నాకు డౌటు. ఇంతకీ ఆ పిల్ల శీలం పోయినట్టేనా?"

"నోర్మూయ్యస్. నీకు బుర్ర లేదసలు. అయిదు నిముషాల్లో అంత కొట్లాటలో చెరచడం మాటలా? ఏదో కక్కుర్తి వెధవలు దొరికింది కొరుక్కున్నారు. దాన్ని నీలాటోళ్ళు ఏకంగా శీలమే పోయిందనుకుంటున్నారు. ఛస్. వెధవ మనుషులు."

"ఊర్కోరా బాబూ"

ఆ గుంపే లేక అలాంటి గుంపులే - ఒకటి రెండు సంవత్సరాలలో జరిగిన చంద్రయ్య కుటుంబం సంగతులూ, సమాచారాలు సేకరించేయి కష్టపడి. ఆ సంగతలూ, సమాచారాలు ఏమిటంటే -

రౌడీలతో తన్నులు తిన్నాక చంద్రయ్య కళ్ళు తెరిచేడట. చంద్రిక సరదా తీరిందట. వేలం పాటకు తండ్రీ కూతురు వెళ్ళడం మానేయడంతో - చంద్రమతి పరుగెత్తికెళ్ళి దేవుడికి వంద కొబ్బరికాయలు కొట్టిందట. చంద్రయ్య చంద్రికి పెళ్ళి చేసేద్దామనుకున్నా, చంద్రిక పెళ్ళి చేసుకుని సంసారం చేయాలని ఉబలాటపడినా - చేతులు కాలేక, ఆకులు పట్టుకున్న చంద్రిక్కి మొగుడు దొరకలేదట. దాంతో చంద్రమతి టక్కున గుండె ఆగి చచ్చిందట. చంద్రయ్య నెత్తీ నోరు కొట్టుకున్నాడట. చంద్రిక చావలేక, నెత్తీ నోరు కొట్టుకోలేక, మొగుడు వచ్చే యోగం లేక, వయసు బరువు మొయ్యలేక ఎవడితోనో లేచిపోయిందట - ఇంట్లో డబ్బూ బంగారంతో సహా

లేచిపోయిందట. దాంతో చంద్రయ్య పిచ్చెక్కిపోయేడట. ఇకపోతే ఎవరో దూరపు బంధువు ఎక్కడినుంచో వచ్చి చంద్రయ్య భూమినీ, మేడల్నీ చేజిక్కించుకున్నాడట.

ఇవన్నీ నిజమే మరి! కావాలంటే మీరు మెయిన్ రోడ్డు మీద విశాఖపట్టణాన్ని వేలం వేస్తూ తిరిగే చంద్రయ్యను ఇప్పటికీ చూడవచ్చు.

# అందాల సముద్రం

## శ్రీపతి

*(ఆంధ్రపత్రిక ఉగాది వార్షిక సంచిక 1966)*

ఆకాశాన చుక్కల వెలుగు
వేకువజాము
చీకటిలో మరీ చీకటిగా పూరిళ్ళ పల్లె
సముద్రపు హోరు దూరంగా
వీధుల్లో పూల మొక్కలూ మధ్య మధ్య
పాదులూ పందిళ్ళూ తులసి కోతలూ ఎడ్లబండ్లూ
ఎక్కడో కోడికూత
మరెక్కడో కవ్వం మోత
నిద్రలేచి రామం పోతున్నాడు
రోజూ మల్లే తోటకి
రామంని చూసినవాళ్ళు
అలవాటుగా నిట్టూర్చారు

భార్య చనిపోయి ఆర్నెలయింది
ఆ చనిపోయిన రోజునుండీ
నిత్యం ఇదేవేళ
ఆమె అంత్యక్రియులు జరిగిన చోటుకు వెళ్ళి
అక్కడ కూర్చుంటాడు

కన్నీళ్ళతో
అది వాళ్ళ కొబ్బరితోట
రాత్రి గుండె కరిగిన మంచు కన్నీళ్ళ హేమంతం!

"దేవతలు విహరించే ఉద్యానవనంలా
ఉందీ ఊరు" అంది ఫాతిమా
అక్కడ ఆ ఊళ్ళో ఆమె అడుగు పెట్టిన తొలిరోజున.
ఆకాశాన్ని కప్పేసే
రంగులు వెదజల్లే తోటలు
రకరకాల పండ్ల చెట్లతో
ఎటు చూసినా తోటలే తోటలు..
ఆ వెనక సూర్యుడు ఉదయించే
అనంత సుందర శోభాయమానమైన సముద్రం..
మంచుపూలు పూసిన ఇట్లాంటి హేమంతంలోనే ఒక ఉదయం
తాము తొలిసారి తాత తండ్రుల ఈ పల్లెటూళ్ళో అడుగుపెట్టినప్పుడు
ఆడా మగా చేతుల్లో పనులు మాని
ప్రేమాభిమానాల చల్లని చూపులతో
దరహాసవదనాలతో ఆశీర్వదించారు.
రతీమన్మధులను చూట్టానికి నిలబడ్డట్టు
ఆ పల్లె హృదయాలలో పులకింత !

నడుస్తూ రామం
ఇంకా విచ్చుకోని వేకువ
ఇసిక నేల.. చెప్పులు లేని పాదాలు..
తనని చూసి ....

తన ఒంటరితనాన్ని చూసి
'చుక్కల్లా మెరుస్తున్నాయి మీ కళ్ళు'
'చుక్కల్లా నవ్వుతున్నాయి మీ కళ్ళు...'
అలసిపోయిన గుర్రబ్బండి దిగి మనం ఇంటి ముందు నుంచున్నప్పుడు
ఎనభైయేళ్ళ జీవితాన్ని మోసి అలసిన చూపులతో
మనల్ని చూసిన తాతయ్య
మనమడు చేసిన ఆగడపు పనికి కినిసి
నీలో తన మనుమడి సౌభాగ్యం చూసి అమ్మా అని కావలించుకుని తల నిమిరి

సుఖంగా వెయ్యేళ్ళు జీవించమని దీవించాడు

చల్లని పరిమళాలు గుండెను తాకుతున్నాయి..

కళ్ళు తెరుస్తున్నాయి దిక్కులు

మేలుకుంటున్న చూపులతో రంగుల తోరణాలు

రామం ఒక్కడూ ఆ తోటల్లో నడుస్తూ

'నిన్ను సుశీలా అంటాను'

'నిన్ను పార్వతీ అంటాను'

'నిన్ను దేవతా అంటాను'

ఆకాశం మీద ఆకుపచ్చని రంగులను పులిమేసిన తోటలు

తోటల్లో అక్కడక్కడ అక్కడక్కడ పశుల సాలలు

ఆవుల మందలు.. గొర్రెల మందలు... మేకల మందలు...

'నేను... నే...ను...నే..'

'ఆ మాట అనొద్దు ఫాతిమా'

'ఇక... బ్ర...త..క...'

'అనొద్దు. అనొద్దు. అ..నొ..ద్దూ'

కన్నీళ్ళు... కన్నీళ్ళు...

కన్నీళ్ళు కూడా లేని ఆమె కళ్ళు...

ప్రమిదలో నూనె ఇంకిపోయినా వెలుగుతున్న దీపాలు.

ముల్లు గుచ్చుకుంది పాదానికి

శరీరపు పంచేంద్రియాల్లోకి ప్రాకింది నొప్పి

ప్రకృతి...

మనిషిని శిక్షించగల శక్తి

మనిషి అల్పత్వానికి...

'ఏడవొద్దు... ఏడవొద్దు...'

'నే...ను...బ్ర...తు..క...'

ఇప్పుడు

నీవు లేని ఈ కాలాన్ని...

ఈ కాయాన్ని... బానిసనై మోస్తున్నాను.

జీవించాలని లేదు ఫాతిమా...

ఒకప్పుడు పున్నమి వెన్నెలై కురిసిన అనుభవాలే

ఇప్పుడు జ్ఞాపకాల నిప్పులై కాలుస్తున్నాయి.

నీవు పెట్టిన అన్నం తింటున్న తాతయ్యను చూస్తే

నాకు ప్రపంచాన్ని మొక్కాలన్నంత ఆనందం
‘జామి చెట్టు మీది చిలకలు‘ అన్నాడు తాతయ్య
ఇద్దరం ఒకే పళ్ళెంలో తింటున్న దృశ్యం చూసి.

దారిలో చెట్టుకింద ఇసికమీద
పరుగుతీస్తున్న పాము
బుస్‌మని పడగెత్తింది
పాముల నరసయ్యగారూ...
రామం అడుగు వెనక్కి వేసి,ఇంకా వెనక్కి నడిచి ఆగి
రెండు చేతులెత్తి.... వణుకుతూ... కలవరపడుతూ
మొక్కాడు
శాంతించింది పాము
దయతలచిన స్వామోట్టులాగ మెల్లగా
వంకర్లు తిరుగుతూ సాగిపోయింది... తన దారిన...
ఒక చీకటి రాత్రితోట నుండీ తామిద్దరూ తిరిగి వస్తుండగా కాలిబాటలో
ఫాతిమా... ఫాతిమా..!
కాలు మీద.. కొన్ని అడుగులు నడిచి పడిపోయింది నేలమీద ఫాతిమా
ఇంత చిన్న పాము...
భయం భయం
సృష్టిని తలక్రిందులు చేయగల మనిషీ
నీవు అల్పుడవు
ఔనౌను అల్పుణ్ణి...

‘ఆయనకి నేనే దిక్కు అక్కడికి‘
‘మరీ ఈ ఉద్యోగమో‘
‘వొద్దు‘
‘తాతగారు కోప్పడరా?‘
‘తోటలున్నాయి. వ్యవసాయముంది‘ ఉద్యోగం వద్దనే తాత.
‘తురకది అనరా‘ఆ ఊళ్ళో
‘అనరు‘
‘మరి ఆ పల్లెటూరి జనం‘
‘నీ నుదట కుంకమ బొట్టు...‘

రామం తోటకి చేరిపోయాడు
అది స్వర్గం
తన దేవాలయం
మట్టిలో కలిసిపోయిన ఫాతిమా
అక్కడే అక్కడే
చివరి శ్వాసగా కన్పిస్తున్న ఫాతిమా
గుండెల మంటగా కన్పిస్తున్న ఫాతిమా
శూన్యమై కన్పిస్తున్న ఫాతిమా
కన్నీరై కన్పిస్తున్న ఫాతిమా... ఫాతిమా
సృష్టి సోయగాల సంపద ఫాతిమా
మట్టిలో కలిసిపోయింది అక్కడే అక్కడే.
అందాల అందం ఆ మట్టి..

ప్రకృతి నిశ్చింతగా తామరాకు మీది నీటిబొట్టులాగా..
ఆ మట్టిని ముద్దు పెట్టుకుని రామం
అక్కడి గాలితో గుండె నింపుకుని రామం.
కన్నీటి నైవేద్యం ప్రియురాలికి
ఆరునెలలుగా నిత్యం..

ప్రక్కనే పశులసాలలో ఆవుల మంద
ఇంకా నిద్రపోతూనే ఉన్నాయి
ఇంకా చలి

నా సర్వస్వం నువ్వు
నాకళ్ళ రుచుల నీ దేహం నీ.. అందాలు
నీలం ఆకాశం నీ కళ్ళల్లో
జీవితమ్మీద ఆశువు నీవు
కృష్ణవేణుగానం నీ సమక్షంలో

చిన్నతనాన
అమ్మను దొంగలించాడు సముద్రుడు గ్రహణం రోజున
సోముడి కోసం వెతకసాగాడు నాన్న..
నాన్న పిలుస్తూనే ఉన్నాడు
నీరధి హోరు వినిపిస్తూనే ఉంది.

ఫాతిమా ఫాతిమా
నీరూపం చెరిగిపోదు

నా స్వప్నం చెదిరిపోదు
జీవితమే స్వప్నం ఇప్పుడు
అవును కదా
అవును కదా

'నీ వల్ల ఈ ప్రపంచం ఇంత సుందరం నాకు
ఈ ప్రపంచం అందమంతా నీవు
పొగడ్తలు కావు' అయినా తల దించుకుంది ఫాతిమా
అందుకే భక్తుడంటే భగవంతుడికి ప్రేమ
ఆ ఆరాధనలో బిడ్డ అనురాగం
ఆమె అన్నయ్యలు ఒకరు లక్నోలో
ఒకరు విదేశాంగ శాఖలో ఢిల్లోలో
ఆమె తల్లి సంస్కారవతి గర్వపడింది
మతాంతర వివాహం చేసుకుంటున్నందుకు
అందరికీ ఉత్తరాలు రాస్తున్నాను మీరు తప్పకుండా రావాలి
అగ్నిసాక్షిగా వివాహం సప్తపది
స్నేహితులే పెత్తనం చేశారు. తాతయ్యతో ముందే చెప్పాడు.
తాతయ్య పెళ్ళికి రాలేకపోయాడు అంతా అద్భుతం
అనిపించింది అది నీ ప్రేమలీల...
దైవలీల.. రహీమ్ అన్నారు
ముద్దుగా అక్కడ
ఫాతిమా లేదు
చేపల్లా ఆడుకునే ఆమె కళ్ళులేవు
ఆమె గొంతు సంగీత మాధుర్యం లేదు
లేదు లేదు ప్రపంచం లేదు
క్రీస్తు లేడు బుద్ధుడు లేడు మహమ్మద్ లేడు
ఫాతిమాలేదు
శ్రీ శంకరుడు లేడు
బ్రతుకు మాయ జగం మాయ
మాయ మాయ
జగం మిధ్య బ్రతుకు మిధ్య
పునరపి జననం పునరపి మరణం

భజగోవిందం భజగోవిందం
భజగోవిందం మూఢమతే

మనపిల్ల మన ఊరు వచ్చింది మన కోడలు
బంగారులాంటి పిల్ల మనలో కలిసిపోయింది
అప్పుడు తెలిసింది... మతాలంటేనే తెలీని ఊరు అది
ఇక్కడ
ఈ సముద్రపు ఒడ్డున కన్నతల్లి ఊరు అది

మీ నాన్నగారు నాకు ఆఫీసర్ కదా!
మీ అక్కయ్య పెళ్ళిలో కదా మన చూపులు కలిసింది!
ఇంటిపనులు అప్పుడప్పుడు అప్పజెప్పినప్పుడు
నిన్ను చూసే భాగ్యకోసం వచ్చేవాడిని
ఆ రోజు మీ ఇంట్లో గానకచేరి
ఎవరో ఆ గొప్పగాయకుడు ఎంకిపాటలు పాడాడు
పండ్ల రసాలు అతిధులకు స్వయంగా ఇచ్చినప్పుడు నీ చేతి స్పర్శకు హృదయ వీణ మధురాతి మధురంగా మోగింది
నీ పేరు చెవిని పడింది ఆ రోజే
ఫాతిమా... ఫాతిమా... నా ప్రేయసీ...
ఫాతిమా అమృత గానమయింది
'పల్లెటూళ్ళు అందంగా ఉంటాయి కదూ'
'పల్లెటూళ్ళు అందంగా ఉంటాయి కదూ'
'పంట పొలాలు, పద్మాల సరస్సులు, తోటలు, పిల్లంగ్రోవి పాటలు, ఆలమందలు, గొర్రె పిల్లలు, మేక పిల్లలు'
'నన్ను మీ ఊరు ఎప్పుడు తీసుకుపోతారు?'
'మనం అమ్మా నాన్నలం కావాలి'
'అంతా అల్లా దయ'
పార్వతమ్మా అని పిలిచే వాళ్ళు ముద్దుగా ఊళ్ళో...
పెళ్లైయిన కొత్తలో ఊరు చూట్టానికి కూతురికోసం ఈ పల్లెటూరు వచ్చినప్పుడు
ఆమె అమ్మా నాన్న అక్కా బావా ఇంకా బంధువులు
'పార్వతమ్మా' అన్న పిలుపువిని

కడుపుబ్బ నవ్వారు..
వాళ్ళూ అదే పేరుతో పిలవసాగారు
అంతా వచ్చారు కాకినాడ నుండి
స్టేషన్‌లో మనల్ని చూసి మురిసిపోయారు
గుర్రపు బళ్ళల్లో ఈ ఊరు
వాళ్ళను చూసి ఊరు ఉప్పొంగిపోయింది

మీ నాన్న మా ఆఫీసర్
మీ అక్క పెళ్ళి పనుల్లో... తర్వాత పెళ్ళిరోజున నిన్ను చూసినప్పుడు...
ఓ ఆదివారం ఇంటికి వచ్చినప్పుడు అమ్మానాన్న ఊరెళ్ళారని చెప్పినప్పుడు
నేను వెనుతిరిగి పోతుంటే
'ఉండండి కాఫీ తీసుకోండి' అని నీ పిలుపు
తొలిసారి మాటలు కలిశాయి
కులాలుగురించి మతాలు గురించి మన సంభాషణలు
ఇద్దరి అభిప్రాయాలు ఒకటే
నీతో మాట్లాడటానికే - కాదేమో - నిన్ను చూట్టానికే
తాపత్రయపడి వచ్చేవాడిని...
ఇంటి పనులు మామూలే కాఫీ మర్యాదలు మామూలే
మీ గురించే ఎదురు చూస్తున్నానన్నావు కదా ఆ రోజు
ఆ వానలో తడిసి వచ్చిన నన్ను చూసి
ఏమిటో మన చేతుల్లో లేని శక్తులు కూడదీశాయి
మనని
మనసు నీతో నిండిపోయింది
హృదయం నీతో నిండిపోయింది
సదా నీ ధ్యానమే
ఈశ్వర్ అల్లా తేరేనామ్
సబ్‌కో సన్మతి దే భగవాన్
రేడియో పాట
రెండే రెండేళ్ళు ఆ మధుర స్వప్నాలు...
ఇప్పుడేం మిగిలింది
కన్నీళ్ళు కన్నీళ్ళు
తనకు పెళ్ళి చెయ్యాలని కుట్ర ఇక్కడ నడుస్తున్నది ఇప్పుడు.

తాతయ్య నోరెత్తడు
మేనత్తలూ, మేనమామలూ, చిన్నన్నలూ, అక్కలూ, చెల్లెళ్ళూ
పెళ్ళి చేసేస్తే మళ్ళీ మనిషవుతాడు
అదీ వాళ్ళ ధోరణి
నా దుఃఖానికి వాళ్ళ భాష్యం అది...
అవును ఆ అమ్మాయి అరుణ బంగారు బొమ్మ
పెద్ద ఆస్తి... ఒకే ఒక్క సంతానం...
సంపద కోసం పెళ్ళి
కానీ ఆ అమ్మాయి బతుకు ఏమౌతుందో ఆలోచించరు
అరుణ జీవితం
నీకన్నా వయసులో అయిదారేళ్ళు చిన్నది...
పదోతరగతి చదువుతున్న అమ్మాయి
అరుణకి ఇష్టమేనట... కావచ్చు
కాని నేను బతకబోవటం లేదుకదా
రోజులు లెక్కపెట్టుకుంటున్న వాడినికదా
ఇప్పుడు నాకు సూర్యోదయం అందం ఆకర్షిస్తున్నది
సముద్రం మీద...
సముద్రం పిలుపు వినిపిస్తున్నది
ఈ దుఃఖాన్ని తట్టుకోలేను...
ఎందరెందరి కన్నీళ్ళో ఆ సముద్రం...
ఎన్నెన్ని కోట్ల కాంతి సంవత్సరాల కన్నీళ్ళో ఆ సముద్రం...
అదే నాదారి...
అక్కడే నీవు!



జీవిత వాస్తవికతను బట్టి చూచినా, శిల్ప విన్నాణాన్ని బట్టి చూచినా, మంచికీ మానవతకూ పట్టంగట్టే ఆంతర్యాలనుబట్టి చూచినా, అర్థ శతాబ్ది తెలుగు కథాసాహిత్య చరిత్రకు న్యాయం చేకూర్చే కథలు శ్రీపతి కలం నుంచి వెలువడ్డాయి. కథకు ఏపాటి వస్తువు కావలసివుంటుంది? దాన్ని కథగా పెంచుకోవడం, మలుచుకోవడం ఎలాగ? మనసులో స్థూలంగా అల్లుకున్న ఆ కథను రచనలో ఒక కళా వస్తువుగా తీర్చిదిద్దడానికి వెనుక రచయిత ఎన్నెన్ని మెలకువలు కలిగి వుండాలి? - అన్న పాఠ్యాంశాలతో యువరచయితలకొక వర్క్‌షాపు నిర్వహిస్తే పాఠ్యబోధనకు మచ్చుతునకల్లా పనికివస్తాయి ఆయన కథలు.

మధురాంతకం రాజారాం

# చిరంజీవి కథ

## - శారద



జీవించిన అతి కొద్ది కాలంలో - ముప్పయ్యేళ్ళలో (1924-1955) పళ్ళ బిగువున సాగించిన జీవన యాత్రలో - నిష్ఠ దారిద్ర్యంలో ఆటుపోటు జీవితపు అలల మీద కలల యాత్ర సాగించిన శారద(ఎస్. నటరాజన్) పుట్టింది తమిళనాడులో. తన పన్నెండవయేట తండ్రితో పాటు తెనాలి వచ్చాడు బతుకు తెరువుకోసం. అప్పటివరకూ తెలుగు అక్షరం ముక్కరాదు.. వయసులో ఉదరపోషణార్థం జోలె పట్టి దేవాలయాల వెంటా, ఇళ్ళచుట్టూ తిరిగి మధూకరం తెచ్చుకున్నాడు కొన్నాళ్ళు. ఆ క్రమంలోనే హోటల్‌లో పనిచేయడానికి కుదిరాడు.. అతి కొద్ది కాలంలోనే తెలుగు భాష మీద పట్టు సంపాదించి రచయితగా అవతరించాడు. అప్పటి సామాజిక పరిస్థితులు కూడా అతనిలోని రచయితకి జీవం పోశాయి. రోజుకి పద్దెనిమిది గంటల బండ చాకిరీ చేస్తూ కూడా తెలుగు సాహితీ సీమపై మెరుపులు మెరిపించాడు.. ‘అపస్వరాలు‘,‘ మంచి-చెడు‘, ‘ఏది సత్యం‘ వంటి నవలలూ వందకి పైగా కథలూ, నాటికలూ, నవలికలూ, రాజకీయ చెణుకులూ.. ఇవన్నీ అతికొద్ది కాలంలో రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని విలువని ఆపాదించిన ఎస్.నటరాజన్ జీవితాంతం దుర్భర దారిద్ర్యంలోనే జీవించి, అతి పిన్న వయసులోనే 1955 అగస్ట్ 17 రాత్రి , తండ్రి పోయిన వద్దనుంచీ తనని వెంటాడిన మూర్ఛవ్యాధికి బలైపోయాడు..! ఆయన కథా సంపుటి రక్తస్పర్శ నుంచీ ఒక కథ ‘కౌముది‘పాఠకులకోసం..

రామచంద్రరావు బీదవాడు అనటానికేమీ సందేహం లేదు. కానీ చినిగిన చొక్కానైనా ఉతికి ఇస్త్రీకి రుద్దించి గానీ వెయ్యకపోవటం చేతనూ, తిన్నా తినకపోయినా తిన్నట్టే నటించటంలో నేర్పు చూపించటంలోనూ అతనికి డబ్బున్న వాడల్లే బతకాలని ఉన్న వాంఛ నిస్సందేహంగా ఋజువైంది. రామచంద్రరావు ముప్ఫైరూపాయల సంపాదన పరుడైనా పెళ్ళాం ఏదో ఒకటి ‘లేదు‘ అనని రోజు క్యాలెండర్లో లేకపోయినా ఆ లేమిని బైటకి కనపర్చకపోవడం చేత ఉన్న వాళ్ళల్లో జతకావాలని చూశాడు; లేని వాళ్ళల్లో కలవనూ లేకపోయినాడు.

ఇటువంటి ప్రవృత్తి వలన అతడి జీవితం స్వర్గాన్నూహిస్తూన్న నరకంలో బతుకుతున్న వాడల్లే ఉంటూ వచ్చింది. డబ్బుతో సాధించే సౌఖ్యాలు, డబ్బుతోటే సాధ్యమౌతాయిగానీ, మరొక రకంగా అందవని రామచంద్రరావుకి స్పష్టంగా తెలుసు. కానీ వాటిని ఊహిస్తూ పొందినట్టే నటించడంలో అతడి ఆత్మ పడే బాధ, అతని ప్రతి వెకిలి నవ్వులోనూ, అస్పష్టంగా వ్యక్తమౌతూ వచ్చింది.

రామచంద్రరావు భార్యా ఇందుకు సరిపోయిన ఘటమే. కానీ, ఆ పద్ధతి వేరు ఆమెకి దాదాపుగా డబ్బు ఎలా వస్తుందో ఆలోచించే సంస్కారం లేదు. ఎప్పుడూ గొప్ప చీరెలు కట్టాలనీ, డబ్బున్న తన చుట్టాలతోటి తూగాలనీ, భర్తతో నిత్యం పోరాడేది. రామచంద్రరావు ఈ పోరును అణిచి ఉంచాడు అనేక రకాల. అయితే తన భార్య కోర్కెలు తీరాలని అతనికీ ఉంది. ప్రయోజనమే లేదు గానీ!

రామచంద్రరావులో అకస్మాత్తుగా ఒక పరివర్తన వచ్చింది. ఎలాగైనా డబ్బు సంపాయించి తన ఊహల్ని నిజం చేసుకోవాలని అతడు పట్టుపట్టాడు. అందుకోసం తనేం చెయ్యాలో అతడికి తెలీలేదు. అందుకోసం అతడు ఇంకెవరినన్నా అడిగి ఉంటే ఎలా ఉండేదో; అందుకు పౌరుషం అడ్డం వచ్చింది. భార్యని అడగడమైనా పౌరుష హీనమే. అతనికా ఆలోచనలేదు. వెనకటి ఆలోచనలకి తోడు ఇదొక యావ తోడైంది. మనిషికి సామాన్యంగా ఏ నలభై ఏళ్ళకో గానీ తల నెరవదు. రామచంద్రరావుకి ఆలోచనలతో తల సగం నెరిసింది పాతికేళ్ళకే. అసలు మనిషి కొంచెం చామన ఛాయగా ఉన్నప్పటికీ ఇదివరకు (చిన్నప్పుడు) నిగనిగలాడుతూ ఉండేవాడు. ఇప్పుడు మాడి మసిబొగ్గు అయినాడు.

రామచంద్రరావుకి కొంచెం భాషా జ్ఞానం ఉన్నది. అతను బడిపంతులు అయినప్పటికీ ఇంకా అతనిలో యాంత్రిక దృక్పథం రాలేదు. కొద్దిగా కల్పనాశక్తికూడా అతనిలో మిగిలి ఉంది. కారణం అతనెప్పుడూ వాస్తవిక జీవితం నుంచీ వేరు పడి ఊహాప్రపంచంలో బ్రతకడమేనేమో!!

రామచంద్రరావు ఓ చిన్న కథ రాసి పత్రికకు పంపించాడు. ఆ కథకి బహుమతిగా ఓ పత్రిక పంపించారు. రామచంద్రరావుకి డబ్బు మీద మోజు రోజు రోజుకూ ఎక్కువ కాసాగింది. అతను విరివిగా కథలు రాయటం సాగించాడు. ఓ పత్రిక అతనికి రెండు - మూడు - ఐదు ఇలా డబ్బు పంపసాగింది.

రామచంద్రరావుకి డబ్బు మీద మోజు, పత్రికలకి కథలు రాయటం వల్ల తీరకపోయినా, డబ్బు సంపాయించటానికి ఇదీ ఒక మార్గమేమోనని అతను భ్రమపడిన మాట వాస్తవం. అయితే డబ్బు ఎంతో కొంత వస్తున్నది కనుక కథలు రాయటాన్ని అతను ఓ ఉపవృత్తి క్రింద జమ చేసి కథలు వ్రాయసాగాడు.

ఒక్కొక్క మనిషి యొక్క కొన్ని కొన్ని ప్రత్యేక ప్రవృత్తులు ఆ వ్యక్తే గనక కథా రచయిత అయితే ఆ రచనలో ప్రతిఫలించి తీర్తాయి. రామచంద్రరావు రాసిన కథలు పాఠకులను ఏవో అనూహ్యమైన లోకాలకు తీసుకెళ్ళేవి. రామచంద్రరావు స్వతహాగా ఏనాడూ అనుభవించని సుఖాల్ని, తన పాత్రచేత అనుభవింపచేసి, పాఠకుల్ని భ్రమింపచేసి, వాళ్ళ ఆదరణని చూరగొన్నాడు. రామచంద్రరావు పక్కింటి అమ్మాయి వంక చూడనైనా సాహసించలేక పోయినప్పటికి; అతని కథానాయకులు పొరుగింటి అమ్మాయిల్ని, రైళ్ళల్లో, సినిమాల్లో తటస్థపడ్డవాళ్ళనీ, చాలా ధైర్యంతో, లేవదీసుకుపోయేవాళ్ళు.

రామచంద్రరావు వ్రాసే కథలు ఎల్లప్పుడూ జీవితం నుంచీ దూరంగా ఉంటూ, పాఠకులకు తియ్యటి కలలొచ్చేటట్టు చేసినై. అతని కథలకి మార్కెట్టు వాల్యూ ఏర్పడ్డది. ఇటువంటి కథలు రాయటంలో అతనికున్న నైపుణ్యాన్ని ప్రతి పత్రికా మెచ్చుకుంది. అతని ''ఫాంటాస్టిక్' కథలకీ, 'రోమాంటిక్' కథలకీ ఎక్కడలేని ఆదరణా ఏర్పడినై.

ఇటువంటి కథలు రాయటానికి అతనికున్న శక్తి ఏమిటా అని ఇతర రాయలేని రచయితలు ఆదుర్దాపడ్డారు. అతన్నే అడిగారు కూడాను. రామచంద్రరావు మామూలుగా వెకిలి నవ్వు నవ్వటం కన్నా ఇంకేమీ చెప్పలేకపోయినాడు.

అట్లాంటి కథలు రాయటానికి అతని ఊహలన్నీ స్వర్గంలో ఉండటమే కారణం. ఇంకో కారణం - అతని జీవితం నరక ప్రాయంగా నిత్య దారిద్ర్యంలో ఉండటం - అందుచేతనే ఆచరణలోనూ, స్వానుభవంలోనూ సాధ్యం కానివాటిని తియ్యగా, అద్భుతంగా ఊహిస్తూ అతను తననీ, తన జీవితాన్నీ, మరచిపోయి 'ఫాంటాస్టిక్' 'రొమాంటిక్' కథలు రాయగలడేమో! ఈ సంగతి రామచంద్రరావుకి తెలీదు.

అతని ఆదాయంలో చెప్పుకోగగినంత మార్పేమీ రాలేదు. బీడీలు పోయి సిగరెట్లు వచ్చినై; ఎవరికీ తెలియని రామచంద్రరావు అందరికీ తెలిసి అభినందనాలందుకోవడం వొచ్చింది. కీర్తి లభించింది. కీర్తి పెరిగిన కొద్దీ ఏ దేశంలోనైనా అయితే రామచంద్రరావు ఆర్థికంగానైనా బాగుపడి, వేళకి తప్పకుండా అనమ్మన్నా తిని ఉండును. తిండిలేని జర్నలిజానికి పేరొందిన ఆంధ్రదేశంలో పుట్టి రామచంద్రరావు కీర్తి మాత్రమే ఆర్జించాడు. ఇందుకోసం వెట్టిచాకిరీ చెయ్యటమే కానీ ఆదాయం కోసం నడుస్తున్నవి కాదు. కథలకు ఈ పాటైనా డబ్బిస్తున్నారంటే అందులో ఏదో రహస్యం ఉండి ఉండాలి.

రామచంద్రరావు డబ్బు కావాలని ఎప్పుడూ పత్రికలకు ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు. రెండు నెలలకీ, మూడు నెలలకీ వాళ్ళు పంపించేవాళ్ళు; ఆగిపోయిన పత్రికలు తప్ప.

రామచంద్రరావు రాసిన ఓ కథ చాల బావుందని సంపాదకుడు వ్రాశాడు. దానికి పదిపదిహేను రూపాయలు పంపిస్తామని కూడా తెలియజేశాడు. రామచంద్రరావుకి అదే రోజున టైఫాయిడ్ ఉధ్రుతంగా వొచ్చింది. అతను జ్వరంలోనూ తన కథలను గురించే కలవరించాడు. కథల్లో 'కళ' గురించి ఉపన్యాస ధోరణిలో వాగుతున్నాడు. అతడి భార్యకే గనక ఆస్తి యావ ఉండుంటే - దస్తావేజు రాయించేందుకు ఆదుర్దా పడి ఉండేది. అంత ప్రమాదంలో పడింది జ్వరం.

రామచంద్రరావుని చూడ్డానికి కొందరు రచయితలు వొచ్చారు. అతనికి వైద్యం చేసే డాక్టరు కూడా అతని పాఠకుడే, ఉచితంగానే చేస్తున్నాడు వైద్యం.

రామచంద్రరావు కథ - గొప్పగా ప్రచురించబడింది. ఆ పత్రిక కాపీ అతనికి అందిన రోజున రామచంద్రరావుకి వొంటిమీద స్మారకం కూడా లేదు.

స్నేహితులు తలా కాస్త డబ్బిచ్చి వెళ్ళారు ఖర్చులకి. అతని కథల్లో పాత్రలు వాస్తవమైనవి కావని, ఆ స్నేహితులు అతనికి వినబడేట్టు అని వెళ్ళారు. ఆ మాటలు రామచంద్రరావుకి వినబడ్డాయో లేదో చెప్పలేం. అతనికి టైఫాయిడ్ బహుశా నయం కాకపోవచ్చు. అతనికి డబ్బు అవసరమని అందరూ గుర్తించినా "ఎప్పుడూ డబ్బు డబ్బంటాడు" అని అన్నారు వాళ్ళు. చుట్టు పక్కలవాళ్ళే కాదు; పత్రికల వాళ్ళు కూడాను. రామచంద్రరావు పంపిన కథ తాలూకు డబ్బు అతని ఉత్తర క్రియలకు అంది తీరుతుందని అతని భార్య ఎదురు చూస్తున్నది. రామచంద్రరావు జీవితంలో ఇంకే డబ్బున్నవాడు అనుభవించని ఆనందాల్ని ఊహించాడు. అతనికి మరణం కూడా 'మరణిస్తున్నాం' అని స్పృహ తెలిసిన స్థితిలో రాకపోవటం కూడా ఒక అదృష్టమనే అతడు భావిస్తాడు. తెలిస్తే.

('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)

# ఎన్నో రంగుల తెల్లకిరణం

## సిరివెన్నెల సీతారామశాస్త్రి

*పరిచయం అవసరం లేని ప్రముఖకవి శ్రీ సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారు, సినీ రంగ ప్రవేశానికి ముందు 'భరణి' అనే కలం పేరుతో కవితలతో పాటు కథలు కూడా వ్రాసారన్న విషయం చాలా కొద్ది మందికే తెలుసు. ఆయన రాసిన కథలు రాసిలో తక్కువే ఐనా శైలి, శిల్పం విషయంలో మాత్రం ఒక ప్రత్యేకతని సంతరించుకుని ఉంటాయి. ఆయన ప్రమిత్రుడు శ్రీ ఆకెళ్ళ ఒక సారి ఈయన కథా రచన గురించి ప్రస్తావిస్తూ ' శాస్త్రి కథ వ్రాయడండీ..చెక్కుతాడు.. ఒక్కో కథనీ 20-30 సార్లు తిరగరాసిన సందర్భాలు కూడా నాకు తెలుసు. ప్రతి పదం, ప్రతి వాక్యం, ప్రతి సన్నివేశం తనకి పూర్తిగా నచ్చితేనే గానీ కథ పూర్తి ఐనట్లు భావించడు..' అని అన్నారు. సిరివెన్నెల గారి విలక్షణ కథా శైలిని ప్రతిబింబించే 'ఎన్నో రంగుల తెల్లకిరణం' ఈ నెల 'కౌముది' పాఠకులకోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. ఈ కథ రచనా కాలం 1980 తొలిరోజుల్లో..*

అటు మధ్య గదిలో నుంచీ, ఇటు కటకటాల వరండాలో నుంచీ కలకలం స్పష్టాస్పష్టంగా వినిపిస్తోంది. రకరకాల సంభాషణలు, మధ్య మధ్య పెద్దగా నవ్వులు, గోలగోలగా నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుతున్నారు.


ఈ గదిలో తలుపులన్నీ మూసేసుకుని, ఒంటరిగా పడుకుని ఉన్నాను. నిద్ర పట్టడం లేదు. నిద్ర పోవాలనే ఉద్దేశమూ లేదు. ఊరికే, విశ్రాంతిగా కళ్ళుమూసుకుని గత ఏడాది కాలాన్ని సమీక్షించుకుంటున్నాను.

'మూడు రోజుల్నుంచీ ఒక్కలా అలసిపోయాడు కుర్ర నాగన్న. సుబ్బరంగా పడుకోనివ్వండి వాణ్ణి' అని అమ్మమ్మ మగవాళ్ళ భోజనాలు పూర్తికాగానే నా విశ్రాంతికి ఏర్పాటు చేసింది. ఆవిడ పుణ్యమా అని గతవారం రోజులుగా దొరకని ప్రశాంతమైన ఒంటరితనం దొరికింది.

శ్రమ పడటం, విశ్రాంతి తీసుకోవడం విషయానికి వస్తే, నాకన్నా, మిగిలిన ప్రతి ఒక్కరూ వందరెట్లు ఎక్కువ కష్టపడ్డారు. ఈ మూడు రోజులూ ఊపిరి తిరగనివ్వని పని. పైగా అయిదుగురు కాపురం ఉండే ఇంట్లో ఏభయిమంది సర్దుకోవలసి రావడం.

ఈ మూడు రోజుల కార్యక్రమానికి కేంద్రబిందువునీ, కర్తనీ నేనే. కనుక నాకు ప్రత్యేకమైన గుర్తింపు. నిద్రకీ వాటికీ ప్రత్యేకమైన సౌకర్యాలు పెళ్ళికొడుకుకిలాగా.

ఈ పోలికను అనుకోవలసి వచ్చిన ప్రతిసారీ అదోలా ముడుచుకుపోతోంది నా మనస్సు. పెళ్ళికొడుకులాగా! ఇదేం పోలిక! కానీ అలా పోల్చుకోక తప్పనిసరి కావడంతో జీవితపు వైచిత్రి ఏదో తోస్తోంది లీలగా.




శారీరక శ్రమకన్నా మానసిక సంఘర్షణ ఎక్కువ అలసట కలగజేస్తుంది. అందువల్లనే అందరికన్నా ఎక్కువ అలసిపోయాను. ఈ మూడు రోజులుగా అనుక్షణం నా అంతరంగం విచిత్రమైన ఒత్తిడికి లోనయ్యింది. ఒకదానికొకటి సంబంధం లేని వేలాది లక్షలాది భావాలు అల్లకల్లోలంగా ఆక్రమించేసాయి మనసంతా. మనిషి జన్మించింది మొదలు మరణశయ్య మీద చిట్టచివరి ఉచ్ఛ్వాశం తీసేవరకూ ఎన్నిరకాల అనుభూతులకు లోనుకాగల అవకాశం ఉందో అన్ని అనుభూతులూ, ఈ ఒక్క మూడు రోజుల్లోనే చుట్టుముట్టాయి నన్ను.

‘అలసలసి ఉన్నారు. అలా ఒక గంట పాటు నడుములు వాల్చరాదట్రా. అలా అనవసరంగా వాగుతూ అలసిపోయేకన్నా?‘ అమ్మమ్మ మధ్య గదిలో ఉన్న వాళ్ళని కసురుతోంది.

‘రేపటి నుండి అందరూ చేసే పనే అది. రేపు తెల్లారి లేస్తే ఎవరి గూటికి వాళ్ళు. మళ్ళీ ఎన్నాళ్ళకో, ఎక్కడో? ఏం కబుర్లు చెప్పుకున్నా ఇవాళ ఒక్కరోజే కదమ్మా‘ సుందరం పిన్ని.

‘ఈ గుంట వెధవలంతా ఏరి? ఒక్కడూ కనబడడూ?‘

‘అలా పెద్దబాబు గది వెనకాల కటకటాల గదిలో పేకాట ఆడుతున్నారు.‘

అటు వాళ్ళ మాటలూ, ఇటు నా పెద్దతమ్ముడు రవణా, మిగతావాళ్ళూ చేస్తోన్న పేకాట అల్లరీ అన్నీ చెవిన బడుతున్నాయి.

అశాంతితో అలసిపోయిన నిస్త్రాణలో ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుంది మనస్సు.

"అన్ని రంగులూ, అన్ని అందాలూ అన్ని అనుభూతులూ సగటుగా కలిసి ఉన్న సూర్యకాంతి, జీవితం కాదంటారా?"

అమ్మ వైపు, నాన్నగారివైపు అయినవాళ్ళు చాలా మంది ఉన్నారు. మేనమామలు, పింతల్లులు, మేనత్తలు, పినతండ్రులు, వాళ్ళ వాళ్ళ కుటుంబాలు, నా ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు, అంతా కలిపి పిల్లా జెల్లాతో సహా నికరంగా యాభైమంది తేలేరు.

ఈ మూడు రోజుల అనుభవమూ తేల్చింది ఇంతమంది అయినవాళ్ళు ఒక్కచోట చేరినప్పుడు ఏం మాట్లాడుకుంటారో ఇదీ అని చెప్పటానికి ఏమీ ఉండదు. కొటేషనూ ఉండదు.

అవి మాటలు కావు. అది సంభాషణ కాదు. ప్రతీ మనిషీ ఒకే గుండెలో ఒక ముక్క వీళ్ళంతా. ఒకే గుండె ముక్కలు. కాలం ఎక్కడెక్కడో విసిరేస్తుంది, ఈ ముక్కల్ని జీవితం తరుముకు వస్తుంటే జీవనాన్ని తరుముకుంటూ, ఎవరికి వారు ఒకరికొకరు దూరంగా, మళ్ళీ అదే కాలం.

చావుకో, పుట్టుకకో, నిలువుగా పాతబడిన పందిరి రాటల మధ్య పెనవేసుకుంటున్న పచ్చని పెళ్ళి ముళ్ళకి సాక్ష్యం ఇచ్చేందుకు, అడ్డంగా పరచబడిన అవే రాటల పాడెమీద, తెగిపోయి వెళ్ళిపోతున్న ముళ్ళను వీడుకొలిపేందుకో... మళ్ళీ తాత్కాలికంగా దగ్గరకు చేర్చుస్తుంది. అప్పుడు ఆ గుండె ముక్కలు, ఆత్రంగా ఆప్యాయంగా అస్తవ్యస్తంగా ఉండగట్టుకుని జారిపోయిన క్షణాలన్నింటినీ స్పందించాలనీ చేసే ప్రయత్నం.

ఇప్పుడు అదే జరుగుతోంది. ఆ మూడు రోజులూ ఈ గుండె ముక్కలన్నింటినీ తన గుప్పెట్లో వుండగా బిగియబెట్టిన కాలం రేపు సూర్యోదయంతో తన గుప్పెటని విసురుగా తెరుస్తుంది. వికేంద్రీకరిస్తుంది. జీవితంలో విసిరేస్తుంది.

మా పెద్దమామయ్య గట్టిగా నవ్వుతూ ఏదో చెపుతున్నాడు. అందరూ పగలబడి నవ్వుతున్నారు. అమ్మ నవ్వు కూడా స్పష్టంగా వినిపించింది. అన్ని నవ్వుల్నీ వదిలేసి అమ్మ నవ్వునే స్పష్టంగా ప్రత్యేకంగా గుర్తించిన నా అంతరంగం తన ఆ చర్యలోని ఔచిత్యాన్ని ఇదమిత్థంగా తేల్చుకోలేకపోతోంది.

నా పెళ్ళి విషయం సంభాషణలో దొర్లడంతో నా ధ్యానం కాస్త అటు మళ్ళింది. నాకు ఈడైన మరదళ్ళు ముగ్గురు నలుగురున్నారు. కానీ ప్రధానంగా పోటీలో ఉన్నది ఇద్దరు. మా పెద్దమామయ్య కూతురు పదహారేళ్ళ పద్మ, మానాన్నగారి పెద్ద చెల్లెలు సూరీడత్త కూతురు పద్దెనిమిదేళ్ళ నీలవేణి. అమ్మ తరపున వాళ్ళు, నాన్న తరపున వాళ్ళు - అని రెండు పక్షాలుగా చీలిపోతున్నారు ఈ విషయంలో. ఈ ప్రసక్తి వచ్చిన ప్రతిసారీ వాతావరణంలో కనిపిస్తోన్న వింతైన చిరువేడి నాకూ, మా అమ్మకీ ఇబ్బందికరంగానే పరిణమిస్తుంది.

మామూలుగానే మళ్ళీ కాసేపు విసుర్లు చురకలూ సాగదీసుకోవడాలూ అన్నీ అయ్యాక పెద్ద మామయ్య మరో విషయం మీదకి నడిపినట్లున్నాడు. కాసేపు జాలిగా మాట్లాడుతూ ఉంటే నాకు అర్థం అయ్యింది. కొద్దిసేపు తరువాత మామయ్య సినిమా ప్రోగ్రాం పెట్టారని.

రవణా! రవణా!

'చిన్నన్నయ్యా! పెద్ద మామయ్య పిలుస్తున్నాడా', నా ఆఖరి తమ్ముడు వాసు రవణని పిలిచాడు.

'అబ్బ ! ఉండరా! కౌంట్ అయ్యేలాగుంది. ఇప్పటికింకా లైఫ్ లేదు. నువ్వు పోయి కనుక్కో ఎందుకో'

సినిమా సంభాషణ జోరుగా వినిపిస్తోంది.

'ఏ సినిమాకో చెప్పేడా మామయ్యా? మా రాజ్యం పిన్ని కొడుకు అడిగేడు వాసును. 'లేదింకా మనవే డిసైడ్ చేద్దాం.'

'చిన్నన్నయ్యా! ఏదైనా కలర్ ఫిలింకి వెళ్దామా!'

అటు మా అమ్మమ్మ కంఠం ఖంగున వినిపించింది. 'అందరూ కట్టకట్టుకుని పది పదిహేను రిక్షాల్లో ఏ పెళ్ళికో, ఊరేగింపుకో వెళుతున్నట్టు చూసే వాళ్ళకి ఏమైనా బాగుంటుందిరా నానీ? ఇప్పుడు వందో, నూట యాభయ్యో తగలేసి..'

'అబ్బ నువ్వుండవే నస.. ఇంతమందీ మళ్ళీ కలుస్తామా ఏమిటీ? మంచో చెడ్డో ఏదో సందర్భం వచ్చింది కాబట్టి కలిసాం గానీ..

మంచో, చెడ్డో ఏదో ఒకటి.! ఏదైనా ఒకటే! జీవితానికి గొప్ప సమదృష్టి వుంది! బ్రతుకుకి గొప్ప ఎడ్జస్టబిలిటీ వుంది! మళ్ళీ నా మనస్సు అగాధాల్లోకీ, ఆకాశంలోకీ పరుగులు తీస్తోంది.

'... అందుకే నాకు కలర్ ఫిల్మ్ అంటేనే ఇష్టం. అంతెందుకు... మనంరోజూ చూసే రోడ్లూ, ఇళ్ళూ, కొండలూ, మైదానాలూ

ఒకటేమిటి, అన్నీ కూడా ఈస్ట్‌మన్ కలర్‌లో చాలా అందంగా, ఇంతకు మునుపు మనం చూడనంత అందంగా కనిపిస్తాయి. ఎందుకో తెలుసా?' తన ఉపన్యాసాన్ని ఒక ప్రశ్నతో ఆపేసాడు వాసు.

'ఎందువల్లనంటావ్?' ఎవరో అడిగేరు. వాడేం చెబుతాడో వినాలని నాకు కుతూహలంగా అనిపించింది. ఇప్పుడిప్పుడే భావగగనాల్లో విహరిస్తోన్న వయస్సు వాడిది. ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

'మనకి కాలేజీలో ప్రాక్టికల్స్‌లో చూపిస్తారు చూడు, కాంతి కిరణం పట్టకం ద్వారా ప్రయాణించి ఏడు రంగుల వర్ణపటంగా విశ్లేషించబడటం! అదే కారణం, మనం పైన చూసే ప్రతి వస్తువునీ తెల్లనిసూర్యకాంతి ఛాయలో చూడటం వల్ల,అన్ని వస్తువులూ వాటి వాటి రంగులు వెలిసిపోయినట్లు, ఫేడౌట్ అయినట్లు కనిపిస్తాయన్నమాట. అదీ కలర్ ఫిల్మ్‌లో అయితే లైట్ రీడిస్పర్షన్ వల్ల చక్కగా రంగురంగులుగా విశ్లేషించబడి, ఏ వస్తువుకి వస్తువు తన ప్రత్యేకతతో, తన ఒరిజినల్ రంగుతో కనిపిస్తుందన్న మాట. కావలిస్తే చూడు, నువ్వు పట్టపగలు చూసే ఏ వస్తువైనా సంధ్యా సమయంలో గానీ రాత్రి దీపాల కాంతిలో గానీ చూస్తే ఇంకా అందంగా కనబడుతుంది. అందుకే నా కనిపిస్తుందీ, దేవుడనేవాడు కనబడితే అడగాలనిపిస్తుంది. పగటి కాంతిని కూడా ఈస్టమన్ కలర్‌లో ఇవ్వరాదా అని!' వాసుగాడి పద్దెనిమిదేళ్ళ భావుకత్వం, నాకు ఎందుకో స్పష్టంగా తెలియని చిరునవ్వుని రప్పించింది.

నాకు ఈ సినిమా ప్రోగ్రాం కొంత అయిష్టంగానే ఉంది. మొత్తానికి పెద్దమామయ్య, అమ్మమ్మతో సహా అందర్నీ బైల్దేరదీసాడు. ఇంతమంది పెద్ద ఊరేగింపులా సినిమాకి బయలుదేరి వెళ్ళడం నాకు కొంచెం డెలికేటుగా ఉంది. నేను వాళ్ళతో కలవకుండా వేరేగా సిటీబస్‌లో వెళ్ళాలనుకున్నాను. అదీగాక ఇన్ని టికెట్లు సంపాదించే ప్రాబ్లం ఒకటుంది. ఆ హాలు మేనేజర్ నా స్నేహితుడు. కనుక ఒక గంట ముందుగా వెళ్ళి చెబితే మంచిది. కొంత అయిష్టంగానే, అంతరంతరాల్లో ఎక్కడో ఎంతో కొంత ఇష్టం లేక పోలేదు అనే నిజం కూడా నాకు తెలుస్తూనే ఉంది. నిజమే ఈ సందడినీ, ఈ సందేహాన్ని, ఆత్మీయుల మధ్య ఈ కలకలల చైతన్యాన్నీ ఆనందించకుండా ఉండలేకపోతోంది నా హృదయం. అలా ఆనందపడటంలో ఏదో అపరాధ భావన కూడా వెంటాడుతోంది లీలగా.

నా వెనక ఎనమండుగురు కుర్రాళ్ళు బయలుదేరారు. అమ్మమ్మ పెట్టిన అభ్యంతరాలన్నీ తీసేసి, పద్మని కూడా వెళ్ళమని పంపించారు పెద్ద మామయ్య. ఆ హడావిడిలో నోటితో నవ్వుతూ, నొసలుతో వెక్కిరిస్తూ, 'నువ్వు కూడా బావతోనే పోవే' అని నీలవేణిని ముందుకి నెట్టింది సూరీడత్త.

పద్మ నా పక్కగా నడుస్తూ, వసపిట్టలా చెవిలో ఏదేదో వాగుతుంది. కాస్త దూరంగా నీలవేణి తలవంచుకుని, అప్పుడప్పుడు నా వైపు ఓరచూపులు చూస్తూ నడుస్తోంది. మిగతా వాళ్ళంతా వానర సైన్యంలా రోడ్డంతా ఆక్రమించుకుని చిందులు త్రొక్కుతూ నడుస్తున్నారు.

సిటీబస్‌లో మా సెక్షన్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు గారు కనిపించి విష్ చేశారు.

'ఆ! ఏవండీ కార్యం బాగా సవ్యంగా నడిచిపోయినట్లేనా?'

'ఆ! బాగానే పూర్తయింది సార్'

'ఊ, బాగుంది! వీళ్ళంతా...?

'తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, బావలూ, మరదళ్ళూ, బంధువులు!

'ఆహా! బాగుంది! వైభవంగానే జరిగిందన్నమాట! ఇంకేం? అయినా మీ నాన్నగారికేం లోటు? మహానుభావుడు. ఆయిన వాళ్ళు కొల్లలు... మొత్తానికి పెళ్ళిలా జరిపించుకున్నాడు. బాగుంది... ఆc.. ఏమిటిలా చాలా హడావిడిగా బయలుదేరారు?

ఏదో చెబుదామనుకున్నాను, ఇంతలోనే ఒక పిసింద్రీ అందుకుని, 'సినిమాకి సార్! దేవిలో శపథం సినిమాకి' అన్నాడు ఉత్సాహంగా, ఒక్క క్షణం గిల్టీగా కొట్టుకుంది నా గుండె

'ఓహో.. సినిమాకా.. ఇకనేం? అన్నట్లు ఈ రోజుతో మీ లీవ్ అయిపోయింది గదా, రేపు జాయినవుతారా లేక ఎక్స్‌టెండ్ చేస్తారా?

'అబ్బెబ్బే లేదండీ! జాయినైపోతాను' కంగారుగా అన్నాను. అవసరంలేని సంజాయిషీ ధ్వనించింది నా కంఠంలో. ఆయనలో ఎంతమాత్రం ఆ ఉద్దేశం లేకపోవచ్చును గానీ, నాకు మాత్రం ఆయన 'ఓహ్, సినిమాకా బాగుంది' అన్న మాటల్లో ఏదో వెక్కిరింత, వ్యంగ్యం ఉన్నట్లనిపించింది.

ఎలా జరిగిందో, ఎవరి ప్రోత్సాహం వల్ల. ఏ 'రాజకీయం' వల్ల జరిగిందో గానీ, నా సీటు పద్మకీ నీలవేణికీ మధ్య ఉండేలా ఏర్పాటు జరిగింది. చిన్నగా నవ్వుకుంటూ కూర్చున్నాను.

సినిమా మొదలైంది. ఇదివరకే నేను చూసేసిన సినిమా. అన్యమనస్కంగా చూస్తున్నాను. నా ప్రక్కన సన్నగా ముక్కు ఎగబీల్చినట్లనిపించి తలతిప్పాను, నీలవేణి ఏడుస్తోంది.

'ఏమిటీ..."' అన్నాను నేను నెమ్మదిగా. ఐదు నిమిషాల తర్వాత, నెమ్మదిగానే చెప్పింది.

'చూశావా బావా! తండ్రి పోయి ఇరవై ఏళ్ళయినా, రామారావు (సినిమాలో హీరో) ఒక్క క్షణం క్రితం పోయినట్లు ఎలా దుఃపడుతున్నాడో! ఇరవై ఏళ్ళుగా ఒక్క నిమిషం కూడా మరచిపోలేదన్న మాట! మా నాన్న కూడా మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకున్నారో అయిదేళ్ళయినా కాలేదింకా, అప్పుడే అమ్మకూడా మరచిపోయింది...

ఉలిక్కిపడ్డాను. దాని మాటలు వినిపించడం మానేశాయి, ఏదో తెలియని ఆవేదన గుండెలో సుళ్ళు తిరుగుతున్నది.
నాన్నగారు! మా నాన్నగారిలాంటి తండ్రి ప్రపంచంలో మరెవ్వరికీ లేరేమో అనిపించేది మాకు!ఎంత ప్రేమ మూర్తి! ఆయన చితిముందు నుంచున్న నాకు, ఇంక ఈ ప్రపంచంలో బ్రతకడం వ్యర్థం అనిపించింది. నేనూ, రవణ పదకొండో రోజున ఆత్మహత్య గురించి ఆలోచించాం. మా అమ్మ వారం రోజులపాటు పచ్చి మంచినీళ్ళు తగలేదు. ఇంత విషం తిని అందరం చచ్చిపోతే బాగుంటుందని నేనూ రవణా నిశ్చయించుకున్నాం. కానీ ముక్కుపచ్చలారని చెల్లెళ్ళు, ఆఖరి తమ్ముడూ వీళ్ళని చంపే ఆధికారం మాకు లేదు. అమ్మకీ, నాకూ, రమణకీ ఉన్నంత మనస్తాపం ఉండే వయస్సు కాదు వాళ్ళది. వాళ్ళకోసం మేం బతక్క తప్పదనుకున్నాం.

ఇంతా జరిగి ఎంతకాలమైంది? అంతలోనే... "బావా!" గిల్లింది పద్మ, "శ్! అబ్బ! ఏమిటి?"

"ముక్కు మొహం తెలీని వాళ్ళని, ఈ ప్రపంచంలో ఎక్కడని వెతుకుతాడా అతను? (హీరో) తను ప్రతిజ్ఞ పట్టేసినంత మాత్రాన వాళ్ళు దొరికితే గానీ, వీడు నవ్వడు, నలుగురితో కలవడు, తిండీ తినడు. ఊహూఁ.. తాగేస్తున్నాడు? వీడు చచ్చిపోడా మరి?"

తన బాల్యంలో తన కళ్ళముందు, తన కన్న తండ్రిని చంపిన హంతకుల అంతు చూడటానికి ప్రతిజ్ఞ పట్టిన ఒక కుర్రవాడి కథ ఆ సినిమా. తండ్రి చితిమంటల ఎదురుగా పిడికిలి బిగించి, గుండెలు పగిలేలా ప్రతిజ్ఞ చేసిన ఆ క్షణంలో ఆ కుర్రవాడి జీవితంలో కాలం స్తంభించిపోయింది! అది ఒక్కటే క్షణం. అటు తర్వాత అతని జీవితంలో మరే ఇతర ' ఇతర క్షణం' తొంగి చూడనే లేదు! ఆ ఒక్కటే అనుభవం, ఆ ఒక్కటే అనుభూతి. అటు తర్వాత అతని అస్తిత్వ కాల ప్రవాహం నుంచీ బైటకి వచ్చేసి 'ఆ భావావేశపు అభావం స్థిరీకరించబడిపోయింది. అటుపైన ఇరవై ఏళ్ళపాటు, అహరం, అనుక్షణం, ఆ దుఃఖాగ్నిలో, ఆ ప్రతీకార జ్వాలలో, ఆ చితిమంటల స్మృతి వాక్యంలో అర్థాంతరంగా ఆగిపోయి నిలిచిపోయాడు. అటుపైన అతనికి నవ్వూలేదు. మరో ఏడుపూ లేదు. బ్రతుకూ లేదు. గమనం అసలే లేదు ఇరవైయేళ్ళపాటు..

నాన్నగారి చావు కూడా చాలా మిస్టీరియస్‌గానే జరిగింది. కోర్టు పనిమీద విజయనగరం వెళ్ళి హఠాత్తుగా హార్ట్ ఎటాక్‌తో .. నో సమ్‌థింగ్ ఈజ్ రాంగ్. ఆ పదకొండు రోజులూ ఏవేవో గుసగుసలు వినిపించాయి నాకు. పోస్ట్‌మార్టం జరగకుండా పెద్ద ప్రయత్నం

జరిగిందట. నాన్నగారు వెంట తీసుకెళ్ళిన కాగితాలు కొన్ని కనిపించలేదట. ఏది, ఏమిటి, ఎందుకు ఎలా జరిగిందో స్పష్టంగా ప్రశ్నలు వేసుకునే లోగానే, నాన్నగారు పిడికెడు బూడిదైపోయారు.

ఎంతగా జ్వలించి పోయింది నా గుండె ఏదో ఉక్రోషంతో, ఏదో మంటతో... నాన్నగారి చావు సహజమా, అసహజమా, అసహజమైతే ఎలా, ఎందుకు..? ఆరా తియ్యాలనీ, అంతు చూడాలనీ, అగ్ని పర్వతంలా రగిలిపోయాను నేను.

ఏం చెయ్యగలిగాను? ప్రశ్న అలాగే ఉండిపోయింది. ఉండిపోలేదు కూడా. కాలగతిలో క్రమంగా కరిగిపోతోంది కూడా.. హుఁ! కాలగతి అంటే ఎంతో కాలమై పోయిందేం...? ఈనాడిలా సినిమా చూస్తూ, వయస్సు రక్తాన్ని రెండు పక్కలా వేడెక్కించుకుంటూ, జీవితానుభవంతో ప్రతిక్షణం మునకలు వేస్తూ.. ఒక్క క్షణమైనా దేవుడిలాంటి నాన్నగారి కోసం జీవితాన్ని స్థిరీకరించుకోలేక.. ఎక్కడికీ కొట్టుకుపోవడం!

నాన్నగారు పోయింతర్వాత, నవ్వు, ఆనందం, అనుభవం – ఇవేవీ నా జీవితంలో ఉండవనుకున్నాను. ఉండకూడదనుకున్నాను. కేవలం కుటుంబం పట్ల నా బాధ్యతని, కర్తవ్యాన్ని నెరవేర్చడానికి మాత్రమే, నాన్నగారు వారసత్వంగా మిగిల్చిన ఈ జీవితాన్ని కొనసాగించాలనుకున్నాను కొన్ని రోజులు. అంతే! మళ్ళీ జీవితం తన పరిపూర్ణ విలాసంతో కమ్మేసింది.

'బావా' మళ్ళీ గిల్లింది పద్మ.

'ఏమిటీ, ఏంటీ నస?' చిరాగ్గా అనాలనుకున్నాను. సరసంగా అనేశాను. 'హౌ షేం ఫుల్! అంతలా కవ్విస్తోంది ఆ అమ్మాయి. అతనిలో నిజంగానే ఏమీ చలనం లేదంటావా?" కవ్విస్తున్నట్టు అడిగింది.

నిజమే! ఈ అనుమానం నాకూ వచ్చింది. కాలం, జీవితం ఇన్నేళ్ళుగా అతన్ని ఎప్పుడూ తాకనేలేక పోయాయా? తాగి తాగి ఆ మత్తులో అస్తిత్వాన్ని తిమ్మిరితో మొద్దుబరిచి, ఆ తాకిడిని తుళ్ళగొట్టి తృణీకరించాలని అతను ప్రయత్నం చేస్తున్నట్లు అనిపించింది. ఆపరేషన్‌కి ముందు మత్తు ఇంజక్షన్ తీసుకున్నట్లు ఎందుకు? జీవన స్పర్శ నుంచీ బలవంతాన తప్పుకునే ప్రయత్నం ఎందుకు? ఆత్మ వంచనని కప్పి పుచ్చుకోవడం ఎందుకు?

"ఏమో నాకేం తెలుసు? నేనేమైనా వాడి మనస్సులోకి తొంగి చూసానా? వాడిలో నిజంగా చలనం ఉందో లేదో, ఉండీ లేనట్లు నటిస్తున్నాడో...."

"ఎందుకూ నటించడం? ఆ అమ్మాయిని ప్రేమిస్తే, వాళ్ళ నాన్నపట్ల ప్రేమ, వాడి ధ్యానం తగ్గిపోతాయా? అసలు, అలా ఒకే పాయింటు మీద అన్నేళ్ళు ఉడుంపట్టు పట్టి కూర్చోవడం సాధ్యమేనా, బావా? నా మటుకు నాకు అసాధ్యం సుమా? మా నాన్న మీద ఎప్పుడైనా అలుగుతాననుకో, నిజంగా అన్నం మానేసి కూచుంటాను. ఆయన వచ్చి బతిమాలడం ఆలస్యమయిందనుకో, ఎంతాకలేస్తుందనుకున్నావ్? కోపం అలాగే ఉంటుంది. కానీ ఆకలి కూడా వేస్తుంది. దొంగతనంగా తినేసి కూర్చుంటానంతే!" కిలకిలా నవ్వేసింది.

దాని మాటల నుంచీ నా అంతరంగంలోని సందిగ్ధతకి ఏదో సమాధానం. నేను అజ్ఞాతంగా అస్పష్టంగా, కోరుకుంటున్న జవాబు వైపుకి మొగ్గు ఇచ్చే ఆలంబన దొరికినట్లు అనిపించింది. మనస్సు గిల్టీ ఫీలింగ్ నుంచీ కొంచెం కొంచెం తేరుకుంటుంది.

ఈ భావ సంఘర్షణ ఇరవై రోజుల క్రితం నుంచీ ప్రారంభమయ్యింది. మా బాబాయి ఇరవై రోజుల క్రితం వచ్చాడు దగ్గరుండీ నిర్వహించేందుకు.

బంధువులకి ఆహ్వానాలు వెళ్ళాయి. పెళ్ళి పిలుపుల్లాగా ఇంతమందికి వసతి సౌకర్యం చూపించడం ఎలాగా అన్న సమస్య తలెత్తినప్పుడు "పక్కింటి మాస్టారింట్లో ఎడం ప్రక్కన వాటా ఖాళీ అయింది. ఆ అయిదు రోజులు విడిదిగా అడిగితే సరి! అన్నాడు రవణతో.

ఆ విడిది అన్నమాట, చాలా ఇబ్బందికరంగా అనిపించి నేను, రవణ ముడుచుకు పోయాం. సౌకర్యార్థం, ఇంటికి ముందూ, వెనుకా షామియానాలు వేయించక తప్పలేదు.

వంట బ్రాహ్మలు, వంటలు, హడావుడీ, ప్రతీక్షణం, ప్రతీ అంశం మీద నేనూ రవణా గిల్టీగా, మొహమాటంగా సిగ్గుతో మొహాలు ఎర్రబరచుకుని, తలలు దించుకుంటూ ఉంటే అమ్మమ్మ అంది.

"అదేమిట్రా కుర్ర నాగప్పల్లారా! ఎందుకలా ఏదో తప్పు చేస్తున్నట్లు, సిగ్గు పడతారు? సంవత్సరీకాలు అంటే, పెళ్ళితో సమానం అని చెబుతారు పెద్దలు" అని.

మూడు రోజులూ, ఉన్నట్లుండి భోరున రాగాలు, పెడబొబ్బలు. అరగంట తిరక్కుండా నవ్వులు, నవ్వుతున్నప్పుడు, కేరింతలు. మళ్ళీ ఏదో తంతు జరుగుతున్నప్పుడు అందరూ శోకాలు, సానుభూతులు.

ప్రతీ రాత్రి పెళ్ళి గొడవలు, చనిపోయిన వారి జ్ఞాపకాలు తవ్వి తియ్యడం కళ్ళు గతాన్ని వర్ణించడం, పుట్టనున్న వారి జాతక చక్రాలు తిప్పుకోవడం, కళ్ళు భవిష్యత్తుని తెలియ చెప్పడం, వర్తమానాన్ని కలలు కనడం.

ఈ ఏడాదిగా లేని జీవకళ ఏదో అమ్మ మొహంలో కనిపించింది. రవణ ఆనాడు తన పాటలతో, తన వాయిద్యాలతో, ఎంత హుషారుగా ఎంటర్టైన్ చేసాడు!

నాన్నగారు పోయిన్నాటి విషాదచ్ఛాయ. నాన్నగారు తిరిగి వచ్చేరా, అన్నంత ఉత్సాహంగా...

బ్రతుకు, చావు, ఆరాటం, ఆనందం... గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇది!

ఏ కుర్రాడికో సినిమా గురించిన సందేహాన్ని, మా బాబాయి గారొకాయన తీరుస్తున్నారు. "బాగుందిరా మరీ! మూడు గంటల్లో మొత్తం కథంతా చెప్పాలాయె! నువ్వు అడిగే ప్రతీ చొప్పదంటు ప్రశ్నకీ, వాడెప్పుడు తిన్నాడు, ఎప్పుడు పడుకున్నాడు, ఎప్పుడు దొడ్డి కెళ్ళాడు, ఎప్పుడు స్నానం చేశాడు.. ఇవన్నీ చూపిస్తే వాడు బతికినంతకాలం మనకి సినిమా చూపించాలి. అదీకాక ఆ కథ వాడి జీవితంలోని ఏ సంఘటనకీ, ఏ రసానికీ సంబంధించిందో ఆ ఒక్క అంశాన్నే చెబుతాడు కానీ, మొత్తం జీవితమంతా, అన్ని రసాల్తో పరిపూర్ణంగా ఎలా చూపించగలడు? సహజత్వం లేదని నువ్వంటే ఎలా? సినిమా అంటే జీవితంలా అనిపించేదే కానీ, జీవితం కాదుగా?"

నాకు సమాధానం దొరికింది. మా నాన్నగారు నాతో అంటున్నట్లు అనిపించింది. "ఒరే నాన్నా! నేను చనిపోయిన ఆ క్షణం దగ్గరే, నీ జీవనం, గమనం స్తంభిస్తే నేను పోయినట్లే లెక్క. అలాకాక, నువ్వు, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ మీమీ బ్రతుకుల్లో నడుస్తూ..మీ వెనకాల నా స్మృతిని నడిపించుకుంటూ, మీ జీవితాల్లోకి, నన్ను ఇముడ్చుకుంటూ వెళితే, నేను బ్రతికి ఉన్నట్లే కదరా?!"


రంగుల్లోకి విశ్లేషించబడితే, పరిపూర్ణత నుంచీ వేరుపడ్డ ఏ ఒక్క రంగో, ఏ ఒక్క అంశమో - స్ఫుటంగానే అయినా, అందంగానే అయినా - ఒక్కటి విడిగా కనబడుతుంది!

అన్నిరంగులూ, అన్ని అందాలూ, అన్ని అనుభూతులు సగటుగా కలిసి ఉన్న సూర్యకాంతి జీవితం.

# మగవాడు ఆడమనిషి

రాచకొండ విశ్వనాథశాస్త్రి

ఆంధ్రపత్రిక, 29-4-1953 ప్రచురితం



జీవితంలో నాలుగు రోడ్ల జంక్షన్ దగ్గరకు వచ్చి ఎటుపోవాలో ఎరక్క అటూ ఇటూ చూస్తోన్న మూర్తి ఒక రోజున నిల్చున్నాడు మద్రాసులో, మైలాపూర్‌లో నాలుగురోడ్ల జంక్షన్లో, బస్‌స్టాండ్ దగ్గర్నే.

మూర్తిలో యవ్వనం ప్రవేశించింది.

కానీ ఇంకా పోలేదు బాల్యం అతన్లోంచి.

అతణ్ణీ అతనితోపాటు బస్‌కోసం 'వెయిట్' చేస్తోన్న ఇంకో పదిహేను మందినీ మాడ్చి చంపుతోంది చెన్నపట్నపు ఎండ.

కావలసింది తప్పించి మిగతా బస్సులన్నీ వస్తున్నట్టున్నాయి. వచ్చినవన్నీ వెళ్ళిపోతున్నాయి.

ఎండ కాల్చి చంపుతూనే ఉంది.

మూర్తికి చిరాగ్గా ఉంటూనే ఉంది.

బస్సులకోసం కాసుక్కూర్చోడం, బస్సుల్లో నలిగిపోతూ నిల్చోడం, ట్రాముల కెగబ్రాకడం, రిక్షాల్లో తూలిపోతూ పోవడం, ఎలక్ట్రిక్ ట్రయిన్లో నలిగి చావడం, అందరికాళ్ళూ పట్టుకొందికి తిరగడం తిరగడం.

ఇలా జరిగిపోతోంది కాలం.

"ఉద్యోగం లేదు, సద్యోగం లేదు. ఈ ఊళ్ళో ఏదీ దొరికేట్టులేదు. ఆఖరికి మంచినీటి చుక్కలయినా దొరకడంలేదు" అనుకున్నాడు రాని బస్సుకోసం నిరీక్షిస్తోన్న మూర్తి.

దువ్వుకున్న జుట్టు దువ్వుకోనట్టుగా ఉంది. చొక్కా నలిగింది, మాసింది. పైజమా ఒక్కచోటే చిరిగింది.

లోకం అంతా ఆ చిరుగువైపే చూస్తున్నట్లు బాధపడుతున్నాడు మూర్తి.

వంటిమీద సరయిన బట్టలేదు. చేతిలో పుష్కలంగా డబ్బులేదు. తప్పుల్లేని ఇంగ్లీషుముక్క లేదు. ఎవడు చూస్తాడీ ఊళ్ళో నన్ను!

ఉద్యోగం కోసం రామయ్యగార్ని చూద్దామని వస్తే ఆయన సుఖమైన వసతికోసం యెగ్మూరు పోయారుట.

రేపు అక్కడికి పోవాలి. ఇప్పుడు అప్లికేషన్ రుసుం చెల్లించడానికి గవర్నమెంటు వారి ఖజానాకి పోవాలి.

పోదల్చుకున్న చోటుకి పోయే బస్సులు రావడంలేదు. వస్తే ఆగడంలేదు.

'నే చస్తే ఈరోజున ట్రామెక్కను.'

చిరాగ్గా నిల్చున్న మూర్తి విసుగ్గా అందరివైపూ చూసేడు. బస్సుకోసం చాలామంది నిల్చున్నారు. అరవ ఫక్కీలో, ఆరుగురు జరీ అంచు ధోవతులు కట్టుకున్నారు. యూరోపియన్ ఫక్కీలో, ఇద్దరు ఉలెన్ సూట్లు వేసుకుని లేని దర్జా తెచ్చుకోబోతున్నారు. ఒకే గొడుగు నీడని నిల్చొన్న

ఇద్దరాడవాళ్ళు ఎందుకోగానీ తెగనవ్వుతున్నారు. కాలేజీ స్టూడెంట్లా కనిపించే ఆడమనిషి పొడవుగా ఉన్నాననే గర్వంతో పొడవుగా నిల్చొంది. మూర్తి దృష్టి పడింది ఆమె చేతిలో ఉన్న పుస్తకాల మీద.

ఆడవాళ్ళు చదివేస్తున్నారు బియ్యేలూ ఎమ్మేలూ!

ఆవిడ బస్సెక్కి కాలేజీకి వెళ్తుంది. నేను బస్సెక్కి ఖజానాకి పోవాలి.

ఏదో బస్సు వస్తోంది! ఆమె మీంచి కళ్ళు తీసేశాడు మూర్తి. బస్ ఇంకా దూరంలోనే ఉంది.

"మిస్టర్ మిస్టర్" అని ఎవరో ఎవర్నో పిల్చేరు. అటు తిరిగేడు మూర్తి.

రంగుల గొడుగు కింద నిల్చొన్న కాలేజీ స్టూడెంట్లా కనిపించే పడుచు దగ్గరగా రమ్మంది మూర్తిని. మూర్తి ఆశ్చర్యపోలేదు.

నిర్ఘాంతపోయాడు. కొంచెం తేరుకుని దగ్గరగా వెళ్ళాడు.

మాసిన చొక్కా ఇంకా మాసింది. చిరిగిన పైజమా ఇంకా చిరిగింది. కొట్టుకునే గుండెలు ఇంకా కొట్టుకుంటున్నాయి. ఆవిడ తొందర పాటుతో మాట్లాడుతోంది.

"క్షమించి మరో విధంగా అనుకోకండి. కానీ అదిగో బస్ వచ్చేస్తోంది. ఈ ఉత్తరం అర్జంటుగా పోస్ట్ చెయ్యాలి. ఇంతవరకూ మర్చిపోయాను. టైమయిపోతోంది. పోస్టు బాక్సు - అదిగో అక్కడే ఉంది. దయచేసి అందులో పడేద్దురూ" అందామె మూర్తితో, ఆతృతతో, ఇంగ్లీషులో.

ఉత్తరంయేదో పోస్టు చెయ్యమంటోందని గ్రహించాడు మూర్తి.

పుస్తకం మధ్యనుంచీ కవరు తీసి మూర్తి చేతికిచ్చిందామె, 'పోస్టుచెయ్యక ఏంచేస్తావ్' అనే ధీమాతో.

నా బస్సు కూడా నీ వెనకే వస్తోంది. అందులో పోయి నేను ఉద్యోగం కోసం ఖజానాలో డబ్బు కట్టాలి. ఆ బస్సుమించిపోతే ఇంకోటి వచ్చేట్టులేదు. రాకపోతే ఎండలో నిల్చొని చావాలి. ఈ ఉత్తరం ఇంత అర్జంటా? తరువాత ఎందుకు పడేసుకోకూడదు? మెయిల్‌కి సాయంకాలం వరకూ వేళ ఉంది కదా అనే మాటలు అందామనే తోచలేదు మూర్తికి.

చుట్టూనిల్చున్న మగాళ్ళంతా "ఏంవదృష్టం, ఏంవదృష్టం" అన్నట్టుగా చూస్తున్నారు.

ఆమె వైపూ వాళ్ళవైపూ చూసి తపాల పెట్టెవైపు నడిచేడు మూర్తి. నడుస్తూ నడుస్తూ కవరు మీద అడ్రస్ చూసేడు.

కలకత్తా ఏదో నంబర్న ఏదో వీధిలో ఉండే "అనిల్ కుమార్" అనే వాడికి "మోహిని, మద్రాస్" నుంచీ వెళ్తోందా ఉత్తరం.

అడ్రస్ చదవడం తప్పేమో, ఆవిడ చూసిందేమో అనే అనుమానంతో వెనక్కి తిరిగి చూసేడు. వేగిరం వెళ్ళమని సంజ్ఞ చేసిందావిడ.

ఏకంగా పరుగే తీసేడు మూర్తి.

తపాలా తీయడానికి బంట్రోతు వచ్చేడు. వగర్చు కొంటూ వెళ్ళి ఉత్తరం అందజేసేడెలాగయితేనేం మూర్తి అతడికి. ఉత్తరం ఇచ్చాక వెనక్కి తిరిగేడు.

కదుల్తూన్న బస్సు గుమ్మంలో నిల్చొని ముడిచిన రంగుల గొడుగు చంకన పెట్టి రుమాలు ఊపిందావిడ మూర్తిని చూస్తూ. ఏం చెయ్యాలో తోచని మూర్తి రెండు చేతులూ ఊపేశాడు.

బస్సు దూరంగా పోయింది. ఆమె గుమ్మంలోంచి బస్సులోకి పోయింది.

ఈవిడే కాబోలు మోహిని!

ఎక్కడ ఉంటోంది? ఏమిటి చదువుతోంది?

అనిల్ కుమారుడెవడు? ఈవిడకీ వాడికీ ఉన్న సంబంధం ఏమిటి?

"ఎందుకోగానీ ఈవిణ్ణి చూస్తే నాకు ఎంతో ఇష్టంగా ఉంది" అనుకున్నాడు మూర్తి.

'అనిల్ కుమార్'ని తల్చుకుంటే ఇష్టంగా లేదు.

"అనిల్ కుమారేమిటి అనిల్ కుమారు? షోకు పేరు. ఎందుకూ పనికిరాని షోకిల్లా రాయుళ్ళు పెట్టుకునే పాడు పేరు." అనిల్ కుమార్‌కి ఆవిడ ఉత్తరం రాసినందుకు విచారించినా తన చేత ఆ ఉత్తరాన్ని పోస్టు చేయించినందుకు గొప్ప పడిపోయాడు మూర్తి.

తన బస్సు పోయినందుకు మూర్తి విచారించలేదు, ఏదో ఘనకార్యం చేసినట్టుగా, ఎంతో సంతోషంతో, సంతృప్తితో మరో బస్సులో బైఠాయించాడు మరో అరగంటకి.

తరువాత డబ్బు కట్టడానికి ఖజానాలో ఉన్నంతసేపూ, తిరిగి ఇంటికి పాతమాంబళం వెళ్తున్నంతసేపూ, మధ్యాహ్నం ఇంట్లో ఉన్నంతసేపూ, సాయంకాలం పానగల్ పార్కులో కూర్చున్నంతసేపూ మోహిని గురించే, ఆమె గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు.

అంతా ఏదో కొత్తగా కనిపిస్తోంది.

ఉద్యోగం దొరకని, మంచినీళ్ళయినా దొరకని చెన్నపట్నం పాడు పట్నంలా కనిపించడంలేదు.

కంపుకొట్టే పాతమాంబళం సందూ మూడుగదుల మేనమామ ఇల్లూ, ఎప్పుడూ మాసిన గెడ్డంతో ఉండే మేనమామా, చస్తేనేగాని పోని స్ఫోటకం మచ్చల మేనత్తా, ఎప్పుడూ తనతో ఆమె, ఆమెతో తను మాట్లాడ్డానికి సందేహించే పదహారేళ్ళ మరదలు వరహాలూ, అన్నీ, అంతా ఎంతో ఆనందంగా మూర్తికి కనిపించేయి, కనిపించేరు. రాత్రి మేనమామ ఎందుచేతనోగానీ ఎక్కడికో వెళ్ళేడు అప్పుడప్పుడే చింతమొద్దులా పడుకుంది మేనత్త అప్పుడే

"నేను నిద్రపోతాను. నాన్నగారికి తలుపు తియ్యాలి ఎవరో ఒకరు" అంది పక్కగదిలో ఉన్న వరహాలు మూర్తికి వినిపించేలా.

ఇది నన్ను ముద్దుగా "బావా" అని ఎందుకు పిలవకూడదు? అనుకున్నాడు మూర్తి.

మూర్తికి ఆవేశంగా ఉంది. ఉత్సాహంగా ఉంది. గర్వంగా ఉంది.

"వరహాలూ! ఇలా రా" అన్నాడు మెల్లిగా, అత్తని లేపకుండా, వరహాలుకి వినిపించేలా.

మెల్లిగా ఉచ్చరించినప్పటికీ మాటల్లో అధారిటీ కనిపిస్తోంది, వినిపిస్తోంది.

"ఇలారా వరహాలూ!"

ఇంతకాలం పలకరించడానికి భయపడ్డవాణ్ణి ఇవాళ దీన్ని ఎలా పిలుస్తున్నాను?! మారుమాటాడకుండా ఎలా వచ్చిందీ వరహాలు పిలవగానే?!

"ఎందుకు బావా?"

"ఇందుకు"

చుట్టూ చేతులు వేస్తే ఎందుచేత ఊరుకుందీ వరహాలు?!

కొత్తగా ఆడదాన్ని అదుముకున్న మైకంలో కళ్ళుమూసి "మోహినీ! మోహినీ!" అన్నాడు అస్పష్టంగా.

వరహాలు క్కూడా అంతా కొత్తే అయినప్పటికీ "మోహినెవరు?" అని అడిగింది ఆడదాని అప్రమత్తతో.

"నువ్వే మోహిన్లా ఉన్నావ్" అన్నాడు మూర్తి, ఒక్కసారిగా తెలివి తెచ్చుకుని, అలాటి సమయాల్లో మొగవాడికి ఉండే అబద్ధపు నైజంతో.

ఇంతలో మామయ్య తలుపుతట్టడం జరిగింది.

రాత్రి పడుకునే ముందు మూర్తి కళ్ళముందు మెరిసింది, మద్రాస్ ఎండలో రంగుల గొడుగు నీడని నిల్చున్న మోహిని. రాత్రంతా కలల్లేని నిద్రపోయేడు.

మర్నాడు అన్నాడు మామయ్య,

"మరయితే డబ్బెలానూ కట్టి అప్లికేషను పడేశావు కదా! ఎగ్మూరు పోయి ఆ రామయ్యగారిక్కూడా ఓసారి కనిపించు, దర్శనం చేసి బతిమాలితే ఏదైనా సాయం చేస్తాడాయన."

ఎగ్మూరు వెళ్ళి రామయ్యని చూడాలని లేనే లేదు మూర్తికి. మైలాపూర్ పోయి మోహిని కనిపిస్తుందేమో చూడాలని ఉంది.

"సరే" అన్నాడు.

రెండేళ్ళు కష్టపడి చదివి స్కూల్ ఫైనల్ సాధించి ఇంటర్మీడియట్ చదువుదామని ఉబలాటపడుతూ ఉంటే, "మీ మావఁదగ్గరికిపోతే అతనేమయినా ఉద్యోగం ఇప్పిస్తాడు. వెళ్ళు వెళ్ళు, మెడ్రాస్ వెళ్ళు" అన్నాడు నాన్న.

దాన్తో పై చదువుకి వెళదామనే సరదా అలానే ఉండిపోయింది. మద్రాస్ చూద్దామనే సరదాతో మద్రాసు వస్తే వచ్చీ రావడంతో ఆ సరదా తీరిపోయింది.

పాతమాంబళంలో పగలే చీకటిగా ఉండే గదిలో కూర్చొని "ఛీ, పాడు ఊరు, పాడు వెధవ్వూరు. పనికి మాలిన ఊరు" అని మద్రాసుని నిందించుకున్నాడు మూర్తి.

ఇంత ఊళ్ళోనూ యాభై రూపాయిలిచ్చే ఉద్యోగంకూడా దొరకదు. దొరికినా ఆ జీతం బతకడానికి చాలదు. అదయినా లక్షాయాభైమంది కాళ్ళు పట్టుకుంటేనేగానీ దొరకదు. కాళ్ళుబట్టుకోడానికి రోజుకి అధమం పదిమైళ్ళయినా తిరిగి తిరిగి చావాలి.

ఎగ్మూరు వెళతానని చెప్పి మైలాపూర్‌కి బయల్దేరిన మూర్తి "ఛీ పాడువూరు" అనుకోలేదు.

ఉద్యోగంలేదు సరే. కానీ, ఊరంత పాడుగాలేదు.

మాంబళం బస్ టెర్మినస్ దగ్గర కాఫీ హోటల్లోకి చకచకాపోతున్నాయి రెండు సిల్కుచీరెలు. "పొడుగుటావిడ మోహిని కాదు కద" అని పరిశీలించి చూశేడు.

ఆవిడ మోహిన్లా లేదు. ఆవిడ మోహిని కాదు.

మోహిని మాంబళంలో ఉండదు. కానీ, మైలాపూర్లో మాత్రం ఉంటుందని నిర్ధారణ ఏముంది?

ఇంతపట్నంలో ఆవిడ మళ్ళీ కనిపించడం అసంభవేమో? మోహిన్ని సులభంగా వెతకడానికి వీల్లేకుండా మద్రాస్ నగరం తగుమాత్రం పెద్దదిగా అయినా ఉండడం మూర్తికి ఇష్టం లేకపోయింది.

"ఛీ! పాడు ఊరు" అని మళ్ళీ విసుక్కున్నాడు లజ్‌కార్నర్‌లో దిగుతూ.

"హల్లో, మిస్టర్" అంది ఎదురుగా పొడుగ్గా నిల్చున్న ఆడమనిషి.

మూర్తికి నవనాళ్ళూ లాగేసినట్టయింది.

ఒకేసారి మల్లెలూ మందారాలూ పూసిన తీగలా నిల్చుంది మోహిని, తెల్లటి చీరతో, ఎర్రటి జాకెట్టుతో.

ముఖం కోలగా ఉంది. నడుం సన్నగా ఉంది. కన్ను పెద్దగా ఉంది. కళ్ళకి కాటుకుంది. సిగలో పువ్వులున్నాయి. పెదవులమీద నవ్వులున్నాయి. మనిషి ముచ్చటగా ఉంది.

"హలో! మళ్ళీ కనిపిస్తావనుకోలేదు. ఏమీ అనుకోకు. నిన్న శ్రమ ఇచ్చినందుకు నీకు. థాంక్స్ మాత్రం తీసుకో, నావి" అంది ఇంగ్లీషులోనే, జోరుగానే.

'థాంక్స్' అనే మాట అర్థమయింది మూర్తికి.

"తెలుగు మనిషిలా లేదు" అనుకుంటోన్న మూర్తికి వీధిలో అంతా తమవైపే, చూస్తున్నట్టుగా తోచింది.

ఏ కాలేజీలో చదువుతున్నావని అడిగింది.

ఎక్కడా చదవనందుకు ఆ సమయంలో ఇదివరక్కంటే ఎక్కువ బాధపడ్డాడు. ఇంగ్లీషులో జవాబు వెంటనే ఇచ్చే భాషా పరిజ్ఞానం లేనందుకు కించపడి బాధపడ్డాడు.

మెల్లిగా ఒక్కొక్కమాటా వచ్చింది ఇంగ్లీషులో.

"నేను స్కూల్‌ఫైనల్ పరీక్ష పాస్‌చేసి ఉన్నాను. నేను ఇప్పుడు కాలేజీలో చదువు చుండుట లేదు."

"అయితే ఈ ఊళ్ళో ఏం చేస్తున్నట్టు?"

ఈవిడకి ఇంగ్లీషు తప్ప మరి ఏ భాషా రాదా?

ఎమ్మే చదువుతే నేను కూడా పరపరలాడించేద్దును ఇంగ్లీషు ఈవిళ్ళాగే.

"నేను ఈ ఊరు ఉద్యోగం నిమిత్తం వచ్చియున్నాను."

ముక్కముక్కకీ తడుముకోవాలి. దిక్కుమాలిన బాధ.

ఈ కుర్రవాడితో ఇంకేమిటి మాట్లాడ్డం అనుకుంటున్నట్టుగా ముఖం పెట్టింది మోహిని. పెదవుల మీద నవ్వు మాత్రం పోలేదు.

ఇద్దరూ మొహమాటపడుతూ అరనిమిషం నిల్చున్నాక ఆ అరనిమిషంలో అనవలసిన మాటలు తర్జుమా చేసుకుని "అయిన యెడల నేను పోయెదను. మరియు వచ్చెదను" అన్నాడు మూర్తి, పోవడానికి ఎంతమాత్రం ఇష్టంలేకపోయినా.

ఆవిడ కళ్ళల్లోకి చూడలేకపోయాడు. మెడవైపు చూశాడు. ఎడంచేతిలో పుస్తకం మీదకి కళ్ళు జార్చేడు.

మోహిని V ఆనర్స్ క్లాస్, ఫలానా కాలేజీ అనే పదాలు నల్లటి అక్షరాలతో నోట్‌బుక్ అట్టమీద రాసి ఉన్నాయి. ఏ కాలేజీలో చదువుతుందో తెలుసుకోవడంతో మూర్తిలో సంతోషం చరచరా లేచింది.

"అయితే, ఛీరియో" అందామె.

ఏమనడానికీ పాలుపోక ఏదో ఇదిగా నవ్వేసిన మూర్తిని "అడగడం మర్చిపోయేను. నీ పేరేమిటి" అని అడిగిందామె.

తనపేరేమిటో తెలుసుకోవాలని కుతూహలం ఆవిడకి కలిగినందుకు మూర్తిలో ఈసారి సంతోషం జరజరలాడింది.

"నాపేరు 'మూర్తి' అయిఉన్నది."

అని సుస్పష్టంగా ఇంగ్లీషులో చెప్పేడు గొప్పగా.

"ఛీరియో" అన్నదామె.

మూర్తికూడా అదే అన్నాడు.

ఇంతలో వచ్చి నిల్చున్న బస్సులోనికి ఎక్కింది మోహిని, సునాయాసంగా పదిమందిని వెనక్కి నెట్టి.

పదిమందిమీదా చెప్పలేనంత కోపం వచ్చింది మూర్తికి. ఎగ్మూర్ వెళ్ళడానికి బస్సు ఎక్కుతూ తనో పన్నెండు మందిని తోసిపారేశాడు మోచేతుల్తో.

ఆరోజున మూర్తికి కోపం కలిగించినవారి సంఖ్య అంతటితో ఇరవై రెండయింది. పెద్ద పెద్ద ఉద్యోగస్థుల్ని ఆశ్రయించడం అన్ని విధాలా మంచిదనేది మామయ్య చెప్పే సూత్రం.

ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టమని మేనల్లుడికి సదా ఉపదేశిస్తూ ఉంటాడు.

ఆ ప్రకారంగా ఎగ్మూరు వెళ్ళి రామయ్యగారి కాళ్ళు పట్టుకోమని బోధించి పంపించేడు మామయ్య.

రామయ్యగారి పిలక పట్టుకుందికి సందేహించని వాళ్ళా వెళ్ళి మాట్లాడేడు మూర్తి ఆరోజున మోహిన్ని విడిచి వెళ్ళేక.

అదివరకు నలుగురైదుగురు ఉన్నతోద్యోగుల్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు వార్ని చూడ్డమే జరిగింది కానీ వారితో మాట్లాడ్డం జరిగింది కాదు. ఎందుచేత?

నోటంట మాటరాకపోవడం చేత!

మరయితే ఇప్పుడింత చురుగ్గా, సమాన ఫాయిదాలో ఇతన్తో ఎలా మాట్లాడుతున్నాను? కారణం ఉంది. నాకా కారణం ఎంతో బాగా తెలుసు. ఏంటది?

"కుర్రాడు చాలా చురుగ్గా ఉన్నాడే" అనుకున్నాడు రామయ్య. తప్పో, ఒప్పో ఇంగ్లీషులో మాట్లాడుతే చాలు. తరించి పోయామనుకునే జాతి రామయ్యది.

తప్పులున్నాసరే ఇంగ్లీషులోనే మాట్లాడాలని అనుకుని వచ్చి అలాగే ఇంటర్వ్యూ సాగిస్తున్నాడు మూర్తి.
రామయ్య ఆఖరికి అన్నాడు.

"అబ్బాయ్. అప్లికేషన్ పంపించేశావు కద! ఏమయినా వీలుంటే చూస్తాన్లే. నాల్రోజులు పోయాక మళ్ళీ ఓసారి కనిపించు" అని.

"థాంక్యూ వెరీమచ్" అన్నాడు మూర్తి.

"బైదిబై. మీ మీ'అంకు'లెలా ఉన్నాడు?"

"హియీజ్.. ఓకే."

ఓకే అంటే అర్థం?

తరువాత రామయ్య కుర్చీలోంచి లేచాడు. మూర్తి కూడా లేచాడు. రామయ్య ఇంట్లోకి పోయాడు. మూర్తి బైటకి వచ్చేడు.

బైటకి వస్తూ "థాంక్యూ మోహినీ" అనుకున్నాడు ఎందుకో. సాయంకాలం ఇంటికి వస్తూనే మామయ్య అడిగేడు.

"రామయ్యగారేమన్నారా?"

"తనచేతిలో సాయం అంతా చేసి తీరుతానన్నాడు."

"నిజంగా"

"నిజంగా"

రామయ్యగారలా అన్నారా?"

"ఆహా! అన్నాడు, నీగురించి కూడా భోగట్టా చేసేడు

"నిజంగా, నిజంగా?"

"ఎంతో నిజంగా నిజంగా."

"ఈ మామయ్యని చూసి ఇన్నాళ్ళూ ఎందుకు గడగడలాడేను?" అనుకున్నాడు మూర్తి.

మామయ్య తనలో తను నవ్వేసుకుంటూ, కోటు విప్పుకుంటూ అవతల గదిలోకి పోయేడు.

తరువాత, బాత్రూమ్‌లోకి ముఖం కడుక్కునేందుకు వెళ్తోన్న వరహాల్ని పైట పట్టుకు లాగేడు మూర్తి.

"అమ్మా నాన్న చూస్తే చంపేస్తారు. నీకో దండం బాబూ" అంది వరహాలు.

"మీ అమ్మా నాన్నా చూస్తే నాకేం భయం?"

"పోనీ, నీక్కాకపోతే, నాకు. ఒదిలేయ్ బావా" అని జాలిగా అడిగింది వరహాలు.

ఆ మాత్రం మగతనం ఆ పిల్లమీద ఆ పూటకి ప్రదర్శించి ఆపాటికి వదిలిపెట్టేడు మూర్తి.

కాణీ ఖర్చు పెట్టకుండా పెద్ద పెద్ద భవంతులు గాల్లో కట్టేస్తూ మర్నాటి పొద్దుటా వెళ్ళేడు మైలాపూర్.

మోహిని కనిపించింది కాదు. నాలుగోరోజు 'ఫలానా' కాలేజీ దగ్గర పొద్దుటా సాయంకాలం కాసినా ప్రయోజనం లేకపోయింది. కళ్ళు మాత్రం కాయలు కాచేయి. కళ్ళు కాయలు కాసినా, కొంచెం చీకటి పడినా, మెరీనా వెంబడి శాన్థోమ్‌వైపు నడుస్తూ, మోహినికోసం చూసుకుంటూ నడుస్తూ "ఆవిడ కనిపిస్తే కపాలేశ్వరుడికి కొబ్బరికాయ కొడతాను" అని మొక్కుకున్నాడు. ఉద్యోగం కోసం కూడా దేముడికి కొబ్బరికాయ కొడదామనుకోలేదు

అనుకుంటూ శాన్థోమ్ దగ్గర ఏదో సందులోకి మళ్ళేడు, నాలుగడుగులు నడిచేడు.

ఆవిడ అక్కడే కనిపించింది, ఎదురుగా వస్తూ ..

మోహినే మోహినే!

ఈ మోహిని నా మోమును చూస్తుందా చూడదా? చూడకపోతే ఎలా? నా అంతట నేను పలకరించలేను కదా ఎలా? హలో అనడమా? ఏమండీ అనడమా? మోహినిగారూ అనడమా? ఏం చేయడమేం చేయడం?–

అని తీవ్రాతి తీవ్రంగా ఆలోచిస్తూ, బితుకు బితుకూ చూస్తోన్న మూర్తి మోహిని కంటపడ్డాడు.

మూర్తిని చూడగానే ఆమె ఓ పెద్ద నిట్టూర్పు విడిచింది. ఆమె ఓ పెద్ద నిట్టూర్పు విడిచేక, కళ్ళల్లో సంతోషం ప్రకటించడం, తొందరగా ముందుకొచ్చి అతని రెండు చేతులూ పట్టుకోవడం, అతను ఆనందంతో వణికిపోడం అన్నీ అటు తరువాత ఒక్క క్షణంలో జరిగేయి.

"థాంక్ గాడ్! సరిగ్గా సమయానికి కనిపించేవు" అని ఊపిరి విడిచింది మోహిని.

ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయాడా అన్నట్టుగా ఉండిపోయాడు మూర్తి.

ఈలోపున, పొట్టిగా ఒకడూ, పొడవుగా ఒకడూ, సూట్లు తొడుక్కున్నవాళ్ళిద్దరు, వాళ్ళని దాటి ముందుకు పోయేరు. ఇరుగ్గాలేని సందులో కార్పోరేషన్ దీపాల కాంతిలో కొద్దిపాటి జనం నడుస్తున్నారు. పక్క ఇంట్లోంచి ఎవరో చూస్తున్నారు.

మోహిని దగ్గరగా నిల్చొంది. చేతులు వదల్లేదు.

"నాకు మళ్ళీ ఓ ఉపకారం చేసితీరాలి."

"చేసితీరతాను" అని మనసులో ఆ వెంటనే నిశ్చయం చేసుకున్న మూర్తి "యస్, యస్" అన్నాడు.

"వెనక్కి చూడు," అంది మోహిని.

వెనక్కి చూశాడు మూర్తి.

వెనక్కి చూస్తే ఏముంది? ఏమీలేదే!

"ఏమి? ఏమి?" అన్నాడు.

కార్నర్లో వాళ్ళిద్దరూ నిల్చున్నారు చూడు."

"యస్, యస్."

పొట్టిగా ఒకడు, పొడవుగా ఇంకొకడు నిల్చుని చూస్తున్నారు తమవైపు.

"నీకు ధైర్యం ఉందా?" అడిగింది మోహిని.

"యస్, యస్."

"అది బాగుంది. అయితే వెంటనే వెళ్ళి వాళ్ళిద్దర్నీ చితకతన్ను."

"యస్ యస్" అనేశాడు, దేనికి 'యస్' అంటున్నాడో అర్థం చేసుకోకుండానే, జీవితంలో అంతవరకూ తమ్ముణ్ణి తప్పించీ మరెవర్నీ తన్నకుండానే.

సరే అనేశాక తెలిసి వచ్చింది వాళ్ళని కొట్టమంటోందని. అప్పుడయినా, ఆమె ప్రవర్తన కొంచెం విపరీతంగా ఉన్నట్టు తోచలేదు. ఉత్తరం పోస్ట్ చేయడం, పెద్దమనుష్యుల్ని పట్టుకు తన్నడం అనే రెండు పనులకీ తేడా కనిపించలేదు మూర్తికి.

అదెంతో ఇదీ అంతే. అది సాధ్యమైతే, ఇదీ సాధ్యమే!

"అయితే, వెళ్ళు వేగిరం."

"ఏల? తన్నుట?" అని మాత్రం అడిగేడు.

"ఇందాకటినుంచీ 'ఫాలో' అవుతున్నారు. డర్టీ రాస్కెల్స్. వాళ్ళకి బుద్ధి చెపితేనే గానీ లాభంలేదు. వేగిరం, వేగిరం వెళ్ళి తన్ను."

వాళ్ళామెని అనుమానిస్తున్నారనీ, వాళ్ళని చితగ్గొట్టవలసి ఉంటుందనీ గ్రహించాడు మూర్తి. మూర్తి కదిలేడు. వాళ్ళవైపు నడిచేడు. పళ్ళు పటపట కొరుకుతూనే ఉన్నాడు.

అంతవరకూ బాగా జ్ఞాపకం ఉంది.

తరువాత ఏం జరిగింది?

వీరాభిమన్యుడు కదిలేడు. శత్రువుల్ని సమీపించేడు. నరాధముల దగ్గర సెంటు వాసన వేస్తోంది. పగతురు పొగవదులుతున్నారు. తరువాత ఇంగ్లీషులో కీసు పాసులు. తెలుగులో ఒకటో రకం తిట్లు, బండబూతులు.

తరువాత?

తరువాత ఏమున్నది? గభీ గభీ, కొట్టో, తన్నో, నరుకో, అడీ అడీ! అడిచుడు కొట్టు! కొట్టు!

ఒకడూ, ఇద్దరూ! ముగ్గురి తన్నులాట!

తరువాత!

పొంగిన ఛాతీతో నిల్చున్న మూర్తి పక్కన నిల్చున్న మోహిని, ఎదురుగా నిల్చున్న పోలీసు జవాన్‌తో గడగడ ఇంగ్లీషులో చెప్తోంది. పోలీసువాడు ఏర్చి కూర్చిన పదాలతో, అరవ బూతుల్తో వాళ్ళతో చెపుతున్నాడు. వాళ్ళని తిడుతున్నాడు. వాళ్ళిద్దరూ వాజమ్మల్లా నిల్చున్నారు, విరగని ఎముకల్తో; చిరిగిన చొక్కాల్తో, తగిలిన దెబ్బల్తో.

తరువాత?

ప్రేక్షకులు వెంట వెళ్ళగా వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. ప్రేక్షకుల్ని తప్పించుకొందికి మోహిని తనని రిక్షాలోకి తోసింది.

తనూ ఎక్కింది.

తరువాత?

నేనూ మోహినీ రిక్షాలో కూర్చున్నాం అనే విషయం గమనించగలిగేడు మూర్తి.

పొట్టి వెధవా, పొడుగు వెధవా, పోయేరు. ఇవాళ రాత్రి చస్తారు. చావనీ.

ఇంగ్లీషులో ఏవేవో ముద్దు పేర్లలో పిలుస్తోంది మోహిని. పిలుస్తూ మాట్లాడుతూ మధ్యలో ఆగింది.

ఆగి రెండు ముద్దులు పెట్టుకుంది మూర్తిని, ఈ బుగ్గ మీద ఒకటీ, ఆబుగ్గమీద ఒకటీ.

తరువాత మళ్ళీ మాటలు.

ఆమె అలా ముద్దు పెట్టుకున్నందుకు మూర్తి ఆశ్చర్యపోలేదు. జరుగవలసిందేదో జరిగినట్టుగా భావించేడు.

ఇప్పుడు ఉండవలసింది అనిల్ కుమార్‌గాడు! ఉంటే ఏం చేసేవాడు? దెబ్బలాటా ఉండకపోను. ముందు తనే దౌడు తీసి తోకముడిచేసేవాడు.

"రా. మోహినీ! వాళ్ళతో మనకేల? మన మానాన్న మనం పోదాం" అనే బాపతు అయిఉంటుంది అనిల్ కుమార్‌ది.

అంతే అంతే.

ఇంతలో రిక్షా ఆగింది, ఏదో డిస్పెన్సరీ ముందు.

దిగుతూంటే వళ్ళు నొప్పిగా ఉంది.

డిస్పెన్సరీలో టించర్ అయొడిన్ రాస్తూంటే బాగా తెలివొచ్చింది.

కాంపౌండర్‌కి మోహిని డబ్బు ఇస్తూంటే,

"ఒద్దొద్దు. నేనిస్తాను" అనగలిగేడు మూర్తి.

"వద్దూ వద్దూ నాన్ ఇస్తాను" అంది మోహిని. ఒక్క మాట మినహాయించి తెలుగులో పట్టి పట్టి మాట్లాడుతూ, నవ్వుతూ. తరువాత డిస్పెన్సరీలోంచీ బైటకి వస్తూ

"మీరు ఆంధ్రాస్ కారా?" అని ప్రశ్నించాడు మూర్తి.

"నో" అంది మోహిని.

ఆవిడ తెలుగు మనిషికానందుకు కొంచెం విచారించేడు.

ఇంగ్లీషుమాట కొంచెం జోరుగానే వస్తోంది.

"మీరేమిటి చదువుతున్నారు?"

"నేనా? హిస్టరీ ఆనర్స్, ఫైనలియర్."

'V,ఆనర్స్ అంటే ఆఖరేడాదన్నమాట అనుకున్నాడు మూర్తి.

ఆనర్స్ చదవని జీవితమేల? అని వ్యధ చెందేడు.

అంతటితో మూర్తికి మోహిన్ని తప్పించి మిగతా చదువుకున్న వారందరిమీదా, డబ్బున్న వాళ్ళందరిమీదా, లోకంలో చాలా భాగమ్మీదా ఎంతో కోపం వచ్చింది.

ఆ సమయంలో పొట్టిగా పొడవుగా ఉన్న వారిద్దరెవరైనా కనిపించినట్లయితే కొంచెం ప్రమాదం సంభవించేది,

"నిన్నెలా 'థాంక్' చెయ్యాలో తెలియకుండా ఉంది" అంది మోహిని నిల్చుండిపోతూ.

మూర్తికూడా ఆగేడు.

పక్కనే పెద్దగేటు. గేటు మీద పువ్వుల పందిరి. లోనికి పోతున్న రోడ్లు. రోడ్డుకి రెండుపక్కలా చెట్లు. వెనక ఎక్కడో వెలుగుతోన్న దీపాలతో భవంతి ఉన్న సూచన.

"ఇదే మా హాస్టలు."

"యస్, యస్."

"మళ్ళీ రేపోసారి రావూ?"

"యస్, యస్"

మోహిని, వెనక్కీ ముందుకీ, చుట్టూ చూస్తోంది, అదోలా ముఖం పెట్టి. పొట్టీ పొడుగూ మళ్ళీ వస్తున్నారా? అనుకున్నాడు మూర్తి. లేదు వాళ్ళు రావడంలేదు.

అయితే, ఎందుచేత అలా చూస్తోంది మోహిని?

జవాబు వెంటనే వచ్చింది.

ఒక్కసారి అకస్మాత్తుగా, అతని మెడచుట్టూ చేతులు వేసి పెదవుల మీద తన పెదవులాన్చి, అంత వేగిరంగానూ వదిలి వెనక్కిపోయింది మోహిని.

కొంచెం దూరం వెళ్ళేక "రేపు సాయంకాలం తప్పక రావాలి" అంది.

"యస్, యస్, యస్" అన్నాడు మూర్తి.

ఆక్షణంలో కనిపెట్టగలిగేడు.

వరహాలెలా వణుకుతుందో మోహిని కూడా అలానే వణికింది. ఇలాంటి విషయంలో ఇద్దరాడవాళ్ళ మధ్యా తేడా లేదు. మూర్తి కొంచెం గర్వంగా అక్కణ్ణించీ కదిలేడు. ఇంటికి వెళ్ళేసరికి చాలా రాత్రయింది. ఇంట్లో అంతా గాభరాపడ్డారు.

వాళ్ళలా గాభరా పడ్డందుకు చాలా సంతోషించాడు మూర్తి.

"ఏమిరా, దెబ్బలెలా తగిలాయిరా? ట్రాములోంచీ కానీ పడ్డావా? ఏమిటి సంగతి? మాట్లాడవేం?" అని మామయ్య ఆందోళనతో అడిగాడు.

ఎక్కువ బాధ నటిస్తూ "హిస్" అంటూ వాలుకుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

"చెప్పరా? చెప్పవేం?బాగా నొప్పిగా ఉందా? ఆస్పత్రిక్కానీ వెళ్ళాల్సుందా? వేగిరం చెప్పు" అన్నాడు మామయ్య.

అందుకు సమాధానంగా "మరేం ఫర్వాలేదు. మీ గాభరా చూస్తే నవ్వొస్తోంది" అన్నట్టు కొంచెం నవ్వి "వరహాలూ, మంచినీళ్ళుతే" అన్నాడు మూర్తి.

"తేవే, తేవే" అన్నాడు మామయ్య.

తెచ్చింది వరహాలు.

గళాసు చేతికి అందిస్తున్నప్పుడు తన కాలుతో ఆమె కాలు నొక్కేడు మూర్తి.

తరువాత ఓ కథ చెప్పేడు.

టెర్మినస్ దగ్గర బస్సులోంచీ తను ఎలా దిగినదీ, అప్పణ్ణించీ ఎవరో వెంటాడుతున్నట్టు ఎలా అనుమానించినదీ, నిజంగా ఎవరో ముగ్గురు ఎలావెంటాడినదీ, చీకటి సందులోకి రాగానే జేబులో పర్సుకోసం తనని వాళ్ళు ఎలా ఆపినదీ, ఆపగానే మొదటివాడి కడుపులో పిడికిలితో తను ఏ రీతిగా పొడిచినదీ, కొంత దెబ్బలాట అయ్యాక, రెండో వాడి ముక్కు మీద ఏ విధంగా గుద్దినదీ, తరువాత ముగ్గురూ ఎలా పారిపోయినదీ, ఇంతలో తనని ప్రజానీకం చుట్టిముట్టి తనని అభినందించి, కట్లుకట్టించి సగౌరవంగా ఎలా సాగనంపిందీ -

అంతా కథంతా, జరిగినట్టుగా, చిన్న చిన్న డిటేల్సుతో కూడా చెప్పేడు.

మామయ్య ఆశ్చర్యపడి సంతోషించేడు.

"నేనయితే ఈ కట్టుకథ నమ్మను" అని అత్తయ్య నోటితో చెప్పలేదు.

వరహాలు గర్వంతో, ఆనందంతోపొంగినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆపిన వెంటనే పోలీసువాళ్ళకోసం కేకలు వెయ్యలేక పోయావురా?" అన్నాడు మామయ్య అంతా విన్నాక.

'అదినీలాటివాడు చేసేపని' అన్నట్టుగా చూసేడు మూర్తి. తరువాత, బాగా రాత్రి అయాక, మెలుకువగా ఉండే ఏదో పలవరిస్తున్నట్లుగా "వరహాలూ, వరహాలూ" అని కేకలు వేసేడు మూర్తి.

"వరహాలుకోసం పలవరిస్తున్నాడే దాన్ని వెళ్ళి వాడి దగ్గర కూర్చోమనరాదు" అంటున్నాడు పక్క గదిలో మామయ్య.

అత్తయ్య ఏదో గొణిగింది.

"ఫరవాలేదే కావలిస్తే నువ్వూ అక్కడే ఉండు" అన్నాడు మామయ్య ఆమెతో.

అంతవరకూ గాఢ నిద్రలో ఉన్నట్టు నటిస్తోన్న వరహాలు కళ్ళు నులుపుకుంటూ అవతలగదిలోనుండీ వచ్చి మూర్తి మంచం పక్క కుర్చీలో కూర్చుంది. అత్తయ్య చాపేసుకుని పడుకుంది.

చీకట్లో వరహాలు చెయ్యి పట్టుకున్నాడు.

తృష్ణ అంతా ఆ రెండు చేతుల్లోనూ ఉంది.

తెల్లవారుతూందనగా నిద్ర వచ్చింది. మధ్యాహ్నం తెలివొచ్చింది.

వళ్ళంతా బరువుగా ఉన్నా మనసెంతో తేలిగ్గా ఉంది.

"ఏరా ఎలా ఉంది" అని అడిగింది అత్తయ్య.

"సినిమాకి వెళ్ళాలనుంది" అన్నాడు మూర్తి.

ధుమధుమలాడుతూ అత్తయ్య గదిలోంచి వెళ్ళిపోయింది. కళకళ్ళాడుతూ వరహాలు గదిలోకి వచ్చింది.

ఆకుపచ్చ చీరకట్టుకుంది. కోరచూపులు కళ్ళలో పెట్టుకుంది.

"ఓహో! చాలా ఫస్టుగా ఉన్నావే! ఏదీ ఇలా వచ్చి ఓ ముద్దియ్" అన్నాడు మూర్తి ఆమెని చూడగానే.

అత్తయ్యకి వినిపించవా నా మాటలు! అనుకున్నాడు.

"శ్! మెల్లిగా మెల్లిగా! అమ్మ వినగలదు" అంది వరహాలు మెల్లిగా కోపంగా.

నేనో ఆడదాన్ని రెక్కపట్టుకు లాక్కొచ్చాను. అందరూ తెలుసుకోవచ్చు - అవి చాటించాలనే మొగవాడి మనస్తత్వం వరహాలుకి అర్థం కాలేదు.

"బావకి గుట్టు ఉంచాలని లేదు ఛీ!" అనుకుంది.

"అమ్మ విన్నా భయంలేదు. అమ్మమ్మ విన్నా భయంలేదు. పెళ్ళయాక కూడా ఇలాగే అంటావు కాబోలు" అన్నాడు మూర్తి.

వరహాలు ఏడుపు ముఖం పెట్టింది.

"ఏడవకు ఏడవకు నా చిట్టి తల్లీ" అన్నాడు మూర్తి. వరహాలు వెళ్ళిపోబోయింది.

"చూడు! ఇవాళ రామయ్య దగ్గరకి వెళ్ళాలి. పెట్లోంచీ నా బట్టలూ అవీ తీసి సిద్ధంగా ఉంచు, నే ముఖం కడుక్కునే లోపున" అని ఆజ్ఞ విసిరేడు.

"సిద్ధంగా ఉంచను" అంది వరహాలు వెళ్ళిపోతూ.

"అంటే సిద్ధంగా ఉంచి తీరుతుందన్నమాట." అని లేచేడు మూర్తి.

"థాంక్యూ మోహినీ!" అనుకున్నాడు ఓసారి.

సాయంకాలం రామయ్యతోకూడా తన కట్టుకథ చెప్పేడు.

"I am no pleased with you" అన్నాడు రామయ్య. మూర్తి పెట్టిన అప్లికేషన్ మీద ఉద్యోగం ఇస్తూ వస్తుందని కూడా ఆర్డర్స్ చేశారనీ, కమ్యూనికేషన్ చెప్పేడు రామయ్య.

అక్కణ్ణించీ వస్తూ "నాక్కాకపోతే ఇంకెవడికిస్తాడు ఉద్యోగం! థ్యాంక్యూ మోహినీ!" అనుకున్నాడు మూర్తి.

ఎగ్మూర్ నుంచీ ఇంటికి వచ్చేసరికి సాయంకాలం ఆరయింది. మోహిని దగ్గరకి వెళ్ళడానికి ఇంకో క్రొత్త డ్రెస్ వేసుకు తీరాలి.

ఇంటికి వచ్చి చెప్పేడు ఉద్యోగం విషయం.

ఆ సంగతి వినగానే -

మావయ్య పెద్దవాడు కాబట్టి గెంతులు వెయ్యలేదు.

అత్తయ్య సంతోషించకుండా ఉండలేకపోయింది, మామయ్య పెళ్ళాం కాబట్టి.

వరహాలు కళ్ళతోటే కావలించుకుంది, పక్క అంతా ఉన్నారు కాబట్టి .

"రామయ్యగారు ఎంత మంచివాళ్ళురా!! ఆయనకు థ్యాంక్స్ ఎల్లా చెప్పడమో ఏమిటో నాకు తోచకుండా ఉంది" అన్నాడు మామయ్య.

రామయ్యకి కాదు థ్యాంక్స్.

మోహినికి థ్యాంక్స్!

మోహినికే థ్యాంక్స్?

మోహినికే థ్యాంక్స్!

అనుకున్నాడు మూర్తి.

ఇంట్లో ఉన్న అయిదునిమిషాల్లోనూ వీలు చూసుకుని అయిదుసార్లు ముద్దులాడేడు వరహాల్ని. వీలు చూసుకుంది వరహాలు.

కొత్తబట్టలు వేసుకుని, ఇంటిగుమ్మం దిగుతూంటే "చీకటి పడిపోతుందిరా కుర్రాడా! ఇప్పుడు వెళుతున్నా వెక్కడికి?" అన్నాడు మామయ్య.

'కుర్రాడా' అని పిలవకు మామయ్యా" అన్నాడు మూర్తి.

తరువాత నాలుగురోడ్ల జంక్షన్ దగ్గర టెర్మినస్ రోడ్డుకి మళ్ళీ, విసురుగా నడిచేడు, నిండు యవ్వనపు గర్వంతో ఠీవితో.

# మల్లిపూలు

## బుచ్చిబాబు

*ఇది బుచ్చిబాబు గారి మొట్టమొదటి కథానిక. ఈ వెర్షన్ ఎక్కడా ప్రచురించబడలేదు. దీన్నే కొంతకాలం తరువాత మరికొన్ని మార్పులు చేర్పులు చేసి ప్రచురణకిచ్చారాయన. ఆయన సతీమణి శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి గారు కౌముదికోసం ఈ కథని ప్రత్యేకంగా అందించారు. వారికి 'కౌముది' కృతజ్ఞతలు తెలియచేస్తోంది.*

మూడేండ్లు గడిచేయి. జన సంచారం ఉన్నా అదొక తోటలాంటి ప్రదేశం. చెట్ల మధ్య కీచురాళ్ళు ధ్వనిస్తూ, ఆకాశంలో మేఘగర్జనాన్ని దిఃఖరిస్తున్నాయి.

"మల్లిపూలు, కోసి పెట్టవు, బావా?"

చాలా సంతోషంతో కోసి, ఆమె హస్తాల్లో ఉంచా.

"చీకటి పడేదాకా, కోస్తూనే ఉండు బావా; నువ్వు కోస్తే ఎక్కడా నలగడంలేదు, పైగా చెట్ల మీద పక్షులు, అలికిడికి పారిపోవడంలేదు. ఆఖరికి, ఆకులైనా కదల్లేదు. ఎంత గమ్మత్తుగా కోస్తావు బావా!"

పరీక్షలో దండయాత్రలు కొడుతున్నా, మల్లిపూలు 'గమ్మత్తు'గా కొయ్యడంలో ఇంత నేర్పు సంపాదించినందుకు, ఆమె చాలా ఆమోదించింది. నిజానికి,



ఆమెకోసం, అల్లా కొయ్యడం తంటాలుపడి నేర్చుకున్నాను. ఆ నేర్చుకోవడంలోనే, పరీక్ష కూడా పోయిందని నా నమ్మకం. మళ్ళీ కొయ్యడం సాగించా. పొరబాటున బొటన వ్రేల్లో ముల్లు దిగింది. బాధ కలిగించకపోయినా, మానవ సహజమైన 'అబ్బ' అన్నాను.

కొంచెం ఖంగారుతో వచ్చి, ఆమె, నా చెయ్యి పట్టుకుని కళ్ళల్లోకి చూసింది.

"అబ్బ చాలా నెప్పిగా ఉందా బావా? పాపం" అంటూ వోణీ కొంగు చింపి, వ్రేలుకి కట్టింది. రాత్రింబవళ్ళు, నిద్రాహారాలు లేకుండా తల బాధ అనకుండా, బట్టలుతుక్కుంటూ, నీళ్ళుతోడుకుంటూ, దీపాలు తుడుచుకుంటూ, జ్వరం అనకుండా కష్టపడి చదివి పరిక్షకెళ్ళి ఫేలయితే ప్రతివాళ్ళు బూతులు తిట్టేవాళ్ళేకాని, (ఆఖరికి తల్లిదండ్రులు కూడా) వెధవ దోమంత ముల్లు దిగినంత మాత్రానికి, నన్ను ఆదరించి. జాలిచూపి, ధైర్యం చెప్పిన అమ్మాయిని, ఏంచెయ్యాలో తోచలేదు. మాటల కోసం తడుముకుంటుంటే

"వెధవపూలు" అని, పూలని మళ్ళీ విప్పి నలిపి గడ్డిలో పారేసి, 'రా బావా' అని చెప్పి చెయ్యట్టుకు తీసికెళ్ళి కూర్చోబెట్టి, నా బొటనవేలు ఆమె నోట్లో పెట్టుకుంది. ఆ స్వేచ్ఛాభావం, స్వాతంత్రోల్లాసంతో, నవ్వుతుంటే ఆఖరికి హిమాలయా పర్వత శిఖరాలు కూడా విరిగి పడాలిసిందే

"పూలెందుకు పారేసావు?"

"నీ వేలు ఎందుకు తెగింది?"

"నా ఖర్మ."

"ఇది నా ఖర్మ"

అది వైరాగ్యం కాదు; విడ్డూరం కాదు

మరో మూడేండ్లు గడిచేయి. ఆ అమ్మాయి, ఏ ఊళ్ళో ఉన్నది తెలుసుకున్నా. కానీ, ఏంచేస్తూంది, ఎల్లా ఉన్నది, నేను ఊహించలేకపోయాను. నాకు, క్రొత్తగా, ఉద్యోగం ప్రాప్తించింది. కనుక చాలా సంతోషంతో నా స్వంత తోట్లో పువ్వులను కోసి, భద్రంగా బుట్టలో పెట్టి తీసి కెళ్ళి ఆ అమ్మాయికి బహుకరించి, నా స్నేహభావం వెలుపుచ్చుదామని బయలుదేరాను.

ఆమె, నాముందు నిలబడ్డది. మంచి ఎత్తరిగా మారింది. అంగ నిర్మాణం పూర్తయింది. కళ్ళు వికసించేయి. ముక్కు ఉంది పెదవులు మందార వకుళాలలాగా తీర్చపడ్డాయి. అంతకంటే అందంగ ఉండటానికి అవకాశంలేదు.

కాని ముఖంలో కళలేదు. కళ్ళల్లో తేజస్సు మొదలేలేదు. తల్లో పూలు లేవు. ముఖాన్ని బొట్టు లేదు. పెదవులు మీద చిరునగవూలేదు.

"ఇవిగో, నీకోసం మల్లి పూలు మా తోటలోవి"

"ఎందుకు బావా? ఈ పాడు జన్మకి మల్లిపూలెందుకు?

"నీకు చాలా ఇష్టంగా... అందులో"

"కాని, ఎప్పుడైనా, ఒకనాడైనా ధరించానా పూలని? నా జీవితంలో, మల్లెపువ్వు వికాశం ఇంక లేదు. పెండ్లి కావడం, విధవనవడం, జరిగిపోయాయి. ఇంకెక్కడి మల్లిపూలు."

రెండు కళ్ళల్లోంచి రెండు అశ్రుబిందువులు రాలి, నేలమీద పడి చప్పుడు కూడా చేసాయి.

"ఖర్మఫలం"

"అవును బావా పూర్వం మూడేండ్ల క్రితం తోటలోనే, చెప్పాగా, "ఖర్మ" అని.

నేను మళ్ళీ మామూలుగా మాటల కోసం తడుముకుంటున్నా.

"పదేండ్లప్పుడే మన స్నేహం, నా హృదయంలో నాటుకుపోయింది బావా. మూడేండ్ల క్రితం నా ప్రేమ కాస్తా నిఘూఢంగా తెలియపర్చాను. నువ్వు గ్రహించి, నాకోసం, ప్రయత్నించలేకపొయ్యావు. స్త్రీని, నేను అంతకంటే, వెలిబుచ్చలేను మన ఖర్మ ఫలం..."

నాకు ఆశ్చర్యం. దుఃఖం కూడా కలిగాయి.

"సంఘం, కౄర స్వభావం దాలుస్తుంది బావా మన వివాహాన్ని వొప్పదు. మన ప్రేమని అసలే గౌరవించదు. కాని మన జీవితాలు రెండూ, మల్లిపూలచే బంధించబడ్డాయి. మల్లి పూల చేతనే వేరుచేయపడ్డాయి. మల్లిపూలు ఏనాడు పుష్పించడం మానా్తయో, ఆనాడు నిన్ను మరచిపోతాను...."

నేనా దృశ్యం చూడలేకపోయాను. రెండు కళ్ళల్లోంచి, రెండు అశ్రుకణాలు రాలేయి. కానీ శబ్దం మాత్రం చెయ్యలేదు.

తెల్లారి లేచేప్పటికి నాముందరున్న, బుట్టెడి మల్లిపూలు, తడిసిపోయాయి. కంటిధారచే కాబోలు. మల్లి పూలు నోరు విప్పి మాట్లాడాయి కూడాను.

"నీ విజ్ఞానం, నీ గంభీరం, నీ ఔదార్యం నీబ్రతుకు తెరువు, నిష్ప్రయోజనం తుదకి మల్లిపూలకి కూడా, ఆనందం సమకూర్చలేకపోయావు. "

# రాలే ఆకులు

## వి.వి.సూర్యనారాయణ

(ఆనందవాణి, 30 నవంబర్ 1947 లో ప్రచురితం. ఒక ఇంగ్లీషు కథ ఆధారం)

ఆ సౌధం దేశదేశాల నుండీ వచ్చే కళా జీవులకి నివాస స్థలం. రచయితలు, కళాకారులు, చిత్రకారులు, నటులు, గాయకులు - అంతా అక్కడికే చేరుతూ ఉంటారు, దేశ దేశాలనుండి వచ్చి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ మేడ కళాకాంతకి ఆటపట్టు.

మేడ మీద ఒక గదిలో ఉంటున్నారు, పీటర్, మేరీ లిద్దరూ. వాళ్ళిద్దరూ వరసకి అన్నా చెల్లెళ్ళు. ఇద్దరూ చిత్రకారులు.

ఎక్కడినుండో వచ్చి కింద గదిలో మకాం చేసేడు మరొక చిత్రకారుడు. అరవై ఏళ్ళకు పైగానే ఉంటుందతని వయస్సు, కాని ఉక్కు పిడుగులా ఉన్నాడు. అతన్ని డేవిడ్ అని పిలుస్తారందరూ.

డేవిడ్ కూడ పై గదిలో ఉన్న అన్నా చెల్లెళ్ళకి మల్లే మంచి చిత్రకారుడే కాని, తన అరవై సంవత్సరాల జీవితంలోనూ అతను పూర్తి చేసిన కళాఖండం ఒక్కటీ లేదు. అతడు గీసిన చిత్రాలన్నీ కూడ అసంపూర్తిగానే ఉండిపోయాయి. శాశ్వతంగా తన కీర్తిని నిలిపేది, ఈ ప్రపంచంలో ఏ ఒక్క జీవికైనా ఉపకారం చెయ్యగలిగేది అయిన ఒక్క కళా ఖండాన్ని సృష్టించ లేకపోయినందుకు మాత్రం డేవిడ్ మధన పడుతూ ఉండేవాడు.

డేవిడ్ మేడలోకి వచ్చిన అనతి కాలంలోనే పై గదిలో ఉన్న అన్నా చెల్లెళ్ళతో పరిచయమైంది. తరువాత కొద్ది కాలంలోనే వారి స్నేహం ఘనీభవించింది.

అది నవంబరు నెల. చలి విపరీతంగా వేస్తోంది. ఆకాశం ఎప్పుడూ మేఘావృతమై ఉంటోంది. అప్పుడప్పుడు పిండిమంచు జల్లులులా పడుతోంది. గుబులుగా ఉన్న ఈ వాతావరణానికి తోడు ఊరిలోనూ, మేడలోనూ శీతజ్వరం ఒకటి వ్యాపించి ప్రాణాంతకంగా తయారైంది. రోజుకొక శవాన్ని అయినా ఆ ఊళ్ళో ఖననం చేస్తున్నారు.

"దాదీ, కిటికీ తలుపులు బారుగా తీసి ఉంచు. ఎన్ని సార్లు చెప్పినా అవి మూసేస్తావేమిటి? " నీరసించిన కంఠంతో అడిగింది, మంచం మీద పడుక్కున్న మేరీ.

"మీరు శీత జ్వరంతో బాధ పడుతున్నారు. చలిగాలి తగలకూడదని తలుపు వేసే ఉంచమన్నారమ్మా అన్నయ్యగారు."

"అల్లా పనికి రాదు. అన్నయ్యకేమి తెలుసే? వెళ్ళి తలుపు తీసి రావే! "

"అలానే అమ్మా. " వెళ్ళి తలుపు తీసి వచ్చింది, దాది.

"దాదీ! అల్లా చూడు. కిటికీ లోంచి అక్కడ ఏది కనిపిస్తోందో చూడు."

"ఏముందమ్మా తెల్లటి గోడ తప్ప."

"అదేమిటే అలా అంటావు? నాకు కనిపిస్తోంది. తెల్లటి గోడ. గోడ మీంచి పాకి వచ్చిన లత, దాన్ని అంటిపెట్టుకుని ఐదు ఆకులూను. పచ్చగా ఉన్న తీగ ఒక కొస నుండి ఎండి బంగారు రంగులోకి మారిపోతున్నాది కూడాను."

"అవును. లతా, ఆకులూ ఉన్నాయి. కాని, మీరాయాసపడకుండా పడుక్కోండి అమ్మ గారూ. అన్నయ్య చూస్తే కోప్పడతారు."

"అదిగో చూడు. ఐదాకులలో ఒక్కటి ఇప్పుడే రాలి పోయింది. ఐదాకులూ రాలిపోగానే నేనూ రాలి పోతానే."

"తప్పమ్మా. అలా అనకూడదు. శీతాకాలం వచ్చేసింది కదా. పండి, ఎండి, వాడి పోయిన ఆకులు ఎన్నాళ్ళుంటాయేమిటి? మీరాయాస పడకుండా పడుక్కోండి. నేను వెళ్ళి వస్తాను."

"వాడి పోయిన ఆకులు తీగని అంటిపెట్టుకుని ఎన్నాళ్ళుంటాయమ్మా? నువ్వు పడుక్కో. ఆయాస పడకు"

"అది కాదన్నాయ్. శుష్కించే లతకూ, నాకూ ఏదో అవినాభావ సంబంధం ఉంది. కాని సంబంధం ఎటువంటిదో నీకూ, నాకూ కూడ తెలియదు."

"మనస్సులో లేనిపోని ఆలోచనలు పెట్టుకుని బాధ పడకు, చెల్లాయ్. మనశ్శాంతి లేక పోతే జ్వరం ఎక్కువ అయే అవకాశాలు ఉన్నాయి."

"అదిగో, అటు చూడన్నయా. మరొక ఆకు వాడిన తీగ నుండి పట్టు వదలి ఇప్పుడే పడిపోయింది. అబ్బా, బాధ గుండెలో నొప్పి దాహం అన్నయ్యా నా రెండో ప్రాణం ఎగిరి పోయిందన్నయ్యా"

"ఇవిగోనమ్మా, మంచినీళ్ళు. ఏం? బాధ కొంచెం సర్దుకుందా? ఇప్పుడే డాక్టర్ ని తీసుకొస్తా."

"ఈ మందులేవీ నా బాధని ఉపశమింప చెయ్యలేవు. అన్నయ్యా, నువ్వువచ్చేటప్పుడు కింద గదిలో ఉన్న డేవిడ్‌ని ఒక సారి తీసుకు రావూ? చచ్చిపోయే ముందు అతన్ని కూడ చూసి మరీ చచ్చిపోతాను."

"ఛ..!ఛ..! అవేమి మాటలు. దిగులు చెందకు, తల్లీ. ఆయనని ఇప్పుడే తీసుకొస్తాను."

అరగంట గడిచేసరికి డాక్టరునీ, డేవిడ్‌నీ వెంట బెట్టుకు వచ్చేడు, అన్నయ్య పీటర్. వైద్య పరీక్ష అయిన తర్వాత ముగ్గురూ బయటకి వచ్చేరు.

కిటికీ లోనుండి కనబడే లతా, దాని ఆకులతో తన చెల్లెలు కల్పించుకున్న సంబంధం డాక్టర్‌కి తెలియజేస్తున్నాడు, పీటర్. ఒకొక్క ఆకు లత నుండి రాలినప్పుడు తన చెల్లెలు పొందే మనో వైకల్యమూ, దాన్ని ఆధారం చేసుకుని ఆమె పడే బాధా వైద్యుడికి వ్యక్త పరుస్తున్నాడు బయట వరండాలో నిలబడ్డ పీటర్.

మేరీ పడుక్కున్న గది లోంచి బాధా సూచకమైన ఆర్తనాదం వినిపించేసరికి అందరూ లోపలికి ఒక్క పరుగున వెళ్ళేరు. ఆమె బాధతో, ఆయాసంతో, పరుపు మీద అటూ, ఇటూ దొర్లుతోంది. ఆమె పొందే వ్యధకు కారణమేమిటన్నట్లు చూసేడు, డాక్టర్, అక్కడ పరిచర్యలు చేస్తూన్న దాది వైపు. దాది కిటికీ గుండా బయటకి చూసింది. మరో రెండాకులు లత నుండి వేరయి పడిపోయినట్లున్నాయి.

"ఆకులు రాలినప్పుడల్లా అమ్మగారు ఇలానే భయపడుతూ ఉంటారు."

డాక్టర్ మేరీ వైపు తిరిగి, "అమ్మా! మీరిలా మనోవైకల్యానికి గురి కావటం చాల ప్రమాదం. మనస్సునిలా శిథిలం చేసుకుంటే నేనిచ్చే మందుల గుణం పూర్తిగా కనబడదేమోనని నేను భయపడుతున్నాను" అన్నాడు.

"మీరు పొరపడుతున్నారు, డాక్టర్". అయిదాకులూ నా అయిదు ప్రాణాలూను. ఒకొక్క ఆకు రాలి పోయిందంటే ఒకొక్క ప్రాణం పైకి ఎగిరి పోయిందన్నమాట. ఇప్పుడు లతకి అంటిపెట్టుకుని ఉన్నది ఒక్కటే ఆకు. ఇప్పుడు నా బొందెని అంటిపెట్టుకుని ఉన్నది ఒక్కటే ప్రాణం. కనుక మీ అమూల్యమైన మందులని నా మీద ప్రయోగించి మీ పరపతిని మట్టి పాలు చేసుకోకండి. మిగిలిన ఆకు రాలిపోగానే నేనూ రాలిపోతాను. నా మీద దయ ఉంచి నాకేమీ మందులు ఇవ్వకండి."

"సరేలే అమ్మా. ఏసు ప్రభువే నిన్ను రక్షిస్తాడు,"అంటూ డాక్టర్ వెనుతిరిగి వెళ్ళిపోయేడు.

డేవిడ్ కూడ డాక్టర్ తో పాటే వెళ్ళి పోతూ, చేతులెత్తి "ప్రభువు నిన్ను తప్పక రక్షించగలడు," అని ఒణుకుతూన్న కంఠంతో దీవించేడు. "అయిదో ఆకు, మేరీ అయిదో ప్రాణం" అని స్వగతంగా గొణుక్కున్నాడు.

మరునాడు ఉదయం పీటర్ కిటికీ గుండా బయట ఉన్న గోడ వైపు చూసేడు. అయిదో ఆకు ఇంకా రాలిపోలేదు. అల్లాగే లతని అంటి పెట్టుకుని ఉంది. అదృష్టవంతులమే అనుకుంటూ తన ఆశీర్వచనాలు లెక్కేట్టుకున్నాడు, పీటర్. కాని రాలే ఆకులకీ, తన చెల్లెలు ప్రాణాలకీ ఉన్న సంబంధమేమిటో పీటర్‌కి ససేమిరా అర్ధం కాలేదు.

ఆ రోజే ముసలి డేవిడ్‌కి చలి జ్వరం వచ్చింది. డేవిడ్‌ని డాక్టర్ చూసి "రాత్రల్లా మంచు దెబ్బ తగలడం వల్ల జ్వరం తీవ్రంగా వచ్చింది" అంటూ మందిచ్చేడు. కాని జ్వరం రోజు రోజుకీ పెరగడం మొదలు పెట్టింది తప్ప తగ్గు ముఖం చూపించలేదు. "ఆఖరికి ఒక ఉత్కృష్టమైన కళా ఖండాన్ని రచించ గలిగేను. దాని వల్ల ఒక్క జీవికి మేలు జరిగినా నా జీవితం ధన్యమే," అంటూ జ్వరం తీవ్రతలో కలవరించడం మొదలు పెట్టేడు.

డేవిడ్ చేసే సంధి ప్రేలాపనల అర్ధం ఏమిటో పీటర్ ఊహకి అంతుపట్టలేదు. ఒక కళాఖండాన్ని రచించాలనే తపన అతనిని ఆఖరు క్షణంలో కూడ వెన్నాడుతోందని సరిపెట్టుకున్నాడు.

మూడు రోజులు గడిచేయి. డేవిడ్ పరిస్థితి దిగజారిపోతోంది. మేరీ బొందిని అయిదో ప్రాణం అంటిపెట్టుకుని వేల్లాడుతోంది. మిగిలిన అయిదో ఆకు లతని అలా అంటిపెట్టుకుని ఉంది తప్ప ఇంకా రాలిపోలేదు; పచ్చని జీవకాంతులని అలా విరజిమ్ముతూనే ఉంది.

మేరీ పరిస్థితి మెరుగు పడజొచ్చింది. మేరీ మంచం మీంచి లేచి తిరుగుతోంది. మేరీలో వచ్చిన ఈ మార్పు పీటర్‌ని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే ఈ మూడు రోజులూ లతని ఆకు అంటిపెట్టుకునే ఉండి తప్ప రాలిపోలేదు. ఈ విషయాన్ని పరిశోధించడానికి పీటర్ లత దగ్గరగా వెళ్ళేడు. ఏముంది! అక్కడ వాడిన లతా లేదు. దాన్నంటిపెట్టుకుని ఎండిన ఆకూ లేదు. స్థానంలో తెల్లటి గోడ మీద ఒక లత, దాన్నంటిపెట్టుకుని ఒక పచ్చటి ఆకూ చిత్రించబడి ఉన్నాయి. అప్పుడు పీటర్‌కి అర్ధం అయింది.

"రాత్రల్లా మంచు దెబ్బ తగలడం వల్ల జ్వరం తీవ్రంగా వచ్చింది" అన్న డాక్టర్ మాటలు గింగురు మన్నాయి పీటర్ చెవుల్లో. వెంటనే డేవిడ్ జ్వర తీవ్రతలో కలవరించిన మాటలు ప్రతిధ్వనించేయి.

జ్వరం తగిలిన నాటి ముందు రోజు రాత్రి డేవిడ్ లతని వేళ్ళాడుతూన్న అయిదవ ఆకుని త్రుంచి, రాత్రంతా మంచులో నిలబడి దాని స్థానంలో జీవకాంతులీనే మరొక పచ్చటి ఆకుని తన కుంచెతో సృష్టించేడన్న ఆలోచన పీటర్ మస్తిష్కంలో తళుక్కున మెరిసింది. అతని కళ్ళు కృతజ్ఞతతో నిండిపోయేయి. తన కృతజ్ఞతని తెలుపుకుందామని ఒక్క ఉదుటులో డేవిడ్ పడుక్కున్న గదిలోకి వెళ్ళేడు. అప్పుడే డేవిడ్ ఆఖరి శ్వాస వదిలేడు. నిర్వీర్ణుడైన పీటర్ దుప్పటిని డేవిడ్ ముఖం మీదకి లాగేసేడు. ఆ రోజు ఆ సౌధం నుండి స్మశానానికి వెళ్ళినది డేవిడ్ భౌతిక కాయం.

మరునాడే పీటర్ తన చెల్లెలు మేరీని తీసుకుని మరొక బస లోకి మారిపోయాడు. చావుకి సిద్ధంగా ఉన్న మేరీ మంచం మీంచి లేచి మళ్ళా ఇలా భూమి మీద తిరగడం, అప్పటివరకూ గుండ్రాయిలా ఉన్న డేవిడ్ మంచం ఎక్కి మూణ్ణాళ్ళల్లో మట్టిలో కలసిపోవడంలో ఉన్న నిగూఢ రహస్యం అప్పటికీ, ఇప్పటికీ మేరీకి తెలియదు.



వేమూరి వేంకట సూర్యనారాయణగారు ౧౯౨౪ లో జన్మించారు. ౧౯౮౮ లో దివంగతులయ్యారు. కాకినాడ విజయవాడ, మచిలీపట్నం లో ఉద్యోగాలు చేసి చివరకు శ్రీకాకుళంలో కోపరేటివ్ సబ్‌రిజిస్ట్రారుగా పదవీ విరమణ చేసారు. సూర్యం అన్న కలం పేరుతో కొన్నాళ్ళు, అసలు పేరుతో కొన్నాళ్ళు దరిదాపు ఏభైకి పైగా 'కథలు' రాసేరు. కొన్ని కథలు ఇంగ్లీషు, హిందీ కథలు ఆ ఆధారంగా రాసారు. ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త ప్రొఫెసర్ వేమూరి వేంకటేశ్వరరావు గారు వీరి సోదరులే.